ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బహుళ అష్టమి (పూర్తి); నక్షత్రం: జ్యేష్ఠ తె. 4.31 వరకు, అనంతరం మూల; అమృతకాలం: రా. 7.10 నుండి 8.55 వరకు; వర్జ్యం: ఉ. 8.29 నుండి 10.12 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, తదుపరి మ. 12.24 నుండి 1.12 వరకు; రాహుకాలం: ఉ. 10.30 నుండి 12.00 వరకు; యమగండం: మ. 3.00 నుండి 4.30 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:56 • సంచిక:327 • శుక్రవారం 9 మార్చి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల:5.00. Published from:Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

రిజర్వేషన్లపై రాష్ట్రాలకే అధికారమివ్వాలని..



ఢిల్లీలో కేసీఆర్ ధర్నా?

- కేంద్రం వైఖరిపై గుర్రు
- ధర్నాపై నేడో, రేపు నిర్ణయం
- జాతీయ నేతలకూ ఆహ్వానం?
- మహాకూటమికి దోహదమని తెరాస వర్గాల అభిప్రాయం
- అటు పార్లమెంట్‌లో 4వ రోజూ కొనసాగిన ఎంపీల ఆందోళన
- ఎస్సీ, ఎస్టీల అణిచివేసే ధోరణి అంటూ కేంద్రంపై ఆరోపనలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఢిల్లీ వేదికగా మహాధర్నాకు ముఖ్యమంత్రి కెసిఆర్ యోచిస్తున్నారు. రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రాలకు హక్కులు ఇవ్వాలని ఇప్పటికే పార్లమెంట్ లో టిఆర్ఎస్ ఎంపీలు పోరాడుతుండగా, రిజర్వేషన్ల పెంపు కుదరదంటూ కేంద్రం విస్పష్టంగా తేల్చేసింది. ఈ నేపథ్యంలో కేంద్రంపై మరింత ఒత్తిడి పెంచేందుకు.. అవసరమైతే తానే ఢిల్లీలో మహాధర్నా చేసే యోచనలో ముఖ్యమంత్రి కెసిఆర్ ఉన్నట్లు పార్టీవర్గాల ద్వారా తెలిసింది. ఇప్పటికిపుడు ధర్నాకు పూనుకుంటారా.. జాతీయ ఎజెండా ప్రకటించాక ముందు కెళ్ళాలా అన్నదానిపై పార్టీ నేతలతో చర్చిస్తున్నట్లు సమాచారం. ఈ పార్లమెంట్ సమావేశాల సమయంలో ధర్నా చేస్తేనే.. కేంద్రంపై ఒత్తిడిని తీవ్రతరం చేయవచ్చని, జాతీయ కూటమి ఏర్పాటుకు కూడా ఇది ఉత్ప్రేరకమవుతుందని కెసిఆర్ భావిస్తున్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. ఈ ధర్నాకు ఇదే డిమాండ్‌తో ఉన్న ప్రాంతీయపార్టీల నేతలను కూడా ఆహ్వానించాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఏఏ పార్టీల నేతలను పిలవాలి.. ఆహ్వానిస్తే వచ్చే నేతలెవరు? ఏఏ అంశాలు ప్రస్తావించాలనే అంశాలపై ప్రత్యేకబృందం అధ్యయనం చేస్తున్నట్లు తెలిసింది. జాతీయ రాజకీయాల్లోకి వస్తున్నానని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించిన తర్వాత తొలిసారి ఢిల్లీలో అడుగుపెట్టే కార్యక్రమానికి పెద్ద ఎత్తున నిర్వహించాలని టిఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. ధర్నా పేరుతో కెసిఆర్ ఢిల్లీలో అడుగుపెడితే.. జాతీయస్థాయిలో ఇది చర్చనీయాంశమవుతుందని, మోడీ ప్రభుత్వంపై కూడా తీవ్ర ఒత్తిడి పెరుగుతుందని టిఆర్ఎస్ వ్యూహరచనాబృందం అంచనా వేస్తోంది. జాతీయ రాజకీయ ప్రవేశ ప్రకటనతోనే.. జాతీయస్థాయిలో పెనుచర్చకు తెరలేపిన ముఖ్యమంత్రి కెసిఆర్.. కేంద్ర అధికారాలపై ప్రశ్నించడం ద్వారా.. రిజర్వేషన్ల డిమాండ్‌ను ప్రభావవంతంగా ఎలుగెత్తడం ద్వారా రాష్ట్రంలో ఆయావర్గాల విశ్వాసాన్ని పెంపొందించుకోవడంతో పాటు జాతీయస్థాయిలోనూ మైలేజీ లభిస్తుందని అంచనా వేస్తున్నారు. ఇందుకోసం కసరత్తు జరుగుతోంది. ఈనెల 12నుండి తెలంగాణ శాసనసభ సమావేశాలు ప్రారంభం కానుండగా, నెలాఖరులో సిఎం

➪ 3వ పేజీలో...



- ఏరోస్పేస్‌లో తెలంగాణ నంబర్ వన్



వింగ్స్ ఇండియా -2018 ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్

మహిళా ఔత్సాహికులకు వి-హబ్!

- రూ. 15 కోట్ల మూలధన పెట్టుబడి
- స్టార్టప్‌లకు రూ.లక్ష నుంచి 25 లక్షల గ్రాంట్
- ఇంటర్ నుంచి డిజిటల్ టెక్నాలజీపై శిక్షణ
- వి-హబ్ మహిళా పారిశ్రామిక వేత్తల ఉత్పత్తులు రాష్ట్ర సర్కారే తొలికొనుగోలుదారు
- విమానయాన రంగానికి ప్రోత్సాహకాలు
- పన్నుల్లో రాయితీ, 15 రోజుల్లో అనుమతులు
- హైదరాబాద్‌లో ఏవియేషన్ యూనివర్శిటీ
- ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి కేటీఆర్ 6



మెడికల్ పీజీ విద్యార్థులకు శుభవార్త

ఆ నిబంధన తొలగింపు

- ప్రభుత్వాస్పత్రుల్లో ఏడాదిపాటు విధుల నిర్వహణ తప్పనిసరికాదు
- ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు
- ఈ ఏడాది నుంచే అమలు 2
- సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష

ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న తరహాలోనే..

ఎంబీసీలకూ రాయితీలు

- పేద యువతీయువకులకు ఆర్థిక సహకారమందించాలి
- ఎంబీసీల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు రూపొందించాలి
- ఎంబీసీ కార్పోరేషన్‌కూ బడ్జెట్‌లో భారీగా నిధులు
- ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే మాదిరిగానే అత్యంత వెనుకబడిన తరగతుల(ఎంబీసీ)కు స్వయం ఉపాధి పథకాల ద్వారా ఆర్థిక సహకారం అందించాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. ఎంబీసీ కార్పొరేషన్ గత ఏడాది బడ్జెట్‌లో రూ. 1000 కోట్లు కేటాయించామని, ఈ సారి కూడా బడ్జెట్ నిధులు కేటాయించనున్నట్టు వెల్లడించారు. ఆ నిధులతో ఎంబీసీ కులాల్లోని పేద యువతకు కావల్సిన ఆర్థిక సహకారం అందించాలని సీఎం ఆదేశించారు.

బీసీలకు అమలు చేసే ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్‌లకు గతంలో రూ. 1,00,000 గానూ రూ. 60వేలు సబ్సిడీ ఇచ్చేవారని, కానీ ఆ సబ్సిడీ సరిపోదని, మరింత సబ్సిడీ అందించాల్సిన అవసరం ఉందని, అలాగే రూ. లక్ష నుంచి రూ. 12 లక్షల వరకు యూనిట్లు నెలకొల్పేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలన్నారు. రూ. లక్ష వరకు తీసుకునే ఆర్థిక సహకారంలో రూ. 80వేలు, రూ. 2 లక్షలతో యూనిట్ నెలకొల్పేవారికి రూ. 1.40 లక్షలు.. రూ. 2 లక్షల నుంచి రూ. 12 లక్షల విలువైన యూనిట్ల నెలకొల్పే వారికి 60 శాతం (గరిష్టంగా రూ. 5 లక్షలు) సబ్సిడీ ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఎంబీసీల కోసం అమలు చేసే స్వయం ఉపాధి పథకాలకు ఇచ్చే సబ్సిడీకి సంబంధించిన ఫైలుపై సీఎం కేసీఆర్ గురువారం సంతకం చేశారు. సబ్సిడీల విషయంలో స్పష్టత వచ్చినందున ఎంబీసీల కోసం అమలు చేయాల్సిన పథకాలను వెంటనే రూపకల్పన చేసి, సహాయం అందించడం ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

అక్కడ వాళ్లు.. ఇక్కడ వీళ్లు..

రాజీనామా!




- కేంద్రమంత్రి పదవులకు అశోక్, సుజనా రాజీనామా
- రాష్ట్ర మంత్రి పదవులకు కామినేని, మాణిక్యం..



చంద్రబాబుకు మోడీ ఫోన్

- కూర్చుని మాట్లాడుకుందాం ప్రధానమంత్రి ప్రతిపాదన రాజీనామాలపై వెనక్కి తగ్గం చంద్రబాబు సమాధానం 2





అన్నదాతకు ఆర్థిక చేయూత

- రైతు ఆత్మహత్యలపై సర్కార్ స్పష్టత
- అసెంబ్లీలో ప్రకటించేలా ఏర్పాట్లు
- సాయం పెంచిన ప్రభుత్వం
- ఒక్కో కుటుంబానికి రూ. 6 లక్షలు పంపిణీ
- ఈ యేడాది కరవు ఛాయలే
- వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం 3



రంగంలోకి రైతు సంస్థ

- రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా గుత్తా సుఖేందర్‌రెడ్డి నియామక ఉత్తర్వులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భవిష్యత్తులో వ్యవసాయరంగం మరింతగా వికసించాలన్న ముందుచూపుతో సీఎం కేసీఆర్ ఆవిష్కరించిన నాలుగంచెల రైతు సమన్వయ వ్యవస్థ వచ్చే నెలలో కార్యరంగంలోకి రానుంది. అధీకృత రైతు సంస్థగా నెలకొల్పబడిన రాష్ట్ర రైతు

➪ 2వ పేజీలో...

విగ్రహాల ధ్వంసం... ప్రజాస్వామ్యానికి ఓ చెరగని మచ్చ

స్ఫూర్తికి విఘాతం

- భారతదేశ నేతలెందరో ప్రపంచానికి మార్గదర్శకులు
- స్ఫూర్తిదాతల సందేశం భవిష్యత్ తరాలకు అవశ్యం
- పెరియార్ బోధనలు... నేటికీ ఆదర్శం, ఆచరణీయం
- రాజకీయ కార్పణ్యాలతో ధ్వంసం అప్రజాస్వామికం
- నిపుణుల అభిప్రాయం






(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

రష్యాలో గోర్బచేవ్ ప్రభుత్వ పతనానంతరం సోవియట్ నిర్మాతలు, కమ్యూనిజం సిద్ధాంతకర్తల విగ్రహాలు నిర్దాక్షిణ్యంగా కూల్చేశారు. అంతకుముందు అమెరికా ఆధిపత్యాన్ని ఎదిరించి నిలదొక్కుకున్న సోవియట్ నిర్మాతల్ని తీవ్ర అవమానానికి గురి చేశారు. ప్రస్తుతం భారత్‌లోనూ ఇలాంటి అవమానాలే జరుగుతు న్నాయి. త్రిపురలో రెండున్నర దశాబ్దాల సీపీఎం ప్రభుత్వ పతనా నంతరం గుర్తుతెలియని దుండగులు ఆ రాష్ట్రంలోని లెనిన్, కారల్ మార్క్స్ విగ్రహాల్ని కూల్చేశారు. జిల్లా కేంద్రం బెలోనియాలోని పబ్లిక్‌స్క్వేర్ లో గల ఐదడుగుల లెనిన్ విగ్రహాన్ని కూల్చేయడంతో పాటు ధ్వంసం చేశారు. మరో 11.5అడుగుల ఫైబర్‌గ్రాస్‌తో నిర్మించిన లెనిన్ విగ్రహాన్ని కుప్పకూల్చారు. విగ్రహం కిందపడ్డ అనంతరం దాని తలభాగాన్ని వేరుచేశారు. దాంతో కొందరు దుండగులు ఫుట్ బాల్ ఆడారు. తమిళనాడులో పెరియార్ విగ్రహాన్ని మరికొందరు విధ్వంసం చేశారు. అంతకుముందు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ విగ్ర హాన్ని కూడా విధ్వంసానికి గురిచేశారు. ఇక దేశవ్యాప్తంగా దాదాపు ప్రతిరోజు ఎక్కడోచోట అంబేద్కర్ విగ్రహాన్ని కూలుస్తూనే ఉన్నారు. లేదా ఈ విగ్రహాలకు అవమానాలు

➪ 3వ పేజీలో...

చంద్రబాబుకు మోడీ ఫోన్


- ఏపీ సీఎంను సముదాయించే ప్రయత్నం
- రాజీనామాలపై వెనక్కి తగ్గేది లేదన్న చంద్రబాబు
- గురువారం శరవేగంగా మారిన రాజకీయ సమీకరణాలు
- బాబు చేతికి బీజేపీ మంత్రుల రాజీనామాలు
- మోడీకి రాజీనామా లేఖలు అందజేసిన తెదేపా కేంద్ర మంత్రులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పుకోవాలని తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు బుధవారం రాత్రి తీసుకున్న నిర్ణయంతో ఇటు ఆంధ్రప్రదేశ్‌లో, అటు ఢిల్లీలో రాజకీయ పరిణామాలు చకచకా మారిపోయాయి. ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో పనిచేస్తున్న ఇరువురు మంత్రులు డాక్టర్ కామినేని శ్రీనివాస్, పి.మాణిక్యాలరావులు గురువారం ఉదయం శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తమ రాజీనామా లేఖలను అందజేయగా, ఢిల్లీలో కేంద్రమంత్రివర్గంలో కొనసాగుతున్న తెదేపాకు చెందిన మంత్రులు పూసపాటి అశోక గజపతిరాజు, యలమంచిలి సుజనా చౌదరి ప్రధాని నరేంద్రమోడీని కలిసి రాజీనామాలు ఇచ్చారు. రాజస్థాన్ రాష్ట్ర పర్యటనను ముగించుకుని ఢిల్లీకి చేరిన ప్రధాని మోడీ చంద్రబాబుకు ఫోన్‌చేసి ఇరవై నిముషాల పాటు మాట్లాడారు. తొందరపడి రాజీనామాలు చేయవద్దని రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై కూర్చొని మాట్లాడుకుందామని చెప్పినా చంద్రబాబు అందుకు అంగీకరించలేదని ఎన్‌డిఎలో కొనసాగుతూనే తమ రాష్ట్ర హక్కుల కోసం పోరాడుతామని ప్రధానికి స్పష్టంచేసినట్టు సమాచారం. ఢిల్లీలో కేంద్ర మంత్రులు రాజీనామా చేశాక అందుబాటులో ఉన్న సీనియర్ మంత్రులు, పార్టీ నేతలతో చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రధాని మోడీతో జరిగిన ఫోన్ సంభాషణ, కేంద్ర మంత్రుల రాజీనామాలు అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై మంత్రులు, ముఖ్య నేతలతో చంద్రబాబు సమీక్షించారు. భవిష్యత్తు ప్రణాళికపై కూడా ఆయన చర్చించినట్టు సమాచారం.

గురువారం ఉదయం తమ మంత్రులు ప్రధాని మోడీని కలిసి రాజీనామాలు అందజేస్తారని చంద్రబాబు ప్రకటించారు. అయితే లోక్‌సభ సమావేశాలకు ప్రధాని హాజరైతే అక్కడే రాజీనామాలు ఇవ్వాలని ఇరువురు మంత్రులు భావించినప్పటికీ ఆయన భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజస్థాన్ వెళ్ళడంతో అది సాధ్యం కాలేదు. ప్రధానిని కలిసేందుకు ఇరువురు మంత్రులు ఆయన కార్యాలయానికి ఫోన్‌చేసి సమయం కోరారు. సాయంత్రం 6 గంటలకు ప్రధాని అందుబాటులో ఉంటారని ఆ సమయంలో వస్తే కలవవచ్చని చెప్పడంతో మంత్రులిద్దరు ప్రధాని నివాసానికి చేరుకుని ఆయనతో ప్రత్యేకంగా సమావేశమై రాజీనామా లేఖలను అందజేశారు. అంతకు ముందే ప్రధాని మోడీ చంద్రబాబుతో మాట్లాడినందున మంత్రులిరువురు తమ రాజీనామా పత్రాలు అందజేసే సమయంలో ఆయన ఎటువంటి వ్యాఖ్యలు చేయకుండానే ఆ లేఖలను స్వీకరించారని తెలుస్తోంది. ఏపీ మంత్రివర్గం నుంచి వైదొలగిన తమ పార్టీకి చెందిన ఇద్దరు మంత్రుల రాజీనామా లేఖలను ఆమోదం కోసం గవర్నర్‌క పంపిస్తే కేంద్రమంత్రుల రాజీనామాలను రాష్ట్రపతికి పంపించాలని భాజపా అధినాయకత్వం భావించింది. అయితే చంద్రబాబుతో భేటీ అయిన సీనియర్ మంత్రులు ఈ పరిణామాలపై చర్చించినట్టు తెలుస్తోంది. సమావేశం అనంతరం సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ, భాజపా మంత్రుల రాజీనామాలను గవర్నర్ నరసింహన్ ఆమోదించారని చెప్పారు. చంద్రబాబుతో జరిగిన సమావేశంలో అనేక కీలకాంశాలను చర్చించామని భవిష్యత్తు కార్యాచరణపై కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. ఎన్‌డిఎ నుంచి తెదేపాకు చెందిన కేంద్ర మంత్రులు రాజీనామా చేయడానికి ముందు జరిగిన ఫోన్ సంప్రదింపులకు అత్యంత రాజకీయ ప్రాధాన్యత చేకూరింది. కేంద్ర ప్రభుత్వం నుంచి తమ పార్టీ మంత్రులను రాజీనామా చేయించడానికి దారి తీసిన పరిస్థితులను చంద్రబాబు మోడీకి వివరించినట్టు చెబుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏపీకి ప్రత్యేక హోదా కల్పించాల్సిందేనని చంద్రబాబు తెగేసి చెప్పినట్టు సమాచారం.

ప్రధానికి రాజీనామా పత్రాలు అందజేయడంతో శుక్రవారం నుంచి పార్లమెంట్ ఉభయ సభల్లో తమ ఆందోళనలను ఉధృతం చేయాలని తెదేపా నిర్ణయించింది. మంత్రులుగా ఉండి పార్లమెంట్ ఉభయ సభలను స్తంభింపజేయడం మంచి సంప్రదాయం కాదన్న ఉద్దేశంతోనే ఇప్పటిదాకా ఎటువంటి ఆందోళన కార్యక్రమాల్లో తాము పాల్గొనలేదని తాజా మాజీ మంత్రులు అశోక గజపతిరాజు, సుజనా చౌదరి చెప్పారు. విభజన హామీలను అమలు చేయడంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూనే తాము చేశామని, రాజీనామాలతో తమకు మరింత స్వేచ్ఛ వచ్చినట్లయిందని వారు తెలిపారు. మంత్రి పదవులకు రాజీనామాలు చేసినందున ఎంపీలుగా అటు లోక్‌సభ, ఇటు



రాజ్యసభలో స్వతంత్రంగా వ్యవహరిస్తామని స్పష్టంచేశారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో రాజీనామా మినహా మరో ప్రత్యామ్నాయం కనపడలేదని చెప్పారు. 2016, సెప్టెంబర్ 8న ఏపీకి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించినా దాన్ని సమర్థవంతంగా అమలు చేయలేదని అందుకే ప్రస్తుత ఈ పరిస్థితి వచ్చిందని తెలిపారు. ప్రజల్లో ఉన్న సెంటిమెంట్‌ను గౌరవించాల్సిన ఆవశ్యకత కేంద్ర ప్రభుత్వానికి ఉందని చట్టంలో ఉన్నది చేయడానికి ఎవరి దయాదాక్షిణ్యాలు అవసరం లేదని మిత్రపక్షంగా ఉన్నా, లేకపోయిన ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనని చెప్పారు. హామీలను పూర్తిస్థాయిలో అమలుచేసే వరకు తమ పోరాటం ఆగదని చెప్పారు. ఇదిలా ఉండగా తెదేపాకు చెందిన ఇద్దరు మంత్రులు చేసిన రాజీనామాలపై గురువారం బాగా పొద్దుపోయేంత వరకు ఎటువంటి స్పందన రాలేదు. మంత్రులు చేసిన రాజీనామాలను తొలుత ప్రధాని ఆమోదించి అనంతరం వాటిని రాష్ట్రపతికి పంపిస్తారు. రాష్ట్రపతి వీటిపై ఆమోదముద్రవేశాక రాష్ట్రపతి భవన్ నుంచి నోటిఫికేషన్ వెలువడుతుంది. అయితే ఈ ప్రక్రియ ఒకరోజులో జరిగేది కాదని శుక్రవారం సాయంత్రంకల్లా రాజీనామాలపై తుదినిర్ణయం వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఆ నిబంధన తొలగింపు

- పీజీ విద్యార్థులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయాల్సిన అవసరం లేదు
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లుకు ఆమోదం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: పీజీ పూర్తి చేసిన మెడికల్ విద్యార్థులు కచ్చితంగా ఏడాది పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయాలన్న నిబంధన తొలగిస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంపై పీజీ విద్యార్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దీనివల్ల ఒక సంవత్సరం పనిచేయాల్సిన అవసరం ఉండదని దీనివల్ల పీజీ విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని వారు పేర్కొంటున్నారు. గతంలో ఉన్న నిబంధన ప్రకారం సంవత్సరం పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయాలన్న నిబంధన వల్ల రెగ్యులర్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడితే ఆ సమయంలో తాము అర్హులం కాలేకపోయే వారమని ప్రస్తుతం సీఎం తీసుకున్న నిర్ణయం వలన విద్యార్థులకు చాలా మేలు జరుగుతుందని వారు పేర్కొంటున్నారు. ఈ నిబంధన తొలగించాలని పీజీ విద్యార్థులు గతంలో ధర్నాలు సైతం చేశారు. ప్రస్తుతానికి ఈ విషయమై సీఎం నిర్ణయం తీసుకోవడం సంతోషకర విషయమని వారు పేర్కొంటున్నారు.

ఈ ఏడాది నుంచే అమలు

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దీనికి సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ నిర్ణయం ఈ ఏడాది నుంచే అమలు చేస్తామని ఈ ఏడాది పీజీ పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయాలనుకున్నా వారి విద్యార్హతలను రిజిస్టర్ చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. మెడికల్ పీజీ పూర్తి చేసిన వారు విధిగా ఒక ఏడాది పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయాలన్న నిబంధన ఉంది. ఇలా చేస్తేనే వారి విద్యార్హతలను రిజిస్టర్ చేసేవారు. ఈ నిబంధన తొలగించాలని విద్యార్థులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ముఖ్యమంత్రి ఇప్పుడు సానుకూల నిర్ణయం తీసుకున్నారని పీజీ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చాలినంత సిబ్బంది లేనందున రెగ్యులర్ ప్రాతిపదికన నియామకాలు చేస్తున్నందున మెడికల్ విద్యార్థులతో పనిచేయించాల్సిన అవసరం లేదని సీఎం స్పష్టం చేశారు.

సీఎం నిర్ణయంతో మేలు జరుగుతుంది

సంవత్సరం పాటు టీచింగ్ ఆస్పత్రుల్లో రూరల్ సర్వీసు కింద పనిచేయాల్సి వచ్చేది. పీజీ అయిపోగానే సం వత్సరం పాటు పనిచేయాలన్న నిబంధన వలన చాలా ఇబ్బంది ఎదురయ్యేది. ఈ విషయమై 3 సంవ త్సరాల క్రితం ప్రభుత్వానికి ఒక వినతిపత్రం ఇచ్చాం. ఇప్పుడు దానికి మోక్షం లభించింది. పీజీ అయిపోయే సమ యానికి మా వయస్సు 29 లేదా 30 సంవత్సరాలు ఉంటుంది. ఆ సమయంలో మాకు రెగ్యులర్ జాబ్ దొరి కితే ఇబ్బంది ఉండదు. మళ్లీ ఒక సంవత్సరం పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేయాలన్న నిబంధన వలన సీనియర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు సీఎం తీసుకున్న నిర్ణయం వలన అందరికి మేలు జరుగుతుంది.

అక్కడ ఆ ఇద్దరూ.. ఇక్కడ ఈ ఇద్దరూ
రాజీనామాలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కేంద్ర మంత్రులు అశోక్ గజపతి రాజు, సుజనా చౌదరి తమ పదవులకు రాజీనామా చేశారు. ప్రత్యేక ప్యాకేజీలో ఒక్క అంశాన్ని కూడా ఇప్పటిదాకా అమలు చేయలేకపోవడం వల్లే తాము రాజీనామాలు చేయాల్సి వచ్చిందని ప్రధానికి వివరించారు. గురువారం సాయంత్రం ప్రధాన మంత్రి నరేంద్రమోడీని ఆయన నివాసంలో కలు సుకుని తమ రాజీనామా లేఖలను అందజేశారు. అయితే ఇప్ప టికే తాము చాలా అంశాలు అమలు చేశామని, మిగిలినవి కూడా అమలు చేస్తామని ఈ సందర్భంగా ప్రధానమంత్రి వ్యాఖ్యా నించారు. రాజీనామాలు దురదృష్టకర నిర్ణయమని అభిప్రాయపడ్డారు. తాము ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. అయితే నాలుగేళ్లుగా విభజన హామీలు నెరవేర్చుతారని ఎదురుచూసిన అమలు కావడంలో ఆలస్యమైందని మంత్రులు వివరించారు. దాని వల్లే తాము మంత్రి పదవుల నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పారు. ప్రధానమంత్రికి రాజీనామా లేఖలు అందించిన తర్వాత మంత్రులిద్దరూ మీడియాతో మాట్లాడారు. విభజన చట్టంలోని అంశాలు, నాటి ప్రధాని మన్మోహన్ హామీలను నెరవేర్చడంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఆలస్యం చేయడం వల్లే రాజీనామాలు చేశామన్నారు. మంత్రివర్గం నుంచి బయటికి వచ్చిన తర్వాత మరింత స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం దక్కుతుందన్నారు. పార్టీ ఆదేశాల మేరకు తాము రాజీనామా చేశామని తెలిపారు. అయితే ఎన్డీఏలో భాగస్వామిగా కొనసాగుతామని స్పష్టం చేశారు. మంత్రి పదవులు లేకుండా అనేక పార్టీలో ఎన్‌డిఎలో ఉన్నాయని చెప్పారు. విభజన బిల్లు అశాస్త్రీయంగా రూపొందించారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా చేయూత నివ్వాలనికోరారు. కొన్ని అంశాలు నెరవేర్చారని, దురదృష్టవశాత్తు ప్రత్యేక హెూదాను నెరవేర్చ లేకపోయారని అన్నారు. ప్రత్యేక ప్యాకేజీని నిర్దిష్ట గడువులోగా అమలు చేయలేక పోవడం వల్ల ఈ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రజలు దీనిపై తీవ్ర ఆందోళనతో ఉన్నారని అందువల్లే తాము రాజీనామాలు చేయాల్సి ఉందన్నారు. ఒక జాతీయ పార్టీ మోసం చేస్తే, మరోపార్టీ నమ్మకద్రోహం చేసిందని ఘాటుగా విమర్శించారు. రాహుల్ గాంధీ తాము అధికారంలోకి వస్తే ప్రత్యేక హెూదా ఇస్తామనడం కేవలం ఊహాగానమేనని అన్నారు. చంద్రబాబు రాజనీతిజ్ఞుడు అని చెప్పారు. ప్రధాన మంత్రిని నేరుగా కలిసి ఇవ్వాలనే సాయంత్రం దాకా ఎదురు చూశామన్నారు. ఇకపై హామీల సాధనకు నిరంతరంగా తాము ప్రయత్నం చేస్తామన్నారు. 16వ లోక్‌సభ లోపల హామీలన్నీ నెరవేర్చాలని ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధిస్తున్నామన్నారు. ఫైనాన్స్ బిల్లుకు మద్దతు ఇవ్వాలా లేదా అన్నది తమ నాయకుడు నిర్ణయిస్తారని చెప్పారు. ప్రధానమంత్రికి ఏపీకి సంబంధించిన అన్ని విషయాలు తెలుసన్నారు. చాలా వరకు చేశాం, మిగిలినవి చేస్తామని ప్రధాని అన్నారన్నారు. ప్రత్యేక ప్యాకేజీ అమలు ఆలస్యమైందని చెప్పామన్నారు. ప్రజల్లో భావోద్వేగాలు పెరిగాయని దాని వల్లే రాజీనామా నిర్ణయాన్ని తీసుకున్నామన్నారు. రాజీనామాలు త్వరలోనే ఆమోదం పొందుతాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల పక్షాన ఉంటామని ప్రధానమంత్రి హామీ ఇచ్చారన్నారు. విభజన చట్టం అమలు కావడం తమ హక్కు అని చెప్పారు. మిత్రపక్షంగానే ఉంటేనే సాధించుకుంటామనడం పొరపాటని అన్నారు. బీజేపీ నుంచి ఎవరు కూడా తమతో చర్చలు జరపలేదన్నారు. ప్రధానమంత్రి చంద్రబాబుతో చర్చలు జరిపితే, ఆయన చెప్పిన ప్రకారం నడుచుకుంటామన్నారు. విభజన సమయంలో ఏపి ప్రజలు



అనేక త్యాగాలు చేశారని మంత్రి అశోక్ గజపతి రాజు అన్నారు. ప్రజల అంచనాలకు అందుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వాటిని ఎలా నెరవేరుస్తారన్నది ప్రశ్నగా మిగిలిందని అన్నారు. ఇది మధ్యయుగాల రాజ్యం కాదని చెప్పారు. యుపిఏ, ఎన్‌డిఎ కలిసికట్టుగా రాష్ట్రాన్ని విభజించాయన్నారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరామన్నారు. తాము ఇంకా ఎన్‌డిఎలో కొనసాగుతున్నామని స్పష్టం చేశారు.

మంత్రి పదవులకు రాజీనామా

- బీజేపీ నేతలు కామినేని, మాణిక్యాలరావు
- చంద్రబాబుకు ధన్యవాదాలు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రమంత్రి వర్గంలో బీజేపీ తరుపున ప్రాతినిధ్యం వహించిన మంత్రులు డాక్టర్ కామినేని శ్రీనివాస్, పైడికొండల మాణిక్యాలరావు గురువారం తమ పదవులకు రాజీనామా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుకు రాజీనామా లేఖలు అందజేసిన తర్వాత శాసనసభలో ఇందుకు కారణాలను వెల్లడించారు. కామినేని శ్రీనివాస్ కొందరు తనపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని, తానేనాడు అవినీతికి పాల్పడలేదంటూ శుక్రవారం కాణిపాకం వరసిద్ధి వినాయకుని సమక్షంలో ప్రమాణం చేస్తున్నట్లు ఉద్వేకభరత ప్రసంగం చేశారు. మరో మంత్రి పైడికొండల మాణిక్యాలరావు తనకు అవకాశం ఇచ్చిన తాడేపల్లి గూడెం ప్రజలకు, సీఎం చంద్రబాబు నాయుడుకు ధన్యవా దాలు చెపుతూ బీజేపీ తరుపున బలమైన వాదన వినిపించారు.

సీఎం కష్టంతోనే అభివృద్ధి

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కష్టంతోనే రాష్ట్రం అభివృద్ధి సాధించిందని రాజీనామా చేసిన మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. తాను ముందు నుంచి క ూడా బీజేపీతో దేశాభివృద్ధి, టీడీపీతో రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని బలంగా నమ్మానని, ఇదే జరిగిందని ఆయన అన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది జరగదనే భావనతో తన పదవికి రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడుపై నమ్మకంతో ప్రజలు అధికారం కట్టబెట్టారన్నారు. ఆయన కూడా ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి అభివృద్ధి చేశారన్నారు. భవిష్యత్‌లో కూడా చంద్రబాబు నాయుడు అవసరం రాష్ట్రానికి ఉందన్నారు. 1982లో దివంగత రామారావు పిలుపుతో పార్టీలో చేరానని, ఆ తర్వాత తనకు ఎమ్మెల్సీ ఇచ్చారన్నారు. 2014లో వెంకయ్య నాయుడు పిలిచి బీజేపీ టిక్కెట్ ఇప్పించారని, టీడీపీ, బీజేపీ సమష్టి కృషితో గెలుపొందానన్నారు. తనకు మంత్రి పదవి రావడానికి వెంకయ్య నాయుడుతో పాటు కేంద్ర, రాష్ట్రబీజేపీ నేతలు కారణమన్నారు. తన పదవీ కాలంలో సీఎం చంద్రబాబు నాయుడు సంపూర్ణ సహకారం అందించినట్లు చెపుతూ తాను కూడా వైద్యశాఖలో అదే విధంగా మార్పులు తీసుకొచ్చానన్నారు.

కేంద్ర సహకారమే కారణం

రాష్ట్రాభివృద్ధిలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు సమర్ధతకు తోడు కేంద్ర సహ కారమే కారణమని పైడికొండల మాణిక్యా లరావు అన్నారు. తొలి నుంచి కూడా విభజనతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధిస్తుందని బీజేపీ బలంగా నమ్మిందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో తాము ఇదే విషయాన్ని పేర్కొనగా సమైక్యవాదులుగా చెప్పుకున్న వారు తమను గేలిచేశారన్నారు. ఇప్పుడు అమరావతి అభివృద్ధి, పోలవరం నిర్మాణం, వాణిజ్య రాజధానిగా విశాఖ అవతరించడం వెనుక బీజేపీ విజన్ ఉందన్నారు. విభజన సమయంలో తెలంగాణాలో బలంగా ఉన్న బీజేపీకి నష్టమని తెలిసి కూడా ప్రధాని నరేంద్ర మోడీ ముంపు మండలాలను ఏపీలో కలపడంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలుచేపట్టారన్నారు. తాము కూడా ఇదే రాష్ట్రానికి చెందిన వారమని చెపుతూ అభివృద్ధికి బీజేపీ అన్ని రకాలుగా సాయం చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో సమైక్యాంధ్ర అన్న వారంతా నరేంద్ర మోడీని అక్కున చేర్చుకోక తప్పదని ఆయన స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు ఆవేదన తమకు అర్థమైందని చెపుతూ ఏపీ ప్రజలకు అండగా తాము ఎప్పుడూ ఉంటామన్నారు. మంత్రిగా తాను ఆఖరిగా చేసిన మూడు వినతుల పట్ల సానుకూలంగా స్పందించిన సీఎంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులపై అంతులేని ఒత్తిళ్లు

- బలవన్మరణాలకు పాల్పడుతున్న వైనం
- రెండు రోజుల్లో ముగ్గురు విద్యార్థులు బలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఒత్తిడి విద్యార్థులపై పెను ప్రభావం చూపుతోంది. పోటీ ప్రపంచంతో తమ పిల్లలు నిలదిక్కుకోవాలంటూ తల్లిదండ్రులు తాపత్ర యపడుతూ అంతూలేని భారాన్ని వారిపై మోపుతున్నారు. తత్ఫలితంగా విద్యా ర్థులపై ఒత్తిడి పెరుగుతోంది. ఆ పరిస్థితుల్లో కన్నవారి కలలు నేరవేరుస్తామా? లేదా? అన్న మీమాంస ఓ వైపు.. పరీక్షల్లో నెగ్గుకు రాగలమా? లేదా? అన్న బెంగ మరోవైపు విద్యార్థుల మదిని తొలిచివేస్తోంది. ఉన్నత చదువులకు తొలిమెట్టుగా భావించే పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించేందుకు ఇటు తల్లిదండ్రులు, అటు పాఠశాలలు విద్యార్థులపై భరించలేని ఒత్తడిని పెంచుతున్నారు. నలువైపుల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి వస్తుండటంతో అటు సబ్జెక్టులు అర్థంకాని పరిస్థితుల్లో మొత్తంగా పరీక్షలు రాయాలంటే భయపడే దైన్య స్థితికి విద్యార్థులు చేరుకుంటున్నారు. మనోస్థైర్యాన్ని కోల్పోతున్నారు.

చదువులపరంగా, ఇతరత్రా తమకెదురయ్యే సమస్యలను తల్లి దండ్రులకు చెప్పేందుకు సైతం విద్యార్థులు సాహసించడం లేదు. తామే న్యాయ నిర్ణేతల మాదిరి అర్థాంతరంగా తనువు చాలిస్తూ తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిలిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ప్రభావతి అనే పదవ తరగతి విద్యార్థిని కూకట్‌పల్లిలో తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పరీక్షలంటే తనకు భయమని, ఎంత చదివినా ఫిజిక్స్, మ్యాథ్స్ అర్థం కావడం లేదంటూ అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని తాను రాసిన సూసైడ్ లేఖలో పేర్కొనడం గమనార్హం. సెయింట్ రీటా స్కూల్లో ఆమె పదవ తరగతి చదువు తోంది. ఇదిలా ఉండగా, ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సరూర్ నగర్ రోడ్డులో టీఎన్‌ఆర్ అపార్టుమెంట్ ఎనిమిదో అంతస్తు నుంచి దూకి పదవ తరగతి విద్యా ర్థినులు భార్గవిపటేల్, శ్రావణిలు ఆత్మహత్యకు పాల్పడ్డారు.



కోనేరులో పడి ముగ్గురు మృతి

- తండ్రికి తప్పిన ప్రమాదం

అడ్డాకుల, ప్రభన్యూస్ : అడ్డాకుల మండలం కందూరు గ్రామం శ్రీ రామలింగేశ్వర స్వామి కోనేరులో గురువారం ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు కోనేరులో పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా ఏనుగొండకు చెందిన వీరు ఉదయం జాతర సందర్భంగా రామలింగేశ్వర స్వామిని దర్శించుకోవడానికి కుటుంబ సభ్యులతో వచ్చి ముందుగా కోనేరులో చిన్న తమ్ముడు అంజనేయులు (19) స్నానానికి దిగాడు. ప్రమాదవశత్తు నీటిలో మునిగిపోయాడు. అది గమనించిన రెండో అన్న పవన్‌కుమార్(27) అతన్ని రక్షించేందుకు ప్రయత్నించి అతనూ మునిగిపోయాడు. ఇది గమనించిన రవికుమార్ (30) వారిద్దరిని రక్షించేందుకు కోనేరులోకి దిగి అతనూ ప్రాణాలు కోల్పోయాడు. అక్కడే ఉన్న తల్లిదండ్రులు గమనించి తండ్రి కేశవులు దిగి వారిని రక్షించేందుకు ప్రయత్నించగా అతను కూడా మునిగిపోతుండగా భార్య గమనించి అతనికి చీర అందించడంతో అతను బతికి బయటపడ్డాడు. వీరు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వీరిది వనపర్తి జిల్లా కామాజీపురం కాగా మహబూబ్‌నగర్ జిల్లా ఏనుగొండలో నివాసం ఉంటున్నారు. వీరు 9 మందితో గురువారం రామలింగేశ్వర దర్శనం కోసం వచ్చి మృత్యువాతపడ్డారు.

రవికుమార్‌సాగర్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అతనికి ఇద్దరు కూతుళ్లు, భార్య. పవన్‌కుమార్‌కు భార్య ఉండగా సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. మూడో వ్యక్తి ఆంజనేయులు విద్యార్థి. సంఘటన స్థలాన్ని అడ్డాకుల ఎస్‌ఐ సతీష్, జడ్చర్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి చేరుకొని వివరాలడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను జిల్లా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. అధికారుల అలసత్వం పర్యవేక్షణ లోపం వల్లనే ప్రమాదానికి కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇక జనంతో మమేకమవుదాం

- మంత్రుల భేటీలో సీఎం

అమరావతి, ఆంధ్రప్రభ: ఇక నుంచి తెలుగుదేశం శ్రేణులు క్షేత్రస్థాయిలోకి వెళ్లాల్సిందేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. 2019 ఎన్నికలే లక్ష్యం గా ప్ర భుత్వ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించే దిశగా తక్షణ కార్యాచరణ అవసరమన్నారు. రాష్ట్ర బడ్జెట్‌ను అసెం బ్లీలో ప్రవేశపెట్టిన అనంతరం ఆయన గురువారం సాయం త్రం అందుబాటులో ఉన్న మంత్రులతో, పార్టీ ముఖ్యులలతో తాజా పరిస్థితిని సమీక్షించారు.ఎన్డీయేలో ఇప్పటికైతే కొన సాగుదామని, పరిస్థితులకనుగుణంగా తదుపరి చర్యలకు ఉపక్ర మించాల్సిన అవసరం వుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి వున్నామని, ఒకసారి కూర్చుని మాట్లాడుదామని ప్రధాని మోడీ తెలిపారని అన్నారు. అయితేతాను మాత్రం ప్రధాని ఆహ్వానాన్ని సున్నితం గా తిరస్కరించానని సమావేశంలో మంత్రులకు ముఖ్యమంత్రి తెలిపారు. రాజీనామాల విషయంలోనూ ప్రధానికి నివేదించామని పేర్కొన్న ముఖ్యమంత్రి ఇప్పటికీ ఎన్డీయేలో కొనసాగు తున్న విషయాన్ని గుర్తుచేసినట్టు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పొత్తులు ఉన్నా, లేకపోయినప్పటికి ప్రజల ఆదరాభి మానాలు చూరగొనాలని, సంతృప్తి రేటును పెంచుకోవా ల్సిన అవస రాన్ని గుర్తు చేశారు. అదే విధంగా ప్రజల సంతృప్తి రేటు గణ నీయంగా పెరగాల్సిన అవసరం ఉందని గ్రామస్థాయి నుంచి మంత్రుల దాకా క్షేత్రస్థాయిలోకి వెళ్ళి పనిచేస్తేనే మనుగడ అని పేర్కొన్నట్లు సమాచారం. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర సమా చారం పౌర సంబంధాల శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర మంత్రల రాజీనామా లపై పునరా లోచన చేయాలని ప్రధాని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ను కోరితే, సున్నితంగా తిరస్కరించా రని తెలిపారు.

రంగంలోకి రైతు సంస్థ



(మొదటిపేజీ తరువాయి)

సమన్వయ సంస్థ ఛైర్మన్‌గా నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు గుత్తా సుఖేందర్‌రెడ్డిని నియ మిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి జీవో విడుదల చేశారు. ఐదుగురు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లతో పాలకమండలిని కూడా నియమించారు. 2013 కంపెనీల చట్టం ప్రకారం లాభాపేక్ష లేని ప్రభుత్వరంగ సంస్థగా ఏర్పాటైన రైతు కార్పొరేషన్‌కు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి, ఆ శాఖ కమిషనర్, ఉద్యానశాఖ కమిషనర్, ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శితో పాటు రాష్ట్ర రైతు సమన్వయ సమితి వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌లను నియమించారు. అలాగే రాష్ట్ర రైతు సమన్వయ సమితి సభ్యులుగా వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారధి, కమిషనర్ డాక్టర్ ఎం.జగన్మోహన్, ఉద్యానశాఖ డైరెక్టర్ ఎల్.వెంకట్రామిరెడ్డి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ జి.లక్ష్మీబాయిలను నియమించారు. దీంతో సమితి, కార్పొరేషన్‌లకు వేర్వేరు పాలకమండళ్ళు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన విధంగానే రాష్ట్ర సమన్వయ సమితికి 42మంది డైరెక్టర్లను త్వరలోనే నియమించనున్నారు. అందులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, జిల్లా సమితుల సభ్యులు, ఆదర్శ రైతులకు అవకాశం కల్పిస్తారు. అలాగే 24 మంది సభ్యులతో జిల్లాస్థాయి, మండలస్థాయి రైతు సమన్వయ సమితిలు, 15 మంది సభ్యులతో గ్రామ రైతు సమన్వయ సమితిలు ఏర్పాటైన విషయం తెలిసిందే.

ఈ వ్యవస్థతో వ్యవసాయ విధానాలకు పదును

వ్యవసాయ విధానాలకు మరింతగా పదును పెట్టి ఈ రంగంపై ఆధారపడిన వారందరికీ ఉపాధి అవకాశాలను మెరుగు పరిచే దిశగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అనుబంధ రంగాలతో పాటు వృత్తులను ప్రోత్సహించి ఆర్థిక స్థితిగతులను బలోపేతం చేసే కార్యాచరణ ప్రణాళికను ఈ ఏడాది త్వరలో ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్ నుంచి కార్యరూపం దాల్చబోతోంది. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఖర్చుచేసే నిధులు నేరుగా లబ్దిదారులకే చేర్చాలన్న అంశంపై పోచారం శ్రీనివాసరెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఏర్పాటు చేయబడిన గ్రామ రైతు సమన్వయ సమితుల ద్వారా వ్యవసాయ రంగాన్ని, రైతు కుటుంబాలను అభివృద్ధి చేసి దేశానికే ఆదర్శంగా నిలువాలన్న దిశగా ప్రభుత్వం లక్ష్యాలను ఎంచుకుంది. దేశ చరిత్రలో మొట్టమొదటి సారిగా తెలంగాణ ప్రభుత్వం ప్రారంభిస్తున్న పెట్టుబడి మద్ధతు పథకాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేసేందుకు గ్రామస్థాయిలో చర్యలు ప్రారంభమవు తున్నాయి.

అవసరాలు తెలుసుకునేందుకు పారదర్శక వ్యవస్థ

గ్రామాల్లో ఎప్పటికప్పుడు రైతుల అవసరాలను తెలుసుకుంటూ, వారికి కావాల్సిన సహాయ, సహకారాలకు అందిస్తూ వ్యవసాయం, అనుబంధ రంగాలను ముందుకు నడిపించేందుకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఒక పారదర్శక వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభం మొదలుకుని గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సమన్వయ సంఘాలు కార్యాచరణ ప్రణాళిక అమలుకు శ్రీకారం చుడుతున్నాయి. ఇటీవల ప్రగతి భవన్‌లో జరిగిన సమావేశంలో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించిన సీఎం కేసీఆర్ తనకున్న ముందుచూపు విధానం, సరికొత్త ఆలోచన మేరకు మార్గదర్శకాలు జారీ చేశారు. రైతు కుటుంబాలకు ప్ర భుత్వ పరంగా ఎలాంటి సబ్సిడీలు, రాయితీలు అందించాలన్నా సంబంధిత పథకాలను ఈ కమిటీల పర్యవేక్షణలోనే అమలు చేస్తారు. సీఎం ఆమోదించిన ప్రతిపాదనల ప్రకారం 42 మంది సభ్యులతో ఈ నెలాఖరు నాటికి తెలంగాణ రాష్ట్రీయ రైతు సమన్వయ సమితి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు.

నోడల్ అధికారులుగా రెవెన్యూ యంత్రాంగం

కార్య నిర్వహణకు రాష్ట్రస్థాయిలో వ్యవసాయ శాఖ కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. అలాగే జిల్లా స్థాయిలో కలెక్టర్ నోడల్ అధికారిగా, మండల స్థాయిలో తహసిల్దార్, గ్రామస్థాయిలో వీఆర్వోలు కార్యనిర్వహణా ధికారులుగా వ్యవహరిస్తారు. గరిష్టంగా పక్షం రోజుల్లోగా ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు సీఎం కేసీఆర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. రైతు సమన్వయ సమితిల ఏర్పాటు ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి మూడు జిల్లాలకు ఒకరి చొప్పున మంత్రులకు బాధ్యతలు అప్పగించారు.

బడ్జెట్‌లో రూ.1000 కోట్ల నిధులు

రాష్ట్ర కేబినెట్ హోదాలో రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుణ్ణి నియమించారు. అనధికార సమాచారం మేరకు వచ్చే ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్‌లో ఈ సంస్థ కార్య కలాపాలకు రూ.1000 కోట్ల ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిం చనున్నారు.

'స్ఫూర్తి'కి విఘాతం



లెనిన్ విగ్రహం ధ్వంసానికి నిరసనగా చెన్నైలో కామ్రేడ్ల ర్యాలీ

(మొదటిపేజీ తరువాయి)

కలుగజేస్తూనే ఉన్నారు.

రాజకీయ కక్షలు, కార్పణ్యాలు, ఆధిపత్య పోరాటాల్లో భాగంగా ఈ జాతికి దిశదశలను నిర్దేశించిన మహానుభావులు, చరిత్రకారులు, సిద్ధాంతకర్తల విగ్రహాల విధ్వంసం కొంత కాలంగా దేశంలో ఓ ఛాందసవాదంగా కొనసాగుతోంది. ఎవరి సిద్ధాంతాలు వారివి. కానీ వాటిని ఆచరించమని మరెవర్నీ ఎవరూ బలవంతపెట్టలేరు. పెరియార్ ఓ సందర్భంలో చేసిన వ్యాఖ్యలు ఇక్కడ ప్రస్తావనార్హం. నే చెప్పేదంతా గుడ్డిగా నమ్మమని ఎప్పుడూ చెప్పను.. మీ సొంత జ్ఞానంతోనే చెప్పదాని గురించి ఆలోచించండి.. అది నిజమని భావిస్తేనే విశ్వసించండి... లేదంటే దాన్నొదిలేయండి... నేను ప్రవచించిన సిద్ధాంతం మాకు గొప్పకావొచ్చు.. దాన్ని విశ్వసించమని ఒత్తిడి తెచ్చే అధికారం మాకులేదంటూ పెరియార్ 89వ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీనుద్దేశించి చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. పెరియార్ మూఢనమ్మకాల్ని వ్యతిరేకించారు. దేవతల్ని విశ్వసించలేదు. దీంతో హిందువులు ఆయన్ను తప్పుబట్టారు. ఆయన చిత్రాల్ని దగ్ధం చేశారు. ఆయనపై చెప్పులు విసిరారు. అయినప్పటికీ పెరియార్ తాను విశ్వసించిన విధానాన్నే జీవిత చరమాంకం వరకు కొనసాగించారు. తమిళనాట పెరియార్ ప్రవచించిన సిద్ధాంతాలిప్పటికీ ఆచరణాత్మకంగా ఉన్నాయి. ఆయన్ను లక్షలాదిమంది అనుసరిస్తున్నారు. వారి వరకు పెరియార్ ఆరాధ్యుడు. పెరియార్ విగ్రహాల్ని ధ్వంసం చేయడంతో ఇప్పుడు తమిళనాట ఆందోళనలు మొదలయ్యాయి. వేలూరు జిల్లా తిరుపత్తూర్‌లో పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం వెనుక వామపక్షకార్యకర్తలకుట్ర ఉందన్న విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

ఓ వైపు త్రిపురలో బీజేపీ గెలుపు అనంతరం కమ్యూనిస్టుల సైద్ధాంతిక కర్తల విగ్రహాల్ని కూలదోస్తున్నారంటూ వామపక్షాలు మండిపడుతున్నాయి. కొన్ని గంటల వ్యవధిలోనే పెరియార్ విగ్రహాలు నేలకూలడం వీటి వెనుకున్న రాజకీయ దృక్కోణానికి అద్దంపడుతోంది. ఇదే సందర్భంలో బీజేపీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి చేసిన వ్యాఖ్యలు మరింత గందరగోళానికి దారితీస్తున్నాయి. లెనిన్‌ను ఓ తీవ్రవాదిగా రష్యాలో కమ్యూనిజ వ్యవస్థ సుస్థిరపాలన కోసం లక్షలాది మందిని కిరాతకంగా అణచివేసిన వ్యక్తిగా స్వామి పేర్కొన్నారు. అలాంటి నియంత విగ్రహాల్ని భారత్‌లో పెట్టాల్సిన అవశ్యకత ఏంటంటూ ఆయన ప్రశ్నించారు. సిద్ధాంతకర్తలు, జాతీయ నాయకుల విగ్రహాల్ని ప్రపంచంలోని పలు దేశాల్లో ఏర్పాటు చేస్తున్నారు. మహాత్మాగాంధీని భారత జాతిపితగా భావిస్తారు. ఆయన విగ్రహాలు ప్రపంచంలోని దాదాపు 40దేశాల్లో నెలకొల్పారు. అమెరికాలోని కాలిఫోర్నియా లేక్‌సైన్‌లో మహాత్ముడి కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇంగ్లండ్‌లోని లండన్ థేవీస్టాక్ స్క్వేర్‌లో మహాత్ముడి భారీ శిలావిగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

డెన్మార్క్‌లోని కోపెన్‌హగాన్, దక్షిణాఫ్రికాలోని పీటర్ మేరిచ్‌బర్గ్, అర్జెంటీనాలోని బ్యూనోస్‌ఏరియస్, ఆస్ట్రేలియాలోని కాన్‌బెర్రా, ఉగాండాలోని జింగా, ఆస్ట్రియాలోని వియన్నా, స్విట్జర్లాండ్‌లోని జెనీవాలతో పాటు లండన్‌లోని పార్లమెంట్ స్క్వేర్‌లో కూడా మహాత్ముడి భారీ విగ్రహాన్ని నెలకొల్పారు. ఆఖరకు చైనాలో కూడా మహాత్ముడి విగ్రహాన్ని నెలకొల్పారు. స్కూల్ ఆఫ్ బిజింగ్ విద్యార్థులకు ప్రతిరోజు మహాత్ముడి బోధనల్ని వినిపిస్తున్నారు. రాజ్యాంగ రచయిత అంబేద్కర్ పేరిట గ్రేట్‌బ్రిటన్, అమెరికాల్లో కొన్ని వీధులకు నామకరణం చేశారు. పలు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో అంబేద్కర్ ప్రతిమల్ని ఏర్పాటు చేశారు. వీరేకాదు.. భారతీయ కళాకారులు, క్రీడాకారులకు కూడా ప్రపంచం సమోన్నత స్థానాలు కల్పిస్తోంది. కెనడాలో ఓ వీధికి ఎఆర్ రెహ్మాన్ పేరెట్టారు. న్యూజిలాండ్‌లోని ఓ వీధికి గవాస్కర్ ప్లేస్ అంటూ నామకరణం చేశారు. నెదర్లాండ్స్‌లో ఒకప్పుడు ఫాయింట్ రోడ్డుగా పేరున్న మెయిన్‌రోడ్డును మహాత్మాగాంధీ రోడ్డుగా మార్చేశారు. చికాగోలోని ప్రధాన రహదారికి స్వామివివేకానంద మార్గ్‌గా నామకరణం చేశారు. టాంజానియాలో ఇందిరాగాంధీ స్ట్రీట్ అంటూ ఓ వీధికి పేరెట్టారు. జర్మనీలోని బెర్లిన్ నగరంలో రవీంద్రనాధ్ ఠాగూర్ పేరిట ఓ వీధిని ఏర్పాటు చేశారు.

రష్యాలోని మాస్కోలో ఓ ప్రాంతాన్ని జవహర్‌లాల్ నెహ్రూ స్క్వేర్ అని పేరు మార్చారు. పాకిస్థాన్‌లోని లాహోర్‌లో భగత్‌సింగ్ చౌక్ ఉంది. కెనడాలోని బ్రాంక్‌టాంగ్ నగరంలో రాజకపూర్ క్రీసెంట్ పేరిట ఓ ప్రాంతానికి పేరుంచారు. ఇండో అమెరికా సైంటిస్ట్ అకోరిసిన్హా పేరును అమెరికాలోని ఓ మంచుపర్వతానికి పెట్టారు. భారతదేశానికి చెందిన ప్రముఖ ఫిజీషియన్ ద్వారకానాథ్ కొట్నీస్ శిలావిగ్రహాన్ని చైనాలోని సిచియాజు వాంగ్ నగరంలో నెలకొల్పారు.

విగ్రహాల కూల్చివేత ప్రజలతో పాటు వారి అభిమానులు, సిద్ధాంతాల పట్ల విశ్వాసమున్నవారి మనోభావాల్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. సాధారణ రాజకీయాలకు, విగ్రహాలకు సంబంధంలేదు. భవిష్యత్ తరాలకు వారిచ్చిన సందేశం గుర్తు చేసేందుకే మహనీయులు, స్ఫూర్తి ప్రదాతల విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. ప్రముఖ ప్రాంతాలకు వారి పేర్లు పెడతారు. రాజకీయ అవసరాల కోసం వాటిని కూలదోయడం, విధ్వంసానికి పాల్పడ్డాన్ని చరిత్ర క్షమించదు. ఇలాంటి చర్యలకు పాల్పడ్డవారెవరైనా భవిష్యత్ తరాలకు జవాబుదారి కాక తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నీట్ దరఖాస్తుకు 12 వరకు గడువు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నేషనల్ మెడికల్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (నీట్) రాయాలనుకునే వారికి శుభవార్త. నీట్ దరఖాస్తు సమర్పణకు గడువును సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పెంచింది. నీట్ దరఖాస్తుల సమర్పణ చేందుకు చివరితేదీ ఈనెల 12 అని ఓ ప్రకటనలో గురువారం ప్రకటించింది. నీట్ దరఖాస్తులో తప్పనిసరిగా విద్యార్థులు తమ ఆధార్ సంఖ్యను పేర్కొనాలని గతంలో సీబీఎస్ఈ ప్రకటించింది. అయితే నీట్ తదితర ఆలిండియా స్థాయి పరీక్షలకు ఆధార్ సంఖ్యను పేర్కొనవలసిన అవసరం లేదని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాలను సమర్పించేందుకు సీబీఎస్ఈ అనుమతించింది. ఈ నెల 12 సాయంత్రం 5.30 గంటల వరకు నీట్ దరఖాస్తులను సమర్పించవచ్చని ప్రకటించింది. ఆన్‌లైన్ ఫీజును ఈ నెల 13 అర్ధరాత్రి 11.50 గంటల వరకు చెల్లించవచ్చని తెలిపింది.

నేడు విద్యా సదస్సు

● ప్రారంభించనున్న ఉప ముఖ్యమంత్రి కడియం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ - నాణ్యమైన విద్య అనే అంశంపై నేడు విద్యా సదస్సు జరగనుంది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి ప్రారంభించనున్నారు. సదస్సులో ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్, శాసనమండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్ రెడ్డి పాల్గొంటారు. సదస్సును తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నిర్వహిస్తోంది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ లక్ష్మారెడ్డి అధ్యక్షత వహిస్తారు. సదస్సులో ఉన్నత విద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, పాఠశాల విద్య కమిషనర్ కిషన్ ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్ తదితరులు పాల్గొంటారు.

మైనార్టీ సంక్షేమానికి రూ. 30 కోట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మైనార్టీ సంక్షేమ శాఖలోన వివిధ పథకాల అమలుకు తెలంగాణ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి దాన కిషోర్ గురువారం పరిపాలన అనుమతులు ఇచ్చారు. షాదీ ముబారక్ పథకానికి రూ. 20 కోట్లు, మైనార్టీ విద్యార్థుల విదేశి విద్యా పథకానికి గాను రూ. 10 కోట్లు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రూ. 6 కోట్లతో 155 మహిళా భవనాలు

హైదరాబాద్,ఆంధప్రభ: రాష్ట్రంలో 155 మహిళాభవనాల నిర్మాణాలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఇందుకోసం ఆరు కోట్లు మంజూరు చేసింది. కరీంనగర్ , వరంగల్ , జగిత్యాల, పెద్దపల్లి, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఈ భవనాలు నిర్మించనున్నారు. గ్రామీణ ఉపాధిహామీ నిధులతో వీటిని నిర్మించనున్నట్టు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్ ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు.

8 మంది ఐఏఎస్‌ల బదిలీ

ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో 8 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి గురువారం జీవో విడుదల చేశారు. పశు సంవర్ధక, మత్స్యశాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న సందీప్ కుమార్ సుల్తానియాను ముఖ్యమంత్రి కార్యదర్శిగా నియమించారు. తాను నిర్వహిస్తున్న పాత శాఖను అదనపు బాధ్యతగా అప్పగించారు. అలాగే సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.మాణిక్యరాజ్‌ను ముఖ్యమంత్రి కార్యాలయంలో అదనపు కార్యదర్శిగా నియమించారు. మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లాలో జాయింట్ కలెక్టర్ పనిచేస్తున్న ధర్మారెడ్డిని మెదక్ జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డిని జనగామ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. నిర్మల్ జిల్లా జాయింట్ కలెక్టర్ సిహెచ్ శివలింగయ్యకు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. సంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ బి.వెంకటేశ్వర్లును అదే జిల్లా కలెక్టర్‌గా నియమించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ డి.అమోయ్ కుమార్‌కు అదే జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. వరంగల్ రూరల్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.హరితను అదే జిల్లా కలెక్టర్‌గా నియమించారు.

ఢిల్లీలో కేసీఆర్ ధర్నా?

(మొదటిపేజీ తరువాయి)

ఢిల్లీ పర్యటన ఉండే అవకాశం ఉందని పార్టీవర్గాలు చెబుతున్నాయి. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు.. మహాధర్నా నిర్వహించడం ఖాయమని, అయితే ఈ పార్లమెంట్ సమావేశాల సమయంలోనే ఇది జరుగుతుందా.. జాతీయ కూటమి ఎజెండా ప్రకటించాక వేడి పెంచే వ్యూహంలో భాగంగా వచ్చే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా నిర్వహిస్తారా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉందని పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. రిజర్వేషన్లు నిర్ణయించుకునే హక్కును రాష్ట్రాలకే ఇవ్వాలనే డిమాండ్‌తో పాటు అనేక కీలక అంశాలను ఢిల్లీవేదికగా ప్రస్తావించే అవ కాశం ఉంది. జాతీయ ప్రభుత్వాల తీరులో గుణాత్మక మార్పు ను కోరుకుంటున్న టిఆర్ఎస్.. మహాధర్నా సందర్భంగా దేశం ముందు పలు అంశాలను చర్చకు పెట్టే అవకాశం ఉంది. దేశంలో నెలకొన్న ప్రధాన సమస్యలు, దేశ సమగ్రాభివృద్ధికి.. ఆర్థిక ప్రగతికి దృష్టిపెట్టాల్సిన సమస్యలు.. అంశాలపై ఇప్పటికే వివిధ రంగాల నిపుణులతో ముఖ్యమంత్రి కెసిఆర్ సంప్రదింపులు జరుపుతున్నారు. గత మూడేళ్ళుగా జాతీయ రాజకీయాలపై, సమస్యలపై దృష్టిపెట్టిన కెసిఆర్.. ఢిల్లీ వెళ్ళినపుడల్లా వివిధ రంగాల నిపుణులతో, నేతలతో మాట్లాడి లోతైన అవగాహన ఏర్పాటుచేసుకున్నారు. తాజాగా ప్రకటించిన జాతీయకూటమికి.. మద్దతు ప్రకటించిన పార్టీలు కూడా.. రోజుకోరకంగా వ్యవహరిస్తుండగా, వ్యూహాత్మకంగా దేశరాజకీయాల్లో మార్పుతెచ్చేందుకు కెసిఆర్ కసరత్తులు జరుపుతున్నారు. జాతీయ రాజకీయాల్లో క్రియాశీలం అయ్యేందుకు అనేక ఎత్తుగడలు పరిశీలిస్తున్నారు.

రాయలసీమలో హైకోర్టు బెంచ్‌కు ఏపీ సీఎం సానుకూలత



అమరావతి, ఆంధ్రప్రభ: రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలంటూ సుమారు 50 రోజుల నుంచి ఆందోళన చేస్తోన్న న్యాయవాదులు గురువారం శాసనసభా ప్రాంగణంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. మంత్రి కాల్వ శ్రీనివాసులు న్యాయవాదులను ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లారు. శ్రీబాగ్ ఒప్పందం మేరకు హైకోర్టు ను రాయలసీమలో ఏర్పాటు చేయాలనీ, తద్వారా ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని న్యాయవాదులు సీఎంను కోరారు. అయితే హైకోర్టు ఏర్పాటు తమ పరిధిలో లేదనీ, హైకోర్టు బెంచి ఏర్పాటుకు సీఎం సానుకూలత వ్యక్తం చేశారు. అనంతరం ఈ విషయాన్ని మంత్రి కాల్వ మీడియాకు వివరించారు. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి వచ్చిన న్యాయవాదల ప్రతినిధి బృందం మంత్రి కాల్వకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కాల్వ మాట్లాడుతూ రాయలసీమలో హైకోర్టు బెంచి ఏర్పాటు విషయం సరైన సమయంలో ప్రకటిస్తారన్నారు. ఇదిలా ఉంటే ఆందోళనలో భాగంగా న్యాయవాదులు మంగళవారం అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించి విఫలమై సచివాలయం ఎదుట మూడు గంటలపాటు బైఠాయించి ధర్నా నిర్వహించడం ఈ సందర్భంగా గమనార్హం.

రిజర్వేషన్లపై రాష్ట్రాలకే అధికారమివ్వాలి..

● పార్లమెంట్ సాక్షిగా తెరాస ఎంపీల ఆందోళన

● 4వ రోజు నిరసనలు ● కేంద్రంపై ఘాటు విమర్శలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రిజర్వేషన్ల అంశంపై రాష్ట్రాలకే అధికారాలు ఉండాలని తెరాస డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలను బిల్లు రూపంలో పార్లమెంట్‌లో ప్రవేశపెడితే... చాలా సులభంగా ఆమోదం పొందుతుందని, కానీ కేంద్రం నిర్లక్ష్య వైఖరి అవలంబి స్తోందని తెరాస ఎంపీలు ఆరోపించారు. రిజర్వేషన్ల అంశాన్ని రాష్ట్రాలకే వదిలేయాని పార్లమెంట్ సాక్షిగా ఆ పార్టీ ఎంపీలు చేపట్టిన నిరసన నాలుగో రోజుకు చేరింది. తెలంగాణ రిజర్వేషన్ల కోటాను పెంచాలంటూ పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకూ వెనక్కి తగ్గేది లేదని గురువారం మరోసారి నొక్కి చెప్పారు. రిజర్వేషన్ల విషయంలో దేశమంతటా ఒకే విధానాన్ని అమలు చేయాలని ఎంపీ వినోద్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల పెంపు మత పరమైన బిల్లు కాదని ఆయన అన్నారు. గిరిజనుల విషయంలో కేంద్రానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఎంపీ సీతారామ్ నాయక్ మండిపడ్డారు.

బీజేపీ సూక్తులు చెప్తోంది

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వస్తే ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల కు రిజ ర్వేషన్లు పెరుగుతాయని 2001 నుంచి సీఎం కేసీఆర్ అనేక బహి రంగ సభల్లో చెప్పారు. టీఆర్ఎస్ ఎంపీలకు రాజ్యాం గం, చట్టాల గురించి తెలియనట్లు బీజేపీ సూక్తులు చెబుతోంది. రిజర్వేషన్లపై సోమ వారం బిల్లు పెడితే, మంగళవారం ఆమోదం పొందు తుంది. కానీ బీజేపీ ఆ పని చేయకుండా తాత్సారం చేస్తోంది. ఎస్టీ, ఎస్సీ, మైనారిటీలకు రిజర్వేషన్లు రాజ్యాంగం ఇచ్చిన హక్కు. జనాభా పెరిగినట్లుగా రుజువైతే రిజర్వేషన్లు పెంచుకోవచ్చని సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పింది.

రాష్ట్ర శాసనసభలో రిజర్వేషన్ల అంశాన్ని పెట్టి, అన్ని రాజకీయ పార్టీలను ఒప్పించి తీర్మానం చేశాం. గవర్నర్ ఆమోదంతో రాష్ట్రపతికి ఆమోదం కోసం ఆ తీర్మానం ప్రతుల్ని పంపాం. పది నెలలైనా కేంద్రం రాష్ట్ర అసెంబ్లీ చేసి పంపిన తీర్మానంపై స్పందించడం లేదు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల జనాభా పెరిగినట్లు సుధీర్, చెల్లప్ప కమిటీలు స్పష్టంగా రుజువు చేశాయి.

ఎస్సీ, ఎస్టీలను అణచివేసే ధోరణి : సీతారాం నాయక్

ఆనాడు ఉన్న జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు ఏడున్నర శాతం రిజర్వేషన్ కల్పించారు. ఇప్పుడు జనాభా పెరిగింది. జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ పెంచవచ్చని రాజ్యాంగంలోనే ఉంది. దాదాపు రెండు వందల కులాల జాబితా ఎస్సీ, ఎస్టీ కమిషన్ వద్ద ఉంది. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును కూడా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరం. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన విధానాన్నే బీజేపీ కూడా అనుసరిస్తోంది. దళితులంటే ఇష్టం లేకే కేంద్రం 50 శాతాన్ని సాకుగా చూపిస్తోంది. అంతరించిపోతున్న జాతులను కాపాడుకోవాలంటే ప్రభుత్వం వెంటనే ఓ నిర్ణయం తీసుకోవాలి. లేని పక్షంలో తమ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అన్నదాతకు ఆర్థిక చేయూత

● రైతు ఆత్మహత్యలపై సర్కార్ స్పష్టత ● శాసన సభలో ప్రకటించేలా ఏర్పాట్లు ● సాయం పెంచిన సర్కార్ ● ఒక్కో కుటుంబానికి రూ. 6లక్షలు ● ఈ ఏడాదీ కరవు ఛాయలే ● వ్యవసాయంపై ప్రభావం

ఆంధ్రప్రభ, హైదరాబాద్ : రైతు ఆత్మహత్యలపై ప్రభుత్వం అధికారిక లెక్కల ప్రకటనకు సిద్ధమవుతోంది. ఈనెల 12నుంచిఅసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో రైతాంగ సమస్యలపై సర్కార్ సన్నద్ధమవుతోంది. దేశంలో ఎక్కడాలేని రీతిలో రైతుకు ఒట సాయంగా ఎకరాకు రూ. 8వేల పెట్టుబడి సాయం పథకం అమలులోకి తెస్తున్న నేపథ్యంలో కీలక అంశాలతో నివేదిక సిద్ధం చేసుకుంటోంది. శాసనసభలో విపక్షాలు మూడేళ్ల రైతు ఆత్మహత్యలపై పట్టుపట్టే అవకాశ: ఉండటంతో సమగ్ర నివేదికను రూపొందించుకుంది. దేశ వ్యాప్తంగా ఏ రాష్ట్రాం ఆయా రాష్ట్రరైతాంగానికి ఎంతెంత మేర మేలు చేశాయో...ఏఏ పథకాలను అవలంభించాయో కూడా ప్రస్తావించేలా కార్యాచరణ చేసుకుంటోంది. ఇప్పటికే సేకరించిన సమాచారంతోపాటు, ధృవీకరించిన రైతు ఆత్మ హత్యలను, అందించిన సాయం వివరాలను ప్రకటించనుంది.

మూడేళ్లలో 1149ఆత్మహత్యలు...

రాష్ట్రం ఏర్పాటైన మూడేళ్లలో 1149 రైతు ఆత్మహత్యలు జరిగినట్లుగా తాజాగా సర్కార్ తేల్చింది. 2014 జూన్ నుండి 2017 ఆగష్టు 31వరకు రాష్ట్రంలో 2066 రైతు ఆత్మహత్యలు నమోదుకాగా అందులో వ్యవసాయ కారణాలతో జరిగిన మరణాలు నివేదికను సిద్ధం చేసింది. మొత్తం 1808 మరణాలపై త్రిసభ్య కమిటీ విచారణ జరిపి 1149 మంది రైతుల ఆత్మహత్యలను గుర్తించింది. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 168 మంది, సంగారెడ్డిలో 144మంది, కరీంనగర్‌లో 109 మంది ఆదిలాబాద్ 69, నిర్మల్ 36, సిరిసిల్ల 25, వరంగల్ అర్బన్66, జనగాం 34, వరంగల్ రూల్ 48, యాదాద్రి 34, మహబూబ్‌నగర్ 63, రంగారెడ్డి 78, వికారాబాద్ 64 మరణాలున్నట్లుగా తేల్చింది.

ఇందులో 846 మందికి పరిహారం అందించినట్లుగా తేల్చారు. గత మూడేళ్లుగా ఎటువంటి రైతు ఆత్మహత్యల అధికారిక ప్రకటనపై జాప్యం నెలకొంది. ఈ లెక్కలను ఇప్పటివరకు ధృవీకరించని సర్కార్ తాజాగా సంబంధిత ప్రభుత్వశాఖలను అప్రమత్తం చేసింది. రెవెన్యూశాఖకు కలెక్టర్లు నివేదికలు అందించేలా ఏర్పాట్లు చేసినట్లు సమా చారం. మండల కమిటీలు అధికారికంగా గుర్తించిన ఆత్మ హత్యల్లో 457 కుటుంబాలకు రూ.6లక్షల చొప్పున పరిహారపు మొత్తం రూ. 27.42 కోట్లను గతఅక్టోబర్‌లో ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఈ 457 మంది ఎప్పటినుంచి ఎప్పటివరకు మృతి చెందిన వారనే అంశంలో స్పష్టత లేదు.

ఈ ఏడాదీ కరవు ఛాయలే...

ఈ ఏడాది కూడా వేసవి ఆరంభానికి ముందే ఎండలు తారాస్థాయికి చేరి... తారెత్తిస్తున్నాయి. ఫలితంగా కరవు ఛాయలు కమ్ముకొస్తున్నాయని విపత్తు నిర్వహణ శాఖ అంచనా వేస్తోంది. 2005లో సగటున 15.06 మీటర్లకు పడిపోయిన భూగర్భ జలాలు ఈ ఏడాది 14.79 మీటర్లకు పడిపోయిందని ప్రభుత్వం గుర్తించింది. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల్లో 2005కంటే దారుణమైన పరిస్థితికి చేరుతోంది.

తీవ్ర కరవు ఆహార ధాన్యాల ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపు తోంది. గతేడాదిగా తెలంగాణలో బియ్యం, పప్పుధాన్యాల దిగుబడి పూర్తిగా నిరాశాజనక స్థాయికి చేరింది. రెండేళ్ల సాగుతో పోలిస్తే అంచనాలు పూర్తిగా అడుగంటాయని వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. మార్చి మొదటి వారంలోనే నీటి కష్టాలు ఆరంభమయ్యాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఆదిలాబాద్, కుమరం భీం, ఖమ్మం జిల్లాల్లో పరిస్థితి దారుణంగా మారింది. నిర్మల్ జిల్లాలో గతేడాది మే నెలలో 11.25 మీటర్ల భూగర్భజలాలు తాజాగా 11.85 మీటర్లకు పడిపోయాయి. కుమరం భీం జిల్లాలో అయితే 11.85 మీటర్ల లోతుకు పడిపోయాయి. కామారెడ్డిలో జనవరిలో 12.14 మీటర్లు ఉండగా ఇప్పుడవి 13.89 మీటర్లకు పడిపోయాయి.

కాలేజీకి చీరలోనే రావాలి

రాజస్తాన్ ప్రభుత్వం సరికొత్త నిబంధన

జైపూర్: రాజస్తాన్ ప్రభుత్వం కళాశాల విద్యార్థులకు డ్రెస్ కోడ్‌ను ప్రకటించింది. కాలేజీలో చదివే అమ్మాయిలు జీన్స్, టీ షర్ట్స్, లెగ్గిన్స్ లాంటి దుస్తులు ధరించి కాలేజీకి రావొద్దని ఓ ప్రకటనలో తెలిపింది. సంప్రదాయ దుస్తులు సల్వార్‌కమీజ్, చీరలో మాత్రమే కాలేజీకి హాజరు కావాలని సూచించింది. ఈ మేరకు కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనరేట్ అన్ని ప్రభుత్వ కాలేజీలకు లేఖలు పంపింది. కళాశాలల ప్రిన్సిపాల్స్.. బాలుర, బాలికల దుస్తుల రంగు (డ్రెస్ కోడ్ కలర్)ను నిర్ణయించి ఈ నెల 12నాటికి తుది నివేదికను పంపాలని పేర్కొంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ డ్రెస్ కోడ్ అమల్లోకి రానుంది. విద్యార్థులు క్యాంపస్‌లో ఉన్నంత కాలం డ్రెస్ కోడ్ వర్తిస్తుంది. అయితే బోధనా సిబ్బందికి డ్రెస్ కోడ్‌పై నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదావేశారు. కాగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని విద్యార్థులు, టీచర్లు, విద్యార్థి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇది తిరోగమ చర్య అని, ఏ డ్రెస్ వేసుకోవాలో చెప్పి తమ హక్కులను హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రీలంకలో ముదిరిన అల్లర్లు

కొలంబో: శ్రీలంకలో రెండు సామాజిక వర్గాల మధ్య జరుగుతున్న అల్లర్లు తారస్థాయికి చేరుకున్నాయి. కాండి జిల్లాలో మెజార్టీ వర్గం అయిన బౌద్ధులకు, ముస్లిం మైనార్టీ వర్గాలకు మధ్య జరుగుతున్నఘర్షణలు మరింత ముదిరాయి. అల్లర్ల నేపథ్యంలో శ్రీలంక అధ్యక్షుడు మైత్రిపాల అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. సామాజిక మాధ్యమాలు, అంతర్జాల సేవలు నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. రెండు రోజులుగా జరుగుతున్న అల్లర్లలో ఇద్దరు పౌరులు మరణించగా, అధిక సంఖ్యలో ప్రార్థన మందిరాలు, ఇళ్లు ధ్వంసం అయ్యాయి. పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారడంతో కాండిలో కర్ఫ్యూ విధించి భారీగా భద్రత దళాలను మోహరించారు.

బుల్లెట్ ప్రూఫ్ ఇల్లు రెడీ

● ముఖ్యమంత్రి కోసం అత్యాధునికంగా నియోజకవర్గ కార్యాలయం

● 104 నియోజకవర్గాల్లో నిర్మాణాలు వేగవంతం

● 16 నియోజకవర్గాల్లో నిర్మాణాలు పూర్తి ● రూ. 3 కోట్లతో నిర్మించిన గజ్వేల్ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు




సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో పూజలు చేస్తున్న మంత్రి హరీష్‌రావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బుల్లెట్ ప్రూఫ్ కారు.. బుల్లెట్ ప్రూఫ్ బస్సు.. ఇపుడు బుల్లెట్ ప్రూఫ్ ఇల్లు.. ముఖ్యమంత్రి కే. చంద్రశేఖరరావు భద్రత కోసం రాష్ట్ర పోలీసుయంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. రాష్ట్ర హోంశాఖ సూచనల మేరకు నియోజకవర్గ క్యాంపు కార్యాలయాన్ని దేశంలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా అత్యాధునికంగా నిర్మించింది. నివాస, కార్యాలయ సముదాయంగా దీనిని తీర్చి దిద్దగా.. ప్రగతి భవన్‌కు ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించారో.. గజ్వేల్ క్యాంప్ కార్యాలయానికి కూడా అదే తరహా వసతులు కల్పించారు. రూ. మూడు కోట్లతో నిర్మించిన కార్యాలయాన్ని గురు వారం మంత్రి హరీశ్‌రావు ప్రారం భించారు. ముఖ్యమంత్రి మినీ క్యాంపు కార్యాలయంగా భాసిల్లనున్న ఈ గజ్వేల్ కార్యాలయం చుట్టూ అత్యా ధునిక కెమెరాలు వాడు తున్నారు. ఇంటి పరిసరాల్లో ఏర్పాటుచేసిన శక్తివంతమైన కెమెరాలతో చుట్టూ ఏం జరిగినా.. ఇట్టే రికార్డవుతుంది. అనేక ప్రత్యేకత లతో.. విశాల ప్రాంగణంలో నిర్మించిన కార్యాల యాన్ని మంత్రి హరీష్‌రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి గురు వారం ప్రార ం భిం చారు. ఇక నియోజ క వర్గాల్లోనూ కార్యాల యాల నిర్మాణం చకచకా జరుగుతోంది.ఒక్కో ఎమ్మెల్యే కార్యాలయాని కి ప్రభుత్వం రూ.కోటి ఖర్చు చేస్తోంది.

104నియోజకవర్గాల్లో..

ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదే శాల మేరకు హైదరాబాద్ మినహా అన్ని నియోజ కవర్గాల్లోనూ నియోజకవర్గ శాసనసభ్యుల నివాస, కార్యాలయ సముదాయాల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. 104 నియోజకవర్గాల్లో నిర్మాణం ప్రారంభం కాగా, 16నివాసాల నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. మరో 31 నియోజకవర్గాల కార్యాలయాల నిర్మాణం వేగంగా జరుగుతోంది. మొత్తం మార్చి ఆఖరుకు 47నియోజక వర్గాల కార్యా లయాలు అందుబాటు లో ఉంటాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్‌కు చెందిన 15 మంది ఎమ్మెల్యేలకు హైదర్ గూడలో ఎమ్మెల్యేలకు నూతనంగా నిర్మిస్తున్న క్వార్టర్స్ సముదాయం లోనే ప్రత్యేకంగా కార్యాలయాలు నిర్మిస్తున్నారు. నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేల కార్యాలయాలు.. ఏప్రిల్‌లోగాపూర్తిచేయించాలని సిఎం ఆదేశించగా, ఆ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తరచూ దీనిపై సమీక్షలు చేస్తూ పనుల వేగం పెంచుతున్నారు. నియోజక వర్గ కార్యాలయాలు.. పాలనా సౌలభ్యానికి, ప్రజలకు ఎమ్మెల్యేలను అందుబాటులో ఉంచేందుకు దోహదపడనుండగా.. ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం నమూనాగా నిలవనుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

హెచ్‌సీయూలో ముదిరిన ముసలం

వివేక్, శేష్ నారాయణను సస్పెండ్ చేసిన అంబుడ్స్‌మన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఏ)లో గత కొంత కాలంగా నివురుగప్పిన నిప్పులా ఉన్న విబేధాలు మరోసారి భగ్గుమన్నాయి. హెచ్‌సిఎలో జరుగుతున్న అవకతవకలు, అక్రమాలపై గతకొంత కాలంగా భారత క్రికెట్ మాజీ కెప్టెన్ అజరుద్దీన్ పోరాటం చేస్తున్నారు. హెచ్‌సిఏ అధ్యక్షుడు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ కోర్టును కూడా ఆశ్రయించారు. కోర్టులో విచారణ జరుగుతున్న తరుణంలో అంబుడ్స్‌మన్ గురువారం హెచ్‌సిఏ అధ్యక్షుడు వివేక్‌తో పాటు కార్యదర్శి శేష్‌నారాయణ్‌ను సస్పెండ్ చేసింది. వాస్తవానికి శేష్‌నారాయణ్‌ను గతంలోనే సస్పెండ్ చేసినప్పటికీ కోర్టు ఆదేశాలతో ఆయన కొనసాగుతున్నారు. తాజాగా అంబుడ్స్‌మన్ రంగంలోకి దిగి అధ్యక్ష, కార్యదర్శులను సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించడం సంచలనం రేకెత్తిస్తోంది. దీంతో అజరుద్దీన్ కొంత కాలంగా చేస్తున్న పోరాటానికి అంబుడ్స్‌మన్ మద్దతిచ్చినట్లైందని అంటున్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
శుక్రవారం 9 మార్చి 2018

రాజకీయాల్లో విద్యార్థులపై చెరో దారి

కమల్ హాసమా!.. రజనీ కాంతులా!!

వారు సినీరంగంలో ప్రత్యర్థులు.. ఇప్పుడు రాజకీయ సమరాంగణానా ప్రత్యర్థులే. కొద్దికాలంగా స్తబ్దుగా ఉన్న తమిళ రాజకీయాలు ఇప్పుడిప్పుడే రాజుకుంటున్నాయి. ఇంతవరకూ ఎవరి దారిన వారు ప్రయాణించిన వీరిద్దరిలో ఒకరు కలిసి ప్రయాణించాలని భావించారు. రెండోవారు తన పంథాకు భిన్నమైన సంకేతాలను కనబరచడంతో ఇక్కడా ప్రత్యర్థులుగా మారిపోయారు.. వారే తమిళ వెండితెరపై అగ్రనటులు కమల్ హాసన్, రజనీకాంత్. పట్టుపరుపుపై నుంచి కత్తుల బోనులోకి ప్రవేశిస్తున్నారిద్దరూ. సినిమాల్లో ఎన్నో సాహసోపేతమైన సన్నివేశాల్లో నటించిన వీరిద్దరికీ రణతంత్రాలను పోలినట్లుండే విభిన్నమైన యవనిక ఎలాంటి ఫలితాలనూ లేదా అనుభవాలను రుచిచూపిస్తుందన్నది కాలం నిర్ణయించాలి.

ఇద్దరి అభిప్రాయాలకూ అసలు పొంతనే లేదనే సంఘటనలు మూడు రోజుల క్రితమే చోటుచేసుకున్నాయి. చెన్నైలోని ఓ విద్యాసంస్థలో డాక్టర్ ఎంజీ రామచంద్రన్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడిన సూపర్ స్టార్ రజనీ కాంత్...రాజకీయాల్లోకి రావద్దంటూ విద్యార్థులకు సూచించారు. దీనికి భిన్నంగా విద్యార్థులు రాజకీయ రంగంలో కదనోత్సాహంతో దూకాలని కమల్ హాసన్ గురువారం పిలుపునిచ్చారు. ఎస్ఎస్ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఆ కార్యక్రమంలో, తమిళనాడు ముందడుగు వేయాలంటే విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలన్నది తన అభిప్రాయమని ఆయన పేర్కొన్నారు. మక్కల్ నీది మయ్యమ్ మీలాంటి వారికోసమే చూస్తోందన్నారు. ఓటు వేయడం మానరాదని కూడా ఆయన సూచించారు. మనలో కొంతమంది ఓటు వేయకపోవడం వల్లనే ఈరోజు మనమీ పరిస్థితిలో ఉన్నామని కమల్ చెప్పారు. మీ ఆలోచనలను నాకు తెలియజేయండి. వింటాను.. నేర్చుకుంటాను అంటూ కమల్ అనడం యువశక్తిని ఆయన గుర్తించారని సంకేతాలు పంపింది. మరోవంక రజనీకాంత్ పిలుపుపై మిశ్రమ స్పందనలు వచ్చాయి. రజనీకాంత్‌కు విద్యార్థి లోకంలో అమితమైన ఫాలోయింగ్ ఉంది. ఈ కారణంగా వారంతా రజనీ వెంట నడుస్తారని రాజకీయ కురువృద్ధులు అంటుంటారు. రాజకీయాలను మలుపుతిప్పగల సత్తా ఉన్న విద్యార్థి లోకాన్ని వాటికి దూరంగా ఉండమనడం సహేతుకం కాదంటున్నారు. తమిళనాడులో ఇలాంటి బోధలు అస్సలు చెల్లవనేది వారి అభిప్రాయం. అధ్యాపకుని వృత్తి నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించిన సి.ఎన్. అన్నాదురై ఎమ్. కరుణానిధి, ఎమ్.జి.రామచంద్రన్‌లను రాజకీయాల్లోకి తెచ్చారు. వీరిద్దరూ విద్యార్థుల మద్దతుతోనే అగ్రపీఠాలకు ఎగబాకారు. హిందీ భాషను రుద్దడం వంటి సెంటిమెంట్లను ఆధారంగా చేసుకుని 1967లో వీరిద్దరూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని పడగొట్టి, అధికారాన్ని చేజిక్కించుకున్నారు.

కమల్ లక్ష్యం విద్యార్థులను ఆకర్షించడంగానే కనిపిస్తోంది. తన పార్టీని విస్తరించడానికి అదే సులువైన మార్గంగా ఆయన భావిస్తున్నారు. విద్యార్థులలో అత్యంత ఆసక్తిని రేపిన రజనీ కాంత్ మరోవంక వారి ఆశలను వమ్ము చేసినట్లే కనిపిస్తోంది. రాజకీయాలొద్దు.. చదువుపై దృష్టి కేంద్రీకరించడని చెప్పడం వారికి రుచించడం లేదు. విద్యార్థులతో మాట్లాడుతున్నప్పుడు రజనీ వారి మనసుల్ని హత్తుకునేలా మాట్లాడారు. నేను ఎమ్‌జిఆర్‌ను కాలేకపోవచ్చు. ఆయన పరిపాలనను మాత్రం తిరిగితెస్తానంటూ భరోసానివ్వడం విద్యార్థుల్లోనే కాకుండా అన్ని వర్గాల్లోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ కమల్...నేను ప్రజా రాజ్యాన్ని తెస్తానంటూ వ్యాఖ్యానించారు. రజనీ.. బీజేపీ భావజాలాన్ని ప్రదర్శిస్తుండగా, కమల్..వామపక్ష భావజాలాన్ని నెత్తికెత్తుకున్నారు. రజనీ చెప్పిన ఆధ్యాత్మిక రాజకీయాలు అనే పదం కమల్‌కు కొరుకుడు పడలేదు. అందుకే ఆయన రజనీకి దూరంగా జరుగుతున్నారు. నేను లెఫ్ట్ కాదు.. రైట్ కాదు.. మధ్యలో ఉన్నా..అందుకే పార్టీ పేరులో మయ్యమ్ అని చేర్చా అని వివరణనిచ్చారు. ఏ విషయం ఎలా ఉన్నా.. ఇద్దరికీ ఉమ్మడి అజెండా మాత్రం ఉంది. అవినీతి రహిత ప్రభుత్వాన్ని నడుపుతామని చెబుతున్నారు. సమాజంలో అణగారిన వర్గాల అభివృద్ధికి పాటుపడతామనీ చెబుతున్నారు. ఇవి రెండే వారు ఉమ్మడిగా చెబుతున్నవి. డొన్నా బ్రెజిలె, అమెరికాకు చెందిన రాజకీయ విశ్లేషకుడు. 2000 సంవత్సరం యూఎస్ఏ ఎన్నికలలో అల్ గోరే, జెస్సీ జాక్సన్‌లకు ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. నటులంతా రాజకీయ నాయకులేనని ఆమె వ్యాఖ్యానించారు. భారతీయ నటులకూ, రాజకీయ నాయకులకూ ఈ వ్యాఖ్య నూరు శాతం అతికినట్లు సరిపోతుంది. రాజకీయాలలో ఉన్నవారు మంచి నటులు. ఈ రెండు రంగాలూ ప్రజలను అవివేకులుగా చూస్తాయి. నటులతో తాము అవివేకులనిపించుకోవడాన్ని వారు ఇష్టపడతారు. రాజకీయ నాయకులు ఇంతకు రెట్టింపుగా ప్రజల్ని అవివేకులు చేస్తారని తెలుతోంది. నైపుణ్యమున్న నటుడు



మిమ్మల్ని ఆలోచింపజేస్తాడు. నేర్పున్న ఏ రాజకీయనేతా మిమ్మల్ని ఆలోచింపనీయడు. ఇది కమల్ హాసన్‌కు సరిగ్గా అతికినట్లు సరిపోతుంది. తమిళనాడులో ఆయన ఇప్పుడు ఒక ఆశాకిరణంగా కనిపిస్తున్నారు. విద్యార్థి లేదా యువశక్తిని సక్రమంగా వినియోగించుకున్న ఏ పార్టీ కూడా ఇటీవలి కాలంలో నష్టపోయిన దాఖలాలు లేవు. బీజేపీ సైతం 2014 సాధారణ ఎన్నికలలోనూ, యూపీ ఎన్నికలలోనూ ఇదే ఫార్ములాను అనుసరించింది. విజయకేతనాన్ని ఎగరేసింది. ఆధ్యాత్మిక రాజకీయాలను నెరపుతానన్న రజనీ విద్యార్థులు రాజకీయాల్లోకి రాకూడదని సూచించడం ఆయనకు నష్టం చేకూరుస్తుంది. తమిళ రాజకీయాలు మొత్తం విద్యార్థుల చుట్టూనే తిరుగుతాయి. అనుకున్నది సాధించడానికి వారు ఎంతకైన తెగిస్తారు. కావేరీ జలాలకోసమైతేనేమీ, సంప్రదాయ క్రీడలలోనైతేనేమి సాధించేవరకూ పట్టువీడరు. సినిమా పరిశ్రమతో సంబంధాలున్న రాజకీయ నాయకుల జాబితా ఎంతో పొడుగ్గా ఉంటుంది. ఎమ్. కరుణానిధి తొలుత స్క్రిప్ట్ రైటర్, అనంతరం ముఖ్యమంత్రయ్యారు. ఐదుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఎమ్.జి. రామచంద్రన్ అలియాస్ ఎంజీఆర్ తొలుత మంచి ఆకర్షణ ఉన్న నటుడు. డీఎంకే సభలకు ఆయనే స్పెషల్ అట్రాక్షన్. 1977లో పార్టీ చీలిపోయేవరకూ ప్రధాన ఆకర్షణగా ఉన్నారు. ఏఐఏ డీఎంకే పార్టీని స్థాపించి, అధికారంలోకి దూసుకొచ్చారు. ఆయనతో హీరోయిన్‌గా నటించిన జె. జయలలిత ఆయన వారసత్వాన్ని స్వీకరించింది. నాలుగు పర్యాయాలు ముఖ్యమంత్రిగా బాధ్యతలను వహించారు. ఎమ్‌డిఎంకే పార్టీని స్థాపించిన యాక్టర్ విజయకాంత్ తొలి ఎన్నికల్లో బాగానే ప్రభావం చూపించారు. కాంగ్రెస్ నేత కె. కామరాజ్ అభిమాని అయిన శివాజీ గణేశన్ పెట్టిన పార్టీ అంతంత మాత్రంగానే ఉండిపోయింది. కమల్ హాసన్ సైతం రాజకీయాల్లోకి రావాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. అవినీతిపై ఏఐఏ డీఎంకే ప్రభుత్వాన్ని ట్విటర్‌లో విమర్శించారు. రజనీ, కమల్ రేపటి నాయకులుగా ఎదగాలంటే ఎంతో పోరాటం చేయాల్సి ఉంటుంది. 1990 మధ్య కాలంలోనే తనకు రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన ఉందని సూచన ప్రాయంగా తెలిపారు. అభిమానుల్ని నిరాశపరిచారు.

రాజకీయాల్లోకి రజనీ ప్రవేశిస్తారన్న తొలి సంకేతాలు 1996లో కనిపించాయి. కాంగ్రెస్ పార్టీకి ప్రచారం చేయాలనే ఆయన తలుస్తున్నారని అప్పటి వార్తలు. అప్పటి ప్రధాన మంత్రి పివి నరసింహారావు ఆసక్తి చూపకపోవడంతో రజనీ తన ఆలోచనను విరమించుకున్నారు. ఏఐఏ డీఎంకెకు కాంగ్రెస్ మద్దతు తెలపడంతో ఆగ్రహించిన జికె మూపనార్ తమిళ మానిల కాంగ్రెస్ పేరుతో బయటకొచ్చినప్పుడు రజనీ ఆ పార్టీవైపు మొగ్గుచూపారు. జయలలితను మళ్ళీ ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటే తమిళనాడును కాంగ్రెస్ కూడా కాపాడలేదని రజనీ అప్పట్లో ప్రముఖంగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యతో ఏఐఏ డీఎంకెకు ఆ ఏడాది ఓటమి తప్పదని అందరూ ఊహించారు. అదేసమయంలో రాజకీయాల్లోకి రావడానికి ఒక మంచి అవకాశాన్ని పోగొట్టుకున్నాడని మరికొందరు అభిప్రాయపడ్డారు. 1998లో అదే కూటమికి తిరిగి మద్దతు ప్రకటించారు. ఆ ఎన్నికల్లో ఏఐఏ డీఎంకే 18 స్థానాలను గెలుచుకుంది. 2002లో రజనీకాంత్ తొమ్మిది గంటలపాటు నిరాహార దీక్ష పాటించారు. కావేరీ జలాలను తమిళనాడుకు విడుదల చేయాలన్న సుప్రీం తీర్పును అమలుచేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ప్రజా ఉద్యమంలో ఆయన ఈ దీక్ష పాటించారు. దేశంలోని ప్రధాన నదులన్నింటినీ అనుసంధానించాలన్న ప్రచారానికి మద్దతు పలికారాయన. 2004లో నదుల అనుసంధానం అంశాన్ని బీజేపీ అజెండాగా చేపట్టినప్పుడు వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి రజనీ మద్దతు తెలిపారు. 2014లో నరేంద్రమోడీతో సమావేశం కావడం కూడా రజనీ రాజకీయరంగ ప్రవేశం అవుతుందనే వదంతులకు తావిచ్చింది. ఆ సమావేశం గౌరవసూచకమే తప్ప మరోటి కాదని అప్పట్లో ఆయన కొట్టిపారేశారు. అప్పటినుంచి రజనీకాంత్‌ను తన దారికి తెచ్చుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తూనే ఉంది.

కొద్ది కాలంగా తమిళనాడు రాజకీయాలు అల్లకల్లోలంగా ఉన్నాయి. 2016 డిసెంబర్‌లో జయలలిత కన్నుమూసినప్పటి నుంచి మరింత తీవ్రతరమయ్యాయి. ఈ నేపథ్యంలో కమల్-రజనీల రాజకీయ రంగప్రవేశం ఆహ్వానించదగ్గ పరిణామమే. విభిన్నమైన వ్యాఖ్యలతో అవకాశాలను చెడగొట్టుకోని వారే రాజకీయరంగంలోనే కాక ఏ రంగంలోనైనా రాణిస్తారు. దానికి కమల్-రజనీ మినహాయింపు కాదు. ఇద్దరూ ఆచితూచి అడుగేస్తే.. పైచేయి ఎవరిదో చెప్పడం కష్టమే. అందమైన అనుభవం చిత్రంలో నటించిన ఇద్దరూ కుర్రాళ్ళోయ్.. కుర్రాళ్ళు.. అంటూ యువతను వెర్రెత్తించారు. స్టెప్పులేయించారు. రాజకీయ రంగంలోకి వచ్చేసరికి ఇద్దరూ చెరోదారీ ఎంచుకోవడం విశేషం.

-సుబ్రహ్మణ్యం విఎస్ కూచిమంచి


నేపాలీలు పాక్‌ని నమ్మరు!

ఇరవై నాల్గేళ్ళ తర్వాత నేపాల్‌లో పాకిస్తాన్ ప్రధాని అబ్బాసీ పర్యటించడం మారుతున్న సమీకరణాలకు అద్దంపడుతోంది .నేపాల్ ప్రధాని గా గత నెలలో ప్రమాణ చేసిన ఖడ్గప్రసాద్ శర్మ ఓలి మూడేళ్ళ క్రితం నేపాల్ ప్రధాని అయినప్పుడు చైనాతో సన్నిహితంగా మెలగడమే కాకుండా, భారత్‌పై ద్వేషాన్ని కక్కారు. తాజాగా ప్రధాని పదవిని స్వీకరించిన తర్వాత తనకు భారత్,చైనాలు రెండూ సమానమేనంటూ ప్రకటన చేశారు.అయితే, ఆయన ప్రకటన మొక్కుబడి ప్రకటన అన్న విషయం ఆనాడే విశ్లేషకులు పేర్కొన్నారు.అది ఇప్పుడు నిజం అయింది. పాకిస్తాన్‌ను భారత్ పైకి దువ్వుతున్న చైనా ప్రభావంలోనే ఓలీ ఉన్నారని తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి. నైసర్గికంగా తీసుకున్నా, మత పరంగా తీసుకున్నా పాక్‌కీ, నేపాల్‌కీ ఏ విధమైన సంబంధం లేదు. ఇంకా పాక్‌కీ,మనకూ సరిహద్దు సంబంధాలు ఉన్నాయి. మతపరంగా కూడా ముస్లింలు మన దేశంలో అధిక సంఖ్యలో ఉండటం వల్ల ముఖ్యంగా, ఉభయ కాశ్మీర్‌లకు చెందిన దాయాదులు తరచూ కలుసుకునేందుకు ప్రయత్నించడం వల్ల నేపాల్‌తో కన్నా మన దేశంతో పాక్‌కి సంబంధాలు ఉన్నాయి. మూడేళ్ళక్రితం తమ దేశంలో పెద్ద ఎత్తున సాగిన మాదేశీల ఆందోళన వెనుక భారత్ ప్రోద్బలం ఉందనేది ఓలీ అపోహ.దానిని ఆసరాగా చేసుకుని నేపాల్‌కి చైనా సాయం అందించేందుకు ముందుకు వచ్చింది. నిజానికి తమకు ఎన్నికల ముందు చేసిన వాగ్దానాన్ని అధికారంలోకి రాగానే ఓలీ విస్మరించడం వల్లనే అప్పట్లో మాదేశీలు ఆందోళన సాగించారు.ఇందులో భారత్ ప్రమేయం కానీ, పాత్ర కానీ వీసమంతయినా లేదు. నేపాల్‌లోని కొండ ప్రాంతాల్లో నివసించే మాదేశీలు రాజ్యాంగ బద్ధమైన హక్కులను కోరుతున్నారు. జనాభా దామాషాగా తమకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతున్నారు. నేపాల్ రాచరిక వ్యవస్థ నుంచి విముక్తం అయిన నాటి నుంచి మాదేశీలు తమ కోర్కెల సాధన కోసం ఆందోళన సాగిస్తున్నారు.ఎన్నికల సమయంలో వారి మద్దతు కోసం ఓలీ వాగ్దానం చేసి నిలబెట్టుకోకపోవడం వల్లే వారు ఆగ్రహించారు. నేపాల్‌లో దీర్ఘ కాలం మావోల ఆందోళన సాగడం,రాచరిక వ్యవస్థ ప్రభావం నుంచి ఇంకా బయటపడకపోవడం వల్ల ఆర్థిక పరమైన సమస్యలను ఎదుర్కొంటోంది.వాటి పరిష్కారం కోసం నేపాల్ మన దేశాన్నీ ఆశ్రయించింది. ఓలీ ప్రమాణానికి ముందు ఖాట్మండూలో పర్యటించిన విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ నేపాల్‌కి గతంలో మాదిరిగానే భారత్ సాయం అందిస్తుందని ఓలీకి భరోసా ఇచ్చారు. ఓలీ కూడా భారత్‌తో తమ దేశానికి శతాబ్దాలుగా ఉన్న సంబంధాలను కొనసాగించేందుకూ, ప్రజల మధ్య రాకపోకలు కొనసాగేట్టు చూసేందుకు చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు.మరి ఇంతలో ఏమైందో తెలియదు. భారత్ నుంచి నేపాల్‌ని దూరం చేసేందుకు చైనా పావులు కదపడం ప్రారంభించింది.తాను తలపెట్టిన ఒకే బెల్ట్ ఒకే రోడ్డు (ఒబిఒఆర్) కి నేపాల్ సహకారం అవసరం కనుక ఓలీని అడ్డుపెట్టుకుని తన ప్రాజెక్టు నిరాటకంకంగా పూర్తి చేసుకోవాలనుకుంటోంది. నేపాల్ లోని ఇతర పార్టీల నాయకులు ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారు. పాకిస్తాన్ ప్రధాని అబ్బాసీ ఖాట్మండూ పర్యటనలో మాజీ ప్రధాని దేవుబాతో సహ ప్రతిపక్ష నాయకు లెవరినీ కలవలేదు. చైనాకి అనుకూలంగా దౌత్యం నెరపడానికే అబ్బాసీ పర్యటనలు జరిపినట్టు ఖాట్మండూ పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. నేపాల్‌లో అధిక సంఖ్యాకులు భారత్‌తో మెరుగైన సంబంధాలు ఉండాలని కోరుకుంటున్నారు. మత పరంగా సంబంధ బాంధవ్యాలు ఉండటం వల్ల భారత్ వైపే వారంతా మొగ్గు చూపుతున్నారు. అంతేకాక, శ్రీలంక అధ్యక్షునిగా మహీందా రాజపక్సే కొనసాగిన కాలంలో రేవు నిర్మాణానికి సహాయం అందించేందుకు ముందుకు వచ్చిన చైనా కంపెనీలు తర్వాత ఆ రేవుల ఆదాయంలో వాటా కోరడం వల్ల అదే మాదిరిగా తమ దేశ ఆదాయానికి కూడా చైనా కంపెనీలు గండి కొడతాయేమో నన్న సందేహాలు నేపాలీల్లో ఉన్నాయి. మరో వంక చైనా ఎత్తుగడలు చైనావి.అమెరికా భారత్‌తో సంబంధాలు కలిగి ఉండటమే కాకుండా, రక్షణ రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యం కలిగి ఉండటం వల్ల ఈ ప్రాంతంలో అమెరికా ప్రభావం పెరుగుతుందేమోనన్నది చైనా అనుమానం. అందువల్ల భారత్‌కి వ్యతిరేకంగా పొరుగు దేశాలను తన వైపు తిప్పుకోవడానికి చైనా అడుగులు వేస్తోంది. పాకిస్తాన్ ఇప్పటికే చైనాకు ఆంతరంగిక దేశం అయింది.నేపాల్‌లో ఓలీ తమ దేశం పట్ల సుముఖంగాఉన్నాడు కనుక,నేపాల్‌ని చేరదీసేందుకు అబ్బాసీ ని ఖాట్మండూ పర్యటనకు పంపింది.అయితే, నేపాలీలు అంత సులభంగా పాక్‌ని నమ్మరు. భారత్‌తోనే సాన్నిహిత్యాన్నే వారు కోరుకుంటారు.రోడ్డు నిర్మాణానికే వారు వ్యతిరేకత తెలిపారు. పాత విషయాలు ఎలా ఉన్నా,డోక్లామ్‌లో చైనా సృష్టించిన ఉద్రికత గురించి నేపాల్‌తో సహా ఇరుగు పొరుగు దేశాలన్నింటికీ తెలుసు.

ఆఫ్ఘన్‌లో పాక్ ఆజ్యం-చైనా వత్తాసు!

అహింసామూర్తి మహాత్మాగాంధీ సారథ్యంలో స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న మన దేశం ఆది నుంచి శాంతి కాముక దేశంగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. అందుకే, భారత్ అణు పరిజ్ఞానాన్ని సముపార్జించుకున్నా ఏ ఒక్క దేశమూ కంగారు పడలేదు. శాంతియుత ప్రయోజనాల కోసమే అణు పరిజ్ఞానాన్ని కలిగి ఉన్నట్టు ఇరాన్ ఎంత మొత్తుకున్నా ప్రపంచ దేశాలు నమ్మలేదు. అదీ తేడా. పపంచంలోని వివిధ ప్రాంతాల్లో అశాంతి ఏర్పడినప్పుడు శాంతి దళాలను ఐక్యరాజ్య సమితి పంపిస్తూ ఉంటుంది. అలా పంపే శాంతి దళాల్లో మన దేశానికి చెందిన సైనికులే ఎక్కువ మంది ఉంటారు. ఆఫ్ఘనిస్థాన్ నుంచి రష్యా వైదొలగిన తర్వాత అమెరికా తాలిబన్లను తరిమేసి ఆ దేశ పునర్నిర్మాణానికి కట్టుబడి ఉన్నట్టు ప్రకటించింది. అయితే, ఆఫ్ఘన్ పునర్నిర్మాణంలో మన దేశమే ఎక్కువ తోడ్పడుతోంది. తాలిబన్లు, హఖానీ గ్రూపు ఉగ్రవాదులు ఆఫ్ఘనిస్థాన్‌లో తిష్ఠ వేసి భారత్‌తో సహా పలు దేశాల నుంచి వస్తున్న సహాయాన్ని అడ్డుకుంటున్నారు. ఈ పరిస్థితిని పాకిస్తాన్ బాగా ఉపయోగించుకుంటోంది. ఈ విషయంలో పాక్‌కి చైనా అండగా నిలుస్తోంది. ఆఫ్ఘనిస్తాన్ దేశానికి ఆసియా జబ్బు మనిషిగా పేరుపొందింది. ఎప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌ను అగ్రరాజ్యాలు బఫర్ రాజ్యంగా వాడుకొనేవి. అదేవిధంగా అమెరికా - రష్యా ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో రష్యా ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రవేశించి ఆ దేశంలో లభ్యమయ్యే ఖనిజ సంపదనూ, యురేనియంనూ కొల్లగొట్టింది. సోవియట్ రష్యా రాష్ట్రాలలో కూడా ఉజ్బెకిస్తాన్‌కు మద్దత్తు నిచ్చేవి. వారిని ఎదుర్కొనేందుకు తాలిబన్ ఉగ్రవాద సంస్థ పాకిస్తాన్ మద్దత్తుతో పనిచేయడంవల్ల ఎప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌లో ఏదో ఒకచోట భారీగా పేలుళ్ళు, బాంబులు వేయడంతో అనేకమంది ఆఫ్ఘన్ పౌరులపై మారణ హోమం సాగించారు. వీరిని అణచి వేయడానికి అమెరికా మిత్ర దళాలను మోహరించింది ఆఫ్ఘనిస్తాన్‌తో న్యాయబద్ధ ప్రభుత్వానికి అండగా పనిచేయడం ప్రారంభించాయి. అమెరికా ఇండియా సరిహద్దు దేశం ఎన్‌డబ్ల్యుఎఫ్ఎ ఉత్తర వాయవ్య సరిహద్దు ప్రాంతం కనుక ఆఫ్ఘనిస్తాన్ పునః నిర్మాణ కార్యక్రమాలను ఇండియాకు అమెరికా అప్పగించింది. ఆఫ్ఘనిస్తాన్‌కు ఇండియా, చైనా సోవియట్ రష్యా సంయుక్త రాష్ట్రాలు సరిహద్దు దేశాలు కనుక ఇప్పటికే పాకిస్తాన్ ఇండియా పట్ల బద్ధవైరుధ్యంగా వ్యవహరిస్తూ ఇండియాలో అల్లర్లను సృష్టించేందుకు చొరబాటు దార్లను పంపుతోంది. సరిహద్దులలో కవ్వింపు చర్యలకు పాల్పడడం అధికం చేసింది. అంతేగాక ఉగ్రవాద సంస్థల నాయకులైన హాఫీజ్ సయ్యద్ లాంటి వారందరు ఇండియాను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడ్డారు. ఇండియా ఆర్థికరాజధాని ముంబాయిలో దాడులు జరిపి 200 మందిని పొట్టన పెట్టుకొన్నారు. ఆ కేసులులపై అంతర్జాతీయంగా వాదనలు జరుగుతున్నాయి. ఈ స్థితిలో ఇండియాకు ఆఫ్ఘనిస్తాన్ పునః నిర్మాణ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల వృద్ధికోసం భారత కంపెనీలు పనిచేస్తున్నాయి. పాకిస్తాన్‌కు కారం మీద పుండు జల్లినట్లు అమెరికా ఇండియాను ఆఫ్ఘనిస్తాన్ నిర్మాణంలో భాగస్వామిని చేయడం గిట్టక పాకిస్తాన్ భారత్‌పై చొరబాట్లను మరింత ఉధృతం చేయడం డ్రగ్స్ మాఫియాను ఇండియాకు పంపడం, ఇండియాలోకి ఫేక్ కరెన్సీని పంపి ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తోంది. అమెరికా ఇండియాను ఆఫ్ఘనిస్తాన్ అభివృద్ధిలో భాగస్వామిని చేయడం చైనాకు నచ్చలేదు. చైనా ఇండియా చుట్టూ తన స్థావరాలను ముఖ్యంగా మిలిటరీ, నౌ కా, వైమానిక స్థావరాలను బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవులలో నిర్మించింది. సిక్కిం సరిహద్దులలో డొక్లామ్ ప్రాంతంలో రోడ్డు రహదారులను నిర్మించి ఇండియాను అష్టదిగ్బంధం చేసింది. మయన్మార్‌లో చైనా మద్దతుదారుడైన సైనిక నియంతను పాలకుడుగా చేసింది.భారత్‌కి అనుకూలురాలైన అ ంగసాన్ సూకీకి మెజారిటీ ఉన్నా, అధ్యక్షురాలుగా నియమించకుండా అడ్డంకులను సృష్టించింది. కేవలం మయన్మార్ ప్రభుత్వ సలహాదారుగా వ్యవహరించేట్లు చేసింది. అదేవిధంగా మయన్మార్ నుండి రొహింగ్యా కాందిశీకులు దాదాపు 15 లక్షల మందిని బంగ్లాదేశ్, భారత్‌లకు పంపి సమస్యలను సృష్టించి ఇండియాను ప్రశాంతంగా ఉండకుండా పలు అడ్డంకులను చైనా సృష్టిస్తోంది. ఇండియాకు అమెరికా మద్దత్తు నిస్తుండడమే కాకుండా మధ్య ఆసియా దేశాలలో శాంతిని నెలకొల్పేందుకు ఇండియా దౌత్యాన్ని వాడుకొంటోంది. అమెరికా ఆఫ్ఘనిస్తాన్ పునః నిర్మాణానికి ఇంతవరకూ 3 ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేసింది.ఆఫ్ఘనిస్తాన్‌లో శాంతి భద్రతలు లేకుండా చేస్తే అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతుందనే లక్ష్యంతో ఉగ్రవాద గ్రూపులైన తాలిబన్ లను పాకిస్తాన్, ప్రోత్సహిస్తూ వారికి తమ దేశంలో ఆశ్రయం కల్పిస్తోంది. ఇందుకు చైనా ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. దాదాపు 10 - 15 ఉగ్రవాద సంస్థలు పాక్‌లో తలదాచుకొంటున్నాయి. కనుక పాకిస్తాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలని కోరగా ఐక్యరాజ్య సమితి పాకిస్తాన్ ఉగ్రవాద దేశంగా ప్రకటించింది. అంతేగాక అమెరికా పాకిస్తాన్‌కు ఇచ్చే 2 బిలియన్ డాలర్ల మిలిటరీ సహాయాన్ని ఇండియా నిలుపుదల చేయించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో పునర్నిర్మాణ కార్యక్రమాలను భారత కంపెనీల వారివి, ఇండియా సైనికులు ఆఫ్ఘనిస్తాన్‌లో పౌర నివాస ప్రాంతాల రక్షణలో అమెరికా ఐక్యదళాలకు సహాయ సహకారాలను అందిస్తున్నారు. భారత్ సైన్యం ఆఫ్ఘన్‌లు శాంతిని నెలకొల్పేందుకు కృషి చేస్తున్నాయి. దీనిని అంతర్జాతీయ సమాజం ముఖ్యంగా రెడ్‌క్రాస్ సంస్థ గుర్తించింది.గత సంవత్సరం చివరి మాసంలో పలుచోట్ల దాడులు జరిగాయి. ఆ దాడుల్లో వెయ్యిమంది పౌరులు, మహిళలు, పిల్లలు చనిపోయారు. అమెరికాకూడా తన రహస్య గూఢచార సంస్థసిఐఎ ద్వారా తాలిబన్‌లను ప్రోత్సహించడమే కాక ఒసామా బిన్ లాడెన్‌కు సిరియా, సౌదీ అరేబియాలలో కాంట్రాక్ట్‌లను ఇచ్చి రష్యా పతనానికి లాడెన్ మద్దతు తీసుకొంది. 1990లో సోవియట్ రష్యా పతనంతో లాడెన్‌కు సహాయ పడడం మానేసింది. దానితో లాడెన్ ఏకు మేకై మానవ బాంబులతో అమెరికాపై 2001 అక్టోబర్ 29న దాడులు చేశాడు, వాటిని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించి లాడెన్ చంపడానికి 10 సంవత్సరాలు పట్టింది అమెరికాకు. ఆఫ్ఘనిస్తాన్ మధ్య ఆసియా విస్తారమైన ఖనిజ సంపద (యురేనియం) ను కలిగి 6,52,000 చదరపు కిలోమీటర్ల భూభాగంలో విస్తరించి కాబూల్ రాజధానిగా ఉన్నది ఆఫ్ఘనిస్తాన్ భూమి కలిగి దేశం (లేండ్ లాక్‌డ్ కంట్రీ) 3,46,56,032 మంది జనాభాను కలిగిన ఇస్లామిక్ రిపబ్లిక్. అలీనోద్యమం దేశాలలో సభ్యురాలు అబ్దుల్ ఘని అధ్యక్షుడు అబ్దుల్లా. అబ్దుల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారిగా ఇండియాతో దగ్గరి సంబంధాలు కలిగి ఉంది. ఉత్తర వాయవ్య సరిహద్దు (ఎన్‌డబ్ల్యుఎఫ్ఎ) ఆఫ్ఘనిస్తాన్‌లో స్థిరమైన ప్రభుత్వం ఉండడం ఇండియాకు మంచిదే. ఆఫ్ఘనిస్తాన్ రెండో ప్రపంచ యుద్ధకాలం నుండి ఎవరో ఆక్రమించుకొని వారి ప్రభావంతో నడుస్తోంది. ఇండియా ఆఫ్ఘనిస్తాన్ పునః నిర్మాణంకు పూనుకొని సహకరించడం మంచిదే అయినా కొన్ని మన సరిహద్దు దేశాలకు నచ్చడంలేదు. కనుక ఇండియా తన దౌత్య ప్రతిభను ఉపయోగిస్తూ అమెరికా, ఐక్యరాజ్య సమితుల మద్దతుతో ఆఫ్ఘనిస్తాన్‌లో అభివృద్ధి కార్యక్రమాలలో భాగం పంచుకొంటోంది. పునరావృతమైన ప్రచ్ఛన్న యుద్ధం వలన ఇండియా నష్టపోకుండా ముందుకు సాగాలని ఆశిద్దాం.

-డాక్టర్ కె. ఆసయ్య
ఐఐఎస్, 8008359912



సాయినాథ్ తోటపల్లి
9394449777

కథ చెప్పడం పెళ్ళి చూపుల్లాంటిది..

ఒక కథ సినిమా కోసం తయారు చేసుకున్నాం.. అది చేసిన రైటర్‌కీ వినిన నిర్మాతకీ డైరెక్ట్ చేసే డైరెక్టర్‌కీ అర్థం అయి ఇష్టమై - నమ్మకం ఉంటే చాలు.. ఆ నమ్మకం, ఆ శ్రద్ధ, ఆ ఇష్టం - త్రికరణ శుద్ధిగా గెలుస్తాయి. ఇది వాస్తవం - రాయడానికి అర్థం చేసుకొని రాయడానికి - రాసింది అనేకసార్లు అనుభవం అయి ఆ నిజాన్ని చెప్పడానికి చాలా చాలా అనుభవం అవసరం. సినిమా కథ ఎలా ఉండాలి? అని చాలా సభల్లో - చాలామంది సన్నిహితుల సమక్షంలో - కొత్తగా వస్తున్న రచయితల మనసులు, కొత్తగా సినిమా తీయాలనుకున్న నిర్మాతలో - డైరెక్టర్లకో కూడా చాలాసార్లు అది అర్థంకాని అర్థంలేని ప్రశ్నలా అనిపించినా అది చాలా విలువైన ప్రశ్న - అవసరం అయిన ప్రశ్న - జీవితాన్ని, జీవనాన్ని మలుపుతిప్పే ప్రశ్న - ఆ సమాధానం ఏంటి అంటే - విపులంగా, క్లుప్తంగా ప్రయత్నిద్దాం. నువ్వు వంశీ వెళ్ళి మన సితార కథను విశ్వనాథ్ గారికి వినిపించి రండయ్యా... అని .. మా ఇద్దరికీ పని పురమాయించారు నిర్మాత పూర్ణోదయ క్రియేషన్స్ సంస్థ అధినేత ఏడిద నాగేశ్వరరావ్.

నేను వంశీ గురువుగారి ఇంటికెళ్ళి అప్పాయింట్‌మెంట్ తీసుకున్నాం - గురువారం ఉదయం 10 గంటలకు మా ఇంటికిరండి - అన్నారు విశ్వనాథ్ గారు - వెళ్ళాం వారు లేరు - సడన్‌గా ఏదో ఎడిటింగ్ పనిమీద వెళ్ళిపోయారు. ఇలా రెండుసార్లు వారిని కలవాలని మేము చేసిన ప్రయత్నం కుదరడం లేదు. మూడోసారి వారిని కలిశాం.. మేం కథ చెప్పాం - విన్నారు ఆ తర్వాత ఆయన చెప్పిన సమాధానం - జన్మలో మరిచిపోలేను - చాలాసార్లు అదే సమాధానం నేను అవసరం అనిపించినప్పుడల్లా చెప్పాను - ఇంతకీ ఆ సమాధానం ఏంటి అంటే సినిమా? కథ చేయడం పెళ్ళిచూపుల కెళ్ళడం లాంటిది - పిల్ల చేసుకునే వాడికి నచ్చాలి - వాడి అమ్మానాన్నలు కూడా ఓకే అనాలి. చాలు - పెళ్ళికి వెయ్యిమందిని పిలుస్తాం అది తప్పుకాదు - పద్ధతి - అంతేకాని మనకు మన తల్లితండ్రులకి నచ్చిన అమ్మాయి మన పక్కింటోళ్ళో, ఎదిరింటోళ్ళు, ఎన్నో ఏళ్ళుగా మన బంధువుల్లా ఉంటారని - వీళ్ళందరికీ నచ్చాలి అని ప్రతివాళ్ళని అమ్మాయిని చూడమని అడగడం తప్పు- పెళ్ళి అవుతున్నప్పుడు అందరినీ ఆహ్వానిస్తాం కదా...సినిమా కథ ఎగ్జాట్‌గా సరిగ్గా అంతే. పదిమందితో చర్చించి తీసుకోవాల్సిన సమిష్టి నిర్ణయం కాదు. నిర్మాతకి, దర్శకుడికి, హీరోకి నచ్చితే చాలు. నా కథలన్నీ అలానే చెప్పాను. చేసుకున్నాను అన్నారు.

ఆ రోజున సగం అర్థం అయింది. - 10 సంవత్సరాలు గడిచిన ఓ 25 శాతం ఎక్కువ అర్థం అయింది. 20 సంవత్సరాల అనుభవం తర్వాత ఓ 90 శాతం అర్థం అయింది. 30 ఏళ్ళ తర్వాత 100 శాతం అదే కరెక్ట్ అని నమ్మడం చెప్పడం - జరుగుతోంది.



ఇక కథలు ఎన్నుకోవాల్సిన తీరు ఎలా ఉండాలి అంటే - కమర్షియల్ హీరోలు బాక్సాఫీసు స్టార్స్‌కి - ఓ రకమైన కథ - కొత్త హీరోలకి ఒక రకమైన కథ 1980 నుంచి 2000 నడిచింది. కాని డిజిటల్ విప్లవం ప్రారంభమై కొత్త జనరేషన్ స్టార్స్ వచ్చేశాక. 2000 నుంచి 2005 దాకా ఓ పద్ధతి -2006 నుంచి 2010 దాకా ఓ పద్ధతి జరిగింది కాని - 2011 నించి 2015 దాకా - చాలా చాలా మార్పులు చేర్పులు ప్రేక్షకుల అభిరుచులు మారాయి - కాని అప్పటికీ ఇప్పటికీ - ఎప్పటికీ ప్రేమ - మానవత్వ విలువలు - కుటుంబకథలు - మూలధనం లాటివి -కాని అవి చెప్పే తీరులో చాలా చాలా అనూహ్యమైన విభిన్నమైన మార్పులు ఆశ్చర్యపరిచేలా చోటుచేసుకున్నాయి. మరీ ముఖ్యంగా - 2016 నుంచి 2018 కథల ఎన్నిక విషయంలో - మరీ ముఖ్యంగా 2017 - 2018 నిశితంగా పరిశీలిస్తే - 2017లో తరుణ్ భాస్కర్ - విజయదేవరకొండల పెళ్ళి చూపులు, రవికాంత్-అడవి శేష్ క్షణం, సంకల్పరెడ్డి-రాణా ఘాజి అనూహ్యంగా విజయం సాధించాయి. ఆనందోబ్రహ్మ, ప్రేమకథా చిత్రం, టైపు కథల చెప్పిన తీరు విపరీతంగా ఆకట్టుకున్నాయి. పైన చెప్పిన సినిమాలలో తాను తప్ప అన్ని సినిమాలలో దాదాపు కొత్త వాళ్ళు నటించారు - మరీ ముఖ్యంగా - అందరూ ఫస్ట్ టైమ్ డైరెక్ట్ చేసిన వాళ్ళు - ప్రస్తుతం రిలీజ్ కావాల్సిన చిత్రాలని స్టార్ సినిమాలని పరిశీలిస్తే (1) రాణా చేస్తోంది 1945 పీరియడ్ ఫిల్మ్ ఒకటి -మళయాళంలో చేస్తున్న హాథీమేరీ సాథీలో ఏనుగులని మాలిమి చేసుకునే మావిటీవారి పాత్ర (2) ఇక రాంచరణ్ చేస్తోంది రంగస్థలం - చెవిటివాడి పాత్ర ఒక్క చెవికి కరెక్ట్‌గా వినిపించని సౌండ్ ఇంజినీర్‌ని అని టీజర్‌లోనే చెప్పారు. పక్కా గ్రామీణ వాతావరణంలో వాటర్ తోడే మిషన్ వేసుకుని అతను వెళ్తున్న తీరు ఆశ్చర్యపరుస్తుంది. అందులో స్టార్ హీరోయిన్ సమంతది మూగ పాత్ర - అంటే ఓ చెవిటి చిట్టిబాబుకి మూగ రామలక్ష్మికి మధ్యగా రొమాంటిక్ కమర్షియల్ ఫిలిమ్ - (3) ఇక ప్రభాస్ చేస్తున్న సాహోలో అతనిది హై ఫై సైన్స్ ఫిక్షన్ ఫిలిమ్‌గా చెప్పవచ్చు. ఆ టీజర్ చూస్తే - డిజిటల్ విప్లవం తాలూకు పరిధిని విస్తృతంగా వినియోగించుకుంటూ చేస్తున్న చిత్రం (4) ఆర్మీ బ్యాక్‌గ్రౌండ్‌లు - ఏంగర్ మేనేజ్‌మెంట్ పైన చేస్తున్న ఓ ఆర్మీ ఆఫీసర్ కథ అల్లు అర్జున్ చేస్తున్న నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా (5) నాగచైతన్య చేస్తున్న చిత్రంలో కథ చేయడానికి ఎడమచెయ్యి అతని కంట్రోల్‌లో ఉండని సవ్యసాచి అని టైటిల్‌తోనే టీజర్‌తోను ఆ కథ తెలిసేలా కొత్తదనం కొట్టొచ్చినట్టు కనిపించేలా ఉన్న ఈ 5 చిత్రాలు 2018లో రాబోతున్నాయి - అంటే ఒకపెళ్ళిచూపులు - ఒక్క క్షణం, ఒకఘాజి - ఒక అర్జున్‌రెడ్డి సక్సెస్‌లు ఇచ్చిన ధైర్య ప్రభావం ప్రస్తుతం విభిన్నమైన ఆలోచనలతో కథలు స్టార్స్ కథలు నడుస్తుండడం - ఒకవంతు అయితే... ''అహం బ్రహ్మాస్మి'' అని వరుణ్‌తేజ్‌తో తయారవబోతోన్న చిత్రం స్పేస్‌లో జరిగే సాహసయాత్రగా చెప్పుకోవచ్చు. దీనిని సైన్స్ ఫిక్షన్ అనుకుంటే ... 'అ' అనే సాహసోపేత మైన చిత్రాన్ని ప్రశాంత్ వర్మ అనే నూతన దర్శకుడు మల్టిపుల్ డిజాస్టర్ సిండ్రోమ్‌పైన ఒక్క కాజల్ 8 పాత్రలుగా చూపిస్తూ ఒక్క రెస్టారెంట్‌లో నడిపిన థ్రిల్లర్ అద్భుతమైన స్క్రీన్ ప్లే మార్పులతో తెలుగు చలనచిత్ర పరిశ్రమ కథ ఎన్నికల కథనంలో నూతన దర్శకులతో విభిన్నమైన వినూత్నమైన కథల ఎన్నికలతో కథా విధానం తీర్చిదిద్దడంలో గొప్ప విభిన్నత ప్రదర్శిస్తూ తెలుగు చిత్రపరిశ్రమ స్క్రీన్ ప్లే రచనని - కొత్త దారులు నిర్దేశిస్తున్నందుకు - అభినందించక తప్పదు.

ఎండమావిగా మహిళా బిల్లు

చట్టసభలలో మహిళలకు సరైన వాటా కొరకు తీసుకురావలసిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి నోచుకోకుండా నెట్టివేయబడుతోంది. కొత్తగా ఆవిర్భవించిన స్థానిక సంస్థలందు కొంతమేర మహిళలకు ప్రజాప్రతినిధులుగా అవకాశాలు లభిస్తున్నప్పటికీ తెరవెనుక అధికారాన్ని భర్తలే చెలాయిస్తున్న దుస్థితి అడుగడుగునా ఎదురవుతోంది. ఈ విధంగా ప్రపంచవ్యాప్తంగా తరాలుగా, యుగాలుగా నరనరాన పురుషాధిక్య వ్యవస్థ కొనసాగుతుండడంతో ఆడపిల్లల జననాల రేటు రోజురోజుకూ తగ్గిపోతోంది. భారతదేశంలో ఒకప్పుడు హర్యానా రాష్ట్రంలో ఏర్పడిన ఈ దుస్థితి నేడు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ఈమధ్య కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బేటీ బచావో బేటీ పఢావో నినాదం ద్వారా అనుకున్న స్థాయిలో ప్రయోజనం కనిపించలేదు. హైదరాబాద్ పాతబస్తీలో పేద ముస్లిం యువతులను బలిసిన అరబ్ వృద్ధ షేక్‌లకు కట్టబెడుతున్న సంస్కృతి నుంచి, తెలంగాణలో కొన్ని గిరిజన తండాలనందు ఆడ శిశువులను విక్రయిస్తున్న దయనీయ దుస్థితి నుంచి, రాయలసీమలో కొన్ని ప్రాంతాలనుంచి స్వచ్ఛందంగా రెడ్‌లైట్ ఏరియాలకు అమ్ముడుపోతున్న వైనం నుంచి ఇతరత్రా అనేక జాఢ్యాల నుంచి మహిళలను, ఆడబిడ్డలను కాపాడుకోవలసిన ధర్మం మనందరిమీద ఉంది.

-తిప్పినేని రామదాసప్ప నాయుడు
9989818212

కోర్టును ఆశ్రయించినవారిపై దాడి చేస్తే సహించేది లేదు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కోర్టులను ఆశ్రయించిన వ్యక్తులపై దాడి చేస్తే సహించేది లేదని హైకోర్టు హెచ్చరించింది. చట్టాలను తమ చేతుల్లోకి తీసుకొని దాడులు చేయడం ఎంత మాత్రం తగదని, హైకోర్టు స్పష్టం చేసింది. హైదరాబాద్ సిద్ధిఅంబర్ బజార్, మహబూబ్‌గంజ్ ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లను ఆక్రమించి, వ్యాపారాలు చేస్తున్నారని పేర్కొంటూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిన పిటిషనర్‌పై దాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని అధికారులకు హైకోర్టు స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా వేసింది. సిద్ధిఅంబర్ బజార్, మహబూబ్‌గంజ్ ప్రాంతాల్లో కాలిబాటలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారని పేర్కొంటూ లక్ష్మినివాస్ అగర్వాల్ అనే వ్యక్తి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే.. ఆక్రమణలపై న్యాయపోరాటం చేస్తున్న తనపై కొందరు దాడి చేసే రక్తం వచ్చేలా కొట్టారని లక్ష్మి నివాస్ అగర్వాల్ గత విచారణ సమయంలో ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు.

హైకోర్టుకు చేరిన న్యాయవాదుల జాబితా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: విశాఖపట్నం జిల్లా జీ మాడుగుల మండలంలోని వాకపల్లి గిరిజన మహిళలపై గ్రేహౌండ్స్ పోలీసుల అత్యాచారం ఆరోపణ కేసులో ప్రత్యేకపబ్లిక్ప్రాసిక్యూటర్ (ఎస్ పీపీ)ను నియమించేందుకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ తయారు చేసిన న్యాయవాదుల జాబితా ఉమ్మడి హైకోర్టుకు చేరింది. క్రిమినల్ కేసుల్లో ఎంతో అనుభవమున్న న్యాయవాదుల పేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. టి.నిరంజన్‌రెడ్డి (హైకోర్టులో సీనియర్ న్యాయవాది), కె.వి.రామమూర్తి (విశాఖ), సుంకర రాజేంద్ర ప్రసాద్ (విజయవాడ), డి.శ్రీనివాసరెడ్డి (ఒంగోలు), ఈ.ఉమా మహేశ్వరరావు (హైదరాబాద్), వి.సురేంద్రరావు (హైదరాబాద్) జీ.ఎం.విజయకుమార్ (సికింద్రాబాద్) ఆ జాబితా ఉన్నారు. ఆ ఏడు పేర్లలో ప్రాధాన్యతా క్రమంలో ముగ్గురు న్యాయవాదులను వారి అంగీకారం తీసుకుని ఎంపిక చేసి కోర్టుకు తెలియజేయాలని గిరిజన మహిళల తరపు న్యాయవాది వసుధానాగరాజ్‌కు హైకోర్టు సూచించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జున రెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌తో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా వేసింది.

ఎమ్మార్పీఎస్ బంద్‌కు మద్దతివ్వాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనలో భాగంగా ఈ నెల 13న ఎమ్మార్పీఎస్ ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు మద్దతివ్వాలని తెలంగాణ ప్రజల పార్టీ అధ్యక్షుడు, జస్టిస్ చంద్రకుమార్‌ను మంద కృష్ణమాదిగ కోరారు. గురువారం చంద్రకుమార్ నివాసానికి వెళ్లిన మంద కృష్ణ వర్గీకరణ, బంద్‌కు సంబంధించిన అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ వర్గీకరణ ఉద్యమం న్యాయమైనదన్నారు. పాలకుల నిర్లక్ష్యం వల్లే 24 ఏళ్లుగా ఉద్యమం సాగుతోన్నదని ఆయన పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ బంద్‌లో తమ పార్టీ కార్యకర్తలు పాల్గొంటారని ఆయన తెలిపారు. కాగా ఎమ్మార్పీఎస్‌కు సంబంధించిన బంద్‌లో మాదిగ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు జేరిపోతుల లలిత తెలిపారు. గురువారం ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మహిళా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.


కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

హైదరాబాద్,ఆంధప్రభ: రాష్ట్రంలో గిరిజన మినీ గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఆదివాసి అధికార్ రాష్ట్రీమంచ్ నేత శోభన్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన సంఘాల నేతృత్వంలో గురువారం ప్రగతిభవన్ ముట్టడి ప్రయత్నం చేశారు. అంతకు ముందు మంత్రి చందులాల్ ఇంటిని కూడా ముట్టడించారు. ఈ సందర్భంగా మంత్రి చందులాల్ మాట్లాడుతూ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చినా వారు శాంతించలేదు. నేరుగా ప్రగతిభవన్‌కు చేరు కని మట్టిడి ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా శోభన్ నాయక్ మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, కమల, పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికల్లో మార్పులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియలో నిబంధనలు మార్చాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ప్రాథమిక ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి తగిన సూచనలు, సలహాలను పాఠశాల విద్య శాఖ సంచాలకులు తీసుకున్నారు. ప్రధానంగా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు సంబంధించి ఇప్పటి వరకు ఉన్న అనుభవం విషయంలో ప్రధానంగా చర్చించినట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో ఉత్తమ ఉపాధ్యాయుని ఎంపికకు 15 సంవత్సరాల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. అయితే దీనిని కాస్త తగ్గించాలనే ఆలోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. 15 సంవత్సరాలను 10 నుంచి 12 సంవత్సరాలకు తగ్గించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికకు ఇప్పటి వరకు ఉపాధ్యాయులే దరఖాస్తు చేసుకునే వారు కానీ గత ఏడాదిలో పాఠశాల విద్యశాఖనే 5 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి సత్కరించింది. అదే విధానాన్ని ఇకపై కొనసాగించాలనే అభిప్రాయంతో ఉన్నట్టు సమాచారం. మరోసారి జరిగే సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయలు తీసుకుని ఆ తరువాత ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు నిబంధనలను ఫైనల్ చేసే అవకాశం ఉంది.

నీటి సంపులో పడి సీఏ విద్యార్థి మృతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నీటి సంపులో పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ఎమ్‌డీ.కాశీం, జైనాబి దంపతుల కుమారుడు బాబా హస్సన్(18) హైదరాబాద్‌లో సీఏ చదువుతున్నాడు. కొద్ది రోజుల నుంచి హస్సన్ స్థాని కంగా ఇంటి వద్దనే ఉండి పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం తల్లిదండ్రులు హుజూర్‌నగర్ వెళ్లి వచ్చేసరికి నీటి సంపులో పడి ఉన్నాడు. నీటి సంపులో పడి ఉన్న హస్సన్‌న్ అందులో నుంచి తీయగా అప్పటికే మృతి చెందాడు. అయితే నీటి సంపు రెండు అడుగుల లోతు మాత్రమే ఉండటంతో హస్స న్ మృతిపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఘటనపై కేసు నమోదు కాలేదు.

కేసీఆర్‌పై మొఘల్‌పురాలో బీజేపీ ఫిర్యాదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రధాని నరేంద్ర మోదీని కించపరిచేలా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యలు చేశారంటూ పోలీసులకు బీజేపీ ఫిర్యాదు చేసింది. ప్రదాని గౌరవానికి భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసినందుకు కేసీఆర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ తెలంగాణ బీజేపీ మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు, న్యాయవాది ఎంఏ అబ్బాసీ ఫిర్యాదులో కోరారు. హైదరాబాద్‌లోని మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో ఈ మేరకు ఆయన పిర్యాదు చేశారు. కేసీఆర్ వ్యాఖ్యలతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. తనతో పాటు బీజేపీ నేతలు, కార్యకర్తలందరూ కేసీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నారని చెప్పారు.

'జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకుంటుంది'

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టులను అనేక విధాలుగా ఆదుకుంటుందని ఇది దేశానికే ఆదర్శమని కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ద రాజు మీడియా అకాడమీని, తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ గురువారం లేఖ రాశారు. రాష్ట్ర ఏర్పడినప్పటి నుంచి జర్నలిస్టులకు రూ. 100 కోట్ల సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి భారీ ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న సీఎం కేసీఆర్‌ను ఆయన అభినందించారు. తెలంగాణ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న మిషన్ భగీరథ ప్రాజెక్టును కోమటిబండ వద్ద, కాళేశ్వరం ప్రాజెక్టును సుందిళ్ల బ్యారేజీని ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం దొరికిందని అవి అద్భుతమైన పథకాలని ఆయన కొనియాడారు. ఫిబ్రవరి 27, 28 తేదీల్లో కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ధరాజు నేతృత్వంలోని 25 మంది సీనియర్ జర్నలిస్టుల బృందం తెలంగాణలో పర్యటించిన విషయం తెలిసిందే.

కేంద్ర మంత్రివర్గంపై కన్నేసిన తెలంగాణ బీజేపీ

- కేంద్రం, ఏపీలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై ప్రత్యేక దృష్టి
- రాజకీయ ప్రయోజనాలను అంచనావేసే పనిలో అగ్రనేతలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంతో తెలుగుదేశం పార్టీ తెగతెంపులు చేసుకోవడం....ఆ పార్టీ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్రమంత్రులు తమ పదవులకు రాజీనామాలు చేయడం వంటి పరిణామాలపై తెలంగాణ రాష్ట్ర కమలనాథులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. కేంద్ర మంత్రి వర్గం నుంచి తెదేపా తప్పుకోవడంతో రెండు మంత్రి పదవుల బెర్త్‌లకు ఖాళీ ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో వాటిని సాధ్యమైనంత త్వరగా కేంద్రం భర్తీ చేసే అవకాశాలు ఉండడంతో పార్టీ రాష్ట్ర నేతలు....ఆ పదవులను దక్కించుకునేందుకు ఉవ్విలూరుతున్నారు. ఈ రేసులో పలువురు సీనియర్ నేతలు కూడా ఉన్నట్లుగా తెలుస్తోంది. మరో సంవత్సరం వ్యవధిలో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండడంతో తెలంగాణ రాష్ట్ర నుంచి కనీసం ఒక్కరికైనా కేంద్రమంత్రి పదవి లభిస్తుందన్న ధీమా పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రస్తుతం ఏకైక ఎంపీగా బండారు దత్తాత్రేయ (సికింద్రాబాద్ నియోజకవర్గం) కొనసాగుతున్నారు. అయితే ఆయనను కొద్ది నెలల క్రితం జరిగిన కేంద్రమంత్రి వర్గ విస్తరణలో తప్పించారు. వయోభారం కూడా ఆయన శాపంగా మారిందన్న ప్రచారం కూడా అప్పట్లో వినిపించింది. ప్రస్తుతం దత్తన్న మినహా....రాష్ట్రం నుంచి మరే నాయకుడు ఎంపీగా కొనసాగడం లేదు. అయితే కేంద్రం భావిస్తే.....ఏ రాష్ట్రం నుంచి అయినా రాజ్యసభ సభ్యుడిగా నాయకులకు అవకాశం కల్పించి కేంద్ర మంత్రి పదవిని కట్టబెట్టేందుకు అవకాశాలు ఉన్నాయి. దీని దృష్టిలో పెట్టుకునే పలువురు భాజపా రాష్ట్ర నేతలు కేంద్రమంత్రి పదవిని దక్కించుకునేందుకు వ్యూహాలను రూపొందించుకుంటున్నట్లుగా తెలుస్తోంది. వారిలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావుతో పాటు పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె. లక్ష్మణ్, శాసనసభా పక్ష నాయకుడు కిషన్‌రెడ్డి తదితరుల పేర్లు ప్రముఖంగా ఉన్నట్లుగా పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. వీరితో పాటు దత్తాత్రేయ కూడా మరోసారి తన వంతు ప్రయత్నాలను మొదలు పెట్టినట్లుగా తెలుస్తోంది. కాగా మిత్రపక్షమైన తెలుగుదేశం దూరం కావడం వల్ల రాష్ట్రంలో భాజపా పరిస్థితిని క్షేత్రస్థాయిలో అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సైకిల్‌తో కలిసి పోటీ చేసి గ్రేటర్‌లో ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లను కమలనాథులు కేవలం చేసుకున్న విషయం తెలిసిందే. కాగా తెదేపా కూడా పద్దెనిమిది శాతం ఓట్లతో పదిహేను అసెంబ్లీ నియోజకవర్గాలను దక్కించుకుంది. తదనంతరం అధికార తెరాస నిర్వహించిన ఆపరేషన్ ఆకర్ష్‌లో పడి ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులతో పాటు అగ్రనాయకులందరూ తెరాసలోకి క్యూ కట్టారు. ఈ పరిస్థితి నిన్నా, మొన్నటి వరకు కూడా కొనసాగుతూనే వచ్చింది. అయితే తెదేపా అగ్రనేతలు పార్టీని వీడినప్పటికీ కింద్‌స్థాయి కార్యకర్తలు మాత్రం ఇంకా పసుపుజెండానే నమ్ముకుని పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో తెదేపా బాగా బలహీనపడిందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఇదే అభిప్రాయం తెదేపా నాయకుల్లోనూ అడపా, దడపా వినపడుతూనే ఉంది. ముఖ్యంగా మూడేళ్ళ క్రితం తెలంగాణలో జరిగిన రాజ్యసభ ఎన్నికల సందర్భంగా ఓటుకు-నోటు వ్యవహారంలో అప్పట్లో తెదేపాలో ముఖ్యనాయకుడిగా కొనసాగిన రేవంత్‌రెడ్డి...పార్టీ అధినేత చంద్రబాబునాయుడును ఇరికించడం వంటి అంశాలు ఆ పార్టీకి శరఘాతంగా పరిణమించిన విషయం తెలిసిందే. ఈ ఘటన తరువాత చంద్రబాబు తెలంగాణపై పూర్తిస్థాయిలో దృష్టిసారించలేదన్న వాదన కూడా ఇప్పటికీ వినిపిస్తోంది. దీని కారణంగా పార్టీ నేతలు ఒక్కరొక్కరుగా తెదేపాకు గుడ్‌బై చెబుతూ ఇతర పార్టీలో చేరిపోయారు. ఇలాంటి తరుణంలో భాజపా, తెదేపాల మధ్య ఏపీకీ ప్రత్యేక హోదా అంశం చిచ్చు ఎట్టడంతో... రెండు పార్టీల మధ్య కొనసాగిన బంధం....విడాకుల వరకు వచ్చింది.ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటికీ ఇంకా ఆంధ్రప్రాంతానికి చెందిన చెందిన వారు పెద్దసంఖ్యలో తెలంగాణలోనే ఉన్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు పూర్వ జిల్లాలు అయిన రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం వంటి జిల్లాల్లో అధిక శాతం ఓటర్లు ఉన్నారు. గత ఎన్నికల్లో వారంతా భాజపా, తెదేపా కూటమికి మద్దతు తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రకు ప్రత్యేక హోదా ఇవ్వని కారణంగా దాని ప్రభావం తెలంగాణలో కూడా ఉంటుందా? అన్న అంశంపై కమలనాథులు ఆరా తీస్తున్నట్లుగా తెలుస్తోంది.అయితే భాజపాతో తెగతెంపులు చేసుకున్న తెదేపా వచ్చే ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీలో జతకట్టనుందన్న అంశంపై ప్రస్తుతం సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇదే అంశంపై రాష్ట్ర భాజపా నేతలు సైతం దృష్టిసారించారు. తెదేపా అధిష్టానం కదలికలపై ఒకవైపు దృష్టిసారిస్తూనే...మరోవైపు వచ్చే ఎన్నికల్లో ఒంటిరి పోరుకు దాదాపు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ ప్రయోజనం ఏ మేరకు ఉంటుందన్న అంశంపై కూడా కమలనాథులు ఆరా తీసే పనిలో ఉన్నట్లుగా తెలుస్తోంది. మొత్తం మీద భాజపా, తెదేపాల తెగతెంపుల అంశం కేవలం రెండు తెలుగు రాష్ట్రా ల్లోనే కాకుండా యావత్ దేశవ్యాప్త చర్చకు దారితీస్తోంది.



యూనివర్సిటీల్లో డిపార్ట్‌మెంట్ యూనిట్‌గా రిజర్వేషన్లు

- వర్సిటీ యూనిట్‌గా తీసుకోవద్దని యుజిసి ప్రతిపాదన?
- నష్టపోనున్న ఎస్సీ,ఎస్టీ,బీసీలు
- భవిష్యత్‌లో కొన్ని డిపార్ట్‌మెంట్లలో రిజర్వేషన్ అభ్యర్థులు లేకుండాపోయే ప్రమాదం!

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. రిజర్వేషన్ల అమలుపై బిజెపి ఎంపిలు ఒక్కొక్కరు ఒక్కో రకంగా మాట్లాడుతున్నారు. ఇప్పుడు ఏకంగా యూనివర్సిటీల్లోని అధ్యాపకుల నియామకాల్లో జరిగే రిజర్వేషన్లపై దృష్టి పెట్టింది. ఇప్పటి వరకు యూనివర్సిటీ యూనిట్‌గా అధ్యాపక పోస్టులకు రిజర్వేషన్లను అమలు చేసేవారు. ఇకపై యూనివర్సిటీ యూనిట్‌గా కాకుండా కేవలం డిపార్ట్‌మెంట్ వారీగా రిజర్వేషన్లను అమలు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. యూనివర్సిటీ వారీగా జరిపే అధ్యాపక నియామకాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి రిజర్వేషన్లను అమలు చేయడానికి వీలగుతుంది. అలా కాకుండా డిపార్ట్‌మెంట్‌ను యూనిట్‌గా తీసుకొని రిజర్వే షన్లను అమలు చేస్తే ఎస్సీ, ఎస్టీ బీసీలకు తీవ్ర అన్యాయం జరగనుంది.

ఇలా అన్యాయం....

యూనివర్సిటీల్లో ఇప్పటి వరకు జరిగే నియామకాల్లో యూనివర్సిటీని యూనిట్‌గా తీసుకొని రిజర్వేషన్లను అమలు చేస్తున్నారు. అలా చేయడం వలన ఎస్సీ, ఎస్టీ బీసీలకు తగిన విధంగా అధ్యాపక పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది. ఇప్పుడు అలా కాకుండా కేవలం డిపార్ట్‌మెంట్ యూనిట్‌గా అధ్యాపక నియా మకాలకు రిజర్వేషన్లను అమలు చేయాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) నిర్ణయించినట్టు సమాచారం. 2017 ఏప్రిల్‌లో అలహాబాద్ హైకోర్టు తీర్పు నేపథ్యంలో యుజిసి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. హైకోర్టు తీర్పు అనంతరం యూనివర్సిటీల్లో అధ్యాపకుల నియామకాలకు పాటించాల్సిన రిజర్వే షన్లను యూనివర్సిటీ యూనిట్‌గా కాకుండా డిపార్ట్‌మెంట్ యూనిట్‌గా చేపట్టడానికి తాము సిద్ధంగా ఉన్నామని, అందుకు అంగీకారం తెలపాలని యుజిసి మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖకు తెలిపింది. అందుకు హెచ్ఆర్‌డీ మంత్రిత్వ శాఖ అంగీకరించినట్టు తెలుస్తోంది. న్యాయ శాఖతోపాటు కేంద్ర శిక్షణ, సిబ్బంది వ్యవహారాలశాఖ కూడా ఇందుకు అంగీకారం తెలిపినట్టు తెలుస్తోంది. ఇదే జరిగితే ... యూనివర్సిటీల్లో జరిగే అధ్యాపకుల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ బీసీలకు తీవ్ర అన్యాయం జరగే ప్రమాదం ఉంది. ఉదాహరణకు ఒక యూనివర్సిటీలో మొత్తం 100 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉంటే వాటి నియామకాల్లో యూనివర్సిటీ యూ నిట్‌గా తీసుకుని రిజర్వేషన్లను అమలు చేస్తే ఎస్సీ, ఎస్టీ బీసీలకు న్యాయం జరు గుతుంది. అలా కాకుండా డిపార్ట్‌మెంట్ యూనిట్‌గా తీసుకుంటే ఒక్కో డిపార్ట్‌మెంట్‌లో పోస్టులు 10లోపే ఉంటాయి. వాటిలో రిజర్వేషన్ల అమలు చేయాల్సి వస్తే ఎస్సీ, ఎస్టీ బీసీలకు అన్నింటికి వచ్చే అవకాశం ఉండదు. డిపార్ట్‌మెంట్‌ను యూనిట్‌గా తీసుకుని అధ్యాపక నియామకాలు జరిపితే భవిష్యత్‌లో యూనివర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీ బీసీల అధ్యాపకులు లేకుండా పోయే ప్రమాదం కూడా లేకపోలేదు.

35 శాతం అధ్యాపక పోస్టులు ఖాళీ..

దేశ వ్యాప్తంగా ఉన్న 716 యూనివర్సిటీలు, 38,056 కాలేజీల్లో సుమారు 35 శాతం అధ్యాపక పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లోనూ అధ్యాపక పోస్టులను భర్తీ చేసే ప్రక్రియ ప్రారంభం అవుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఇటువంటి నిర్ణయాన్ని యుజిసి తీసుకొస్తే ఎస్సీ, ఎస్టీ బీసీలకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. అయితే ఇప్పటి వరకు యుజిసి మాత్రం అధికారికంగా దీనిని రాష్ట్రా లకు పంపించలేదు. అలహాబాద్ హైకోర్టు తీర్పు నేపథ్యంలోనే అధ్యాపక నియామకాల్లో రిజర్వేషన్ల అమలు తీరును మార్చినట్టు యుజిసి అధికారులు చెబుతున్నారు.

మెటీరియల్ రీసెర్చ్‌కు ప్రాధాన్యమివ్వాలి

- సెంటర్ ఫర్ మెటీరియల్స్ అండ్ డివైజెస్(ఐసిఎఎస్ఎమ్‌డి-2018)
- 28వ వార్షిక స్థాపక దినోత్సవ ఉత్సావాల్లో కేంద్ర ప్రభుత్వ సలహాదారులు



ఆంధ్రప్రభ, హైదరాబాద్: దేశంలో మెటీరియల్ రీసెర్చ్ ఇన్ ఎలక్ట్రానిక్ టెక్నాలజీకి ఎంతో ప్రాధాన్యత ఉందని భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వయిజర్ ఆర్ చిదంబరం అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఐఐసిటీలో సెంటర్ ఫర్ మెటీరియల్స్ అండ్ డివైజెస్(ఐసిఎఎస్ఎమ్‌డి-2018) 28వ వార్షిక స్థాపక దినోత్సవ ఉత్సవాలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్లైడ్ రీసెర్చ్‌కు బేసిక్ రీసెర్చ్‌తో ముడిపెట్టేందుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. సిలికాన్ కార్బైడ్, గాలియం నైట్రేట్ లాంటి పార్థాల వినియోగంతో ప్రజలకు వైద్యం, విద్య లాంటి రంగాల్లో ఉపయోగపడే పరికరాలను, తక్కువ ఖర్చుతో రూపొందే పరికరాలను మరింతగా అభివృద్ధి చేయాలని కోరారు. వివిధ శాస్త్రీయ పరికరాలలో సెన్సర్‌లు, కండరకట్రల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక వినియోగం ఉండే సెమీ కండక్టర్ నెట్‌వర్క్ అభివృద్ధిని సి ఎమ్ఇటి చేపట్టాలన్నారు. బలమైన ఇ వేస్ట్ పరిజ్ఞాల విధానం ఉండాలన్నారు. 2020 నాటికి దేశంలో వాడిన వాహనాల నుంచి 180 టన్నుల అల్యూమినియం ఉత్పత్తి అవుతుందని, దీనిని తిరిగి కరగబోయడం ద్వారా సహజంగా అయ్యే ఇంధన వినియోగంలో 7శాతమే ఖర్చవ నుందన్నారు. రక్షణ మంత్రి సలహాదారు సతీష్‌రెడ్డి మాట్లా డుతూ దేశ భవిష్యత్తు అవసరాలకు పనికి వచ్చే పరిజ్ఞానాలను గుర్తించాలని శాస్త్రవేత్తలకు సూచించారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్‌పై ఫిర్యాదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రామజన్మభూమి-బాబ్రి మసీదు స్థల వివాదాన్ని సాధ్య మైనంత త్వరగా పరిష్కరించకుంటే భారతదేశం సిరియా మాదిరిగా తయారవుతుందని వ్యాఖ్యానించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్(ఏఓఎల్) వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవి శంకర్‌పై మజ్లిస్ నేత తౌహిద్ సిద్ధిఖి లక్నోలో ఫిర్యాదు చేశారని ఏఎన్ఐ వార్తా సంస్థ తెలిపింది. అయోధ్య స్థల వివాదాన్ని సత్వరం పరిష్కరించకుంటే బారత్‌లో సిరి యా తరహా హింసాత్మక ఘటనలు చోటు చేసుకునే ప్రమాదముందని ఓ టీవీ షోలో రవిశంకర్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. దేశవ్యాప్తంగా అనేక పార్టీలు ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబడుతున్నాయి. రామాలయానికి వ్యతిరేకంగా కోర్టు తీర్పు ఇస్తే, రక్తసిక్తమైన పరిస్థితులు నెలకొంటాయి. మెజార్టీ హిందు వులు అలాంటి తీర్పును అంగీకరిస్తారా.. చెప్పండి? వారు ముస్లిం వర్గంపై కోపా వేశాలను ప్రదర్శించే అవకాశముంది. అని రవిశంకర్ వ్యాఖ్యానించిన సంగతి విది తమే. ఆయన వ్యాఖ్యలపై మజ్లిస్‌తో పాటు శివసేన కూడా మండిపడ్డాయి. తన వ్యాఖ్యలపై చెలరేగిన దుమారాన్ని సద్దుమణిగేలా చేసేందుకు ఆయన ప్రయ త్నించారు. అయోధ్య కేసులో తాను చేసిన వ్యాఖ్యలు హెచ్చరిక కాదని, కేవలం ముందు జాగ్రత్త మాటలేనని ఆయన స్పష్టం చేశారు.

సైదాబాద్ పీఎస్‌లోనూ...

హైదరాబాద్‌లోని సైదాబాద్ పీఎస్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్‌పై ఫయాజ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. రామజన్మభూమి-బాబ్రి మసీదు స్థల వివాదంపై రవిశంకర్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఆయన వ్యాఖ్యలపై మజ్లిస్, శివసేన మండిపడిన నేపథ్యంలో నగరంలోని సైదాబాద్ పీఎస్‌లో ఫయాద్, రవిశంకర్‌పై ఫిర్యాదు చేశారు. కేసు పోలీసుల దర్యాప్తులో ఉంది.

సచివాలయం తరలింపునకు తాత్కాలిక బ్రేక్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర సచివాలయాన్ని సికింద్రాబాద్‌లోని బైసన్‌పోలో గ్రౌండ్స్‌కు తరలింపుపై తాత్కాలిక బ్రేక్ పడినట్లు సమాచారం. ప్రభుత్వం ఆదేశం మేరకు ఇప్పటికిప్పుడు ఆ ఫైల్‌ను కదిలించకూడదని అధికారులు నిర్ణయించారు. రాష్ట్రంలో ఏర్పడిన ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సచివాలయం తరలింపును ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిసింది. హుస్సేన్ సాగర్ ఒడ్డున ఉన్న ఇప్పుడున్న సచివాలయంలో మౌలిక సదుపాయాలు లేవనీ, వాహనాల రాకపోకలకు ఇరుకుగా ఉందని, మంత్రి వర్గ సమావేశాలు, కలెక్టర్ కాన్ఫరెన్సులు ఇతర ముఖ్య సమావేశాలు నిర్వహించేందుకు సరైన భవనాలు లేవని, వాహన కాలుష్యం మధ్యలో సచివాలయం ఉన్నందున విశాలమైన ప్రాంతానికి సచివాలయాన్ని మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత ఎర్రగడ్డలోని ఛాతి ఆస్పత్రి ప్రాంగణంలో కొత్త సెక్రటేరియట్ నిర్మించాలని అనుకున్నప్పటికీ ఆ ఆలోచనను ప్రభుత్వం విరమించుకుంది. ఆ తర్వాత సుదీర్ఘ చర్చలు, సమీక్షల తర్వాత సికింద్రాబాద్‌లోని బైసన్‌పోలో గ్రౌండ్స్ అన్నింటికి అనుకూలంగాఉంటుందని భావించి ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ఆ స్థలంలో సచివాలయం నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రూ. 500 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టనున్నట్లు శాసనసభలో ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ మేరకు బైసన్ పోలో గ్రౌండ్స్‌ను అప్పగించాలని కోరుతూ రక్షణ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం లేఖలు రాసింది. కేంద్రం కూడా ప్రాథమికంగా తన సుముఖతను వ్యక్తం చేసింది. బైసన్‌పోలో గ్రౌండ్స్‌కు ఇప్పుడున్న మార్కెట్ రేట్ ప్రకారం విలువ కట్టేందుకు ముందుకు వస్తే పరిశీలిస్తామని రక్షణ శాఖాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. రక్షణ శాఖాధికారుల లేఖకు స్పందిస్తూ రూ. 71 కోట్లు చెల్లించేందుకు కూడా రాష్ట్రం సుముఖత వ్యక్తం చేసింది. ఈ పరిస్థితుల్లో సచివాలయం తరలింపును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్,బీజేపీ, టీడీపీ, వామపక్షాలు, ప్రజాసంఘాలు, క్రీడాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఆందోళనలు చేపట్టాయి. అంతేగాక బైసన్‌పోలో గ్రౌండ్స్‌లో సచివాలయం నిర్మాణాలు చేపట్టకుండా నిలుపుదల చేయాలని కోరుతూ మాజీ క్రికెటర్ ఎంవీ జైసింహా, మాజీ డీజీపీ ఎంవి భాస్కర్ రావు, మాజీ సైనికుడు, స్క్వాడ్రన్ లీడర్ అనిల్ భల్లా, చార్టెడ్ అకౌంటెంట్ తుర్లపాటి భరద్వాజ్ తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. క్రీడాకారులు ఆడుకునేందుకు బైసన్ పోలో గ్రౌండ్స్ అత్యంత అనుకూల ప్రాంతమని, జంట నగరాలలోని ఏ మూల నుంచైనా ఇక్కడి రాకపోకల సౌకర్యం ఉందని కోర్టుకు నివేదించారు. ఎందరో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను అందించిన బైసన్ పోలో గ్రౌండ్స్ లో సచివాలయం నిర్మించకుండా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు. సచివాలయం తరలింపుపై దాఖలైన పిటిషన్లను విచారించిన ఉమ్మడి హైకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు కూడా జారీ చేసింది. విచారణ కొనసాగుతోంది. హైకోర్టులో సచివాలయం తరలింపుపై విచారణ కొనసాగుతుండడం, ప్రస్తుతం ఏర్పడిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సచివాలయం తరలింపు కార్యక్రమం తాత్కాలికంగా నిలిచిపోయినట్లు అధికారులు చెప్పారు.ఈ వ్యవహారమై ఉన్నత స్థాయి నుంచి ఉత్తర, ప్రత్యుత్తరాలు జరగడం లేదన్నారు.



నీరవ్, మెహుల్‌కు సీబీఐ సమన్లు

న్యూఢిల్లీ: పిఎన్‌బి కుంభకోణంలో వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, ఆయన మేనమామ మెహుల్ చోక్సీలకు సిబిఐ గురువారం తాజా సమన్లు జారీ చేసింది. సాధ్యమైనంత త్వరగా విచారణకు హాజరుకావాలని, దర్యాప్తు ఏజెన్సీకి తప్పనిసరిగా సహకరించాలని వారిని కోరినట్టు అధికారులు తెలిపారు. సిబిఐ గత నెల 19, 23, 28 తేదీల్లో వారికి వరుసగా మూడు సమన్లు జారీ చేసింది. ఈ నెల ఏడవతేదీన విచారణకు హాజరుకావాలని ఈ సందర్భంగా అధికారులు వారిని ఆదేశించారు.



పూర్తిగా మహిళల నియంత్రణలో ఉన్న బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం



వింగ్స్ ఇండియా-2018

ఏరోస్పేస్‌లో తెలంగాణ నెంబర్ వన్

- విమానయాన రంగానికి ప్రోత్సాహం
- పన్నుల్లో రాయితీలకు సుముఖం
- హైదరాబాద్‌లో యూనివర్శిటీ ఏర్పాటు
- ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు





హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో పౌర విమాన యాన రంగం అభివృద్ధిని తమ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ వెల్లడించారు. బేగంపేట విమానాశ్రయంలో గురువారం వింగ్స్ ఇండియా-2018 సదస్సుకు మంత్రి కేటీఆర్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాంతీయ విమానాశ్రయాల అభివృద్ధికోసం ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అవసరమైన సహాయ సహాకారాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. విమాన యాన మౌళిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వరంగల్ విమానాశ్రయాన్ని అభివృద్ధి పరచాలని, అదే విధంగా హకీంపేట్ , దుండిగల్ , రామగుండం ప్రాంతీయ విమానాశ్రయాలను



అభివృద్ధి పరిచి రీజనల్ కనెక్టివిటీ పెంచాలన్నారు. బేగంపేట్ విమానాశ్రయం కేంద్రంగా నేషనల్ ఏవియేషన్ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా ఫ్లైయింగ్ స్కూల్‌తోపాటు పలు పైలెట్ ట్రైనింగ్ సెంటర్లు ఉన్నాయని, యువత కూడా ఉద్యోగ ,ఉపాధి అవకాశాలకోసం వైమానిక రంగంపై దృష్టి పెట్టిందన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్‌ను ప్రభుత్వం ప్రొత్సహిస్తోందన్నారు. బోయింగ్ , ఏయిర్‌బస్ వంటి సంస్థలుకూడా ఇప్పటికే ఇక్కడికి వచ్చయన్నారు. ఏరోస్పేస్ పార్కుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హైదరాబాద్ ఫార్మాహబ్‌గా అభివృద్ధి చెందిందని కార్గో సర్వీసులు కూడా పెరుగుతున్నాయన్నారు. హైదరాబాద్‌లో ఏవియేషన్ రంగానికి అవసరమైనంత స్థలం కూడా అందుబాటులో ఉందని ప్రభుత్వం కూడా స్థలాన్ని కేటాయించేందుకు సుముఖంగానే ఉందన్నారు. రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమని అన్నింటికీ సిద్దంగా ఉండాల్సి వస్తుందన్నారు. ఉదయం లేవగానే కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి అశోక్ గజపతిరాజు రాజీనామా వార్త చేసి తాను ఖంగుతిన్నానని తెలిపారు. పౌర విమానయాన శాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. హైదరాబాద్ బేగంపేట వింగ్స్ ఇండియా సదస్సుకు ముఖ్యఅతిథిగా రావాల్సిన అశోక్ గజపతిరాజు ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిణామాల నేపధ్యంలో రాలేకపోవడంతో తాను ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవహరించాల్సి వచ్చిందన్నారు. దేశంలో 70ఏళ్లలో 70 విమానాశ్రయాలు ఉంటే అశోక్ గజపతి రాజు సారధ్యంలో గడిచిన మూడేళ్లలో 60కిపైగా విమానాశ్రయాలు కొత్తగా ఏర్పాటయ్యాయన్నారు. భారత వైమానిక రంగం ఇలాగే అభివృద్ధి చేందాలని కేటీఆర్ అకాంక్షించారు. అనంతరం మంత్రి కేటీఆర్ వైమానిక ప్రదర్శనకు ప్రారంబోత్సవం చేశారు. వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. సీఈవో సదస్సులో పాల్గొని రాష్ట్రంలో విమానయాన రంగాన్ని పోత్సహిస్తామని తెలిపారు. పన్నుల రాయితీలకు కూడ ప్రభుత్వం సుముఖంగాను ఉన్నట్టు మంత్రి కేటీఆర్ సీఈవోల సమావేశంలో ఎయిర్ పోర్ట్ అధారిటీ ఆఫ్ ఇండియా అధికారులకు భరోసా ఇచ్చారు.

సమన్ల రద్దుకు కార్తీ వినతి


- సుప్రీం కోర్టుకు చిదంబరం కుమారుడు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం ఢిల్లీ హైకోర్టును గురు వారం ఆశ్రయించారు. ఐఎన్ ఎక్స్ మీడియా మనీలాం డరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దర్యాప్తు కార్యకలాపాలు, జారీ చేసిన సమన్ల రద్దు కోసం ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశాన్ని జస్టిస్ ఎస్.రవీంద్ర భట్ ఎదుట ఇన్-చాంబర్‌లో ప్రస్తావించారు. జడ్జీ కార్తీ పిటిషన్‌పై వాదోపవాదాలను శుక్రవారానికి లిస్ట్ చేశారు.ఐఎన్‌ఎక్స్ మీడియా కేసుకు సంబంధించి ప్రస్తుతం సిబిఐ కస్టడీలో ఉన్న కార్తీ చిదంబరం గురువారం ఉదయం సుప్రీం కోర్టు ఆదేశానుసారం హైకోర్టును ఆశ్రయించారు. కేసుకు సంబం ధించి సర్వోన్నత న్యాయస్థానంలో దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపహరించుకోవ డానికి సుప్రీంకోర్టు ఆయన్ను అనుమతించింది. సిబిఐ 2017, మే 15న నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో అభియోగాలకు సంబంధంలేని వాటిపై దర్యాప్తు ఈడీ పరిధి లో లేదని నిర్ధారిస్తూ ఆదేశాలు చేయాలనే అభ్యర్ధనతో కార్తీ చిదంబరం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. గత నెల 28న యుకే నుంచి తిరుగు ప్రయాణంలో చెన్నయ్ విమానాశ్రయానికి చేరుకున్న కార్తీ చిదంబరాన్ని దర్యాప్తు అధికారులు అరెస్టు చేశారు. ఐఎన్‌ఎక్స్ మీడియాకు ఎఫ్ఐపిబి క్లియరెన్స్ కోసం కార్తీ చిదంబరం ముడుపుల రూపేణా రూ.10 లక్షలు పుచ్చుకున్నారని సిబిఐ ఆరోపించింది. కార్తీ చిదంబరానికి ఈడీ సమన్ల నిలుపదలకు సుప్రీంకోర్టు గత నెల 23న నిరాకరించింది. ఈడీ కార్తీ చిదంబరం, ఇతరులపై గతేడాది మే నెలలో ఒక కేసు నమోదు చేసింది. సిబిఐ ఫిర్యాదులో నిందితులైన కార్తీ చిదంబరం, ఐఎన్‌ఎక్స్ మీడియా, దాని డైరెక్టర్లు పీటర్, ఇంద్రాణి ముఖర్జియా, తదితరులపై ఈడీ ఒక ఎన్ ఫోర్స్‌మెంట్ కేసు దర్యాప్తు నివేదికను(ఇసిఐఆర్) నమోదు చేసింది.



మాల్యా విహార నౌక జప్తు

- సిబ్బందికి ఒక మిలియన్ డాలర్లు బాకీ



ఇన్‌సెట్‌లో మాల్యా

లండన్: అప్రతిష్ఠ పాలైన మద్యం వ్యాపార దిగ్గజం విజయ్ మాల్యాకు చెందిన ఒక విలాసవంతమైన చిన్నపాటి విహార నౌకను(యాచ్ట్) మాల్టాలో అధికారులు జప్తు చేశారు. మాల్యా యాచ్ట్ సిబ్బందికి ఒక మిలియన్ డాలర్ల మేరకు వేతనాలు చెల్లించని కారణంగా అధికారులు ఆ చర్యకు ఉపక్రమించారు. సిబ్బందికి 3,30,00 డాలర్ల మేరకు వేతనాలు, ఇతర ఖర్చులను రాబట్టడం కోసం ఇండియన్ ఎంప్రెస్ అనే 95 మీటర్ల నౌకను అధికారులు జప్తు చేశారని నాటిలస్ ఇంటర్నేషనల్ కార్మికుల సంఘం తెలిపింది. దాదాపు రూ.9,000 కోట్ల మేరకు బ్యాంకులకు బకాయి పడ్డ మాల్యా గతేడాది సెప్టెంబర్‌లో ఇండియన్ ఎంప్రెస్ నిర్వహణా బాధ్యతలను వదిలివేశారు. సిబ్బందికి వేతనాల రూపేణా దాదాపు ఒక మిలియన్ డాలర్లు బాకీ పడ్డారు. నెలవారి వేతనాల చెల్లింపులకుసంబంధించి తమ సభ్యులు వారి యజమానికి, నౌక యజమానికి అనేక అవకాశాలు ఇచ్చారని నాటిలస్ ఇంటర్నేషనల్ కార్మికుల సంఘం వ్యూహాత్మక నిర్వాహకులు డేనీ మెక్‌గోవన్ తెలిపారు. అంతర్జాతీయ మారిటైమ్ లేబర్ కన్వెన్షన్(ఎంఎల్‌సి) ద్వారా ఇండియన్ ఎంప్రెస్ సిబ్బందికి వేతన బకాయిలను కొంతవరకు ఇప్పించగలిగామని చెప్పారు. ఆ క్రమంలో నాలుగు మాసాల వేతన బకాయిల రూపేణా దాదాపు 6,15,000 డాలర్లు రికవరీ చేశామని తెలిపారు. ఇండియన్ ఎంప్రెస్ సిబ్బందిలో భారతీయులు, బ్రిటిషర్లు, తూర్పు ఐరోపాకు చెందినవారు ఉన్నా రు. సూపర్ యాచ్ట్ రంగం చూడటానికి తళుకుబెళుకులతో సర్వాంగసుందరంగా ఉంటుందని నాటిలస్ ఇంటర్నేషనల్ న్యాయ సేవల డైరెక్టర్ చార్లెస్ బోయ్‌లె తెలిపారు. కానీ ఆ రం గంలో పనిచేసే సిబ్బంది మాత్రం పని దోపిడీకి, వేధింపులకు గురవుతుంటారని చార్లెస్ చెప్పారు. ప్రస్తుతం అధికారుల అధీ నంలో ఉన్న ఇండియన్ ఎంప్రెస్ విలాసవంతమైన విహార నౌకను మాల్యా లక్షల కొద్ది డాలర్లు వెచ్చించి 2006లో కొనుగోలు చేశారు. 2016లో రీఫిట్టింగ్ చేయించారు. 17 కేబి న్లతో కూడిన విలాసవంతమైన నౌక 12 మంది అతిథులకు ఆ తిథ్యమివ్వగలదు. ఒక డెక్ మొత్తంగా ఉన్న మాస్టర్ సూట్‌లో ఒక జిమ్, సానా, స్టీమ్ రూమ్ కూడా ఉన్నాయి.

విమానయానంలో భారత్ తృతీయం

- అభివృద్ధికి రూ.18వేల కోట్లు
- కొత్తగా 75 విమానాశ్రయాలు
- పెరుగుతున్న రీజనల్ కనెక్టివిటీ
- డొమిస్టిక్‌లో 17.5 శాతం వృద్ధి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: పెరుగుతున్న విమాన ప్రయాణీకుల సంఖ్యను దృష్టిలో ఉంచుకున్ని రానున్న నాలుగేళ్లలో దేశంలోని పౌరవిమాన యాన రంగాన్ని రూ.18వేలకోట్లతో అభివృద్ధి పరచనున్నట్టు సివిల్ ఏవియేషన్ మినిస్ట్రీ సెక్రటరీ ఆర్ఎన్ చౌబె వెల్లడించారు. గురువారం బేగంపేట విమానాశ్రయంలో వింగ్స్ ఇండియా -2018 ప్రారంభ కార్యక్రమంలో చౌబె మాట్లాడుతూ దేశంలోని పలు విమానాశ్రయాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. సిబ్బంది నైపుణ్యత పెంపుదలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక 75 విమానాశ్రయాలు మాత్రమే ఉండేవని ఈ రెండేళ్లలోనే 56 విమానాశ్రయాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. మూడేళ్ల కిందటివరకూ 395వున్న ఎయిర్‌క్రాఫ్టుల సంఖ్యను ఇపుడు 900కు పెంచుకున్నట్టు తెలిపారు.ఉడాన్ పథకం కింద విమానాశ్రయాల అభివృద్ధికి పెద్దపీట వేసినట్టు తెలిపారు. రీజనల్ కనెక్టివిటీని బాగా పెంచుకుంటూ పోతున్నామన్నారు. ఈ పథకం కింద 56 విమానాశ్రయాలను అభివృద్ధి పరచాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 18 విమానాశ్రయాల పనులు పూర్తయి అవి అందుబాటులోకి వచ్చాయన్నారు. మిగిలిన వాటిని కూడా 15రోజులకు ఒకటి వంతును ప్రారంభానికి సిద్ధం చేస్తామని వెల్లడించారు. రెండో ప్రపంచ యుద్ధం సందర్భంగా ఏర్పాటు చేసిన దేశంలోని నాలుగు వందల విమానాశ్రయాలను కూడా ఉడాన్ పథకం కింద పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పౌర విమాన యాన రంగంలో 17.5శాతం గ్రోత్ ఉన్నట్టు వెల్లడించారు. ఉడాన్ పథకం కింద రీజనల్ కనెక్టివిటీ పెరుగుతూ వస్తోందని, చిన్న పట్టణాలకు కూడా విమాన ప్రయాణ సదుపాయాలు అందుబాటులో వస్తున్నాయ న్నారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా , రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో విమానాశ్రయాల అభివృద్ధి దిశగా ముందుకు పోతున్నామన్నారు.

పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రతి నాలుగేళ్లకోసారి వసతులు పెంచుకుంటూ పోతున్నామన్నారు. పౌర విమాన యాన రంగంలో ఇండియా ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద దేశంగా అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రైవేటు రంగంలో కూడా పీపీఏ పద్దతిలో విమానాశ్రయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కొత్తగా 31 హెలికాప్టర్లకు కూడా అనుమతి ఇచ్చినట్టు తెలిపారు. ఏవియేషన్ చట్టాలకు సవరణల ప్రతిపాదనలు ఉన్నాయని, ఈ పార్లమెంట్ సమావేశాల్లోకాని లేదా వచ్చే సమావేశాల్లో కాని వాటికి ఆమోదం లభించేఅవకాశాలు ఉన్నట్టు తెలిపారు. ఈసమావేశంలో ఎయిర్‌పోర్ట్ అధారిటికి చెందిన ఉషా పాదీ, బిఎస్ బుల్లా, డిలిప్ చౌన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎయిర్ ఇండియా బయ్యర్ల కోసం వేట

కేంద్ర ప్రభుత్వం ఎయిర్ ఇండియాలో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ వేగవంతానికి కట్టుబడి ఉందని చౌబే తెలిపారు. వచ్చే కొద్ది వారాల్లో ఆసక్తి ప్రదర్శించే పార్టీల నుంచి ఇఒఐలను ఆహ్వానించే అవకాశం ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఆర్.ఎన్. చౌబే తెలిపారు. అదే సమయంలో పవన్ హన్స్‌లో పెట్టు బడుల ఉపసంహరణ కోసం ఒక సవరించిన ఇఒఐ వెలువడవచ్చని చెప్పారు. మా మంత్రిత్వ శాఖ ప్రస్తుతం ఎయిర్ ఇండియా, దాని అనుబంధ సంస్థలు, పవన్ హన్స్ కొనుగోలుదార్లను కనుగొనే ఒక ముఖ్యమైన పనిలో తలమునకలై ఉంది. ఆ ప్రక్రియను అత్యంత వేగంగా ముందుకు తీసుకువెళ్ళడానికి మేం కట్టుబడి ఉన్నాము అని చౌబే వివరించారు.



మహిళా ఔత్సాహికులలకు వి-హబ్

- ఇంటర్ నుంచే డిజిటల్ టెక్నాలజీపై అవగాహన
- రూ.15 కోట్ల పెట్టుబడి: కేటీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి ప్రతిష్టాత్మకమైన వి-హబ్‌ను ఆవిష్కరించింది. మహిళలను పారిశ్రామిక ఔత్సాహికులుగా తీర్చిదిద్దేందుకు వారికోసం ప్రత్యేకంగా అత్యాధునిక టెక్నలజీతో కూడిన ఇంక్యుబేటర్‌ను రాష్ట్ర ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎల్ డైరెక్టర్ శిథామస్, కళారి క్యాపిటల్ మేనేజింగ్ డైరెక్టర్ వాణి కోలా, ఐటిశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, వి-హబ్ సీఈవో దీప్తి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, మహిళలను ఔత్సా హికలుగా తీర్చిదిద్దేం దుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. వి-హబ్‌లో అత్యాధునిక పరిజ్ఞానం అందిస్తామని, అన్ని రకాల అన్వేషణలకు ఇదొక ప్లాట్‌ఫాంగా ఉంటుందన్నారు. టెక్ స్టార్టప్, సోషల్ ఇన్నోవేషన్‌తో వి-హబ్ విభిన్న రీతిలో పని చేస్తుందని మంత్రి అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళలను ప్రోత్సహించి వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి ఔత్సాహికులుగా తీర్చిదిద్దేందుకు వి-హబ్ పని చేస్తుందన్నారు. మహిళా సాధికారిత సాధించేందుకు, సామాజిక అడ్డంకులను అధిగమించి స్వతంత్రులుగా నిలబెట్టే లక్ష్యంగా వి-హబ్ ప్రోత్సహిస్తుందని మంత్రి చెప్పారు. వి-హబ్‌కు రూ.15 కోట్లు మూలధనం పెట్టుబడి ప్రభుత్వం ఇస్తుందని, ఇక్కడి స్టార్టప్స్‌కు లక్ష నుంచి 15 లక్షల వరకు, 15 నుంచి 25 లక్షల వరకు స్థాయిలను బట్టి గ్రాంట్ ఇవ్వనున్నట్లు చెప్పారు.

సమాజంలో డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని ఆశించే వారే ఎక్కువగా ఉన్నారని ఈ పరిస్థితుల్లో సామాజిక ఔత్సాహికవేత్తలుగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఇంటర్మీడియట్ స్థాయి నుంచే డిజిటల్ టెక్నాలజీపై అవగాహన కల్పించి వారిలోని నైపుణ్యాలు, ప్రతిభను వెలికితీసే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మంత్రి చెప్పారు.

వి-హబ్ ఆవిష్కరణ సందర్భంగా ఆరు సంస్థలు భాగస్వాములయ్యేందుకు ముందుకు వచ్చాయి. ఇంక్యుబేషన్ కార్యక్రమాలు, ఈవెంట్స్, వర్క్‌షాప్, సోషల్ ఇన్నోవేషన్ కార్యక్రమాల్లో మహిళా ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు ఈ సంస్థలు సహకారం అందించనున్నాయి.

పీఎన్‌బీకి ఏడాది కాలపరిమితి!

- స్కామ్‌పై ఆర్‌బీఐ చొరవ

న్యూఢిల్లీ: రూ.12,646 కోట్ల కుంభకోణానికి సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంకు(ఆర్‌బిఐ) పంజాబ్ నేషనల్ బ్యాం కు(పిఎన్‌బి)కు నాలుగు త్రైమాసికా ల కాలపరిమితి విధించింది. పిఎన్‌బి కుంభకోణంపై గడువులను కోరుతూ ఆర్‌బిఐ కి ఒక లేఖ రాసిందని సంబంధిత వర్గాలు వెల్లడించా యి.

మోసపూరిత రుణాలపై కాలపరిమితికి సంబంధించి ఆర్‌బిఐ ఇదివ రకే ఆదేశం ఇచ్చినప్పటికీ భారీ కుం భకోణాన్ని వెలుగు లోకి తీసుకువచ్చిన పిఎన్‌బీ అనూహ్యమైన పరిస్థితిని ఎదు ర్కొనేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుం ది. మోసపూరితంగా లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్(ఎల్‌ఒయులు) జారీ తొలిసారిగా చోటు చేసుకున్న కారణం గా కుంభకోణంపై పిఎన్‌బికి ఆర్‌బిఐ నాలుగు త్రైమాసికాల కాలపరిమితి విధించే అవకాశం ఉంది. కుంభకోణంలో ప్రధాన నిందితునిగా అభియోగం ఎదుర్కొం టున్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీపై సిబిఐ తాజాగా ఒక కేసును బుధవారం నమోదు చేసింది.

పిఎన్‌బి స్కామ్ విలువ ఇక పెరగదు

ముంబై: పిఎన్‌బి కుంభకోణంలో మొత్తం విలువ రూ.12,646 కోట్ల కన్నా మరింతగా పెరిగే అవకాశం లేదని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం(డిఇఎ) కార్యదర్శి సుభాష్ చంద్ర గర్గ్ గురువారమిక్కడ తెలిపారు.

మరింతగా పెరగడానికి తమకు ఎలాంటి ఆధారం కనిపించడంలేదని ఆయన అన్నారు.

ఐవిసిఎ కార్యక్రమంలో పాల్గొన్న గర్గ్ విలేకరులతో మాట్లాడు తూ అన్ని ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) లేదా మొండి బకాయిల ఖాతాలను తనిఖీ చేయాల్సిందిగా ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల విభాగం బ్యాంకులను ఆదేశించిందని తెలిపారు. అలాంటి ఖాతాలను సంబంధిత బ్యాంకులు జల్లెడ పడతాయని చెప్పారు.

ఏదైనా ఆవిర్భవిస్తే(స్కామ్ మొత్తంలో పెరుగుదల) మాకు తెలుస్తుంది. కానీ ఈ దశలో ఏదైనా పెరుగుదల చోటు చేసుకుంటుందని, మున్ముందు జరగబోతుందని మాకైతే కనిపించడం లేదు అని సుభాష్ చంద్ర చెప్పారు. పిఎన్‌బి మొదట్లో దాదాపు 1.77 బిలియన్ డాలర్ల స్కామ్ చోటు చేసుకుందని తెలిపింది. ఆ తర్వాత సమీక్షించి కుంభకోణం మొత్తానికి అదనంగా 204.25 మిలియన్ డాలర్లు చేర్చింది.

పాస్‌పోర్టు రద్దు చేశారు.. రాలేను

- సీబీఐకి చోక్సీ 7పేజీల లేఖ

న్యూఢిల్లీ: తన పాస్‌పోర్టు రద్దు కావడానికి తోడు అనారోగ్యం కారణంగా భారత్‌కు తిరిగి రాలేనని పిఎన్‌బి కుంభకోణంలో అభియోగాలు ఎదుర్కొంటున్న గీతాంజలి జెమ్స్ ప్రమోటర్ మోహుల్ చోక్సీ పేర్కొన్నారు. ఈ మేరకు ఏడు పేజీల లేఖను తన న్యాయవాది ద్వారా విడుదల చేశారు. సిబిఐ నోటీసుకు సమాధానంగా పూర్తి వివరాలతో కూడిన ఇ-మెయిల్‌ను చోక్సీ పంపించారు. ఫిబ్రవరి 16న పాస్‌పోర్టు కార్యాలయం నుంచి తనకు ఒక ఇ-మెయిల్ అందిందని తెలిపారు. దేశ భద్రతకు ముప్పు దృష్ట్యా తన పాస్‌పోర్టును రద్దు చేసినట్టు మెయిల్‌లో పేర్కొన్నారని చెప్పారు. అయితే ముంబైలో ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం తన పాస్‌పోర్టు రద్దుకు వివరణ ఇవ్వలేదని చోక్సీ ఆరోపించారు. తాను దేశ భద్రతకు ముప్పు ఎలా అవుతానని ఆయన నిలదీశారు.

అంతేకాక ఆరోగ్య సమస్య వల్ల కూడా తాను ప్రయాణించే స్థితిలో లేనని చోక్సీ తెలిపారు.

సరిగ్గా ఇలాంటి కారణాలతోనే తాను భారత్ రాలేనని నీరవ్ మోడీ సిబిఐకి గతంలో బదులిచ్చారు. దీనిపై దర్యాప్తు ఏజెన్సీ నీరవ్‌కు ఘాటుగా స్పందించింది. మీరు ఏ దేశంలోనైతే ఉన్నారో అక్కడి భారత రాయబారి కార్యాలయాన్ని సంప్రదించండి. వారు మీ భారత్ ప్రయాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తారు అని వజ్రాల వ్యాపారికి బదులిచ్చినట్టు అధికారులు తెలిపారు.

పీఎన్‌బీకి సీవీసీ పురస్కారం

సకాలంలో క్రమశిక్షణా చర్యలు పూర్తి చేసినందుకు గాను పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌కు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సివిసి) నెలకొల్పిన విజిలెన్స్ ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. కేంద్ర వ్యక్తిగత, ప్రజా ఫిర్యాదులు మరియు పింఛన్లు శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ రాజ్యసభ కు ఈ విషయాన్ని గురువారం తెలియపరిచారు. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఒక ప్రశ్నకు సమాధానమి స్తూ 2017 సంవత్సరానికి గాను ఆరు ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందిన సివిఒలు, విజిలెన్స్ సిబ్బంది, విజిలెన్స్ మేనేజ్‌మెంట్‌కు వేర్వేరు కేటగిరీల కింద పుర స్కా రాలు అందించినట్టు మంత్రి తెలిపారు. సివిసి ఇచ్చిన సమాచారం మేరకు 2016 సంవత్సరంలో పనితీరు కుగాను తొలిసారిగా 2017లో పురస్కారాలు నెలకొ ల్పినట్టు వెల్లడించారు.

బడ్జెట్ సమావేశాలపై స్పీకర్ సమీక్ష



హైదరాబాద్, ఆంధ్రప్రభ : శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 12 వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి, కౌన్సిల్ ఛైర్మన్ స్వామిగౌడ్, డిప్యూటీ ఛైర్మన్‌నేతి విద్యా సాగర్ రావు, కార్యదర్శి నర్సింహాచారి తదితరులు ఉన్నతాధికారులతో గురువారం భేటీ అయ్యారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, డిజిపి ఎం. మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ ఇంచార్జీ సిపి వివి శ్రీనివాసరావు, జిఎడి అధికారులు పలువురు పాల్గొన్నారు.అసెంబ్లీ జరుగుతున్నన్ని రోజులు సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాలలో బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. గతంలో తీసుకున్న చర్యలను తెలుసుకున్న అధికారులు అదనపు సూచనలను చేశారు. ఈసారి మెట్రో రైల్ బ్రిడ్జి కూడా రావడం, అసెంబ్లీ పరిసరాలలోనే మెట్రోస్టేషన్‌లు ఉండటంతో వాటిపై కూడా దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం ఏ ఉత్సవాలు, ఊరేగింపులు, ప్రదర్శనలు జరిగినప్పటికీ పోలీసులు లాఠీలకు పని చెప్పకుండా జాగ్రత్తగా డీల్ చేసినందుకు అభినందించిన స్పీకర్, ఛైర్మన్‌లు అసెంబ్లీ సందర్భంగా జరుగనున్న బందోబస్తులోనూ ఇదే విధానాన్ని కొనసాగించాలని సూచించారు.

టెన్త్ విద్యార్థులకు కౌన్సెలింగ్

● పరీక్షలు ముగిసేవరకు కొనసాగింపు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఎస్ఎస్‌సి పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉండటం కోసం వారికి కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం పాఠశాల విద్య శాఖ కమిషనరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసింది. విద్యార్థులు, తల్లిదండ్రులు టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి వారి సమస్యను చెబితే కమిషనరేట్‌లో నియమించబడిన కౌన్సిలర్ వారికి కౌన్సిలింగ్ ఇస్తారు. కౌన్సిలింగ్‌ను సోమవారం నుంచి ప్రారంభించాలని పాఠశాల విద్య శాఖ నిర్ణయించింది. టోల్‌ఫ్రీ నంబర్ 18004257462 నంబర్‌కు డయల్ చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమస్యలను చెప్పాలని పాఠశాల విద్య సంచాలకులు జి కిషన్ సూచించారు. కౌన్సిలర్ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే కాకుండా ప్రైవేటు, కేజిబివి, మోడల్ స్కూల్ ఎవరైనా ఎస్ఎస్‌సి పరీక్షలకు సిద్ధం అవుతున్న వారు టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయవచ్చని తెలిపారు.

మే 8న డోస్టు నోటిఫికేషన్!

● నిర్వహణ బాధ్యత ఉన్నత విద్యా మండలిదే

హైదరాబాద్,ఆంధ్రప్రభ: డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించే డోస్టుకు మే 8న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. మే 2 నుంచి 7 వరకు ఎంసెట్ పరీక్షలను నిర్వహిస్తున్నందున ఎంసెట్ పరీక్షలు ముగిసిన వెంటనే మే 8న డోస్టు నోటిఫికేషన్‌ను జారీ చేయాలని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. డోస్టు నిర్వహణకు సంబంధించిన పూర్తి బాధ్యతను ఈ ఏడాది తెలంగాణ ఉన్నత విద్యామండలి తీసుకోనుంది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలను త్వర లోనే నిర్ణయించి వాటిని ఉత్తర్వుల రూపంలో జారీ చేయనున్నట్టు సమాచారం.

'మిలియన్ మార్చ్'కు అనుమతి లేదు

● స్పష్టం చేసిన పోలీసు అధికారులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ట్యాంక్‌బండ్‌పై ఈ నెల 10వ తేదీన జేఏసీ తల పెట్టిన మిలియన్ మార్చ్ స్ఫూర్తి యాత్రకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రదేశం కాబట్టి ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది. ఇంటర్ పరీక్షలు ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని పోలీసు శాఖ భావించింది. ఎంతమంది పాల్గొంటారు.. ఎవరెవరు మాట్లాడుతారో తెలియ కుండా అనుమతి ఇవ్వలేం అని పోలీస్ శాఖ పేర్కొంది. గతంలో మిలియన్ మార్చ్ జరిగినప్పుడు జంటనగరాల్లో గొడవలు జరిగాయి. ఇప్పుడు కూడా ఎంతమంది వస్తారో స్పష్టత ఇవ్వలేదని, దీంతో సంఘ విద్రోహక శక్తులు కూడా పాల్గొ నవ చ్చంటూ పోలీసు శాఖ అనుమతి నిరాకరించింది. అనుమతి నిరాకరించిన నేప థ్యంలో జేఏసీ, సీపీఐ, ప్రజాసంఘాలు చర్చించుకుని భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు సమాచారం.

జులై 15న తెలంగాణ సెట్ పరీక్ష

● 14నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్(టిఎస్-సెట్)-2018 పరీక్షను జూలై 15న నిర్వహించనున్నారు. అభ్యర్థుల నుంచి ఉస్మానియా యూనివర్సిటీ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను మార్చి 14 నుంచి స్వీకరించనున్నట్టు సెట్ సభ్య కార్యదర్శి గురువారం ఒక ప్రకట నలో తెలిపారు. అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను ఏప్రిల్ 14 వరకు అవ కాశం కల్పించారు. రూ. 1500 అపరాధ రుసుంతో ఏప్రిల్ 24 వరకు, అపరాధ రుసు ం రూ. 2000తో మే 4 వరకు, అపరాధ రుసుం రూ. 3000తో మే 15 వరకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.తెలంగాణసెట్.వోఆర్‌జీ. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఉస్మానియా.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పూర్తి సమాచారం ఉంటుందని స్పష్టం చేశారు.

ఇంటర్ పరీక్షలకు సహకరించాలి

● విద్యార్థి సంఘాలకు ఇంటర్ బోర్డు విజ్ఞప్తి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలకు ఇబ్బంది లేకుండా 13న జరిగే ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు సహకరించాలని కోరుతూ ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్ విద్యార్థి సంఘాల జేఏసీకి విజ్ఞప్తి చేశారు. ఆ రోజు ఎంఆర్‌పిఎస్ తలపెట్టిన రాష్ట్ర బంద్ నేపథ్యంలో ఇంటర్ పరీక్షలను వాయిదా వేయాలని విద్యార్థి సంఘాల జేఏసీ బోర్డు కార్యదర్శికి వినతిపత్రం సమర్పించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బోర్డు కార్యదర్శి స్పందించారు. ఇంటర్ పరీక్షల తరువాత జాతీయస్థాయి పోటీ పరీక్షలు ఉంటాయని, ఈ నేపథ్యంలో ఇంటర్ పరీక్షలు ఆటంకం లేకుండా జరిగేలా చూడాలని విద్యార్థి సంఘాల జేఏసీకి గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా ఏపిలో జరిగే పరీక్షల నేపథ్యంలో ఒకేసారి నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఒకేసిలబస్ ఉంటున్నందున పేపర్ లీకేజీ సమస్యలు ఉంటాయని అందుకే 13న జరిగే పరీక్షను యధావిధిగా జరిగేలా సహకరించాలని, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆటంకం కలిగించకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. గురువారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం గణితం -1బి, జువాలజీ-1, హిస్టరీ-1 పరీక్షలకు 14,306 మంది గైరాజరు అయ్యారని తెలిపారు. పరీక్షకు 3,78,734 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 3,64,428 మంది హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా మహబూబ్‌నగర్‌లో 7 కేసులు నమోదు అయ్యాయి.

ఫ్యాన్సీ నంబరుపై మోజు

● రూ. 7 లక్షలు వెచ్చించిన హీరో పృథ్వీరాజ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మలయాళంతో పాటు తమిళ చిత్రాల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న హీరో పృథ్వీరాజ్. తాను గతేడాది లంబోర్గిని హరికేన్ కారును కొనుగోలు చేశాడు. ఇంత హై ఎండ్ కారుకి మంచి ఫ్యాన్సీ నెంబర్ కావాలని ముచ్చటపడిన అతన వేలంపాటగా ఏకంగా ఏడు లక్షలు వెచ్చించాడు. తద్వారా తనకున్న ఫ్యాన్సీ నెంబర్ మోజును తీర్చుకున్నాడు. ఎర్నాకులం ఆర్‌టీఓ కార్యాలయంలో ఇటీవల కేఎల్ 07 సీఎన్ 1 అనే నెంబరును వేలానికి ఉంచారు. ఈ నెంబర్ కోసం వేలం పాట రూ.10 వద్ద ప్రారంభమైంది. చివరకు రూ.7 లక్షల వద్ద పృథ్వీరాజ్ దీనిని సొంతం చేసుకున్నాడు. ఈ లంబోర్గిని కారు ధర సుమారు రూ.3.25 కోట్లు. 2010లో విడుదలైన విలన్ చిత్రంలో బాలీవుడ్ హీరోయిన్ ఐశ్వర్యారాయ్ భర్తగా అతను నటించాడు. దేశవ్యాప్తంగా ఉన్న ఆర్‌టీఓలు వేలం పాటల్లో ఫ్యాన్సీ నెంబర్లను విక్రయించడం ద్వారా మంచి లాభాలను ఆర్జిస్తున్నాయి. మరికొందరు సినిమా స్టార్‌లు తమకున్న కార్లన్నింటిపైనా ఒకే నెంబరును వాడుతున్నారు. బాలీవుడ్ స్టార్ సంజయ్‌దత్ తనకున్న అన్ని కార్లపై 4545 నెంబరు ప్లేటును వాడుతున్నాడు. ఇక కండల వీరుడు సల్మాన్‌ఖాన్ తన కార్లపై 2727 నెంబరును ఉపయోగిస్తుండటం ఫ్యాన్సీ నెంబర్లపై వారికున్న మోజును తెలియపరుస్తోంది.


లెక్కలు చెప్పని అభ్యర్థులు అనర్హులే

● 13,329 మందిపై వేటు ● నిబంధనల అమలుతో దడ

● స్థానిక ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఫోకస్

హైదరాబాద్, ఆంధ్రపభ: ఎన్నికల వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. తెలంగాణ తొలి రాష్ట్ర ఎన్నికల సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రజత్‌కుమార్ కీలక సంస్కరణల దిశగా దృష్టి సారించారు. మరో మూడు నెలల్లో స్థానిక సంస్థల గడువు తీరనున్న సమయంలో మరింత పారదర్శకత, కఠిన నిబంధనలను తెరపైకి తేవాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా డిక్లరేషన్, స్వంత పూచీకత్తు, ఎన్నికల వ్యయం, నిబంధనల అతిక్రమణ వంటి అంశాలను ఇదివరకటి తీరులో చూసీచూడనట్లుగా కాకుండా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేసేలా తీర్మానించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు స్థానిక సంస్థలు అంటే గ్రామ పంచాయతీలు, మండల, జిల్లాపరిషత్‌లకు పోటీ చేపి గెల్చిన, ఓడిపోయిన అభ్యర్థులంతా విధిగా ఎన్నికలు ముగిసిన 40 రోజుల్లోపు ఎన్నికల ఖర్చు లెక్కలను అధికారులకు సమర్పించాలి. లేని పక్షంలో మొత్తం అభ్యర్థులను వార్డు సభ్యులుగా పోటీ చేసినవారిని కూడా వదలకుండా ఎన్నికల సంఘం షార్ట్‌నోటీస్ జారీ చేస్తుంది. ఈ నోటీస్‌కు స్పందించని వారిపై మూడేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేసి, వారిని ఎన్నికలకు దూరం చేసే అధికారం ఎన్నికల సంఘానికి ఉంది. ఇప్పుడీ అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలించింది. తనకున్న అధికారం మేరకు గత ఉమ్మడి రాష్ట్రంలో 2013లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలు, ఆ తర్వాత 2014లో జరిగిన జెడ్పీటిసి, ఎంపీటిసి ఎన్నికల్లో పోటీచేసి ఖర్చులను వెల్లడించని 13,329 మందిని ఎన్నికల సంఘం గుర్తించింది. వీరందరినీ మూడేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేదం విధించింది. అనర్హతకు గురైన వారిలో 8వేల మంది గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వార్డు సభ్యులుగా పోటీ చేసిన వ్యక్తులుకాగా, మిగతా అభ్యర్థులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలుగా లెక్క తేల్చారు.

మరో మూడు, నాలుగు నెలల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అభ్యర్థుల ఆశలపై ఎన్నికల సంఘం ఊహించని రీతిలో



నీళ్లు జల్లింది. ఈ దెబ్బతో సర్పంచ్‌కు, వార్డు సభ్యులకు పోటీ పడాలనే యోచ నలో ఉన్న అభ్యర్థులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొం ది. 2013లో తెలంగాణలోని 8778 సర్పంచ్,88682 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఇక ఆ తర్వాత ఏడాది 2014లో 436 జెడ్పీటిసి, 6441 ఎంపీటిసి స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఆయా పదవులకు భారీగా అభ్యర్థులు పోటీ చేశారు. కాగా ఇదే అంశంలో ఎన్నికల సంఘం నోటీసులకు స్పందించని 3వేల మందిపై గతేడాది జనవరిలోనూ చర్యలు తీసుకుంది.

ఆర్థిక స్వావలంబనతోనే మహిళాభివృద్ధి

సింగరేణి ఈడీ కిషన్‌రావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మహిళలను గౌరవించి, ఆదరించేగొప్ప సంస్కృతీ వారసత్వాన్ని కాపాడుకుంటూనే మహిళలు ఆధునిక ప్రపంచంలో అన్ని రంగాల్లో రాణించాలని, ముఖ్యంగా ఆర్థిక స్వావలంబన సాధించాలని సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మార్కెటింగ్ అండ్ కోల్‌మూమెంట్) బి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గురువారం అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకలు జరగ్గా, ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గతానికి భిన్నంగా మహిళలు అనేక రంగాల్లో రాణిస్తున్నారని, వీరి సంఖ్య తక్కువగా ఉందని పేర్కొన్నారు. మహిళలు పురుషులతో సమంగా గౌరవించబడడానికి, ఎదగడానికి చట్టాలు అవకాశం కల్పించాయని.. వీటిని సద్వినియోగం చేసుకుని ఎదగాలన్నారు. . కార్యక్రమంలో ఏజిఎం ప్రేమ్‌కుమార్, దుండె వెంకటేషం, డాక్టర్ శేషగిరిరావు, గణాశంకర్‌పూజారి, రాధామాధవి, షాలెంకుమారి, జ్యోతి పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పెంపు ఆందోళనకు మద్దతు

జాతీయ బీసీ సంక్షేమసంఘం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జనాభా ప్రకారం రిజర్వేషన్లను పెంచాలని టిఆర్ఎస్ పార్లమెంటు సభ్యులు గత నాలుగు రోజులుగా పార్లమెంటులో చేస ఆందోళనకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఇదే అందోళనలో బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతంనుంచి 50 శాతానికి పెంచాలనే అంశాన్ని కూడా చేర్చాలని సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు విజ్ఞప్తి చేశారు. బీసీలకు చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే అంశాన్ని కూడా చేర్చాలన్నారు. గత ఏడు దశాబ్దాలుగా బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కూడా 56 శాతం ఉన్న బీసీలకు రాజకీయ రంగంలో 14 శాతం, ప్రభుత్వ ఉద్యోగాల్లో కేవలం 12 శాతం మాత్రమే ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు.

చట్టసభల్లో రిజర్వేషన్లతోనే.. మహిళా సాధికారత

- కేసీఆర్ పాలనలో ఎన్నడూ లేని విధంగా మహిళాభివృద్ధి
- అంతర్జాతీయ మహిళా సదస్సులో పద్మా దేవేందర్‌రెడ్డి
- ప్రతిభా పురస్కారాలు అందజేసిన తుమ్మల, నాయిని నర్సింహారెడ్డి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారానే మహిళా సాధికారత వేగవంతంగా జరుగుతుందని శాసనసభ ఉప సభాపతి పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించిందని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం ఇక్కడ లలిత కళా తోరణంలో మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవానికి పద్మాదేవేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం చట్టసభల్లోకి వారసత్వం ద్వారానో లేదా ప్రజాప్రతినిధులుగా ఉన్నవారు చనిపోతే వారి బంధువులో వస్తున్నారని, ప్రతి మహిళ ఎమ్మెల్యే కావాలని కోరుతూ మహిళల నుంచి చప్పట్లను అందుకున్నారు. మహిళలకు పండుగ అనేది మార్చి 8 కాదనీ, ప్రతిరోజు పండుగగా మార్చేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అవకాశాలు వస్తే మహిళలు దేన్నైనా సాధించగలరని, లాలించేతల్లి..., అంతరిక్షంలో అడుగుపెడుతోందని, సైనికురాలిగా దేశ రక్షణ భాధ్యతలు నిరవ్రహిస్తోందని చెప్పారు. ఎక్కడ మహిళలు పూజింపబడతారో అక్కడ దేవతలు తిరగాడుతారని సూక్తిని నిజం చేస్తూ మహిళాభివృద్ధికి సీఎం కె చంద్రశేఖరరావు అగ్ర ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ఆడబిడ్డ మంచినీటి కోసం కష్టపడకూడదనే ఉద్దేశ్యంతో ఇంటింటికి తాగునీరు అందించే బృహత్తర పథకాన్ని కేసీఆర్ చేపట్టారని, ఈ మిషన్ భగీరథ పథకాన్ని ఎన్నికల్లోగా పూర్తి చేయకపోతే 20198 ఎన్నికల్లో పోటీ చేసే ప్రసక్తిలేదని కూడా సీఎం సాహసోపేత ప్రకటన చేశారని పద్మాదేవేందర్ రెడ్డి గుర్తు చేశారు. మానవ సంపదను కాపాడుకోవాలి...ప్రాణాలను దక్కించుకోవాలి...పోయిన ప్రాణం రాదనే ఉద్దేశ్యంతో అందరికీ ఆరోగ్యం ఉండాలనే సదుద్దేశ్యంతో ఆరోగ్యలక్ష్మి కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని, మహిళల్లో పౌష్టికాహార లోపం ఉండరాదనే ఉద్దేశ్యంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తోందన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కూడా ప్రభుత్వం గట్టి కృషి చేస్తోందని, ఆడబిడ్డల పెళ్లికి గానూ కళ్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.75,000 ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతోందన్నారు. ఆడబిడ్డలు పుట్టినప్పటి నుంచి పెళ్లయ్యే వరకు బాధ్యతలను ప్రభుత్వమే తీసుకుందని చెప్పారు.

అవార్డుల ప్రదానం

ఈ సందర్భంగా 17 విభాగాల్లో విశిష్ట ప్రతిభ కనబర్చిన 20 మంది మహిళలకు పద్మాదేవేందర్ రెడ్డితో పాటు మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అవార్డులు ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్నవారిలో కవితా దర్యానీ (విద్య), అరుణారెడ్డి తరపున ఆమె తల్లి (జిమ్నాస్టిక్స్), డాక్టర్ సత్యలక్ష్మి (ఆరోగ్యం), చక్రవర్తుల లక్ష్మీ నర్సమ్మ (సాహిత్యం), డాక్టర్ సిరి (సాహిత్యం), నిత్య సంతోషిణి (సంగీతం), మంజులా శ్రీనివాస్ (నృత్యం), కవితా దేవుస్కర్ (పెయింటింగ్), నందినీ రెడ్డి (సినిమా), ఝూన్సీ (జానపద సంగీతం), ఇందూరి పద్మ (ఉద్యమగానం),డి రాజశ్రీ (పారిశ్రామిక రంగం), లతాజైన్ (జర్నలిజం), సౌమ్య నాగపూరి (జర్నలిజం), సుప్రీయ సనమ్ (మెట్రో లోకో డ్రైవర్), సరిత (ఆర్టీసీ డ్రైవర్ - ఢిల్లీ), యాప భద్రమ్మ (స్వయం సహాయక సంఘం), బొగ్గం జయమ్మ (అభ్యుదయ రైతు), శైలజ (కొత్త పల్లి గ్రామ సర్పంచ్), గంద్ర రమాదేవి (సామాజిక సేవ) ఉన్నారు.

త్వరలో హైదరాబాద్‌లో మహిళా విశ్వవిద్యాలయం - తుమ్మల

మహిళాభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న సీఎం కేసీఆర్ త్వరలో హైదరాబాద్‌లో మహిళల కోసమై ప్రత్యేకంగా మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నారని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. గడచిన మూడున్నరేళ్లుగా టీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మహిళలు సుఖ , సంతోషాలతో ఉన్నారని చెప్పారు. బాలికల కోసం అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు.

అక్క జమునను చూసే రాజేందరన్న బడ్జెట్ రూపొందిస్తుండ్రు...

మహిళలు అత్యంత ప్రతిభ కలవారని, ఇంటి ఖర్చులు రోజుకు, నెలకెంత అవుతుందో వారికి మాత్రమే తెలుస్తుందని, అదే విధంగా రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి ఈటల రాజేందరన్న కూడా భార్య జమునను అడిగి రూపొందిస్తారని అనుకుంటున్నానని హర్షధ్వానాల మధ్య డిప్యూటి స్పీకర్ వ్యాఖ్యానించారు. ప్రతి మహిళ ఎమ్మెల్యే కావాలనీ, పద్మాదేవేందర్ రెడ్డి ఒక్కరే కాదని, అందుకోసం చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్లు కావాలని డిమాండ్ చేయాలని పిలుపునిచ్చారు.

మహిళలకు భద్రత కల్పించాం... నాయిని నర్సింహారెడ్డి

టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు భద్రత, రక్షణ కల్పించామని రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి చెప్పారు. మహిళల రక్షణ కోసం టీ షీంలు ఏర్పాటు చేశామని, భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ధైర్యాన్ని నింపామని తెలిపారు. పోలీస్‌శాఖలో 33 శాతం రిజర్వేషన్లు మహిళలకు కల్పించామని చెప్పారు. పోలీస్‌శాఖ పరంగా మహిళల కోసం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కెవి రమణాచారి, మహిళాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి డి జగదీశ్వర్, డైరెక్టర్ విజయేంద్ర బోయీ, మహిళా ఆర్థిక సంస్థ చైర్మన్ గుండు సుధారాణి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్లు సునీతాలక్ష్మారెడ్డి (రంగారెడ్డి) తుల ఉమ (కరీంనగర్), గడిపల్లి కవిత (ఖమ్మం) తో పాటు రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్, రాష్ట్ర సాంస్కృతిక మండలి డైరెక్టర్ మామిడి హరిక్రిష్ణ, హైదరాబాద్ మేయర్ సతీమణి బొంతు శ్రీదేవి, బీసీ కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు పాల్గొన్నారు.

రక్షణ బలగాల్లోకి మహిళలు రావాలి

- ఐపీఎస్ అధికారి రమారాజేశ్వరి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పోలీసు శాఖతో పాటు వివిధ రక్షణ విభాగాలలోనూ మహిళలు భాగస్థులు కావాల్సిన అవసరం ఉందని ఐపిఎస్ అధికారి రమారాజేశ్వరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈక్వస్టన్ సంస్థ ఆధ్వర్యంలో భూమిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి హాజరైన రెమా రాజేశ్వరి మాట్లాడుతూ, సమాజంలో ఇప్పటికీ ఎంతో మంది మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని, కుటుంబపరంగా ఇక్కట్లు ఎదురవుతున్నా పోలీసుస్టేషన్‌కు వెళ్ళేందుకు కూడా సాహసించడం లేదన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌పిగా తనకు 2016లో వచ్చిన ఫిర్యాదును చూసి ఆశ్చర్యపోయాయని, బాధిత మహిళ నివాసానికి కూతవేటు దూరంలో పోలీసుస్టేషన్ ఉన్నప్పటికీ వెళ్ళి ఫిర్యాదు చేసేందుకు సాహసించలేదన్నారు. నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ మాట్లాడుతూ, మహిళలు తమ చిన్నారుల భవిష్యత్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.10 మంది మహిళలకు అవార్డులందించారు.



బేటీ బచావో.. బేటీ పడావోపై.. హైదరాబాద్ కలెక్టర్‌కు అవార్డు



హైదరాబాద్, ప్రభ న్యూస్ : బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం అమలుకు హైదరాబాద్ కలెక్టర్, అధికార యంత్రాంగం జిల్లావ్యాప్తంగా విశేష కృషి చేశారు. అందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల సంరక్షణ, బాలిక విద్యకు కృషి చేసినందుకు గాను జిల్లా కలెక్టర్ డాక్టర్ యోగితారాణాను కేంద్ర ప్రభుత్వం గురువారం సత్కరించింది. రాజస్థాన్ రాష్ట్రంలోని జన్‌జునూలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నుంచి యోగితా రాణా అవార్డునందుకున్నారు.

అడుగడుగనా అన్యాయమే

- టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో : స్వాతంత్రం సిద్ధించిన తరువాత దేశంలో మహిళలకు చోటు లేని కేబినేట్ ఉందంటే అది తెలంగాణ రాష్ట్రంలోనే అని, ఇది 2కోట్ల మంది ఉన్న మహిళలకు కేసీఆర్ ఇచ్చిన గౌరవమని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి వాఖ్యానించారు. ప్రజాచైతన్య బస్సుయాత్రలో భాగంగా గురువారం కరీంనగర్ జిల్లా ఎల్ఎండీ గెస్ట్‌హౌస్‌లో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన మహిళలకు శుభాకాంక్షలు తెలిపి రాష్ట్రంలో మహిళలను చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. మహిళలకు ఈ రాష్ట్రంలో అన్ని విషయాల్లో అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చింది ఉక్కు మనిషి సోనియాగాంధీ అయితే తెలంగాణ బిల్లు పాసుకావడంలో క్రియాశీల పాత్ర పోషించింది అప్పటి స్పీకర్ మీరాకుమార్ అని అన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభోత్సవంలో తెలంగాణ ఇవ్వడం ఏదో పాపం అన్నట్లు ప్రధాని నరేంద్రమోడీ మాట్లాడితే టీఆర్ఎస్ ఎంపీలు నోరు మెదపలేదన్నారు. మహిళా సాధికారత గత కాంగ్రెస్ హయాంలోనే సాధ్యమైందని, ఇప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని విస్మరిస్తున్నాయని ధ్వజమెత్తారు. చట్టసభలో మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెడితే కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని, వచ్చేఎన్నికల్లో మహిళలకు సీట్లు కేటాయించడంలో ప్రాధాన్యత ఇస్తామన్నారు. సమావేశంలో మండలి ఫ్లోర్‌లీడర్ షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెపల్లి మోహన్, ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మాజీ కేంద్ర మంత్రి బలరాంనాయక్, మాజీ ఎంపీ మల్లురవి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు నేరెళ్ల శారద, అధికార ప్రతినిధి రేగులపాటి రమ్యారావు, కాంగ్రెస్ నాయకులు బొమ్మ వెంకటేశ్వర్, కొడూరి సత్యనారాయణ గౌడ్, గజ్జలకాంతం, కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్ మధ్య విబేధాలు ఉన్నాయి. నేను చెప్పినా మీరు రాయరు. కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు లేవు. మాది జాతీయ పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యం ఉంది. అందరం సమిష్టినిర్ణయంతో ముందుకపోతున్నాం. రాష్ట్రంలో నిశబ్దవిప్లవం కొనసాగుతుంది. రానున్న ఎన్నికల్లో అధికారం మాదే.

రాష్ట్ర మంత్రి వర్గంలో మహిళకు చోటేది?

- భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాజకీయ పార్టీల్లో మహిళలకు మూడోవంతు అవకాశాలు కల్పిస్తూ... వారిని రాజకీయంగా అభివృద్ధి చెందేలా చేస్తున్న ఏకైక రాజకీయ పార్టీ భాజపా అని పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె. లక్ష్మణ్ అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నాంపల్లిలోని భాజపా కార్యాలయంలో రాష్ట్ర మహిళా మోర్చా ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళానేతలను ఉద్దేశించి లక్ష్మణ్ మాట్లాడుతూ, పార్టీ పరంగానూ, కేంద్ర ప్రభుత్వంలోనూ మహిళలకు పెద్దపీట వేసింది భాజపానేనని అన్నారు. మిగిలిన పార్టీలు మహిళలను కేవలం ఓటర్లను పరిగణించాయని ఆయన విమర్శించారు. మహిళల్లోని శక్తి సామర్థ్యాలు, ప్రతిభను గుర్తించడంలో నరేంద్రమోదీ ప్రభుత్వం చాలాముందుందన్నారు. కీలకమైన రక్షణ బాధ్యతలను నిర్మలా సీతారామన్‌కు కట్టబెట్టారని లక్ష్మణ్ గుర్తు చేశారు. అలాగే విదేశాంగ శాఖ మంత్రిగా సుష్మాస్వరాజ్, లోక్‌సభ స్పీకర్‌గా సుమిత్రా మహాజన్, హర్ సిమ్రత్‌కౌర్ బాదల్ వంటి పలువురు మహిళలకు కేబినెట్‌లో అవకాశం కల్పించిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మహిళలు ఏ పని తలపెట్టినా నిజాయితీగా, నిబ్బరంగా, నైపుణ్యంగా పూర్తి చేస్తారని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఒక మహిళకు కూడా రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించిన ఏ రాష్ట్రమైన ఉన్నదంటే....అది తెలంగాణలోనేనని అని ఆయన మండిపడ్డారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా షీ టాయిలెట్లు కూడా ఏర్పాటు చేశారన్నారు. భాజపా అధికారంలోకి వచ్చే నాటికి దేశంలో 40శాతం జనాభాకు మరుగుదొడ్ల కూడా లేవని, మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటింటికి మరుగుదొడ్డి నిర్మించేందుకు చర్యలు చేపట్టి మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింప చేశారన్నారు.
మహిళా సంక్షేమం కోసం సుకన్య సమృద్ధి యోజన, బేటీ పడావో...బేటీ బజావో వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నారని, ఉజ్వల పథకంలో భాగంగా దేశంలోని ఎనిమిది కోట్ల మంది నిరుపేదలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇస్తున్నారని లక్ష్మణ్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమాన్ని గాలికొదిలేసిన కేసీఆర్....తమ కుటుంబ స్వార్థం కోసం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్, తెరాస రెండు పార్టీలు కూడా పాపాల పుట్టలని, కేసీఆర్ రాజకీయ జీవితం ప్రారంభమైందే కాంగ్రెస్ నుంచని విమర్శించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ మాట్లాడుతూ, అన్ని రంగాలల్లో పురుషులతో సమానంగా పోటీపడుతున్న మహిళలకు... రాజ్యాధికారం కూడా దక్కాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా నేతలు అరుణజ్యోతి, ఛాయాదేవి, సావిత్రి,. గీతామూర్తి, శిల్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మహిళకు 'నారీ శక్తి'

- రాష్ట్రపతి చేతుల మీదుగా జయమ్మకు అవార్డు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణకు చెందిన సామాజిక కార్యకర్తకు నారీ శక్తి పురస్కార్-2017 అవార్డు దక్కింది. రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ చేతుల మీదుగా తెలంగాణకు చెందిన బండారి జయమ్మ ఈ అవార్డును అందుకున్నారు. సెక్స్ వర్కర్ల కుటుంబాల రక్షణ, హెచ్ఐవీ నిరోధంపై చేస్తున్న ఉద్యమానికిగానూ జయమ్మ చేస్తున్న సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. కార్యక్రమం అనంతరం ఆమె ఢిల్లీ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం గర్వంగా ఉంది అన్నారు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఈ స్థాయి కి వచ్చానని చెప్పారు. అమాయక మహిళలు పడుపు వృత్తిలోకి నెట్టబడుతున్నారని జయమ్మ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం హెచ్ఐవి నిరోధంపై దృష్టి సారించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ భవన్‌లో... ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మహిళల్లో ఆశావహ ఆలోచనా దృక్పథం, స్వీయ పరిశీలన ద్వారా సామాజిక వికాసం, సమాజాభివృద్ధి, మహిళా సాధికరాత సాధ్యమని అరకు ఎంపీ కొత్తపల్లి గీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ఏపీ భవన్‌లో తేవా (తెలుగు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కొత్తపల్లి గీతతో పాటు తమిళనాడులోని తిరుచూరు ఎంపీ సత్యభామ, నార్త్ ఢిల్లీ మేయర్ ప్రీతి అగర్వాల్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా కార్యదర్శి ప్రీతి సూడాన్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. తొలుత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మహిళా దినోత్సవ విశేషాలను డాక్టర్ ప్రసాద్ విశ్లేషించారు.

ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ... మహిళల పట్ల గౌరవ భావం పెంపొందేలా పిల్లల పెంపంకంలో తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆడవారి సంక్షేమం, రక్షణ కోసం ఎన్ని చట్టాలు, శాసనాలు చేసినా కార్యాచరణలో ఆటంకాలు, సవాళ్లను ఎదుర్కొంటున్నామని ఆమె తెలిపారు. మహిళలపై పెరుగుతున్న హింస, అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే మహిళలకు సమాజం పట్ల అవగాహన, వ్యక్తిగత విశ్లేషణ అవసరమని గీత అభిప్రాయపడ్డారు.

తిరుచూరు పార్లమెంట్ సభ్యురాలు సత్యభామ మాట్లాడుతూ... సాటి ఆడవారి పట్ల సేవా తత్పరత ఉండాలని అన్నారు. అనంతరం ఆత్మీయత, ఆదరణ, అనురాగాలకు తెలుగు ఆడపడుచులు ప్రతిరూపాలని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి ప్రీతి సూడాన్ కొనియాడారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న, ప్రతిభ చాటుతున్న తెలుగు మహిళామణులకు ముఖ్య అతిథులు శాలువా, జ్ఞాపిక, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. వైద్య రంగంలో సేవలందిస్తున్న డాక్టర్ మాణిక్య మాల, నృత్య విభాగంలో రాధిక, సామాజిక సేవలో శశి చందన, రచయిత్రి డాక్టర్ ప్రబల జానకి, ఫైనార్ట్స్ విభాగంలో లక్ష్మీ భార్గవి, విద్యారంగంలో కృషి చేస్తున్న భాస్కరవల్లితో పాటు మీడియా రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న ఢిల్లీ ఆంధ్రప్రభ సీనియర్ కరస్పాండెంట్ స్వరూప పొట్లపల్లిలను ఈ సందర్భంగా సన్మానించారు. చివరలో కుసుమ బృందం ప్రదర్శించిన పెళ్లి చూపుల ప్రహసనం హాస్య నాటిక, మహిళా దినోత్సవ బుర్ర కథ ఆహుతులను ఆద్యంతం అలరించాయి. ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో తేవా అధ్యక్షురాలు సుశీల వరదరాజు, తేవా సభ్యులు, ఢిల్లీలోని తెలుగు వారితో పాటు ఉత్తరాది వారు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పౌర సరఫరాలలో మహిళల కృషి ప్రశంసనీయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మహిళలు పురుషులతో సమానమైన శక్తి సామర్థ్యాలు కలిగి ఉన్నారని, ఏరంగంలోనైనా ఉత్తమ ప్రతిభ కనబరిచే సత్తా వారికి ఉందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సివి ఆనంద్ అన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పౌరసరఫరాలభవన్‌లో జరిగిన వేడుకలో కమిషనర్ ఆనంద్ మాట్లాడుతూ గత కొంతకాలంగా సాంకేతిక పరిజ్ఞానంతో పౌర సరఫరాలలో చేపట్టిన సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలిచాయంటే ఇందులో మహిళల పాత్ర ప్రముఖంగా ఉందన్నారు. సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళలు మరింత చైతన్యవంతులవ్వాలన్నారు.



మహిళలే మూలస్తంభాలు

హైదరాబాద్,ఆంధప్రభ: సమాజ అభివృద్ధికి మహిళలే మూలస్థంబాల వంటివారని దక్షిణమధ్యరైల్వే మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు అర్చనా యాదవ్ అన్నారు. గురువారం దక్షిణమధ్య రైల్వే కార్యాలయంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆర్చనా యాదవ్ మాట్లాడుతూ అప్పగించిన బాద్యతలు నిర్వర్తించటంలో మహిళకు మించిన వారు లేరన్నారు. ఇంటిని , పనిచేసే కార్యలయాన్ని కూడా చక్కదిద్దటంలో మంచి దక్షత చూపుతారన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన దక్షిణమధ్యరైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ దక్షిణమధ్యరైల్వే పరిధిలో మహిళా ఉద్యోగులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామన్నారు. మహిళా ఉద్యోగుల ఎదుగుదలకు కూడా మంచి అవకాశాలు కల్పించామన్నారు. మహిళల్లో అక్షరాస్యత పెరిగితో దేశం మరింత అభివృద్ధి చెందుతుందని జీఎం వినోద్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ చూపిన పలువురు మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు.



అన్ని రంగాల్లో రాణించాలి

- కార్పొరేషన్ చైర్‌పర్సన్ గుండు సుధారాణి పిలుపు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : మగవారికి దీటుగా మహిళలు అన్నిరంగాల్లో విజయం సాధించాలని చైర్‌పర్సన్, తెలంగాణ రాష్ట్ర మహిళా కో-ఆపరేటివ్ బ్యాంక్ గుండు సుధారాణి పేర్కొన్నారు. తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో బిర్లామందిర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాల్లో చాలాచోట్ల మహిళలే ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రస్తుత రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఉపయోగపడే విధంగా పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. ప్రభుత్వం మహిళలకు సమాన అవకాశాలు కూడా కల్పిస్తుందన్నారు. బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళల పాత్ర కీలకం అన్నారు. ఆడవాళ్లను అందరూ గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్య దర్శి సీహెచ్ సంపత్‌కుమారస్వామిలు మాట్లాడుతూ తమ యూనియన్‌లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించామన్నా రు. తెలంగాణ ఎంప్లాయీస్ అధ్యక్షురాలు జి.నిర్మలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలు డాక్టర్ బి.చంద్రావతి, ధృవ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థాపక చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, గాయనీ కౌసల్య, గడ్డం బాలస్వామి, అంజనీకుమారి, చిలగాని రాజేశ్వరి, ఎం.సత్యనారాయణ మహిళలు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళా ప్రగతి

- సెర్ప్ సీఈఓ పౌసమి బసు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: విద్యనేర్చుకోవటం ద్వారానే మహిళారంగం అభివృద్ధి సాధ్యమని సెర్ప్ సీఈవో పౌసమి బసు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలో ఏర్పాటు చేసిన మహిళా దినొత్సవ కార్యాక్రమంలో బసు ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఎందరో మహిళలు సమాజం కోసం పాటుపడ్డారన్నారు. మహిళలు తాము సాధించిన విజయాలను ఇతర మహిళలతో పంచుకుని వారికి మార్గనిర్దేశం చేయాలన్నారు. స్త్రీ,పురుషులు కలిసి ఆలోచనలు అభిప్రాయాలు సమానంగా పంచుకున్నపుడే జీవితం నాలుగు చక్రాల బండిలా సాఫీగా సాగుతుందన్నారు. మహిళలు తాము నివసించే ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. ఆదర్శంగా నిలిచిన స్వయంసహాయక సంఘాల మహిళా గ్రూపులను ఈ సందర్భంగా పౌసమి బసు సన్మానించారు. వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఐఆర్‌డీ జాయింట్ డైరెక్టర్ నరేంద్రనాథ్‌తోపాటు కుసుమ మాధురి, భారతి తదితర అధికారులు పాల్గొన్నారు.

జై కిసాన్

ఏపీ బడ్జెట్‌లో అన్నదాతకు పెద్దపీట



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆర్థిక వ్యవస్థకు మూలం అన్నదాతలేనని గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరానికి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యంగా ప్రోత్సాహకాలను ప్రకటించారు. ముగిసిన రబీలో 42శాతం లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో కరవు పీడిత ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టారు. స్థూలంగా లక్షలాది కుటుంబాలు ఆధారపడి ఉన్న వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించడం, ఈ రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహించడం లాంటి కార్యక్రమాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించారు. 2018-19 వార్షిక బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయం, అనుబంధ రంగాలను కలుపుకుని రెవెన్యూ వ్యయం కింద రూ.18,602.98 కోట్లు, పెట్టుబడి వ్యయం కింద రూ.467.38 కోట్లు, మొత్తం రూ. 19,070.36 ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను సభ ముందుంచారు. గురువారం శాసనసభలో వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శాసన మండలిలో మంత్రి పత్తిపాటి పుల్లారావు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

దేశంలోనే తొలిసారిగా కౌలు రౌతులకు ఆర్థిక వెసులుబాటు కల్పించారు. వారికి పంట రుణాలు మంజూరుకు రూ.2346 కోట్లు ప్రతిపాదించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13 జిల్లాల్లో 7 జిల్లాల్లో కరువు ప్రభావం ఉన్నందున నివారణ చర్యలకోసం రూ. 1042 కోట్లు కేటాయించారు.

- 2022 నాటికి రైతు ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యం
- రూ.19,070 కోట్లతో ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్
- దేశంలోనే తొలిసారిగా కౌలు రైతులకు ఆర్థిక వెసులుబాటు
- వారి రుణాల కోసం రూ.2346 కోట్లు
- కరువు నివారణకు రూ.1042 కోట్లు
- 'రైతు రథం' కొత్త పథకం ద్వారా సబ్సిడీపై ట్రాక్టర్ల పంపిణీ
- వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహకాలు
- పెట్టుబడి వ్యయం తగ్గించేందుకు సాగులో సాంకేతిక విప్లవం
- అధిక ఉత్పాదకతకు వ్యవసాయ యాంత్రీకరణకు ప్రాధాన్యత
- అనుబంధ రంగాల్లో 'ఉపాధి హామీ'కి రూ.4730 కోట్లు
- వ్యవసాయబడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.18,602.98 కోట్లు
- పెట్టుబడి వ్యయం రూ.467.38 కోట్లు
- పెద్దఎత్తున మత్స్య పరిశ్రమ ద్వారా సంపద సృష్టి
- 90శాతం రాయితీతో వేరుశనగ విత్తనాలు
- ఉత్తరాంధ్రలో దిగుబడి పెంచేందుకు అన్ని విత్తనాలపై 50శాతం రాయితీ
- తంగడంచెలో మెగా ఫుడ్‌పార్కు ఏర్పాటు
- ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక ప్రోత్సాహకాలు
- వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అన్ని జిల్లాలకు విస్తరణ
- ఈ పథకం అమలుకు రూ.258.16 కోట్లు
- ఊబర్ సంస్థ ద్వారా యంత్ర పరికరాలు అందుబాటులోకి
- దేశంలో తొలిసారిగా 7లక్షలమంది కౌలు రైతులకు రుణాలు
- జైకా ప్రాజెక్టు కింద వ్యవసాయ యంత్రాల వినియోగంపై శిక్షణా కేంద్రాలు
- అనంతపురంలో బిందు, తుంపర పరికరాల కేంద్రాలు
- ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు
- వ్యవసాయశాఖకు రూ.7,607.49 కోట్లు
- ఉద్యాన శాఖకు రూ.1517.88 కోట్లు
- ఉచిత విద్యుత్ పథకం రాయితీకి రూ.2500 కోట్లు
- వడ్డీలేని రుణ పథకానికి రూ.172 కోట్లు
- పంటల బీమా పథకానికి రూ.485 కోట్లు

తుది విడత రుణ విముక్తి పథకానికి రూ.4100 కోట్లు

- వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రూ.395 కోట్లు
- ఉద్యాన విశ్వవిద్యాలయానికి రూ.96.22 కోట్లు
- పశు వైద్య విశ్వవిద్యాలయానికి రూ.130 కోట్లు
- పట్టు పరిశ్రమ రంగానికి రూ.175.12 కోట్లు
- పశు సంవర్ధక శాఖకు రూ.482.04 కోట్లు
- మత్స్యశాఖ ద్వారా ప్రోత్సాహకాలకు రూ.386 కోట్లు
- లక్ష సౌరశక్తి పంపుసెట్ల పంపిణీకి రూ.1800 కోట్లు
- ఉపాధి హామీ అనుసంధానానికి రూ.3980 కోట్లు.

సంక్షేమమే శ్వాసగా...

ఆంధ్రప్రదేశ్ వార్షిక బడ్జెట్ రూ.1.91 లక్షల కోట్లు

- శాసన సభలో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు
- కేంద్ర సాయంపై అసంతృప్తి





హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ.1,91,063.61 కోట్ల అంచనాలతో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు వార్షిక బడ్జెట్‌ను గురువారం శాసన సభలో ప్రవేశపెట్టారు. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ శాసనమండలిలో ప్రవేశపెట్టారు. రాష్ట్రం అనేక సవాళ్ళు ఎదుర్కొంటున్న తరుణంలో పట్టుదల, దృఢచిత్తంతో ప్రభుత్వం సాధిస్తున్న పురోగతి ఒక ఆశాజనకమైన ధైర్యాన్ని, విశ్వాసాన్ని కలిగిస్తుందన్నారు. ఆకాశంవైపు చూడు. మనం ఒంటరి కాదు. ఈ విశ్వమంతా మనకు స్నేహంగా ఉంది. స్వాప్నికులు, కష్టపడి పనిచేసే వారికి చేయూతనివాలన్న మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పిన సూక్తిని ప్రస్తావిస్తూ యనమల తన బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు. మన ఆలోచనలే మనమేంటో నిర్ణయిస్తాయి. ఆలోచించేపుడు జాగ్రత్త వహించాలి. మనం చెప్పే మాటలకన్నా ఆలోచనలు ఎల్లకాలం ఉంటాయి. అవి సుదూర లక్ష్యాలను చేరుకునేలా ప్రయాణిస్తాయంటూ స్వామి వివేకానంద స్ఫూర్తిదాయకమైన మాటలతో తన బడ్జెట్ ప్రసంగాన్ని ముగించారు. రాష్ట్ర విభజనతో జరిగిన నష్టం, కేంద్ర ప్రభుత్వం నుంచి ఆశించిన మేరకు సహకారం అందకపోవడంపట్ల ఆర్థికమంత్రి విచారం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అరకొరగా ఉన్న నిధులతోనే అభివృద్ధిని, సంక్షేమాన్ని సమతుల్యం చేస్తూ జాతీయ సగటుకన్నా ఎక్కువ స్థాయిలో రెండంకెల వృద్ధిరేటును సాధించామని చెప్పారు. ప్రభుత్వ చిత్తశుద్ధి, పారదర్శకత వల్లే 10.96 శాతం వృద్ధి సాధించామని ఆర్థికమంత్రి చెప్పారు. గత ఏడాదిగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ వచ్చే ఆర్థిక సంవత్సరం ఎలాంటి పథకాలకు ప్రోత్సాహం, ప్రాధాన్యతలు ఇస్తున్నారో బడ్జెట్ కేటాయింపుల ప్రతిపాదనలతో సభకు వివరించారు.

బీసీ విద్యార్థులకు ప్రీ, పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ట్యూషన్ ఫీజు వాపసు, ఎన్‌టిఆర్ విద్యోన్నతి, ఎన్‌టిఆర్ విదేశీ విద్యాదరణ, హాస్టల్, రెసిడెన్షియల్ పాఠశాలలకు 16 లక్షల మందికి లబ్ధి చేకూర్చే విధంగా రూ.2,165 కోట్లు కేటాయస్తున్నట్లు తెలిపారు. కాపు విద్యార్థులకు రూ.400 కోట్లు, ఈబీసీ విద్యార్థులకు ట్యూషన్ ఫీజుకు రూ. 700 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు ఆర్థికమంత్రి తెలిపారు. చేతివృత్తులకు ఆదరణ పథకం కింద 2.55 లక్షల మంది లబ్ధి పొందేందుకు రూ.750 కోట్లు ప్రతిపాదించారు. బీసీ సంక్షేమం కోసం రూ.4,477 కోట్లు కేటాయించగా, వైశ్యులకు రూ.30 కోట్లు, కాపుల సంక్షేమానికి రూ.1000 కోట్లు కేటాయించారు. చేనేత పని వారినుంచి వస్త్రాలను సేకరించి వాటిని 50శాతం సబ్సిడీపై నిరుపేదలకు జనతా వస్త్రాలుగా సరఫరా చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ పథకానికి 10 రెట్లు నిధులు పెంచుతూ రూ.200 కోట్లు కేటాయించడంతో పాటు పట్టునేత పని వారికి నూలు కొనుగోలుపై రాయితీ కోసం మరో రూ.42 కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మత్స్యకారుల జీవనోపాధి పెంచేందుకు సబ్సిడీపై మర పడవలు, వలలు, డీజిల్ ఇచ్చేందుకు రూ.77 కోట్లు కేటాయించడంతో పాటు 50 ఏళ్ళు పైడిన వారికి సామాజిక భద్రత పెన్షన్‌ను అందించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. అలాగే రజకులకు మౌలిక సదుపాయాలు కల్పించి వృత్తిపరమైన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకునేందుకు వందరెట్లు నిధుల పెంపుతో రూ.70 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. దూదేకుల కులం వారికి వృత్తిపరమైన సాంకేతిక పరిజ్ఞానం పెంచుకునేందుకు రూ.40 కోట్లు, నాయీ బ్రాహ్మణులకు రూ.30 కోట్లు, అత్యంత వెనకబడిన తరగతుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించినట్లు యనమల తెలిపారు. అలాగే కల్లుగీత కార్మికులకు రూ.70 కోట్లు, వాల్మీకి / బోయలకు రూ.50 కోట్లు, వడ్డెర్లకు రూ.50 కోట్లు, విశ్వబ్రాహ్మణులకు రూ.50 కోట్లు, శాలివాహనలకు రూ.50 కోట్లు, ఉప్పరలకు రూ.40 కోట్లు, మేదరలకు రూ.30 కోట్లు, కృష్ణబలిజ / పూసలు రూ.25 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ మొత్తం కేటాయింపులు బీసీ ఉప కార్యాచరణ పథకంలో 20 శాతం వృద్ధితో రూ.12,200 కోట్లకు పెరిగిందని ఆర్థికమంత్రి వెల్లడించారు.

ఎస్సీ విద్యార్థులకు సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా మంచి విద్యను అందించేందుకు రూ.1,050 కోట్లు, షెడ్యూల్డ్ కులాల సాధికారత కోసం దుర్బర వర్గాలకు అందించే ఆర్థిక మద్దతు పథకాల్లో సబ్సిడీకి రూ.901 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు రామకృష్ణుడు తెలిపారు. చర్మకారులు నైపుణ్యం పెంచుకునేందుకు రూ.60 కోట్లు, లిడ్‌క్యాప్‌కు రూ.40 కోట్లు, డప్పు కళాకారుల పెన్షన్లకు రూ.12 కోట్లు కేటాయించారు. ఎస్సీ కాంపోనెంట్ కింద 22 శాఖల నుంచి మౌలికసదుపాయాలు కల్పించేందుకు ఈ బడ్జెట్‌లో 14 శాతం నిధులు పెంచుతూ రూ.11,228 కోట్లు కేటాయించారు.

గిరిజనుల విద్యార్థుల సంక్షేమానికి రూ.250 కోట్లు, అలాగే గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ.670 కోట్లు, ఎస్సీ ఆర్థిక సాయం, నైపుణ్యం పెంపునకు రూ.262 కోట్లు ప్రతిపాదించినట్లు మంత్రి తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో బ్రాండ్‌బాండ్ సదుపాయాల కల్పించేందుకు రూ.90 కోట్లు, పౌష్టికాహారానికి రూ.50 కోట్లు కేటాయించారు. 2014-15 నుంచి 2017-18 వరకు గిరిజన ఉప ప్రణాళిక కింద రూ.10,033 కోట్లు కేటాయించామన్నారు. ఈ బడ్జెట్‌లో ఎస్సీ కాంపోనెంట్ కింద రూ.4,176 కోట్లు ప్రతిపాదించినట్లు ఆయన చెప్పారు. మైనారిటీల సంక్షేమం, విద్య, విదేశీ విద్య, దల్హన్ పథకం హిమాన్స్, మోజన్స్‌కు ప్రోత్సాహకాలకు రూ.1,102 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు.

మహిళా, శిశు, వికలాంగులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమానికి రూ.1,016 కోట్లు కేటాయించారు. కౌమార దశలో బాలికలకు పోషకాహారం, నైపుణ్యాలు, విద్య, వ్యక్తిగత పరిశ్రతకు రూ.60 కోట్లు, శానిటరి న్యాప్‌కిన్లకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు ఆర్థికమంత్రి తెలిపారు. దివ్యాంగుల సంక్షేమానికి రూ.35 కోట్లు, వారికి ఆర్థిక పునరావాసానికి రూ.30 కోట్లు కలిపి మొత్తం రూ.121 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ వర్గాల కుటుంబంలో ఉన్న దివ్యాంగులందరికీ ఎలాంటి సంఖ్యాపరిమితి లేకుండా పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు యనమల తెలిపారు. యాచన ద్వారా జీవనం సాగిస్తున్న హిజ్రాలు గౌరవంగా జీవించేందుకు రూ.20 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, శిశువులు, దివ్యాంగులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమానికి మొత్తం రూ.3008 కోట్లు కేటాయిస్తున్నట్లు యనమల తెలిపారు. పేదరిక నిర్మూలనకు అనేక పథకాలకు ఖర్చు చేసేందుకు రూ.1,700 కోట్లు, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలకు రూ. 1,463 కోట్లు, స్త్రీనిధికి రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

బీసీలకు స్వయం సహాయక రుణాలు

- పథకాల రూపకల్పనకు అధికారులకు సీఎం ఆదేశం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే మాదిరిగానే అత్యంత వెనుకబడిన తరగతుల (ఎంబీసీ)కు స్వయం ఉపాధి పథకాల ద్వారా ఆర్థిక సహకారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు గత ఏడాది బడ్జెట్‌లో రూ. 1000 కోట్లు కేటాయించామని, ఈ సారి కూడా బడ్జెట్ నిధులు కేటాయించనున్నట్టు వెల్లడించారు. ఆ నిధులతో ఎంబీసీ కులాల్లోని పేద యువతకు కావల్సిన ఆర్థిక సహకారం అందించాలని సీఎం ఆదేశించారు. బీసీలకు అమలు చేసే ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్‌లకు గతంలో రూ. 1,00,000 గానూ రూ. 60వేలు సబ్సిడీ ఇచ్చేవారని, కానీ ఆ సబ్సిడీ సరిపోదని, మరింత సబ్సిడీ అందించాల్సిన అవసరం ఉందని, అలాగే రూ. లక్ష నుంచి రూ. 12 లక్షల వరకు యూనిట్లు నెలకొల్పేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలన్నారు. రూ. లక్ష వరకు తీసుకునే ఆర్థిక సహకారంలో రూ. 80వేలు, రూ. 2 లక్షలతో యూనిట్ నెలకొల్పేవారికి రూ. 1.40 లక్షలు.. రూ. 2 లక్షల నుంచి రూ. 12 లక్షల విలువైన యూనిట్ల నెలకొల్పే వారికి 60 శాతం (గరిష్టంగా రూ. 5 లక్షలు) సబ్సిడీ ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఎంబీసీల కోసం అమలు చేసే స్వయం ఉపాధి పథకాలకు ఇచ్చే సబ్సిడీకి సంబంధించిన ఫైలుపై సీఎం కేసీఆర్ గురువారం సంతకం చేశారు. సబ్సిడీల విషయంలో స్పష్టత వచ్చినందున ఎంబీసీల కోసం అమలు చేయాల్సిన పథకాలను వెంటనే రూపకల్పన చేసి, సహాయం అందించడం ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

బీజేపీ గద్దె దిగేవరకు పోరాటం:సురవరం

హైదరాబాద్ (నల్లకుంట), ప్రభ న్యూస్ : మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు తీవ్ర పోరాటాలు కొనసాగించాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. విగ్రహాలను కూల్చివేయడం మూర్ఖత్వమన్నారు. వచ్చే ఎన్నికలలో మోడీ సారథ్యంలో ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఓడించి తీరుతామన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష ప్రజాతంత్ర శక్తులచే విశాల ఐక్య వేదికను ఏర్పాటుచేస్తామన్నారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ 1 నుంచి 4వ తేదీ వరకు జరగనున్న క్రమంలో హైదరాబాద్ నగర సమితి ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన సామూహిక విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ కేంద్ర కమిటీ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ నగర సమితి కార్యదర్శి ఇ.టి. నర్సింహ్మా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్ అడ్డాగా భాగ్యనగరం

- శివారు ప్రాంతాల్లో యధేచ్ఛగా తయారీ
- చెలరేగుతున్న మాఫియా




హైదరాబాద్, ఆంధ్రప్రభ : డ్రగ్స్ అడ్డాగా హైదరాబాద్ గణతికెక్కుతోంది. శివారు ప్రాంతాల్లో డ్రగ్స్ తయారీ యధేచ్ఛగా కొనసాగుతోంది. మళ్లీ డ్రగ్స్ మాఫియాలు చెలరేగిపోతున్నాయి. శివారు ప్రాంతాల్లో మూతబడిన కంపెనీలను లీజుకు తీసుకుంటూ తమ దందాను కొనసాగిస్తున్నాయి. ఏదో అడపాదడపా పోలీసులు దాడులు నిర్వహించి తాము న్నామని చెబుతూ కొన్ని కేసులను నమోదు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు తప్పించి శాశ్వత చర్యలకు శ్రీకారం చుట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి డ్రగ్స్‌ని తీసుకొచ్చి మరీ ఇక్కడ యధేచ్ఛగా విక్రయించేస్తున్నారు. వారు యూత్‌ను టార్గెట్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో డ్రగ్స్ మాఫియాలు ఎంతలా విస్తరించాయంటే ఇటీవల కూకట్‌పల్లిలో నేరెళ్ల చంద్రశేఖర్ అనే వ్యాపారిని మధ్యప్రదేశ్‌కు చెందిన 11 మంది వ్యక్తులు వచ్చి అతి కిరాతకంగా హత్య చేసి అతడి ఆనవాళ్లు లేకుండా చేసే ప్రయ త్నం చేశారు. ఈ కేసుకు సంబంధించి నిందితులను ఇంతవరకూ పోలీసులు పట్టు కోకపోవడం గమనార్హం.

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ నేతృత్వంలో ఇటీవల హైదరాబాద్ డ్రగ్స్ కేసు వెలుగు చూసింది. ఈ కేసులో కీలక వ్యక్తులైన కెల్విన్, మైక్ కమింగ్, గాబ్రియేల్, లేడీ డాన్ సంగీతలను ఎక్సైజ్ సిట్ అరెస్టు చేసింది. వారి కాల్‌డేటా ఆధారంగా ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. డ్రగ్స్ కేసులో ప్రమేయముందని భావిస్తున్న 12 మంది సినీ స్టార్స్‌ను గంటల తరబడి ఎక్సైజ్ సిట్ విచారించింది. ఆ విచారణలో ప్రధానంగా డ్రగ్స్ వినియోగానికి పెరిగిన పబ్ కల్చర్ ప్రధాన కారణమని ఎక్సైజ్ సిట్ భావించింది. డ్రగ్స్ వాడకం, సరఫరా, నిల్వ ఉంచడం నేరమేనని ఎక్సైజ్ పోలీసులు తేల్చి చెప్పారు. కేసులో పట్టుబడ్డ కీలక వ్యక్తులు చిట్టచివరికి హైదరాబాద్‌లోని 8,9 తరగతి చదివే పాఠశాల విద్యార్థులను సైతం డ్రగ్స్‌కు బానిసలను చేసేశాయని, దాదాపు 1250 మంది విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలైనట్లు గుర్తించింది. ఈ క్రమంలో మొత్తంగా డ్రగ్స్ మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలించాలని ఎక్సైజ్ సిట్ చర్యలు ఒకానొక దశలో వేగవంతం చేసింది. సెకండ్ లిస్టులో ఈ కేసులో ప్రమేయమున్న కొందరు నేతలు, పారిశ్రామికవేత్తలు, మరికొందరు ప్రముఖ తారలు ఉన్నట్లు గుర్తించింది. వారితో కూడిన సెకండ్ లిస్టును కూడా విడుదల చేసేందుకు ఎక్సైజ్ సిట్ సన్నద్ధమైంది. మరోవైపు పబ్ యాజమాన్యాలతో చర్చించింది. సినీ పరిశ్రమకు చెందిన పెద్దలు ప్రభుత్వానికి ఓ లేఖ రాశారు. ఆ లేఖ సారాంశంలో పరిశ్రమలో ఎవరైనా అలాంటి వారి వుంటే తామే చర్యలు తీసుకోగలమని విన్నవించింది. అదే సందర్భంలో ప్రభుత్వం నుంచి ఓ కీలక ప్రకటన వెలువడింది. డ్రగ్స్ వినియోగదారులంతా బాధితులుగానే పరిగణించాలని పేర్కొంది. దీంతో, ఈ కేసులో ముందుకు ఎలా వెళ్లాలో తెలియని అయోమయ స్థితిలో ఎక్సైజ్ సిట్ పడి పోయింది. ఒకసారి డ్రగ్స్‌కు బానిసలైన వారే అనంతరం డ్రగ్స్ సరఫరాదారులుగా వెలుగొందుతున్నారు. డ్రగ్స్ కేసు పీక్ దశలో ఉన్న సమయంలో ప్రభుత్వ ప్రకటనతో కేసు ఒక ఇంచు కూడా ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొందని అంటు న్నారు. పైపెచ్చు నగరంలోని పబ్‌లన్నింటికీ స్లీపింగ్ పార్టనర్స్‌గా రాజకీయనేతలు, సినీ స్టార్స్ అన్నది బహిరంగ రహస్యమే. దీంతో, నో సే టూ డ్రగ్స్‌పేరిట ఎక్సైజ్ పోలీసులు చేసిన ప్రయత్నం కూడా ఆదిలోనే బెడిసికొట్టింది. కొందరు సెలబ్రిటీలను పిలిచి వారితో అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినా అది ఫలించలేదు. ఇక డ్రగ్స్ కేసులో చార్జిషీట్ ఫైల్ చేస్తామని అనంతర కాలంలో ఎక్సైజ్ సిట్ చెప్పినప్పటికీ సదరు డ్రగ్స్ కేసులో అరెస్టయిన నిందితులు సైతం బెయిల్‌పై బయటకు వచ్చేయడం గమనార్హం. మరోవైపు పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు జరుపుతున్న సోదాలు, దాడుల్లో సైతం ఎప్పటికప్పుడు డ్రగ్స్ పట్టుబడుతుండటం గమనార్హం. కాగా, హైదరాబాద్ డ్రగ్స్ కేసు వెలుగుచూసిన తర్వాత అసలు డ్రగ్స్ మూలాలు ఎక్కడన్న దానిపై ఫోకస్ పెట్టినా ఆ ప్రయత్నం నీరుగారిందనే చెబుతున్నారు. దీంతో, డ్రగ్స్‌కు అడ్డాగా హైదరాబాద్‌ని ఎంచుకుని డ్రగ్స్ మాఫియాలు ఇష్టాను సారంగా రెచ్చిపోతున్నాయి. తమ వద్దకు వచ్చే కస్టమర్లకి డ్రగ్స్ రుచి చూపించిన సదరు మాఫియాలు తిరిగి వారినే సరఫరాదారులుగా మారుస్తూ చాప కింద నీరులా తమ పని తాము చేసుకుని పోతూనే ఉన్నాయి. ఇదే ప్రయత్నంలో కొందరు వ్యాపారంలో నష్టం వచ్చిన క్రమంలో ఇతర రాష్ట్రాల నుంచి డ్రగ్స్‌ను తెప్పిస్తూ కావాల్సిన కస్టమర్లకు అందజేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

'స్ఫూర్తి యాత్ర'ను జరిపి తీరుతాం

- చాడ వెంకటరెడ్డి, కోదండరాం ప్రకటన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మిలియన్ మార్చ్ స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించి తీరుతామని మిలియన్‌మార్చ్ స్ఫూర్తి కమిటి నిర్ణయం తీసుకున్నది. శాంతియు తంగా నిర్వహించేకార్యక్రమానికి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం శోచనీయ మని, అయినా నిర్వహిస్తామని స్ఫూర్తి కమిటి నేతలు చాడా వెంకట్‌రెడ్డి, కోదండ రామ్, ఎం ఆదిరెడ్డి, గోవర్దన్, పి. రంగారావు, నలమాస కృష్ణ గాదె ఇన్నయ్య, సురేం దర్‌రెడ్డితో పాటు చెరుకు సుధాకర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 10న మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు ట్యాంక్ బండ్ వద్ద శాంతియుతంగా మిలియన్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రభు త్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. అయితే శాంతిభద్రతల పేరుతో పోలీసులు అనుమతి వ్వకపోవడం దుర్మార్గమని వారు విమర్శించారు. తెలంగాణ సాధనోద్యమంలో మిలియన్ మార్చ్ ఒక చారిత్రాత్మకమైన రోజన్నారు. పోలీసులు అనుమతిచ్చినా, ఇవ్వకపోయినా సభను జరిపి తీరుతామన్నారు. తెలంగాణవాదులు పెద్ద ఎత్తున రావాలని వారు కోరారు.

12న టీజేఏసీలోకి దిలీప్‌కుమార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మాజీ ఎమ్మెల్సీ, బీజేపీకి చెందిన కపిలవాయి దిలీప్ కుమార్ తన అనుచరులతో కలిసి ఈ నెల 12న కోదంరామ్ సమక్షంలో టీజేఏసీలో చేరనున్నారు. కోదండరామ్ ఏర్పాటు చేయబోయే కొత్త పార్టీలో దిలీప్‌కుమార్ కీలక పాత్రను పోషించనున్నారు. దిలీప్‌కుమార్ టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి సీఎం చంద్రశేఖర్‌రావుతోనే ఉన్నారు. టీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే కేసీఆర్‌తో ఏర్పడిన విభేదాలతో టీఆర్ఎస్‌ను వీడి ఆరెల్డీలో చేరి రెండేళ్లుగా ఆ పార్టీ తెలంగాణ శాఖ అధ్యక్షుడిగా విధులు నిర్వహించారు. ఆ తర్వాత బీజేపీలో చేరిన దిలీప్‌కుమార్ మొదటి రెండేళ్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పని చేశారు. ప్రస్తుతం ఈఎస్ఐ సెంట్రల్ బోర్డు మెంబర్‌గా ఉన్నారు. పార్టీలో నెలకొన్న కొన్ని అంతర్గత విషయాలతో మూడు రోజుల క్రితమే బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తన అనుచరులతోనూ చర్చలు జరిపి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

బస్సు యాత్రతో కొత్త ఉత్సాహం

- ముగిసిన రెండో విడత కాంగ్రెస్ ప్రజా చైతన్య యాత్ర
- పాత ఐదు జిల్లాల్లో భారీ సభలు
- ఉత్తర తెలంగాణలో మంచి స్పందన
- బడ్జెట్ సమావేశాల అనంతరం మూడో విడత



(ఫైల్ ఫోటో)

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రజా చైతన్య బస్సుయాత్ర రెండో విడత యాత్ర ముగిసింది. ఈ నెల 4న పూర్వపు నిజామాబాద్ జిల్లాలో తిరిగి చేపట్టిన యాత్ర అదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 10 బహిరంగ సభలు నిర్వహించారు. గురువారం హుస్నాబాద్, హుజురాబాద్ నియోజక వర్గ కేంద్రాల్లో నిర్వహించారు. అధికార టీఆర్ఎస్ పార్టీకి గట్టి పట్టున్న ఉత్తర తెలంగాణలో కూడా కాంగ్రెస్ సభలకు ప్రజల నుంచి మంచిస్పందనే వచ్చిందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ నేతలు కూడా తెలంగాణ ప్రభుత్వంపై విమర్శల జోరు పెంచడంతో కేడర్‌లో జోష్ వచ్చిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అంతే కాకుండా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేయాల్సిన హామీలను కూడా వివరిస్తూ ముందుకు సాగారు. కాంగ్రెస్ పార్టీ హామీలతో ఆయా జిల్లాల సమస్యలను కూడా ప్రజలకు వివరించారు. ప్రధానంగా కరీంనగర్ జిల్లాలో నేరెళ్ల ఘటన, నిజాబాబాద్‌లో పసుపు, ఎర్ర జొన్న రైతుల సమస్యలను ప్రస్తావించి ప్రజల సానుభూతిని పొందేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారు. వీటితో పాటు సీఎం చంద్రశేఖర్‌రావు ప్రకటించిన థర్డ్ ఫ్రంట్‌పైన కాంగ్రెస్ నేతలు విమర్శల జోరు పెంచారు. అయితే ఈ ప్రజా చైతన్య బస్సు యాత్రకు కొంత మంది సీనియర్లు దూరంగానే ఉన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ రాంచంద్ర కుంతియా మొదటి విడత యాత్రలో చేవెళ్ల, వికారాబాద్ యాత్రలో తప్పా మరే సభలో కనిపించక పోవడం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. మొదటి రోజు జరిగిన అవమానంతోనే బస్సు యాత్ర దూరంగా ఉన్నారనే గుసగుసలు వినిపించాయి. రెండో విడతలో భాగంగా చివరి రోజు సభలకు కుంతియా హాజరయ్యారు. ఇప్పటి వరకు పూర్వపు 10 జిల్లాలకు గాను ఐదు జిల్లాలలో యాత్రను చేపట్టారు. రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ జిల్లాలో మొత్తం 16 బహిరంగ సభలు నిర్వహించారు. ముఖ్యనేతల మధ్య చిన్న చిన్న విభేదాలు ఉన్నప్పటికి.. పార్టీ అధిష్టానం సూచన మేరకే నాయకులందరూ కలిసి వచ్చారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏక కాలంలో రూ. 2 లక్షల రైతు రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధర, ఒక్కో డ్వాక్రా సంఘానికి రూ. 10 లక్షల రుణాలు ఇవ్వడం, వడ్డీని పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని హామీలు కాంగ్రెస్ పార్టీకి కలిసి వస్తాయని అంటున్నారు. ఇదిలా ఉండగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిశాక మూడో విడత యాత్ర ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ యాత్ర ఎక్కడి నుంచి ప్రారంభించాలనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. జూన్ 1న మాత్రం ముగింపుగా పెద్ద బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఈ సభకు ఏఐ సీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ హాజరవుతారని నేతలు తెలిపారు.

నేడు సీఎల్పీ సమావేశం..

ఇదిలా ఉండగా ఈ నెల 12 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అవుతుండటంతో.. సభలో అనుసరించే వ్యూహంపై చర్చించేందుకు శుక్రవారం సీఎల్పీ సమావేశం ఏర్పాటు చేశారు. సీఎల్పీ నేత జానారెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, సీనియర్ నేతలు హాజరు కానున్నారు.

రాష్ట్రంలో తుగ్లక్ పాలన

- పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్





సిద్దిపేట, ప్రభన్యూస్: తెలంగాణ రాష్ట్రంలో తుగ్లక్ పాలన కొనసాగుతుందని టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎప్పుడు ఏం చేస్తాడో, ఎప్పుడు ఏం మాట్లాడుతాడో తెలియని విధంగా సాగుతున్న పాలనతో రాష్ట్రం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలుస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ హామీని నాలుగేళ్ల పాలనలో టీఆర్ఎస్ సర్కార్ నిలబెట్టుకోలేకపోయిందన్నారు. తెలంగాణ ప్రజా చైతన్య బస్సు యాత్రలో భాగంగా గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జీ కుంతియా, మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బట్టి విక్రమార్కలతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... హుస్నాబాద్‌ని నియోజకవర్గంలో ఆరు మండలాలుంటే రెండు మండలాలు సిద్దిపేట జిల్లా, రెండు మండలాలు కరీంనగర్, మరో రెండు మండలాలు వరంగల్ జిల్లాలో ఉండటంతో ప్రలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజల అసౌకర్యం, ఇబ్బందిని ఎంత మాత్రం పరిశీలనలోకి తీసుకోకుండా ఇష్టారీతిన జిల్లాల పునర్విభజన చేసిన తుగ్లక్ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. నాలుగేళ్ల టీఆర్ఎస్ పాలనలో ఎంత నష్టం జరిగిందో రాబోయే కాలంలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఏం చేయబోతున్నామో స్వయంగా చెప్పేందుకే బస్సు యాత్రను చేపట్టామన్నారు. ఎన్నికల సమయంలో మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్‌లు, గిరిజనులకు జనాభా ప్రాదిపదికన రిజర్వేషన్‌లన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో తెలంగాణ శాసన సభ పంపిన రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి పంపిందన్న విషయం ఓ ప్రశ్నకు జవాబు ద్వారా తెలియరావడం నిజంగా సిగ్గుచేటన్నారు. ఎన్నికల సమయంలో 12శాతం రిజర్వేషన్‌లను పేర్కొని పార్లమెంట్‌కు మాత్రం 10శాతం రిజర్వేషన్‌లతో కూడిన ప్రతిపాదనలు పంపడం ద్వారానే కేసీఆర్ నిజస్వరూపం బయటపడిందన్నారు.

రైతు వ్యతిరేక విధానాలతో 4వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఏకకాలంలో రుణమాఫీ చేస్తే కొంత మంది రైతులకైనా భరోసా ఉండేదన్నారు. పండించిన పంటలకు కేంద్ర మద్దతు ధరతో పాటు స్థానిక మార్కెట్ రేటుకు అనుగుణంగా రాష్ట్రాలు బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తాయని రూ.5 లక్షల బడ్జెట్ అంటూ ఊదరగొట్టే కేసీఆర్ సర్కార్ వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు రూ.5 వేలు కూడా కేటాయించలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులు పండించిన పంటలన్నింటినీ కొనుగోలు చేసేందుకు నిపుణులతో కమిటీ వేసి సమగ్ర కొనుగోలు విధానంతో పాటు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. వీటితో పాటు వరి, మొక్కజొన్న, జొన్న, సజ్జలకు రూ.2 వేలు, కందులకు రూ.7 వేలు, మిర్చి, పసుపుకు రూ.10 వేలు, పత్తికి రూ.6 వేలు, సోయకు రూ. 3500, ఎర్రజొన్నలకు రూ.3 వేలు మద్దతు ధర చెల్లించి కొనులు చేస్తామని ప్రకటించారు. మహిళా సాధికారత కోసం టీఆర్ఎస్ సర్కార్ చేసిందేమి లేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆగిన అభయహస్తం పెన్షన్‌లను పునరుద్ధరించడంతో పాటు పింఛన్ మొత్తాన్ని 1000 రూపాయలకు పెంచుతామన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులకు బాసటగా నిలుస్తామని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు నిరుద్యోగులకు భృతి కింద నెలకు రూ.3 వేలు అందిస్తామన్నారు. హుస్నాబాద్ ప్రజల చిరకాల వాంఛ అయిన గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టుల పనులకు అత్యంత ప్రాధాన్యత క్రమంలో నిర్మించి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మృత్యుంజయ, మాజీ మంత్రులు శ్రీధర్‌బాబు, బర్లాంనాయక్, వి.హన్మంతారావు, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సంపత్, జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అలిగిన ప్రవీణ్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజూ ప్రతిష్టంభన

● గురువారం సమావేశాలు వాయిదా ● మహిళా దినోత్సవంపై రాజ్యసభలో ఎంపీల ప్రసంగాలు ● మహిళలపై వివక్ష అంతంచేసి, రక్షణ కల్పించాలన్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ● మహిళా నేరాల అంతానికి ప్రతిన పూనాలి: సుష్మా స్వరాజ్ ● నీరవ్ మోడీ కుంభకోణంపై చర్చకు కాంగ్రెస్ పట్టు ● ఏపీ, తెలంగాణ ఎంపీల ఆందోళన ● కావేరి నదీ బోర్డు ఏర్పాటుకు అన్నాడిఎంకె ఎంపీల ఆందోళన



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : విపక్షాలు, మిత్రపక్షాల ఆందోళనతో నాలుగో రోజు పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. గురువారం లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్పీకర్ సుమిత్రా మహజన్ మాట్లాడారు. మహిళా స్వావలంబనకు అందరూ కృషి చేయాలన్నారు. మహిళా జీవితాల్లో మార్పునకు గ్రామీణ, పట్టణ సామాజిక కార్యకర్తలు నడుం కట్టాల్సిన సమయం ఆసన్నమైందనే థీమ్‌తో ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్పీకర్ ప్రసంగం ముగియగానే విపక్ష, మిత్రపక్ష టిడిపి ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేయడం మొదలుపెట్టారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ నీరవ్ మోడీ కుంభకోణంపై చర్చించాలని వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపాయి. రిజర్వేషన్ల కోటా పెంచాలని టిఆర్ఎస్, ఏపి విభజన చట్టం హామీలు అమలు చేయాలని టిడిపి, ఏపికి ప్రత్యేక హెూదా ఇవ్వాలని వైఎస్సార్సిపి, కావేరి నదీ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడిఎంకె ఎంపీలు స్పీకర్ పోడియంను చుట్టుముట్టారు. 193 నిబంధన కింద బ్యాంకు మోసాలపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, ముందుగా ప్రశ్నోత్తరాలను చేపట్టాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ విజ్ఞప్తి చేశారు. దాంతో స్పీకర్ ప్రశ్నోత్తరాలను చేపడుతుండగా, వెల్‌లోని సభ్యులు గట్టిగా నినాదాలు చేస్తూ జరగకుండా అడ్డుకున్నారు. సభ కార్యకలాపాలు సాగేందుకు సహకరించాలని స్పీకర్ సుమిత్రా మహజన్ పదే పదే విజ్ఞప్తి చేశారు. అయినా సభ్యులు పట్టించుకోకపోవడంతో సభను పదే పదే వాయిదా వేయాల్సివచ్చింది.

ఇటు రాజ్యసభ ప్రారంభం కాగానే అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి పురస్కరించుకుని సభ్యులందరికీ ఛైర్మన్ వెంకయ్య నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. బాలికలు, బాలురకు మధ్య వ్యత్యాసం చూపకుండా పెంచాలన్నారు. మహిళలకు భయంగొల్పే పరిస్థితులను సృష్టించొదన్నారు. పలువురు మహిళాఎంపీలు, పార్టీ ఎంపీలకు మహిళా దినోత్సవంపై మాట్లాడే అవకాశాన్ని కల్పించారు. మహిళలపై నేరాలను అంతంచేసే దిశగా అందరూ ప్రతిజ్ఞపూనాలని విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ అన్నారు. లింగసమానత్వం దిశగా కృషి చేయాలన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు చాలా ముఖ్యమైందని, భారత్‌లో మహిళా ప్రధానమంత్రి, రాష్ట్రపతి, స్పీకర్‌గా పనిచేశారన్నారు. ప్రస్తుతం ఏకంగా యుద్ధ విమానాలు నడిపే స్థాయికి ఎదగడం గర్వంగా ఉందన్నారు. అయినా ఈ పరిస్థితుల్లోనూ మహిళలపై నేరాలు పెరగడం సిగ్గుచేటన్నారు. మహిళలకు భారత్ సురక్షితం అనే విశ్వాసాన్ని కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ అన్నారు. ఈ అంశంపై సభ్యులు మాట్లాడిన వెంటనే, విపక్షాలు ఆందోళన కొనసాగించాయి. కాంగ్రెస్, టిడిపి, టిఆర్ఎస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నీరవ్ మోడీ కుంభకోణంపై చర్చ జరపాలని కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేశారు. మరోవైపు సభను సజావుగా నడిపించేందుకు సహకరించాలని రాజ్యసభ ఛైర్మన్ పదే పదే సభ్యులకు విజ్ఞప్తి చేశారు. సభ్యులు తమ స్థానాలకు వెళ్లాలని, ప్లకార్డులు ప్రదర్శించవద్దని విజ్ఞప్తి చేశారు. అయినా సభ్యులు నిరసన కొనసాగించడంతో సభను వాయిదా వేయాల్సి వచ్చింది. దాంతో ఉభయ సభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి.



హోదా అంటే రాయితీలు కాదు

● ఏపీ బీజేపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి సహాయం చేయలేదని చెప్పడం చాలా బాధాకరమని భారతీయ జనతా పార్టీ ఏపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు అన్నారు. పదేళ్ల కాలపరిమితితో రాష్ట్రానికి ఇవ్వాల్సిన అనేక విద్యా సంస్థలు, పరిశోధనా సంస్థలను మూడున్నరేళ్లలోనే ఇచ్చినప్పటికీ ఇలా నిందించడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ నుంచి కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న అశోక్ గజపతి రాజు, వైఎస్ చౌదరి (సుజనా) తమ మంత్రి పదవులకు రాజీనామా సమర్పించిన నేపథ్యంలో హరిబాబు స్పందిస్తూ తాము ఏ మిత్రపక్షాన్ని దూరం చేసుకోవాలని అనుకోవడం లేదని అన్నారు. రాష్ట్రానికి హెూదా ఇవ్వకపోయినప్పటికీ హెూదాతో సమానమైన ప్రయోజనాలన్నింటినీ కల్పిస్తున్నామని తెలిపారు. కేంద్రం ప్రభుత్వం ఇప్పటికీ ఏపీ ప్రయోజనాలకు కట్టుబడి ఉందని హరిబాబు అన్నారు.

మరోవైపు ప్రత్యేక హెూదా గురించి వివరణ ఇస్తూ, హెూదా అంటే రాయితీలు కాదని స్పష్టం చేశారు. హెూదాతో కేవలం ఇతర రాష్ట్రాల కంటే మరో 30 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వ పథకాలకు అందుతాయని అన్నారు. ఒకవేళ రాష్ట్రానికి హెూదా ఇస్తే కలిగే ప్రయోజనాన్ని సుమారు రూ. 16,000 కోట్లుగా అంచనా వేశామని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలిస్తే వెంటనే ఆ నిధులు బదిలీ చేస్తానని జైట్లీ చెప్పిన మాటను ఆయన గుర్తుచేశారు. ఇక రాయితీలు, పన్ను మినహాయింపుల గురించి చెబుతూ, హెూదాకు వాటికి సంబంధం లేదన్నారు. అయినా సరే రాయలసీమ, ఉత్తరాంధ్ర 7 జిల్లాల్లో పారిశ్రామిక రాయితీలు అమలవుతున్నాయన్నారు.

ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్షకు బ్రేక్

● ఢిల్లీలో ఏపీ కాంగ్రెస్ నేతల అరెస్టు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రత్యేక హెూదా ఆంధ్రుల హక్కు అంటూ పార్లమెంట్ స్ట్రీట్‌లో ధర్నా చేపట్టిన ఏపీ కాంగ్రెస్ నేతలను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష పేరుతో చేపట్టిన ధర్నాలో మూడో రోజు కేవీపీ, రఘువీరా రెడ్డి, సి.రామచంద్రయ్య, జేడీ శీలం, మాజీ మంత్రి బాలరాజు, గిడుగు రుద్రరాజు, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ, పంతం నానాజీ, కొండ్రు మురళి, బాలరాజు, శైలజానాథ్, గంగాభవాని, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మ, పలువురు నగర, జిల్లా కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ప్రత్యేక హెూదా ఆంధ్రుల హక్కు అంటూ వారు చేసిన నినాదాలతో పార్లమెంట్ స్ట్రీట్ ఆవరణ దద్దరిల్లింది. ఆందోళన ఉధృతమవుతుండడంతో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పోలీసులు కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుని మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం 4 గంటల సమయంలో వారిని విడిచిపెట్టారు. నేడు రఘువీరారెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ నేతల బృందం ఎన్నికల కమిషనర్‌ను కలవనున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయని బీజేపీ, టీడీపీల గుర్తింపు తొలగించాలని కోరనున్నారు.

టీడీపీ రాజీనామాలన్నీ డ్రామాలే!

● పార్లమెంట్ గేట్ వద్ద వైకాపా ఎంపీల ధర్నా

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఏపికి ప్రత్యేక హెూదా ఇవ్వాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ధర్నా నిర్వహించారు. గురువారం పార్లమెంటు ప్రధాన ద్వారం వద్ద ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవి.సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, విజయసాయి రెడ్డి, వరప్రసాద్, అవినాశ్ రెడ్డి ఆందోళనకు దిగారు. ప్రత్యేక హెూదా ఏపీ హక్కు అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. రాజకీయ అవసరాల కోసమే టిడిపి రాజీనామాల డ్రామా ఆడుతోందని ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. ఎత్తుగడలతో ప్రజలను వంచిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రత్యేక హెూదా ఇవ్వమని రెండేళ్ల కిందటే చెప్పారని అన్నారు. అప్పుడు ప్యాకేజీకి ఒప్పుకుని చంద్రబాబు ఏపీ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. హెూదా వచ్చి ఉంటే ఈ పాటికే అనేక పరిశ్రమలు వచ్చేవన్నారు. ఏపికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేశాయన్నారు. తొలి నుంచి తాము ప్రత్యేక హెూదాకు కట్టుబడి ఉన్నామని ఎంపీ వరప్రసాద్ అన్నారు. హెూదా కోసం మార్చి 21న అవిశ్వాస తీర్మానం పెడతామన్నారు. 29 సార్లు సీఎం ఢిల్లీకి వచ్చి సాధించిందేమీ లేదన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రత్యేకహెూదాపై పిల్లిమొగ్గలు వేస్తోందని ఎంపీలు విమర్శించారు.

మోనజైట్ నిక్షేపాల వెలికితీత లేదు

● రాజ్యసభలో మంత్రి జితేంద్రసింగ్ వెల్లడి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : విశాఖ జిల్లాలో లభించే అరుదైన మోనజైట్ నిక్షేపాలను వెలికితీసి అణు రియాక్టర్లలో వినియోగించే ప్రతిపాదనేదీ ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వం వద్ద లేదని పీఎంవో కార్యాలయ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. మోనజైట్ నిక్షేపాలు అణు రియాక్టర్లలో వినియోగించడానికి పనికి వస్తాయో లేదో తెలుసుకునేందుకు ప్రభుత్వం ఏవైనా పరీక్షలు నిర్వహించిందా... అని వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయిరెడ్డి గురువారం రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. డొంకూరు బారువా ప్రాంతంలోని మోనజైట్ నిక్షేపాల వెలికితీతకు అటమిక్ మినరల్స్ కన్సెషన్ రూల్స్-2016 కింద అణు శక్తి విభాగం సారథ్యంలో పని చేసే ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్‌కు ఇంకా మైనింగ్ లైసెన్స్ జారీ కాలేదని జితేంద్ర సింగ్ వివరించారు.

జీఎస్టీతో తగ్గనున్న ప్లాట్ల ధరలు, ఇళ్ల నిర్మాణ వ్యయం

జీఎస్టీ ప్రకారం ప్లాట్లు, ఇళ్లు, ఇళ్ల సముదాయాల నిర్మాణ వ్యయం తగ్గుతుందని గృహ నిర్మాణ శాఖ సహాయ మంత్రి హర్‌దీప్ సింగ్ వెల్లడించారు. ఎంపీ విజయసాయి రెడ్డి ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా జవాబిచ్చారు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక సరుకులు, సేవలకు సంబంధించి ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ నిరాటంకంగా చెల్లించే ప్రక్రియ అందుబాటులోకి వచ్చింది. దీనివల్ల ప్లాట్లు, ఇళ్ళు లేదా గృహ సముదాయాల నిర్మాణ వ్యయం కూడా తగ్గుతుందని, నివాసానికి సిద్ధంగా ఉన్న ప్లాట్ల కొనుగోలుపై ఎలాంటి జీఎస్టీ విధించడం లేదని రెవెన్యూ విభాగం తెలిపినట్లు చెప్పారు. రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) చట్టం (రెరా) 2016 అమల్లోకి వచ్చాక దేశంలోని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు/కేంద్ర పాలిత ప్రాంతాలు దానికి అనుగుణంగా సొంతంగా నిబంధనలను రూపొందించుకుని ప్రకటించాల్సి ఉంది. అయితే భూ యాజమాన్యానికి సంబంధించి కొన్ని రాజ్యాంగపరమైన చిక్కులు ఉన్నందునే రెరాకు అనుగుణంగా నిబంధనలను రూపొందించలేకపోతున్నట్లు కొన్ని రాష్ట్రాలు తెలిపినట్లు మంత్రి చెప్పారు. రెరా చట్టం కింద సొంతంగా నిబంధనలను రూపొందించుకోవలసిందిగా కోరుతూ గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ తరుచుగా అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖలు రాస్తున్నట్లు మంత్రి వివరించారు.

అక్కరకురాని చుట్టంతో పనేంటి?

● బీజేపీ తీరుపై తెలుగుదేశం ఎంపీల అసహనం ● కొనసాగిన ఎంపీల ధర్నా, ఆందోళన ● వైకాపా ఎంపీలపైకి దూసుకెళ్లిన జేసీ దివాకర్‌రెడ్డి ● మీసం మెలేసి, తొడగొట్టి హల్‌చల్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: బీజేపీతో కాపురం దాదాపు విడాకుల వరకు వచ్చిన పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ ఎంపీల ధర్నా గురువారం కూడా కొనసాగింది. పార్లమెంటు ఆవరణలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద ఎంపీలంతా ఆందోళన చేపట్టారు. కేంద్ర మంత్రివర్గం నుంచి తమ మంత్రులిద్దరూ వైదొలుగుతూ రాజీనామాలు సమర్పించిన నేపథ్యంలో ఆ పార్టీ ఎంపీల ఆందోళన ఉద్వేగంతో సాగింది. ఒక దశలో ఆవేశంతో ఊగిపోయిన అనంతపురం ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి వారికి ఎదురుగా పార్లమెంట్ భవనం ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలపైకి దూసుకెళ్లారు. మీసం మెలేసి, తొడ గొడుతూ వారికి సవాల్ విసిరారు. అంతా కలసికట్టుగా రాజీనామాలు చేద్దాం రమ్మంటూ వారికి సవాల్ విసిరారు. జేసీ సవాల్ విసరడంతో వైకాపా ఎంపీలు సైతం ప్రతి సవాల్ విసిరారు. ''మేం రాజీనామాలకు సిద్ధం మీరు సిద్ధమా అంటూ'' ఎదురు నిలదీశారు. దీంతో జేసీ దివాకర్ రెడ్డి మరింత రెచ్చిపోయి దమ్ముంటే రండి, రాజీనామా చేద్దాం అంటూ వైకాపా ఎంపీల చేతులు పట్టుకుని లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో ఆ ప్రాంతంలో కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. అప్పటికే ఉభయ సభలకు సమయం కావడంతో, ఎంపీలంతా నినాదాలు చేస్తూ లోపలికెళ్లారు. సభను జరగనీయకుండా అడ్డుకున్నారు.

ప్రతిపక్షంలో ఒకలా అధికారంలో మరోలా
ముత్తంశెట్టి శ్రీనివాస్ (అవంతి), అనకాపల్లి ఎంపీ

రాజకీయ ఆందోళనలకు, ప్రజల సెంటిమెంట్లకు డబ్బు రాలవన్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాటలు తనకు చాలా బాధ కలిగించాలని అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాస్ (అవంతి) అన్నారు. గత ప్రభుత్వం అవినీతిమయం అంటూ వివిధ రకాల సెంటిమెంట్లను బీజేపీ రెచ్చగొట్టలేదా, ఆ సెంటిమెంట్లతోనే అధికారంలోకి రాలేదా అని ఆయన ప్రశ్నించారు. చివరకు తెలంగాణ ప్రజల సెంటిమెంటును గౌరవించే కదా రాష్ట్రాన్ని విభజించారు అంటూ ఉదహరించారు. దేశ ప్రజలకు సెంటిమెంట్లే ప్రధానమని, ఒకచోట భాష సెంటిమెంటుగా ఉంటే, ఒక చోట ప్రాంతం సెంటిమెంటుగా ఉందని అవంతి అన్నారు. వాటిని గౌరవించకపోతే పరిణామాలు తీవ్రంగా మారతాయని అన్నారు. నాడు ప్రత్యేక హెూదా ఇస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎందుకన్నారని నిలదీశారు. ప్రతిపక్షంలో ఒక రకంగా, అధికారంలోకి రాగానే మరోలా ఎందుకు ప్రవర్తిస్తున్నారని భారతీయ జనతా పార్టీని నిలదీశారు.



పొగబెట్టి పొండి అంటున్నారు
మురళీ మోహన్, రాజమండ్రి ఎంపీ

అరుణ్ జైట్లీ మీడియా సమావేశం చూశాక పొగబెట్టి పొమ్మన్నట్టుగా అనిపించిందనది రాజమండ్రి ఎంపీ మురళీ మోహన్ అన్నారు. మీతో మాకు పని లేదు అన్నట్టుగా కేంద్ర ప్రభుత్వం తీరు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఆత్మగౌరవం నినాదంతో, పునాదులు వేసుకుని పుట్టిందని, తాము తెలుగువారి ఆత్మగౌరవం కోసం ప్రాణాలైనా ఇస్తాం తప్ప, అధికారం కోసం పాకులాడబోమని అన్నారు. ప్రజల మనోభావాలను గౌరవించి, తమ మంత్రులిద్దరూ పదవులకు రాజీనామాలు చేశారని, తద్వారా తమకు రాష్ట్ర అభివృద్ధే ముఖ్యం తప్ప పదవులు కాదని చాటారని మురళీ మోహన్ వ్యాఖ్యానించారు.

మోడీ మనసు కదిలించడం సాధ్యం కాదు
ఎన్. శివప్రసాద్, చిత్తూరు ఎంపీ

ఒక కళాకారుడిగా తాను చెప్పాలనుకున్న విషయాన్ని కొన్ని కళారూపాలు, నాటకాల ద్వారా చెబుతానని, తద్వారా అది అవతలివాళ్ల మనసులో మరింత బలంగా నాటుకుంటుందని చిత్తూరు ఎంపీ ఎన్. శివప్రసాద్ అన్నారు. అయితే కుందేటి కొమ్మునైనా సాధించవచ్చు కానీ ప్రధాని నరేంద్ర మోడీ మనసు కదిలించడం సాధ్యం కాదని గ్రహించానని వ్యాఖ్యానించారు. మోడీని, బీజేపీని అక్కరకు రాని చుట్టంగా అభివర్ణిస్తూ సామెతలు, శతకాలు చదివి వినిపించారు. రాష్ట్రానికి నిధులివ్వకుండా, హామీలు నెరవేర్చకుండా దెబ్బతీయాలని చూస్తున్నారని ఆరోపించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తెలుగువాడి దెబ్బ రుచిచూడాల్సి వస్తుందని అన్నారు. ఈ క్రమంలో రాజీనామాలు మొదటి దశ మాత్రమే అన్నారు.

బీజేపీకి కాంగ్రెస్ గతే పడుతుంది :
కొనకళ్ల నారాయణ, మచిలీపట్నం ఎంపీ

మిత్రపక్షం మంత్రివర్గం నుంచి బయటకురావడాన్ని బీజేపీ అధినేతలు, ప్రభుత్వాధినేతలు సీరియస్‌గా తీసుకోవాలని టీడీపీ సీనియర్ ఎంపీ కొనకళ్ల నారాయణ అన్నారు. తమకు ఎంత బాధ కలిగితే రాజీనామాలు చేస్తున్నామో అర్థం చేసుకోవాలని టీడీపీ మంత్రుల రాజీనామాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ముందు ముందు బీజేపీతో కలిసి నడిచే ప్రసక్తే లేదని, వాళ్లు మా మేలు కోరనప్పుడు ఎలా కలిసి నడుస్తామని అన్నారు. వారి వైఖరిలో మార్పు రాకపోతే మరింత తీవ్రమైన పోరాటాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రస్తుతం ఏపీలో కాంగ్రెస్ పార్టీకి పట్టిన గతే రేపు బీజేపీకి పడుతుందని తీవ్రస్వరంతో వ్యాఖ్యానించారు. తాము కొత్తగా ఏమీ కోరడం లేదని, ఇచ్చిన హామీలనే అమలు చేయాలని కోరుతున్నామని అన్నారు.

తలాఖ్ చెప్పేశాం పిల్లల కోసం కలిసున్నాం :
జేసీ దివాకర్ రెడ్డి, అనంతపురం ఎంపీ

కేంద్ర ప్రభుత్వంతో తాము ఇప్పటికే తలాఖ్ చెప్పేశామని, ఇక మాట్లాడడానికి ఏమీ లేదని టీడీపీ ఫైర్‌బ్రాండ్ అనంతపూర్ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి అన్నారు. తమకు బీజేపీ అనే ఒక అందమైన అమ్మాయితో పెళ్లయిందని, పెళ్లి తర్వాత బుద్ధి బాగోలేదని తెలిసిందని చెప్పుకొచ్చారు. ఎంత నచ్చజెప్పినా కాపురం సాధ్యపడడం లేదని, అందుకే విడాకులు ఇచ్చాం అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే తమకు రాష్ట్ర ప్రజలు అనే పిల్లలున్నారని, వారి కోసమే అప్పుడప్పుడూ కలవక తప్పడం లేదని తనదైన శైలిలో వ్యంగాస్త్రాలు సంధించారు.

కర్ణాటకలో బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తాం :
నిమ్మల కిష్టప్ప, హిందూపురం ఎంపీ

త్వరలో ఎన్నికలు జరగబోయే కర్ణాటక రాష్ట్రంలో 90 వేలకు పైగా తెలుగు కుటుంబాలున్నాయని, ఇంటింటికీ వెళ్లి బీజేపీ తీరును ఎండగడతామని చెప్పారు. మోదీ మాకు ఎన్ని కష్టాలు తెచ్చి పెట్టారో చూడండని మొర పెట్టుకుంటామని చెప్పారు. విభజన హామీలు అమలు చేయలేదని చెప్పుకుంటామన్నారు. ప్రజలు ఏం చెబుతారో మోదీకి, అమిత్ షాకి తెలియబోతుందని కిష్టప్ప తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ



జిల్లా బిజెపి నూతన కార్యాలయానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

సంగారెడ్డి, ప్రభ న్యూస్ : వచ్చే శాసన సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను ప్రజలు మర్చిపోవడానికి కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ నాటకం ఆడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. గురువారం కంది గ్రామ శివారులో సంగారెడ్డి జిల్లా పార్టీ నూతన కార్యాలయానికి భూమి పూజ చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కేసీఆర్‌ను తీవ్రంగా విమర్శించారు. దేశంలో మొదటిసారిగా రక్షణ మంత్రి తెలుగువాడు కావడం గర్వకారణం కాని తెలంగాణ ప్రభుత్వంలో మహిళా మంత్రులు లేకపోవడం దారుణమన్నారు. దేశ రాజకీయాలకు వెళితే ఇక్కడ మహిళనో, దళితున్నో సిఎంగా ముందుగా ప్రకటించాలన్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని మిర్చి రైతులు ప్రశ్నిస్తే రైతుల చేతులకు బేడీలు వేసింది నిజమా కాదా అని ఆయన ప్రశ్నించారు. రిజర్వేషన్ పట్ల చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలోనే చేసుకో వచ్చు కదా అని అన్నారు. బీజేపీ నిర్వహించే ప్రజా కోర్టులోనే 2019 ఎన్నికలలో తేల్చు కుంటామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కాసాల బుచ్చిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శులు శేఖర్, వేణుమాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెరాసకు జాతీయ దృక్కోణం లేదు: శేషగిరిరావు

తెరాస ప్రాంతీయ పార్టీ అని.... దానికి జాతీయ దృక్కోణం లేదని భాజపా సీనియర్ నాయకుడు, ప్రొఫెసర్ ఎస్‌వి. శేషగిరిరావు అన్నారు. రిజర్వేషన్ల నిర్ణయాధికారం రాష్ట్రాలకే ఉండాలన్న సిఎం కేసీఆర్ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రిజర్వేషన్లపై నిర్ణయాధికారం రాష్ట్రాలకు ఇవ్వడం అన్నది అంత ఆషామాషీ కాదన్నారు. వైషమ్యాలు పెరగడంతో పాటు కొట్లాటలు జరుగుతాయన్నారు.

5 నదుల అనుసంధానానికి మహా ప్రణాళిక

జలవనరుల శాఖకు రూ. 16,978 కోట్లు



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రాన్ని కరవు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం జలవనరుల శాఖకు ఈ బడ్జెట్‌లో పెద్ద ఎత్తున కేటాయింపులు చేసింది. ఊహించినట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం నీరుపారుదల వ్యవస్థకు అగ్రతాంబులం ఇచ్చింది. ఇప్పటికే భారీ ఎత్తున సాగునీటి ప్రాజెక్టులు చేపట్టిన ప్రభుత్వం సాగునీటి వ్యవస్థకు పెద్దపీట వేసింది. నవ్యాంధ్రుల జీవనాడిగా పేర్కొంటున్న పోలవరం ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, నిధుల కేటాయింపులు చేసింది. ఈ ప్రాజెక్టును త్వరిగతిన పూర్తి చేసి, దీని ఫలాలను రాష్ట్ర ప్రజలకు వేగంగా అందించేందుకు ప్రభుత్వం దృఢనిశ్చయంతో ఉంది. అందులో భాగంగా 2018-19 ఆర్థిక సంవత్సరానికి ఇందుకోసం రూ. 9,000.75 కోట్లను ప్రతిపాదిస్తూ, ఆ మేరకు కేటాయింపులు చేయడం గమనార్హం. ఈ కేటాయింపులే ప్రభుత్వ చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తున్నాయంటున్నారు. నిత్యం సాగునీటి రంగంపైనే ప్రధానంగా దృష్టి నిలిపి పనిచేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతి సోమవారం పోలవారంగా చేసుకుని, పోలవరం ప్రాజెక్టును త్వరిగతిన పూర్తి చేసేందుకు రేయింబవళ్లు పనిచేస్తున్న సంగతి తెలిసిందే. ఈ తాపత్రయం మరోసారి ఈ బడ్జెట్ కేటాయింపుల ద్వారా వెల్లడైంది. ముఖ్యమంత్రి ఎప్పుడు చూసినా ఏ వేదికపైకి వెళ్లినా పోలవరం గురించే మాట్లాడతారన్న సంగతి తెలిసిందే. తన జీవిత ఆశ, శ్వాస పోలవరం ప్రాజెక్టును రాష్ట్రప్రజలకు అంకితం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా, ఎంత ఆర్థికలోటులో ఉన్నా సరే రైతు శ్రేయస్సే లక్ష్యంగా సాగునీటి రంగానికి నిధుల కేటాయింపుల్లో అగ్రస్థానం ఇచ్చారంటున్నారు. అదే విధంగా చురుకుగా నడుస్తున్న మహేంద్ర తనయ, వంశధార, తోటపల్లి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పురుషోత్తం పట్నం ఎత్తిపోతల పథకం, గోదావరి డెల్టా (ఏలేరుతో సహా) ఆధునీకరణ చింతలపూడి ఎత్తిపోతల పథకం, కృష్ణా డెల్టా ఆధునీకరణతోపాటు పట్టిసీమను అత్యధిక స్థాయిలో ఉపయోగించుకోవడం, నాగార్జున సాగర్ ఆధునీకరణ, వెలుగొండ ప్రాజెక్టు, సంగం ఆనకట్ట, నెల్లూరు ఆనకట్ట, సోమశిల, దాని అనుబంధ పనులు, హెచ్ఎన్ఎస్ఎస్, దాని అనుబంధ పనులన్నింటినీ త్వరిగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. అదే విధంగా ఏపీఎస్ఐడిసీ ద్వారా అమలు చేస్తున్న ఎత్తిపోతల పథకాలను పూర్తి చేయడానికి కూడా తగిన ప్రాధాన్యత ఇచ్చారు. వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా, పెన్నాలను అనుసంధానం చేస్తూ ఒక మహాసంగమంను రూపొందించటానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో జలవనరుల శాఖకు 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను 2017-18 పోలిస్తే 33శాతం వృద్ధి రేటను సాధించాలనే లక్ష్యంతో రూ.16,978 కోట్లను కేటాయించారు. గతంలో రూ. 12,770 కోట్లను మాత్రమే కేటాయింపులు చేశారు. రాష్ట్రాభివృద్ధికి పటిష్టమైన పునాదులు వేయాలనే దృఢసంకల్పంతో రాష్ట్రప్రభుత్వం జలవనరుల శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, నిధులు కేటాయించింది. దీనికి అనుబంధంగా వున్న వ్యవసాయ రంగానికి రూ.12,352 కోట్లు కేటాయించడం గమనార్హం. గతంలో పోలిస్తే ఇది 35.91 శాతం అదనం. ఇక పోలవరం ప్రాజెక్టుకు ఏకంగా రూ. 9,000.75 కోట్లు కేటాయించడం అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది. ఈ ప్రాజెక్టుకు 2017-18లో రూ. 7009.88 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇక నీరుచెట్టు కింద రూ. 500 కోట్లు కేటాయించారు.

'ఉపాధి' కూలీలకు శుభవార్త

● వేతనాలు రాష్ట్రమే చెల్లించాలని నిర్ణయం ● తక్షణమే రూ.242.89 కోట్ల వేతన బకాయిలు చెల్లించాలని సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ఉపాధి హామీ కూలీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీపి కబురు అందించారు. ఉపాధి హామీ కూలీల వేతనాలను ప్రస్తుతం కేంద్రం తో సంబంధం లేకుండా ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం నుండి ఉపాధి హామీ వేతన దారులకు వేతన రూపంలో రావాల్సిన నిధులు విడుదల కాకపోవడంతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసు కున్న మంత్రి లోకేష్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వేతనదారులకు రాష్ట్ర ప్రభుత్వమే వేతనాలు చెల్లిం చాలని నిర్ణయించింది. ఈమేరకు బకాయి ఉన్న రూ.242.89 కోట్ల వేతనాలను తక్షణమే చెల్లించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పంచాయితీరాజ్ శాఖను ఆదేశించారు. దీనికి సంబంధించి వెంటనే వేతనాల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్ పంచాయితీరాజ్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. మహిళలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేష్‌మహిళాదినోత్సవం సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

రాహుల్‌కు వృద్ధనేతల సవాళ్లు

- పార్టీ అనుబంధ విభాగాల్లో ఎన్నికలకు ససేమిరా
- యువతరానికి అవకాశం ఇవ్వాలంటున్న అధినాయకుడు
- సోనియా చెంతకు చేరిన సీనియర్లు
- ఆసక్తిగా కాంగ్రెస్ అంతర్గత రాజకీయం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ప్రక్షాళలనకు రాహుల్ గాంధీ చేస్తున్న ప్రయత్నాలకు సీనియర్ నేతలు మోకాలడ్డుతున్నారు. పార్టీ అత్యున్నత నిర్ణయాధికార వ్యవస్థ అయిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సహా మొత్తం 12 విభాగాలకు ఎన్నికలు నిర్వహించాలన్న రాహుల్ ఆలోచనను వృద్ధ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సీడబ్ల్యూసీ సభ్యుల ఎంపికలో నామినేషన్ విధానాన్ని కొనసాగించాలని పట్టుబడుతున్నారు. ఈ మేరకు వారంతా తమ అభిప్రాయాన్ని సోనియాగాంధీకి వివరించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ రాజ్యాంగం ప్రకారం, సీడబ్ల్యూసీలోని 20 మంది సభ్యుల్లో 10 మందిని ఎన్నిక ద్వారా ఎంపిక చేయాలి. మిగతా పది మందిని పార్టీ అధ్యక్షుడు నామినేట్ చేస్తారు. నామినేటెడ్ సభ్యులను దాదాపు శాశ్వత ఆహ్వానితులుగా ఎంపిక చేయడం ఆనవాయిగా వస్తోంది. పార్టీలో జవసత్వాలు నింపేందుకు యువతరానికి కీలక బాధ్యతలు అప్పగించాలని రాహుల్ భావిస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ వ్యవస్థల్లో కనీసంగా 25 శాతం కొత్త ముఖాలకు చోటిచ్చేందుకు ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నారు. 1992-97 సంవత్సరాల్లో సీడబ్ల్యూసీ సభ్యుల ఎంపికకు ఎన్నికలు జరిగాయి. పీవీ నరసింహారావు, సీతారాం కేసరి నాయకత్వాలను ఆమో దించే పరిస్థితి లేనందున, బలనిరూపణకు అప్పట్లో ఎన్నికలు నిర్వహించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఇప్పుడు భిన్నమైన పరిస్థితి ఉంది. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని వ్యతిరేకించే వాళ్లెవరూ లేరు. సీడబ్ల్యూసీ సభ్యుల ఎంపికలో ఆయనకు పూర్తిస్వేచ్ఛ ఉందని సీనియర్ నాయకులు పేర్కొంటున్నారు. వచ్చేవారం జరగనున్న కాంగ్రెస్ సమావేశాల్లో సీడబ్ల్యూసీ సభ్యుల ఎంపిక అనివార్యమైనందున, సీనియర్లు తమ వాదనకు మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. రాహుల్ మాత్రం పురాతన పార్టీని తనదైన మార్గంలో పునర్మించాలని సంకల్పించారు. ఎన్నికల ద్వారా సమర్థవంతమైన యువతరానికి కీలక బాధ్యతలు అప్పగించాలని చూస్తున్నారు. విద్యార్థి విభాగం నాయకుడిగా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, పార్టీ ఉపాధ్యక్షుడిగా వివిధ స్థాయిల్లో పనిచేసిన అనుభవాల దృష్ట్యా ఎన్నికల విధానం ఉండాలని రాహుల్ గాంధీ నొక్కిచెబుతున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఒక రకంగా ఇది రాహుల్ నాయకత్వానికి సవాల్ వంటిదే. సీనియర్ల వ్యతిరేకతను యువ అధినేత ఎలా అధిగమిస్తారన్నది ఆసక్తిగా మారింది. త్వరలో దీనిపై స్పష్టత వస్తుందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.



రాజకీయ తప్పిదమే కాశ్మీర్ సమస్య

రాజకీయ నిర్ణయాల్లో జరిగిన తప్పిదమే, దశాబ్దాలు గడిచినా కాశ్మీర్‌ను నేటికీ పట్టిపీడిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. సింగపూర్, మలేసియాలలో మూడురోజుల పర్యటన నిమిత్తం గురువారం సింగపూర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన ఒక సభలో రాహుల్ ప్రసంగిస్తూ కాశ్మీర్ సమస్యపై తన భావాలను వారితో పంచుకున్నారు. 2014 లో తాను జమ్మూ-కాశ్మీర్ సందర్శించినప్పుడు దుఃఖం ముంచుకొచ్చిందని, అంతటి దయనీయ పరిస్థితులకు కారణం...తప్పుడు రాజకీయ నిర్ణయాలేనని ఆయన భావోద్వేగంతో పేర్కొన్నారు. భారత్-చైనా సంబంధాలపై రాహుల్ వ్యాఖ్యానిస్తూ, తయారీ రంగంలో చైనాను భారత్ అధిగమించగలదని తాను భావించడంలేదని, ఆ దేశంతో శాంతియుత, సహకార సంబంధాలు కొనసాగించాలని కోరుకుంటున్నానని ఆయన పేర్కొన్నారు. తొలుత, సింగపూర్ లోని ఇండియన్ నేషనల్ ఆర్మీ ఐకానిక్ స్మృతి చిహ్నాన్ని సందర్శించిన రాహుల్‌గాంధీ నేతాజీ సుభాష్‌చంద్ర బోస్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. జపాన్ అధీనంలో సింగపూర్ వున్నప్పుడు ఈ స్మృతి చిహ్నాన్ని నిర్మించారు. రాహుల్ తన మూడు రోజుల పర్యటనలో సింగపూర్, మలేసియాలలోని భారత సంతతికి చెందిన ప్రముఖులను, వాణిజ్య దిగ్గజాలను, ఓవర్సీస్ కాంగ్రెస్ సభ్యులతో సమావేశమవుతారు. సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయం లీ కాన్ యూ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ లో జరిగే సభలో కూడా రాహుల్ గాంధీ ప్రసంగిస్తారు.

కేరళలో గాంధీ విగ్రహంపై దౌష్ట్యం

- జాతినేతల విగ్రహాలపై కొనసాగుతున్న విధ్వంస పరంపర

కన్నూర్: దేశ నలుమూలలా మహనీయుల విగ్రహాల విధ్వంస పరంపర కొనసాగుతూనే ఉంది. దుండగులు జాతినేతల విగ్రహాలపై దౌష్ట్యం చేస్తూ దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్నారు. త్రిపురలో లెనిన్ విగ్రహ విధ్వంసంతో మొదలైన విధ్వంసకాండ తాజాగా కేరళలోని మహాత్మాగాంధీ విగ్రహంపై దుశ్చర్య వరకు పాకింది. కాగా ఈ ఘటనపై కేరళ పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కన్నూర్ జిల్లా తలిపరంబ పట్టణంలో గాంధీ విగ్రహాన్ని దుండగులు పాక్షికంగా ధ్వంసం చేశారని తెలిపారు. గాంధీ విగ్రహానికి ఉన్న కళ్లజోడును ధ్వంసం చేసి మెడలోని పూలదండను నేలపై విసిరేశారని తెలిపారు. గాంధీ విగ్రహం తలిపరంబ తాలుకా కార్యాలయానికి చేరువలో ఉందన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడినవారిని గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నామన్నారు. సీసీటీ వీలో అనుమానిత వ్యక్తి ఒకరిని గుర్తించామన్నారు. ఈ ఘటనపై స్థానికులు కొంత మంది ఒకవ్యక్తి ఆ ప్రాంతం నుంచి పారిపోతూ గాంధీ విగ్రహంపైకి రాయి విసిరి ఆ ప్రాంతనుంచి పారిపోయాడని తెలిపారన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సివి ప్రకాశన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.





చెన్నైలో అంబేద్కర్ విగ్రహంపై రంగు

దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నమోదవుతున్న మహనీయుల విగ్రహ విధ్వంస ఘటనల్లో భాగంగా చెన్నైలో మరో ఘటన చోటుచేసుకుంది. దళిత ఆశాజ్యోతి అంబేద్కర్ విగ్రహంపై దుండగులు దుశ్చర్యకు పాల్పడ్డారు. తిరువత్రియుర్‌లో అంబేద్కర్ విగ్రహానికి ఎర్రరంగు పూశారు. ఈ సమాచారం తెలిసిన స్థానిక ప్రజలు ఆందోళనకు దిగారు. దీంతో డిప్యూటీ పోలీస్ కమిషనర్ శశాంక్ సాయి సంఘటన ప్రాంతాన్ని చేరుకుని ఆందోళనకారులను సముదాయించి దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై డీసీపీ మాట్లాడుతూ స్థానిక ప్రజల ఫిర్యాదును నమోదు చేసుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. నిందితులను పట్టుకునేందుకు రెండు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి నిందితుల గురించి గాలిస్తున్నామని తెలిపారు. ప్రధాని మోదీ విగ్రహ విధ్వంస ఘటనలపై స్పందిస్తూ ఈ దుర్ఘటనలను తీవ్రంగా ఖండించారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కర్నాటక ప్రత్యేక జెండా ఆవిష్కరణ

బెంగళూరు: కన్నడిగుల ఆత్మగౌరవం నినాదంతో రానున్న ఎన్నికల బరిలోకి దిగుతున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మరో అడుగు ముందుకేసి ప్రతిపాధిత కర్ణాటక రాష్ట్ర జెండాను ఆవిష్కరించారు. నాద ధ్వజ (రాష్ట్ర జెండా)ను పసుపు, ఎరుపు, తెలుపు వర్ణాలు కలిపి జెండాను రూపొందించారు. జెండా మధ్యలో రెండు తలల గండభేరుండ పక్షి గుర్తును ఉంచారు. కర్ణాటక రాష్ట్ర ప్రత్యేక జెండాను రూపొందించేందుకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గతేడాది ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఎటువంటి రాజ్యాంగపరమైన, న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు జెండా రూపకల్పనలో తీసుకున్నామని కమిటీ తెలిపింది. కన్నడ సంఘాలు, ఉద్యమకారులు, సాహితీవేత్తలు ఆధ్వర్యంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య జెండాను ఆవిష్కరించారు. కాగా జెండా నమూనాపై ఎవరూ ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా మూకుమ్మడిగా తమ అంగీకారం తెలిపారు.

బీహార్లోనూ ప్రత్యేక హోదా ప్రకంపనలు

పాట్నా: బీహార్ సీఎం నితీశ్ కుమార్ ఏపీ సీఎం చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకుని బీహార్‌కు ప్రత్యేక హోదా సాధించేందుకు పోరాడాలని ఆర్జేడీ పిలుపునిచ్చింది. నాయకుల విగ్రహాల ధ్వంసం ఘటనపై ఇంకా సీఎం నితీశ్ కుమార్ నోరు మెదపటంలేదని ఆర్జేడీ జాతీయ ప్రతినిధి మనోజ్ ఝా విమర్శించారు. మహిళా నేతలు మాయావతి, రేణుక చౌదరిని కేంద్రం అవమానించినా బీహార్ ముఖ్యమంత్రి స్పందించటం లేదన్నారు. బీహార్‌కు ప్రత్యేక హోదా సాధించటంలో సీఎం విఫలమైతే ఆర్జేడీ ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తుందన్నారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపించిన ధైర్యానికి అభినందిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరుచేసి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటుచేసిన పరిస్థితులు బీహార్ నుంచి జార్ఖండ్‌ను వేరుచేసిన పరిస్థితులకు సామ్యం ఉందన్నారు. కానీ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య చాలా తేడా ఉందన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2% డీఏ పెంపు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం తీపికబురు అందించింది. ఏడవ పే కమిషన్ సిఫారసులను అనుసరించి కేంద్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు రెండుశాతం డీఏ పెంచేందుకు అంగీకరించింది. ఈ డీఏ పెంపువల్ల 48.41లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. అదేవిధంగా 61.17లక్షల పెన్షన్‌దారులకు సైతం డీఏ పెంపువల్ల లబ్ధి చేకూరుతుంది. కేంద్ర మంత్రి మండలి బుధవారం తమ ఉద్యోగులకు రెండుశాతం డియర్‌నెస్ అలవెన్స్(డీఏ) పెంపునకు అంగీకరిస్తున్నట్టు ప్రకటించింది. ఈ పెంపు వల్ల దేశవ్యాప్తంగా 11మిలియన్ల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని అంచనా వేశారు.

హదియా పెళ్లి... లవ్ జిహాద్ కాదు

- భర్తతో కలిసి ఉండొచ్చు : సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన హదియా కేసుకు సుప్రీం కోర్టు ఫుల్‌స్టాప్ పెట్టింది. కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు తప్పుబట్టింది. హదియా పెళ్లి అనేది సాధారణ వివాహం అని, లవ్ జిహాద్‌లో భాగం కాదని సుప్రీం కోర్టు వివరించింది. మూడు జడ్జిల బృందం చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, చంద్రచుడ్ తీర్పును వెలువరించారు. 2016లో కేరళలో అఖిల అశోకన్ పేరుతో హిందువుగా పుట్టింది. తరువాత షెఫిన్ జహాన్‌ను పెళ్లి చేసుకున్న తరువాత హదియాను పేరు మార్చుకుంది. దీంతో ఆమె తండ్రి కేరళ హైకోర్టును ఆశ్రయించారు. కేరళ హైకోర్టు వీరి పెళ్లిని రద్దు చేసింది. అనంతరం హదియాను ఆమె తల్లిదండ్రులు గృహ నిర్బంధం చేశారు. దీంతో జహాన్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ.. సుప్రీం కోర్టుకు వెళ్లాడు. గతేడాది ఈ కేసును జాతీయ దర్యాప్తు బృందానికి సుప్రీం కోర్టు కేసు అప్పజెప్పింది. కేరళ హైకోర్టు ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దని సూచించింది. జహాన్‌ను హదియా ఇష్టపడి పెళ్లి చేసుకుందని, ఇందులో ఎలాంటి ఒత్తిడి లేదని సుప్రీం కోర్టు వివరించింది. ఉగ్రవాద సంబంధాలు అనే అంశంపై కూడా జాతీయ దర్యాప్తు బృందంతో కలిసి విచారణ చేపట్టింది.అనే రీతిలో సుప్రీం కోర్టు విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే.. .జడ్జీలు మాట్లాడుతూ... ఎన్ఐఏ బృందం విచారిస్తే ఏంటి..? విచారించకుంటే ఏంటి..? హదియా మాత్రం ప్రేమించి పెళ్లి చేసుకుందనేది వాస్తవం. ఆమె నిరభ్యంతరంగా ఉన్నత చదువులు చదువుకోచ్చు అని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా తెలిపారు.

సీఎంగా రియో ప్రమాణ స్వీకారం



న్యూఢిల్లీ: నాగాలాండ్ ముఖ్యమంత్రిగా నాలుగవసారి, నెఫ్యూ రియో గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న ఈ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో గవర్నర్ పిబి ఆచార్య నాగాలాండ్ శాసనసభ 13 వ ముఖ్యమంత్రిగా రియో చే ప్రమాణం చేయించారు. కొహిమా లోని కొసీజీ మైదానంలో భారీ జన సమూహం మధ్య ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. 2014లో కేంద్ర కేబినెట్లో పదవి ఆశించి నాగాలాండ్ రాష్ట్ర రాజకీయాల నుంచి బయటకు వచ్చేసిన రియో తిరిగి నేడు ముఖ్యమంత్రిగా పునరాగమనం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రియో చిరునవ్వులు చిందిస్తూ, ఎన్‌డిపిపి-బిజెపి కూటమితోనే మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనూహ్య పరిణామాల మధ్య నాగాలాండ్ రాజకీయాల్లో తన ముద్ర వేస్తూ ఈ ఎన్నికలలో 12 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకున్న భారతీయ జనతా పార్టీ అయిదు కేబినెట్ మంత్రి పదవులు, ఒక డిప్యూటీ సిఎం పదవి కోసం బేరసారాలు సాగించే పరిస్థితికి వచ్చింది. కొత్త భాగస్వామ్య పక్షం పిడిఎ(పీపుల్స్ డెమొక్రాటిక్ అలయన్స్)లో బిజెపి కి సింహభాగం దక్కనుంది. భారతీయ జనతా పార్టీ పిడిఎ భాగస్వామి అయిన రియో కి చెందిన ఎన్‌డిపిపి(నేషనల్ డెమొక్రాటిక్ ప్రోగ్రెస్సివ్ పార్టీ) కి ఒక ముఖ్యమంత్రి పదవితో పాటు మూడు కేబినెట్ మంత్రి పదవులు దక్కనున్నాయి. మిగిలిన రెండు మంత్రి పదవులు జెడి(యూ), స్వతంత్ర అభ్యర్థితో చెరొకటి భర్తీ కానున్నాయి. 2003 నుంచి బిజెపి నాగాలాండ్ ప్రభుత్వంలో భాగస్వామిగా వుంటూ వస్తున్నది. అప్పుడు ఏడు స్థానాల్లో గెలిచిన బిజెపి నాగా పీపుల్స్ ఫ్రంట్ తరపున సంకీర్ణ ప్రభుత్వంలో చేరింది. రియో అప్పుడు ఎన్‌పిఎఫ్ సభ్యునిగా సంకీర్ణ కూటమి ప్రభుత్వాన్ని నడిపించారు. నాగాలాండ్ రాజకీయాలలో ఆ తరువాత సంభవించిన పరిణామాలు బిజెపి కి అంతగా అనుకూలించలేదు. 2008 లోజరిగిన ఎన్నికలలో ఆ పార్టీ కేవలం 2 సీట్లు మాత్రమే గెలిచింది. 2013 లో అయితే కేవలం ఒక సీటు మాత్రమే నెగ్గింది. 2018 ఎన్నికల నాటికీ బిజెపి పుంజుకుని 12 స్థానాల్లో నెగ్గి రియో ప్రభుత్వంలో సింహభాగానికి అర్హత సంపాదించింది.

రాజస్థాన్‌లో కాంగ్రెస్ జయకేతనం

- స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో హస్తం హవా
- జిల్లా పరిషత్, పంచాయతీ, మున్సిపోల్స్‌లో మెజార్టీ స్థానాలు కౌవసం

జైపూర్: ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల్లో చావుదెబ్బ తిన్న కాంగ్రెస్‌కు రాజస్థాన్ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కొత్త ఉత్సాహాన్నిచ్చాయి. బీజేపీ పాలిత రాష్ట్రంలో హస్తంపార్టీ ఆధిక్యాన్ని చాటుకుంది. ఆరు జిల్లా పరిషత్ స్థానాలకు గాను నాలుగింట జయకేతనం ఎగురవేసింది. అదేవిధంగా 20 పంచాయతీ సమితి సీట్లలో 12 చోట్ల గెలుపొందింది. అదేవిధంగా ఆరు మున్సిపల్ సీట్లకు గాను నాలుగింటిని సొంతం చేసుకుంది. ఈ యేడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, ఈ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి శుభసూచకమని పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. కొద్ది రోజులకిందట రెండు పార్లమెంటరీ స్థానాలు, ఒక అసెంబ్లీ సీటును కాంగ్రెస్ గెలుచుకున్న విషయం తెలిసిందే. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలిచ్చిన ఈ తీర్పు వారికి చెంపపెట్టు వంటిదని కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందనడానికి ఇది నిదర్శనమని చెప్పారు. గత నాలుగేళ్ల కాలంలో జరిగిన ఎన్నికలను గమనిస్తే, కాంగ్రెస్‌కు ఓటింగ్‌శాతం పెరుగుతున్న విషయం స్పష్టమవుతున్నదని తెలిపారు. బీజేపీకి ఈ ఫలితాలు హెచ్చరికల వంటివని విశ్లేషకులు పేర్కొంటున్నారు. లోక్‌సభ, అసెంబ్లీ ఉప ఎన్నికలు, ఇప్పుడు స్థానిక ఎన్నికల ఫలితాలు కాషాయ పార్టీ పతనావస్థను తెలియజేస్తున్నదని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 33 జిల్లాపరిషత్‌లకు గాను 21 బీజేపీ ఆధీనంలో ఉన్నాయి. 183 మున్సిపాలిటీల్లో 157 చోట్ల బీజేపీ అధికారంలో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఏడు మున్సిపల్ కార్పొరేషన్లను కాషాయ పార్టీ చేతిలోనే ఉన్నాయి. ప్రస్తుత పరిణామాలు కాంగ్రెస్‌కే అనుకూలంగా ఉన్నాయన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.



ముంబై పేలుళ్ల కేసులో నిందితుడు

దావూద్ అనుచరుడు ఫారూఖ్ అరెస్ట్

న్యూఢిల్లీ/ముంబై: అండర్ వరల్డ్ అధినేత దావూద్ ఇబ్రహీం కీలక అనుచరుడు, 1993 ముంబై వరుస పేలుళ్ల కేసులో నిందితుడు మహమ్మద్ ఫారూఖ్ అలియాస్ ఫారూఖ్ టక్లాను అరెస్ట్ చేశామని గురువారం సిబిఐ అధికారులు విలేఖరులకు వెల్లడించారు. టక్లా దుబాయ్ నుంచి కరాచీకి ఎటువంటి అనుమతులు లేకుండానే మనుషులను అక్రమంగా తరలించేవాడని తెలిపారు. అక్కడ వారికి బాంబుల తయారీలో శిక్షణ ఇచ్చి వాటిని ఆధునిక ఆయుధాలుగా ఉపయోగించటంలో తర్ఫీదు ఇచ్చేలా మధ్యవర్తిత్వం వహించేవాడన్నారు. టక్లా(57) దుబాయ్ నుంచి ఢిల్లీకి రాగానే సీబీఐ అరెస్టు చేసిందన్నారు. టక్లా 1990నుంచి గల్ఫ్ ప్రాంతానికి హవాలా ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. కానీ దావూద్ తరహాలో టక్లా పాకిస్థాన్‌ను షెల్టర్ జోన్‌గా ఉపయోగించుకునేవాడు కాదని సెక్యూరిటీ అధికారులు తెలిపారు. అరుణ్‌గావ్లీతో గ్యాంగ్‌వార్ నేపథ్యంలో టక్లా ముంబై వదిలి వెళ్లిపోయాడన్నారు. 1992 సెప్టెంబరులో గావ్లీ గ్యాంగ్‌కు చెందిన శైలేష్ హల్దాంకర్‌ను ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా దావూద్ గ్యాంగ్ హతమార్చిందన్నారు. ప్రతీకారంగా గావ్లీగ్యాంగ్ దావూద్ బావమరిది ఇబ్రహీం పార్కర్‌ను 1992లో అతని ఇంటివద్దే కాల్చి చంపారన్నారు. 1993లో ముంబైలో జరిగిన వరుస పేలుళ్ల ఘటనలో టక్లా కీలకపాత్ర పోషించాడన్నారు. అనంతరం ముంబై వదిలి వెళ్లిపోయాడన్నారు. టక్లా దుబాయ్ నుంచే తన కార్యకలాపాలన్నీ నిర్వహించేవాడన్నారు. 1995లో సీబీఐ ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించి టక్లాకు వ్యతిరేకంగా రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసిందన్నారు. టక్లా దుబాయ్ నుంచి ఢిల్లీ చేరుకోగానే ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ కౌంటర్ వద్ద ఉన్న టక్లాను సిబిఐ అరెస్ట్ చేసిందన్నారు. ముంబై వరుస పేలుళ్ల ఘటనలో 257మంది చనిపోగా అప్పట్లో 82కోట్ల ఆస్తి నష్టం జరిగిందన్నారు. పేలుళ్ల అనంతరం ప్రధాన నిందితుడు దావూద్, ఇతర నిందితులు దుబాయ్‌కు పారిపోయి అక్కడనుంచి పాకిస్థాన్‌కు పారిపోయారన్నారు. ఫారూఖ్ అరెస్టుతో ముంబై పేలుళ్ల కేసులో కీలకసమాచారం లభించనుందన్నారు.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అత్యుత్సాహం

- గర్భిణి మృతి
- అదుపు తప్పి కిందపడిన దంపతులు

చెన్నై : ఓ ట్రాఫిక్ పోలీసు దుశ్చర్యకు నాలుగు నెలల గర్భిణి ప్రాణాలు కోల్పోయింది. మోటార్ సైకిల్‌ను వెంబడించడంతోనే మహిళ ప్రాణాలు కోల్పోయింది.. సదరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌ను అరెస్టు చేశామని పోలీసు ఉన్నతాధికారులు వివరించారు. ఈ ఘటన తిరుచిరపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... రాజ తన భార్య ఉషతో కలిసి తిరువెంకుంబర్ చెక్‌పోస్టు వద్ద నుంచి వెళ్తున్నాడు. అతను హెల్మెట్ పెట్టుకోకపోవడంతో పోలీసులు అతన్ని ఆపడానికి ప్రయత్నించారు. అతను ఆగకపోగా మరింత వేగంగా మోటార్ సైకిల్ పోనిచ్చాడు. దీంతో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కామరాజ్ తన వాహనంతో రాజాను వెంబడించాడు. దీంతో అదుపుతప్పి రాజ, అతని భార్య ఉష పడిపోయారు. తీవ్రగాయాలపాలైన ఉష అక్కడికక్కడే మృతి చెందింది. ఉష కింద పడిన తరువాత మరో వాహనం ఆమెపై నుంచి వెళ్లిందని పలువురు స్థానికులు తెలిపారు. పోలీసు ఉన్నతాధికారి అత్యుత్సాహంతోనే ఉష మృతి చెందిందని స్థానికులు ఆందోళనకు దిగారు. పోలీసులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసు వాహనాలపై రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పలువురు ఆందోళనకారులు గాయాలపాలయ్యారు. పోలీసు ఉన్నతాధికారులు కామరాజ్‌ను అరెస్టు చేశారు. హత్యా కేసు నమోదు చేశామని, తగిన పరిహారం అందించి న్యాయం చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.



హరిద్వార్‌లో శ్రీదేవి అస్థికలను గంగానదిలో నిమజ్జనం చేస్తున్న ఆమె భర్త బోనీ కపూర్, చిత్రంలో బోనీ సోదరుడు అనిల్ కపూర్, డిజైనర్ మనీష్ మల్హోత్రా, రాజకీయ నేత అమర్ సింగ్ ఉన్నారు



యాసిడ్ బాధితుల ర్యాంప్ వాక్

- గుండె ధైర్యంతో ముందుకు: లక్ష్మీఅగర్వాల్

థానే : యాసిడ్ దాడులకు గురైన వారందరూ కలిసి ర్యాంప్ వాక్ కార్యక్రమాన్ని మహారాష్ట్రలోని థానేలో నిర్వహించారు. అందాల తారలకు తామేం తక్కువ కాదన్నట్టుగా... చేతులు, కాళ్లు, మోహాలు కాలిపోయినా... వారు గుండె ధైర్యంతో అందరితో పోటీపడుతూ ముందుకు దూసుకెళ్తున్నారు. ఇప్పటికైనా దాడులకు పాల్పడుతున్న వారు ఇలాంటి నేరాలు చేయవద్దని, అదేవిధంగా అక్రమంగా యాసిడ్ అమ్మకాలు చేపట్టొద్దంటూ తెలియజేసేలా ఈ ర్యాంప్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా యాసిడ్ బాధితురాలు లక్ష్మీ అగర్వాల్ మాట్లాడారు. యాసిడ్ దాడులకు గురైన బాధితులు ఇప్పటికీ ధైర్యంగా ముందుకు వెళ్లడం ఆనందంగా ఉంది. వారి హక్కులు వారు పొందాలి. కొందరు సంకుచిత స్వభావులు, సమాజం కాలిన గాయాలు చూసి వెక్కిరిస్తుంటారు. కానీ అన్నింటికి ఎదురొడ్డి ముందుకు వెళ్లాలి. యాసిడ్ దాడికి గురైన బాధితులు మళ్లీ సున్నా నుంచి జీవితం ప్రారంభించాల్సి ఉంటుంది. శరీరం లోపలి నుంచి కాలిన గాయాలు ఉండటంతో ఏ పనిపై కూడా సరిగ్గా శ్రద్ధ వహించలేకపోతారు. ఈ ఫ్యాషన్ షో ఏర్పాటు చేసిన వారికి ధన్యవాదాలు. మహిళలుగా పుట్టిన వారందరూ ఎంతో గర్వంగా ఉండాలి. వీరంతా ప్రేమ, శాంతి కోసం నిలబడతారు. 2005లో నాపై యాసిడ్ జరిగింది. అప్పుడు నా వయస్సు 15 ఏళ్లు. తరువాత యాసిడ్ బాధితుల పక్షాన నిల్చుని పోరాటం చేయడం ప్రారంభించాను. అక్రమంగా యాసిడ్ అమ్మకాలు చేపట్టే వారు ఇప్పటికైనా మేల్కోవాలి.

మేం ఎవరి కీ అడ్డు కాదు: చైనా

బీజింగ్: చైనా వ్యూహాత్మకంగా పోటీ దారుగా తయారైందంటూ అమెరికా జాతీయ భద్రతా వ్యవహారాల శాఖ అభివర్ణించడాన్ని చైనా విదేశాంగ మంత్రి యాంగ్ యీ తప్పు పట్టారు. అమెరికన్ భద్రతా వ్యవహారాల సలహాదారు రూపొందించిన పత్రాలన్నీ తప్పుల తడకలేనని ఆయన అన్నారు. తమదేశం ఎవరికీ పోటీకాదనీ, అదే సందర్భంలో తమకు అంది వచ్చిన అవకాశాలను జారవిడచబోదని ఆయన స్పష్టం చేశారు. అమెరికా తమ దేశాన్ని బూచిగా చూపించేందుకు ప్రయత్నిస్తోందని ఆయన అన్నారు. వాణిజ్య, ఆర్థిక రంగాల్లో తమ దేశం దూసుకుని పోతున్న మాట నిజమే ననీ, అదేసందర్భంలో ఏ దేశం ప్రయోజనాలనూ దెబ్బతీయాలన్న దురుద్దేశ్యం తమకు లేదని ఆయన స్పష్టం చేశారు. వాణిజ్యంలో పోటీ ఉన్న మాట వాస్తవమే ననీ, అది ఆరోగ్య కరమైన పోటీ అని ఆయన అన్నారు. చైనా పెట్టుబడులపైనా, నిపుణులపైనా ఆంక్షలు విధించడమేథో పరిరక్షణ చట్టాలకు వ్యతిరేకమని ఆయన అన్నారు. ఉత్తర కొరియాను చర్చలకు ఒప్పించేందుకు తమ దేశం తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆయన చెప్పారు. భారత్ చైనాలు దౌత్య, వాణిజ్య, సంబంధాల్లో కలిసిసాగాలనీ, భారత్ ఏనుగు, చైనా డ్రాగన్ కలిసి నృత్యం చేయాలని ఆయన వ్యాఖ్యానించారు. ఒకటిఒకటి పదకొండ కావాలి కానీ, రెండు కారాదని ఆయన చమత్కరించారు.

క్రీడాప్రభ



మొహమ్మద్ షమి .. నెక్ట్స్ ఏంటి?

● వివాహేతర సంబంధాలు

● గృహహింస ఆరోపణ చేసిన భార్య

● కాంట్రాక్టు నిలిపివేసిన బీసీసీఐ

● ఐపీఎల్ ఆడొచ్చాలేదా?

● లోపించిన క్లారిటీ

వేగంగా వేసిన బంతి గమనం గతి తప్పితే స్వింగ్ అంటారు. క్రికెట్‌లో అలా గతి తప్పిన బంతులే ప్రత్యర్థులను ఇబ్బంది పెడతాయి, వికెట్లు కూలుకునేలా చేస్తాయి. కానీ బంతులేసే బౌలర్ గుణం తప్పితే అప్పుడు పడే వికెట్ అతనిదే అవుతుంది. ప్రస్తుతం అలాంటి పరిస్థితుల్లోనే వున్నాడు స్వింగ్ బౌలర్ షమి.

షమి మీద తీవ్రమైన ఆరోపణలు చేసింది అతని భార్య హసీన్ జహాన్. అతనికి పరాయి స్త్రీలతో సంబంధాలున్నాయని, పాకిస్తాన్‌కు చెందిన మహిళతో వివాహం కూడా అయిందని ఆమె సోషల్ మీడియాలో గోడు వెళ్లబోసుకుంది. ఆ తర్వాత మీడియా ద్వారా తన బాధ పంచుకోవడమే గాక పోలీసులను కూడా ఆశ్రయించింది. అదే సమయంలో ఆటగాళ్ల కాంట్రాక్టులను పొడిగించే విషయంపై ఆలోచిస్తున్న బీసీసీఐ షమి కాంట్రాక్టును పొడిగింపు నిలిపివేసింది.

అయితే బీసీసీఐ నిర్ణయం కొన్ని ప్రశ్నలకు తావిస్తోంది.

◆ షమి కాంట్రాక్టును పొడిగించిన తర్వాత అతని భార్య ఆరోపణలు చేసి వుంటే బీసీసీఐ ఏం చేసి వుండేది అనేది అందులో తొలి ప్రశ్న. పొడిగించిన కాంట్రాక్టు ప్రకారం అతనికి డబ్బులు చెల్లించేదా? లేక చెల్లింపులు నిలిపివేసేదా?

◆ కాంట్రాక్టు పొడిగించలేదు సరే. కానీ అతడిని జట్టులోకి తీసుకుంటారా లేదా అనేది అతని మీద క్లారిటీ లేదు. మామూలుగా బీసీసీఐతో కాంట్రాక్టు చేసుకున్న ఆటగాళ్లకు ఆడినా, ఆడకపోయినా వాళ్ల సొమ్ము వాళ్లకు అందుతుంది. ఆ వేళ మ్యాచ్ ఆడినట్లయితే మ్యాచ్ ఫీజు అదనం అవుతుంది. ఇక్కడ షమి కాంట్రాక్టు గురించి మాత్రమే బీసీసీఐ తన నిర్ణయాన్ని వెలిబుచ్చింది కానీ అతను క్రికెట్ కెరీర్‌ను కొనసాగించవచ్చో లేదో అనేది చెప్పలేదు. ఈ విషయం సెలెక్టర్లకు ఇబ్బంది కలిగించే విషయమే.

◆ ఇక షమిని ఢిల్లీడేర్‌డెవిల్స్ రూ.3కోట్లు వెచ్చించి మరీ అంటి పెట్టుకుంది. మరి అంత భరించి అతనిని ఆడించాలా, లేదా అనే సందిగ్ధంలో నేడు గంభీర్ సేన వుంది. ఇవన్నీ ఒక ఎత్తైతే కనీసం విచారణ కూడా చేయకుండానే బీసీసీఐ నిర్ణయం తీసుకోవడం అనేది మరో అంశం. దీని మీద అడ్మినిస్ట్రేటర్స్ కమిటీ ఛైర్మన్ వినోద్ రాయ్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. "ఒకవేళ అతడి కాంట్రాక్టు పొడిగించినట్లయితే మీరే వచ్చి ఆరోపణలున్న వ్యక్తితో ఒప్పందం ఎలా చేసుకుంటారంటూ ప్రశ్నిస్తారు. నైతిక అంశాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకున్నాం" అని రాయ్ వ్యాఖ్యానించారు. సత్వర న్యాయం అందరూ కోరుకునేదే అయినా కేవలం ఆరోపణల మీద అతని కెరీర్‌ను సందిగ్ధంలో పడేయడం అంత ఆమోదయోగ్యంగా లేదు.

బీసీసీఐ చేతులు దులుపుకుందా?

షమి భార్య కేవలం తన భర్త మీద మాత్రమే ఆరోపణలు మాత్రమే చేసి వదిలెయ్యలేదు. అతని వివాహేతర సంబంధాల్లో బీసీసీఐ పాత్ర వుందని ఆమె అంటోంది. హోటల్ గదుల్లోకి వేరే అమ్మాయిలు వచ్చినా అడ్డెప్పకుండా.. ఒకరకంగా తన భర్తని ప్రోత్సహించింది అనేది ఆమె ఆరోపణ. వీటికి సమాధానం చెప్పకుండా.. కేవలం సత్వర చర్యలు తీసుకోవడం ద్వారా హసీన్ శాంతపరిచే చేతులు దులిపేసుకోవాలి అనే ఆలోచన బీసీసీఐ వ్యవహరించిన తీరులో కనిపిస్తోంది. గతంలో కోహ్లితో కలిసి ప్రయాణిస్తూ, తెలిసినా బీసీసీఐ చూసీ చూడనట్లు వ్యవహరించిన విషయం విదితమే.



ప్రమీలకు రెండో స్వర్ణం

● ఆసియన్ కప్ ఆర్చెరీ



ముంబై: ఆసియా కప్ ఆర్చెరీ పోటీల్లో ప్రమీల దాయ్‌మేరీ రెండో స్వర్ణ పతకాన్ని సాధించింది. గురువారం ముగిసిన ఈ టోర్నీలో భారత ఆర్చర్లు మొత్తం మూడు స్వర్ణాలు, రెండు కాంస్యాలు గెలిచింది. చివరి రోజు భారత త్రయం ఆకాశ్, గోరా హో, గౌరవ్ ల్యాంబెలు మంగోలియాకు చెందిన అడియాసురెన్ బాసాంకు, ఒట్గన్‌బోల్డ్ బాబార్ ఖుయొగ్, గ్యాంటుగ్స్ జాంట్సన్‌ల త్రయంపై టై బ్రేకర్లో 27-26 పాయింట్ల తేడాతో విజయం సాధించారు. అంతకుముందు ప్రమీలా దాయ్‌మేరీ రష్యాకు చెందిన నటాలియా ఎర్డీనివాపై 7-3 తేడాతో గెలిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. ఇదే పోటీలో భారతకు చెందిన మధు విద్వాన్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. కాంస్యంకోసం జరిగిన పోటీలో మధు విద్వాన్ మంగోలియాకు చెందిన అల్టాంజెల్ ఎన్‌ఖుటియాపై 6-5 తేడాతో విజయం సాధించింది. బుధవారం జరిగిన మహిళల కాంపౌండ్ వ్యక్తిగత పోటీల్లో ముస్కాన్ కిరార్(భారత్), మలేసియాకు చెందిన నదీరా జకారియా సజాతులపై 139-136 పాయింట్ల తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకం గెలుచుకుంది. టీం ఈవెంట్లో ముస్కాన్, దివ్య దయాల్, మ్యుజాల్ హివార్లేతో కలిసి ఇండోనిషియా ఆర్చర్లు శ్రీ రాంటి, డెల్లీ త్రి స్యాండిండా, నినా బోనిటా పెరీరా యురికేలపై 227-221 పాయింట్ల తేడాతో విజయం సాధించి కాంస్య పతకం గెలుచుకుంది. కాంపౌండ్ పురుషుల టీం ఈవెంట్లో భారత ఆర్చర్లు గుర్విందర్ సింగ్, మాయాంక్ రావత్, అమన్ సైనీ తృటి లో కాంస్యాన్ని చేజార్చుకున్నారు. ఇండోనేషియా ఆ పతకాన్ని గెలుచుకుంది. కాంపౌండ్ మిక్స్‌డ్ టీం ఈవెంట్లో అమన్ సైనీ, దివ్య జంట ఇండోనేసియా చేతిలో ఓటమి చవిచూసింది.

బంగ్లాను... నిలువరించారు



లంక మ్యాచ్‌లో ధారాలంగా పరుగులిచ్చిన భారత బౌలర్లు బంగ్లాదేశ్‌తో మాత్రం పొదుపు పాటించారు. దొరికిన బంతిని బాదేద్దాం అన్నట్టు కనిపించిన బంగ్లా బ్యాట్స్‌మెన్‌ను దొరకబుచ్చుకున్నారు. తక్కువ పరుగులకే ప్రత్యర్థి జట్టును కట్టడి చేసి ఛేజింగ్ సులభం చేశారు. సమిష్టి కృషి తో సిరీస్‌లో తొలి విజయాన్ని అందించారు.

ధావన్ వరుసగా రెండో ఫిఫ్టీ

బంగ్లా 139-9, భారత్ 140-4

సిరీస్‌లో తొలి విజయం అందుకున్న రోహిత్ సేన



కొలంబో: నిదహాస్ టోర్నీలో మెన్ ఇన్ బ్లూ బోణీ కొట్టింది. బంగ్లాదేశ్ నిర్దేశించిన 140 పరుగులు స్వల్ప లక్ష్యాన్ని 18.4 ఓవర్లలో ఛేదించింది. శిఖర్ ధావన్(55; 43 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) మరోసారి అర్ధసెంచరీతో కథం తొక్కడంతో భారత్ విజయం నల్లేరు మీద నడకలా సాగింది.మనీశ్ పాండే(27; 19 బంతుల్లో 3 ఫోర్లు), సురేశ్ రైనా(28; 27 బంతుల్లో 1 ఫోర్,1 సిక్స్)లు చక్కటి ఇన్నింగ్స్ ఆడారు. బౌలింగ్‌లో ఉనద్కత్ అత్యధికంగా 3 వికెట్లు తీశాడు. యువ బౌలర్ విజయ్ శంకర్ బంగ్లా కెప్టెన్ మహ్మదుల్లా, వైస్ కెప్టెన్ ముష్ఫికర్ వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టు నడ్డివిరిచాడు. కీలక వికెట్లు తీసిన విజయ్‌నే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు వరించింది. చాహల్, ఠాకూర్‌లకు తో వికెట్ దక్కింది. వాషింగ్టన్ సుందర్ వికెట్లేమీ తీయకపోయినా మరోసారి పరుగులు నిలువరిస్తూ బౌలింగ్ చేశాడు.

రోహిత్ మరోసారి విఫలం

ముందున్నది స్వల్ప లక్ష్యమే. ఒత్తిడి లేకుండా ఆడేందుకు అవకాశం ఎంతైనా వుంది. దానికి తోడు చక్కటి ఆరంభం కూడా లభించింది. పరిస్థితులన్నీ అనుకూలంగా వున్నా సద్వినియోగం చేసుకోవడంలో రోహిత్ శర్మ(17; 13 బంతుల్లో 3 ఫోర్లు) విఫలమయ్యాడు. ముస్తాఫిజుర్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్‌గా వెనుదిరిగి నిరాశపరిచాడు. ఆ తర్వాత వచ్చిన రిషభ్‌పంత్(7; ఒకఫోర్) కూడా రోహిత్ దారినే అనుసరించాడు. అయితే ఈ సారి బౌలర్ రూబెల్. రోహిత్, రిషభ్‌ల వికెట్లు రెండు కోల్పోయేటపప్పటికి 5.1 ఓవర్లలో 40 పరుగులతో పటిష్ట స్థితిలో వుంది. దాంతో ధావన్, రైనాలు స్వేచ్ఛగా ఆడుతూ స్కోరు బోర్డు నడిపించారు. చివర్లో ఇద్దరి వికెట్లు కోల్పోయినా మనీశ్ పాండే, కార్తీక్(2)లు ఏ మాత్రం ఇబ్బంది పడకుండా మ్యాచ్ ముగించారు.

బంగ్లాదేశ్ ఆరంభ శూరత్వం

తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ బ్యాటింగ్ శైలిని ఒక్క మాటలో చెప్పాల్సి వస్తే ఆరంభ శూరత్వం అనాలి. దాదాపు టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ అందరికీ మంచి ఆరంభాలు లభించినా ఎవరూ క్రీజులో ఎక్కువ సేపు నిలబడలేక పోయారు. సౌమ్య సర్కార్(14) ఫోర్, సిక్స్‌తో ఎదురుదాడికి దిగాడే.. ఊపు ఎంతో సేపు కొనసాగించలేకపోయాడు. రెండు ఫోర్లతో టచ్‌లో ఉన్నట్టు కనిపించిన తమీమ్(15)దీ అదే పరిస్థితి. తర్వాత వచ్చిన ముష్ఫికర్(18) కూడా చాహల్ బౌలింగ్‌లో రెండు వరుస ఫోర్లతో ఆరంభించినా మరో సిక్స్‌తో ముగించేశాడు. ఆ వెంటనే కెప్టెన్ మహ్మదుల్లా(1) కూడా పెవిలియన్ చేరాడు. వికెట్లు పడుతున్నా సంమయనంతో ఆడిన లిటన్ దాస్(34).. సబ్బీర్ రహ్మాన్‌తో కలిసి స్కోరు బోర్డు వంద దాటించాడు. పిమ్మట బ్యాటన్ అందుకున్న సబ్బీర్ ఓ ఎండ్‌లో వుండడం వల్ల అతి కష్టమ్మీద బంగ్లా 139 పరుగులు చేయగలిగింది.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్: తమీమ్ ఇక్బాల్ (సి) ఉనద్ కత్ (బి) శార్దూల్ ఠాకూర్ 15, సౌమ్య సర్కార్ (సి) చాహల్ (బి) ఉనద్కత్ 14, లిటన్ దాస్ (సి) రైనా (బి) చాహల్ 34, ముష్ఫికర్ రహీమ్ (సి) ఠాకూర్ (బి) శంకర్ 1, సబ్బీర్ రెహ్మాన్ (సి) కార్తీక్ (బి) ఉనద్కత్ 30, హసన్ మిరాజ్ (సి) పాండే (బి) ఉనద్కత్ 3, తస్కిన్ అహ్మద్ 8(నాటౌట్), రూబెల్ హుసేన్ (రనౌట్) రైనా/ఠాకూర్ 0, ముస్తాఫిజుర్ రహ్మాన్ 1(నాటౌట్), ఎక్స్‌ట్రాలు 15 (లెగ్ బై 2, నోబాల్స్ 2, వైడ్లు 11); మొత్తం (20 ఓవర్లకు) 139/8

వికెట్ల పతనం 1-20(సౌమ్య సర్కార్, 2.4ఓ), 2-35 (తమీమ్ ఇక్బాల్,4.6ఓ), 3-66 (ముష్ఫికర్ రహీమ్, 8.5ఓ), 4-72 (మహ్మదు ల్లా, 10.5ఓ), 5-107(లిటన్ దాస్,15.1), 6-118(హసన్ మిరాజ్, 16.4ఓ), 7-134 (సబ్బీర్ రహ్మాన్, 18.5ఓ), 8-135(రూబెల్ హుసేన్, 19.2ఓ)

బౌలింగ్ గణాంకాలు

ఉనద్కత్ 4-0-38-3, వాషింగ్టన్ సుందర్ 4-0-23-0, శార్దూల్ ఠాకూర్ 4-0-25-1, చాహల్ 4-0-32-2, శంకర్ 4-0-32-2

ఇండియా: రోహిత్ శర్మ (బి) ముస్తాఫిజుర్ 17, శిఖర్ ధావన్ (సి) లిటన్ దాస్ (బి) తాస్కిన్ అహ్మద్ 55, రిషభ్ పంత్ (బి) రూబెల్ హుసేన్ 7, సురేశ్ రైనా (సి) హసన్ మిరాజ్ (బి) రూబెల్ హుసేన్ 28, మనీశ్ పాండే 27 నాటౌట్, దినేశ్ కార్తీక్ 2 నాటౌట్, ఎక్స్‌ట్రాలు 4(బై 1, లెగ్ బై 1, వై 2); మొత్తం (18.4 ఓవర్లలో) 140/4

వికెట్ల పతనం: 1-28(రోహిత్ శర్మ, 3.3 ఓ), 2-40(రిషభ్ పంత్, 5.1ఓ), 3-108(సురేశ్ రైనా, 14.1ఓ), 4-123(శిఖర్ ధావన్, 16.4ఓ)

బౌలింగ్ గణాంకాలు: ముస్తాఫిజుర్ 4-0-31-1, తాస్కిన్ అహ్మద్ 3-0-28-1, రూబెల్ హుసేన్ 3.4-0-24-1, హసన్ మిరాజ్ 4-0-21-0, సౌమ్య సర్కార్ 1-0-8-0, మహ్మదుల్లా 1-0-11-0, నజ్ముల్ ఇస్లామ్ 2-0-15-0

లంకలో మారణహోమంపై సంగక్కర

మానవత్వం చచ్చిపోయిందా?

కొలంబో: శ్రీలంకలో జరుగు తున్న మతకల్లోలాల మీద ప్రముఖ క్రికెటర్ సంగక్కర స్పందించాడు. గతం నుంచి మనం ఏమీ నేర్చుకోలేదా? మనలో మానవత్వం చచ్చిపోయిందా? మన పక్క వాడిని కాపాడాల్సిన బాధ్యత మనకు లేదా? మనుషుల్లో మతాన్ని ఎందుకు చూస్తున్నారు? నా వరకూ నాకు ప్రతి లంకేయుడిలోనూ నన్ను చూసుకుంటున్నాను. అజ్ఞాణంతో మనం అంత గుడ్డివాళ్లమయ్యామా? ఇకనైనా జాతి వివక్షకు, హింసకు వ్యతిరేకంగా నిలబడదాం. అని సంగక్కర సోషల్ మీడియా ద్వారా శాంతికి పిలుపినిచ్చాడు.

300 కోట్లు

క్రీడాభివృద్ధి కోసం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం. ఇది గత సంవత్సరం కంటే 42 శాతం ఎక్కువ.

భారత మహిళలకు తొలి ఓటమి

సియోల్: దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న భారత మహిళల హాకీ జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. ఐదు మ్యాచుల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన మూడో మ్యాచ్‌లో దక్షిణ కొరియా చేతిలో 2-1 తేడాతో భారత్ ఓటమి చెందింది. తొలి రెండు మ్యాచ్‌లు గెలిచిన భారత జట్టు సిరీస్‌ 2-1 తేడాతో ఆధిక్యంలో ఉంది. ఇంకా రెండు మ్యాచుల్లో ఒకటి గెలిస్తే సిరీస్ భారత్ సొంతమవుతుంది. తొలి క్వార్టర్ 12వ నిమిషంలో కొరియా క్రీడాకారిణి సియోల్ కి చెయోన్ ఒక గోల్ చేయగా, 14వ నిమిషంలో యురిమ్ మరో గోల్ చేసి కొరియాకు 2-0 ఆధిక్యాన్ని సాధించిపెట్టారు. ఆట ద్వితీయార్ధం పదహారో నిమిషంతో భారత క్రీడాకారిణి లాల్‌రెమ్‌సియామి గోల్ చేసి కొరియా ఆధిక్యాన్ని 2-1కు తగ్గించింది. అనంతరం కూడా భారత క్రీడాకారిణులు ప్రత్యర్థి జట్టు గోల్‌పోస్ట్‌పై దాడులు చేసినప్పటికి గోల్స్ సాధించలేకపోయారు. సిరీస్‌లో నాలుగో మ్యాచ్ నేడు జరుగనుంది.

కోహ్లీని సెలెక్ట్ చేశా.. నా ఉద్యోగం ఊడింది

● వెంగ్ సర్కార్



ముంబై: ఓ గొప్ప క్రీడాకారుడిని వెలుగులోకి తెచ్చినందుకు ఏ సెలెక్టర్‌కైనా అభినందనలు దక్కుతాయి. కానీ వెంగ్ సర్కార్‌కి పాపం సెలెక్టర్‌గా వున్న ఉద్యోగం కాస్తా పోయింది. ఈ వివరాల్ని స్వయానా కల్నలే మీడియాతో పంచుకున్నాడు. "ఆస్ట్రేలియాలో జరిగిన ఓ ఎమర్జింగ్ ప్లేయర్స్ టోర్నమెంట్‌కు బద్రినాథ్‌ను కాదని అప్పుడే అండర్ 19 ప్రపంచకప్ గెలిపించిన కోహ్లిని సెలెక్ట్ చేశా. నా నిర్ణయంపై ధోనీకి గానీ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్‌కు గానీ నమ్మకం లేదు. ఆ తర్వాత జరిగిన పరిణామాల వల్ల శ్రీనివాసన్‌కు, నాకు చెడింది. దాంతో సెలెక్టర్‌గా నా ఉద్యోగం పోయింది" అని వెంగీ తెలిపాడు. ఇదే విషయాన్ని గతంలో విరాట్ కోహ్లి కూడా బహిరంగంగా చెప్పడం జరిగింది. ఆ రోజుల్లో వెంగ్‌సర్కార్ నిర్ణయం వల్ల ఆ టోర్నీలో ఓపెనర్‌గా బరిలోకి దిగిన కోహ్లి సెంచరీ సాధించడంతో తర్వాతి శ్రీలంక టూర్‌కు టీమిండియాలో స్థానం సంపాదించగలిగాడు.

దేవదర్ ట్రోఫీ ఇండియా 'బి' కైవసం

●: ఫైనల్లో కర్నాటకపై 6 వికెట్ల తేడాతో గెలుపు



ధర్మశాల: దేవధర్ ట్రోఫీ ఇండియా 'బి' జట్టు గెలుచుకుంది. గురువారం జరిగిన ఫైనల్లో కర్నాటకపై ఇండియా బి జట్టు 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ టోర్నీలో ఆడిన రెండు మ్యాచుల్లో గెలిచిన కర్నాటక ఫైనల్లో చేతులెత్తేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కర్నాటక నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 279 పరుగులు చేసింది. రవికుమార్ సమర్థ్ 107 పరుగులు చేసి మెరిశాడు. వికెట్ కీపర్ గౌతం 76 పరుగులు చేసి ఔటయ్యాడు. ఇండియన్ బి బౌలర్లలో ఖలీల్ అహ్మద్ 49 పరుగులకు మూడు వికెట్లు తీయగా, ఉమేష్ 2, జయంత్ ఒక వికెట్‌ను చేజిక్కించుకున్నారు. అనంతరం లక్ష్య ఛేదన ప్రారంభించిన ఇండియా బి జట్టు 48.2 ఓవర్లలోనే 281 పరుగులు సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఇండియన్ బి ఓపెనర్లు గట్టి పునాదిని వేసి జట్టు విజయానికి బాటలు వేశారు. రుతురాజ్ గ్వైక్వాడ్ 58పరుగులు చేసి మోరే బౌలింగ్‌లో గౌతంకు క్యాచిచ్చి ఔటవగా, అభిమన్యు ఈశ్వరన్ 69 పరుగులు చేసి శ్రేయాస్ గోపాల్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయి పెవిలియన్‌కు చేరాడు. అనంతరం బ్యాటింగ్ వచ్చిన కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, విహారీలు పరిస్థితిని కదుటపర్చారు. చివరలో ఉత్కంఠ రేపిన మ్యాచ్ చివరికి ఇండియన్ బి గెలుపుతో ముగిసింది. ఒక దశలో బంతులు, సాధించాల్సిన పరుగులు సమానదశకు వచ్చాయి. అయితే ఇండియా బి బ్యాట్స్‌మన్లు మనోజ్ తివారి, శిఖర్ భారత్‌లు తొట్రుపాటు పడకుండా విజయానికి కావలసిన పరుగులను సాధించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును రవికుమార్ సమర్థ్ అందుకున్నాడు.

వయసు పై బడుతున్నా నేనే నెం.1



అమితమైన శ్రమతో కూడిన టెన్నిస్ ఆటను అవలీలగా ఆడుతూ నవ యువకులనే సవాల్ చేసి టైటిళ్లు కొట్టేస్తున్న ఫెదరర్ ఆటను ఇంకా ఎంజాయ్ చేస్తున్నానంటున్నాడు. ఆడాలని కృత నిశ్చయం, గెలవాలన్న తపన ఉంటే శరీరం, మనసు కూడా సహకరిస్తుందని ప్రపంచ నంబర్ 1 ఫెదరర్ చాటుతున్నాడు. శరీరంలో శక్తి, మానసిక సంతులనం, పరిస్థితులకు తగ్గట్టుగా ఆడటం, కోర్టులో చురుగ్గా పరుగెత్తడం వంటి నైపుణ్యాలను కలిగివున్న ఫెదరెర్ నేటి యువ ఆటగాళ్లకు ఆదర్శమైన ఆటను ఆడుతూ ఫెదరర్ ముందుకు దూసుకుపోతున్నాడు.

● 97 టైటిల్స్ సాధించిన ఫెదరర్

● ఇండియన్ వెల్స్ టైటిల్ హాట్ ఫేవరేట్‌గా బరిలోకి


ఇండియన్‌వెల్స్(యూఎస్): వయసుపైబడుతున్న ఆటలో తనకు సాటిలేరని నిరూపిస్తున్నాడు స్విస్ టెన్నిస్ స్టార్ రోజర్ ఫెదరర్. 36 ఏళ్లు పైబడ్డ ఫెదరర్ గత నెలలో ప్రపంచ నంబర్ 1 ర్యాంకును కైవసంచేసుకుని తాజాగా ఇండియన్ వెల్స్ టోర్నీలో తన తడాఖాను చూపనున్నాడు. ఇప్పటివరకు 20 గ్రాండ్ స్లామ్‌లు, గెలిచిన ఫెదరర్ తాజాగా ఇండియన్ వెల్స్ టైటిల్‌ను ఆరోసారి గెలవడానికి సమాయత్తమయ్యాడు.

ఫెదరర్‌కు ఈ ఏడాది బాగానే కలిసివస్తోంది. జనవరిలో జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను గెలిచి తన ఇరవైయవ గ్రాండ్ స్లామ్ టైటిల్‌తో సహా రోట్టర్ డామ్ ఓపెన్‌ను కూడా ఫెదరర్ గెలుచుకున్నాడు.

13 టైటిళ్లు సాధిస్తే ప్రపంచ రికార్డు

మొత్తంగా చూస్తే ఫెదరర్ తన కెరియర్‌లో ఇప్పటివరకు సాధించిన అన్ని టైటిళ్ల సంఖ్య 97. అమెరికాలోని క్యాలిఫోర్నియా రాష్ట్రంలోని ఎడారి సిటిగా పేరుగాంచిన ఇండియన్‌వెల్స్‌లో జరగుతున్న తాజా టోర్నీలో టైటిల్ హాట్ ఫేవరేట్‌గా ఫెదరర్ బరిలోకి దిగుతున్నాడు. ఈ టోర్నోలో ఫెదరర్ రెండో రౌండ్లో అమెరికన్ రేయాన్ హారిసన్ లేదా అర్జెంటీనాకు చెందిన ఫెడ్రికో డెల్‌బోనిస్‌తో తలపడనున్నాడు. గతంలో ఈ టోర్నీ టైటిల్‌ను 2004, 2005, 2006 సంవత్సరాల్లో కైవసం చేసుకున్నాడు. 2012లో నాలుగోసారి, 2017లో ఐదోసారి ఇండియన్ వెల్స్ టైటిల్స్‌ను గెలుచుకున్నాడు. ఏటీపీ చరిత్రలో అత్యధికంగా 109 టైటిళ్లు గెలిచిన రికార్డు అమెరికాకు చెందిన జిమ్మి కార్నర్ పేర ఉంది. కార్నర్ రికార్డును అధిగమించడం ప్రపంచ నంబర్ వన్ ఫెదరర్‌కు అసాధ్యమేమీకాదు. సాన్‌జోస్‌లో ఒక చారిటీ మ్యాచ్‌లో పాల్గొన్న అనంతరం ఫెదరర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచ నెంబర్ వన్‌గా ఇక్కడ నెగ్గుకొస్తాను అని అన్నాడు.'ఆటకు వయసుతో పనిలేదు అని ఫెదరర్ నిరూపిస్తున్నాడు. ప్రతీ ఏడాది టోర్నీల్లో పాల్గొంటూ తనకు వయస్సు పెరుగుతున్న విషయాన్నే మరిచాడు' అని మూడో సీడెడ్ ఆటగాడు గ్రిగర్ డిమిత్రివ్ అన్నాడు.ఇండియన్ వెల్స్ టోర్నీలో పాల్గొంటున్న పదో సీడ్ సెర్బియన్ ఆటగాడు నొవాక్ జొకోవిక్ కూడా ఈ టోర్నీ టైటిల్స్‌ను 2008,2011,2014, 2015, 2016లో గెలుచుకున్నాడు. డ్రా ప్రకారం, జొకోవిక్, ఫెదరర్‌లు తొలి అర్ధ భాగంలో పోటీపడే అవకాశంలేదు. వీరిద్దరు ఫైనల్లోనే ఢీకొనే అవకాశ ముంది. జొకోవిక్‌కు బై దొరికింది. తొలి రౌండ్‌లో గెలిచిన ఆటగాడితో ఆడనున్నాడు. ఈ టోర్నీలో ఆడుతున్న ఇతర కీలక ఆటగాళ్లలో అర్జెంటీనాకు చెందిన జువాన్ మార్టిన్ డెల్ పొట్రో, జపాన్‌కు చెందిన కెయ్ నిశికొరి, రెండో సీడెడ్ మార్లిన్ క్లిక్, అమెరికన్ ఫేవరేట్ జాన్ ఇస్నార్‌లున్నారు. ఇండియన్ వెల్స్-2013లో ఫైనల్స్‌కు చేరిన డెల్ పొట్రో మెక్సికన్ ఓపెన్‌లో విజయం సాధించాడు.

షరపోవా ఔట్



రెండు సార్లు ఇండియన్ వెల్స్ టైటిల్‌ను గెలుచుకున్న ప్రపంచ నం. 41 ర్యాంకు క్రీడాకారిణి రష్యాకు చెందిన మారియ షరపోవా గురు వారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో జపాన్ క్రీడా కారిణి నవోయమి ఒసాకా (44వ ర్యాంకు) చేతిలో 6-4, 6-4 తేడాతో పరాజయం పాలైంది. గంటన్నర పాటు సాగిన వీరిద్దరి పోరులో తొలి సెట్లో షర పోవా ఆధిక్యంలోకి దూసుకెళ్లినప్పటికి నవోమి పుంజుకుని సెట్‌ను కైవసం చేసుకుంది. రెండో సెట్లో నవోమి4-2 లీడ్ సంపాదించుకుంది.షరపోవా స్కోరును సమం చేసిందికాని చివరలో నవోమిదే పై చేయి అయింది.

యూకీ భాంబ్రీ క్వాలిఫై

ప్రతిష్టాత్మక ఇండియన్ వెల్స్ టోర్నమెంట్‌కు భారత టాప్ సీడ్ యూకీ భాంబ్రి అర్హత సాధించాడు. క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత్‌కే చెందిన రామ్‌నాథన్‌పై 6-4,6-2 తేడాతో గెలిచి యూకీ ఈ ఫీట్ సాధించాడు. 2009లో మియామి మాస్టర్స్ ఆడిన యూకీకి ఆ తర్వాత ఇదే ఏటీపీ 1000 మాస్టర్స్ టోర్నీ కావడం విశేషం. ఈ మధ్య కాలంలో పలు సంచలన విజయాలు సాధించిన రామనాథన్ సహచర ఆటగాడికి పోటీ ఇవ్వలేకపోయాడు. తొలి రౌండ్‌లో ఈ భారత నెంబర్ వన్ ఆట గాడు మరో క్వాలిఫయర్ నికొలస్ మహుత్ తో ఆడనున్నాడు. ఏటీపీ 1000 మాస్టర్స్ టోర్నీ అంటే టైటిల్ నెగ్గిన వారి ఖాతాలో 1000 పాయింట్లు చేరతాయి. గ్రాండ్ స్లామ్స్ తర్వాత స్థానం ఈ మాస్టర్స్ 1000 టోర్నీలకు వుంటుంది. ఆ తర్వాత వరసలో మాస్టర్స్ 500, మాస్టర్స్ 250, మాస్టర్స్ 125 వంటి టోర్నీలు వుంటాయి. గ్రాండ్ స్లామ్‌ల కంటే ఎక్కువ ప్రైజ్ మనీ అందించే టోర్నీల్లో ఇండియన్ వెల్స్ ఒకటి.



Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

ఆంధ్రప్రభ
I లైఫ్
శుక్రవారం
9 మార్చి 2018
lifepage2012@gmail.com

ఇక కాటన్ మార్చ్ మొదలు!

వేసవి మొదలైంది. ఎండలు మండుతున్నకొద్దీ...వాటినుండి రక్షించుకునే మార్గాలను వెతుకుతుంటాం మనం. అందులో కాటన్ దుస్తులు ఒకటి. ఎండాకాలం కాటన్ చీరలు..చలువ పందిళ్లలో నడిచినంత చల్లదనాన్ని ఇస్తాయి. అందుకే వేసవిలో ప్రత్యేకంగా మరింత అందమైన, మరింత ప్రత్యేకమైన డిజైన్లలో కాటన్ చీరలు మార్కెట్లో ప్రత్యక్షమవుతుంటాయి. ఇక్కడ కనబడుతున్నవన్నీ అలాంటివే. ఇంట్లో ఉన్నప్పుడైనా, ఆఫీస్‌లకు, ఫంక్షన్లకు, షాపింగులకు ఎక్కడికి వెళ్లాలన్నా... అన్నింటికీ తగినట్టుగా, ఎన్నో వెరైటీల్లో కాటన్ చీరలు మార్కెట్లో ఉన్నాయిప్పుడు. ఎవరి అభిరుచిని బట్టి వారు ఎంపిక చేసుకోవడమే. అందంగా హుందాగా కనబడుతున్న ఈ చీరలను ఇలా చూస్తుంటే...కాటన్ చీరలు కట్టుకున్న మహిళలు ఎండలను నిరసిస్తూ మార్చ్ (నిరసన ప్రదర్శన) చేస్తున్నట్టే ఉంది కదూ!





ఇదే మా స్వేచ్ఛా 'కాలం'...చెల్లిందా!

- ★రాజస్థాన్ కాలేజీల్లో అమ్మాయిలకు డ్రెస్‌కోడ్ ★చీరలు సల్వార్ కమీజులకు మాత్రమే అనుమతి
- ★పెళ్లయితే...ఎలాగూ నిబంధనలే...ఇప్పుడు కూడానా...
- ★అబ్బాయిలకు కుర్తా పైజమా నిబంధనను ఎందుకు పెట్టరు...
- ★ఇదేనా సమానత్వం...మండిపడుతున్న ఆడపిల్లలు

దేశమంతా మహిళా దినోత్సవ వేడుకల్లో మునిగి తేలుతున్న వేళ...రాజస్థాన్ నుండి ఒక ఆశ్చర్యకరమైన వార్త బయటకు వచ్చింది. రాష్ట్రంలోని అన్ని కాలేజీల్లోనూ అమ్మాయిల వస్త్రధారణపై నిబంధనలు విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందనేది ఆ వార్త. అమ్మాయిలు కేవలం చీరలు, సల్వార్ కమీజ్‌లను మాత్రమే ధరించాలి, సల్వార్ కమీజ్ కూడా పూర్తిగా దుపట్టాతో ఉండాలి. మొత్తానికి స్కిన్‌టైట్ జీన్స్ క్రాప్‌టాప్‌లకు, వాటిని ధరించే స్వేచ్ఛకు కాలం చెల్లిపోయిందనేది దాని సారాంశం. ఈ విషయం తెలియగానే అక్కడి ఆడపిల్లలు తమ నిరసనలను వ్యక్తం చేస్తుంటే...ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా...డ్రెస్‌కోడ్ రంగులను ప్రిన్స్‌పాల్స్ సెలక్ట్ చేసి, ఏ రంగులను నిర్ణయించాలి అనేవిషయంపై ఈ నెల 12 లోగా తుది నివేదిక ఇస్తారని పేర్కొంది. ప్రపంచమంతా ముందుకు వెళుతుంటే...మనం మాత్రం వెనక్కువెళుతున్నామని....రాజస్థాన్‌లోని కాలేజీ విద్యార్థినులు ఈ విషయంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

డ్రెస్ కోడ్ ఎందుకు...అనే ప్రశ్నకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి కిరణ్ మహేశ్వరి ఒక విచిత్రమైన కారణాన్ని వివరించారు. కాలేజీల్లో ఎవరు విద్యార్థులు, ఎవరు బయటివాళ్లు అనేది తెలియటం లేదని, బయటివారు లోపలికి వచ్చి చాలా సమస్యలు సృష్టిస్తున్నారని దీనిని నివారించడానికే ఈ నిబంధనను అమల్లోకి తెస్తున్నామని మంత్రి చెప్పారు. మొత్తంమీద ఈ నిబంధన వలన అమ్మాయిలు జీన్స్, వెస్ట్రన్ మోడల్ దుస్తులన్నింటికీ దూరంగా ఉండాల్సి ఉంటుంది. మహిళలు అధిగమించిన ఆటంకాలను గుర్తు చేసుకుంటూ, సాధించిన విజయాలకు సంబరాలు జరుపుకుంటున్న రోజున...రాజస్థాన్ అమ్మాయిలు....అబ్బా...అని తలలు పట్టుకుని బాధపడటం విచిత్రమే.

ఇదే మా స్వేచ్ఛాకాలం...ఇప్పుడుకూడా నిబంధనలా...

ఆహారం, దుస్తులు, భాష, మతం...వీటి విషయంలో తమకు నచ్చినట్టుగా ఉండటం అనేది... పౌరులకున్న కనీస హక్కు. కానీ స్త్రీల దుస్తుల విషయంలో దేశంలో ఏదో ఒక మూలనుండి నిబంధనలు విధిస్తూనే ఉన్నారు. పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక హిస్టరీ ప్రొఫెసర్ దీనిపై స్పందిస్తూ...ప్రపంచం ఒక అడుగు ముందుకు వెళుతుంటే..భారత్ రెండడుగులు వెనక్కు వెళుతోందని అన్నారు. అంజలీ మీనా...అనే అమ్మాయి 'ఇప్పుడే మేము కాస్త స్వేచ్ఛను అనుభవించగలం. పెళ్లయితే మాకు టీషర్టులు జీన్స్ వేసుకునే అవకాశం ఉండవచ్చు ఉండకపోవచ్చు. ఇప్పుడు కూడా మాకు నచ్చిన దుస్తులు ధరించనీయకపోవటం అన్యాయం' అంటూ ప్రభుత్వ నిర్ణయంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. 'ప్రభుత్వం ఆడా మగా సమానమేనని అంటుంది... మరి అబ్బాయిలు కూడా కుర్తా పైజమాలను మాత్రమే ధరించాలనే నిబంధన విధించాలి...కదా. ఇది వివక్షకాదా' అని ప్రశ్నించింది మేఘా శైని అనే విద్యార్థిని. పిల్లలే కాదు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు, సామాజిక కార్యకర్తలు అందరూ దీనిపై వ్యతిరేకంగా స్పందిస్తూ తమ మనోభావాలను చెబుతున్నారు. అయితే ప్రభుత్వం నుండి అందిన సమాచారం మాత్రం... విద్యార్థులు క్యాంపస్‌లో చదువుతున్నంతకాలం డ్రెస్‌కోడ్ అనేది పాటించాల్సిందేనని, బోధనా సిబ్బంది కూడా దీన్ని పాటించాలా...అక్కర్లేదా అనే నిర్ణయాన్ని ఇంకా తీసుకోలేదని చెబుతోంది. జైపూర్‌లోని ఒక ప్రభుత్వ కాలేజి ప్రిన్స్‌పాల్...విద్యార్థులతో మీటింగుని నిర్వహిస్తామని పిల్లలే డ్రెస్‌కోడ్ రంగుని నిర్ణయిస్తారని చెప్పారు. అయితే ప్రతిపక్షాలు మాత్రం ఇందులో ఉన్నది రాజకీయమేనని ఆరోపిస్తున్నాయి.

అందుకే...ఈ డ్రెస్‌కోడ్

బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని కాషాయమయం చేసే ప్రయత్నంలో ఉందని, అందుకే ఇలాంటి నిబంధనలు పెడుతున్నదని ప్రతిపక్షాలు అంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ...ఈ విధానాన్ని ఎదుర్కొని తీరతామంటోంది. ఇంతకుముందుకూడా ప్రభుత్వం కాషాయ రంగు సైకిళ్లను



పంపిణీ చేసిందని, ప్రభుత్వం డాక్టర్లు ఇంజినీర్లను కాకుండా...బాబాలను తయారుచేయాలని చూస్తోందని ప్రతిపక్ష సభ్యులు అంటున్నారు. ప్రిన్స్‌పాల్స్, కాలేజి నిర్వహణా సిబ్బంది కలిసి కాలేజి విద్యార్థుల సంఘాలతో చర్చలు జరిపాకే దీన్ని అమలు చేస్తామనే మాట ప్రభుత్వం నుండి వినబడుతోంది. పోయిన సంవత్సరం ఉత్తర ప్రదేశ్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిసైతం ఇలాంటి ఆదేశాలే ఇచ్చారు. టీచర్లు జీన్స్ టీషర్టులు ధరించరాదని...వారు గౌరవప్రదంగా దుస్తులు ధరిస్తే...పిల్లలు కూడా అనుసరిస్తారని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఏదిఏమైనా అన్ని అనర్థాలకు దుస్తులు... ముఖ్యంగా ఆడవాళ్ల బట్టలే కారణమని....వారిని అదుపులో పెడితే...అంతా సవ్యంగా ఉంటుందనే రీతిలో ప్రభుత్వాలు భావిస్తుంటే...ఇక మహిళలపై హింసకు అసలైన కారణాలను ఎప్పటికి కనుక్కుంటారు...ఎప్పటికి ఆ దారుణాలను ఆపుతారని మహిళా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

మెడ పట్టేసిందా!



నిద్రలో దిండు సరిగ్గా లేనప్పుడో, గభాలున వెనక్కు తిరిగినప్పుడో, ఒకేలా కూర్చుని పనిచేసినప్పుడో మెడపట్టేస్తుంటుంది. ఇది ఏ పనీ చేయనివ్వకుండా వేధిస్తుంది. దీన్ని సులభంగా చిన్నపాటి చిట్కాలతో వదిలించుకోవచ్చు-

ఐస్ క్యూబ్స్‌తో...

కొన్ని ఐస్ ముక్కలను తీసుకుని వాటిని ఒక ప్లాస్టిక్ బ్యాగులో వేసి దాని మూతిని కట్టేయాలి. తరువాత ఆ బ్యాగుకి ఒక క్లాత్‌ని చుట్టి...మెడమీద నొప్పి ఉన్న చోట అప్లయి చేయాలి. పది పదిహేను నిముషాల పాటు అలాగే ఉంచాలి. గంటకు రెండు గంటలకు ఒకసారి ఇలా చేయవచ్చు. ఐస్ ముక్కలతో పాటు వేడి కాపడం కూడా పెట్టవచ్చు. ఐస్ ముక్కలు నొప్పిని వాపుని తగ్గిస్తే...వేడి కాపడ0తం కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది.

వేడి నూనెతో...

కొబ్బరినూనె లేదా ఆవనూనెని తీసుకుని వేడి చేయాలి. దీనిని మెడకు రాసుకుని 10 నుండి 15 నిముషాల పాటు మృదువుగా మర్దన చేయాలి. ఇలా రోజుకి రెండుసార్లు చేయవచ్చు. దీనివలన కండరాలకు ఉపశమనం కలుగుతుంది...మెడకు రక్త ప్రసరణ పెరుగుతుంది. నొప్పి కూడా తగ్గుతుంది.

అల్లం తేనె టీ....



ఒక అంగుళం అల్లం ముక్కని తీసుకుని ఒక కప్పువేడి నీటిలో వేసి పదినిముషాలు అలాగే ఉంచాలి. తరువాత అల్లంముక్కని తీసేసి ఇందులో కాస్త తేనెని కలపాలి. చల్లారకముందే ఈ టీని తాగాలి. రోజుకి రెండుమూడుసార్లు దీనిని తాగవచ్చు. అల్లం నొప్పిని నివారిస్తుంది. అలాగే వాపుని తగ్గిస్తుంది.

పసుపుతో...

ఒక టీస్పూను పసుపుని ఒక గ్లాసు వేడి పాలలో కలపాలి. కావాలనుకుంటే తేనెని కలుపుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని బాగా కలిపి...తాగాలి. రోజుకి ఒకటి లేదా రెండుసార్లు తాగవచ్చు. పసుపులోనూ వాపుని తగ్గించే లక్షణాలు ఉన్నాయి. దాంతో నొప్పి తగ్గుతుంది.

చింతన

సంసార సాగరాన్ని దాటేందుకు సేతువు వంటిది నాచికేతాగ్ని. దానిని తెలుసుకోవడం, ఆచరించడం కర్తవ్యం. ప్రాణాంతకుడైన యముని సమీపించి అతనిని తన జిజ్ఞాసతో మెప్పించి, జరామరణరహితమైన అమృతత్వ స్థితిని వరంగా పొందిన జీవన్ముక్తుడు నాచికేతుడు. మృత్యువు నుంచి విముక్తిని, ముక్తిని పొందాలనే మానవుని ఆకాంక్షకు ఆశాకిరణం నాచికేతుడు.



యముడు గురువుగా ఆత్మజ్ఞానం నాచికేతుడు

వేదాలలో, పురాణాలలో, ఉపనిషత్తులలో అతనిని నాచికేతుడని తెలిపారు. దగ్గుపల్లి దుగ్గన తన నాసికేతోపాఖ్యానంలో ఇతనిని నాసికేతుడని పిలిచాడు. అంతటి మహనీయుని చరిత్ర బ్రహ్మ మానస పుత్రుడు ఉద్దాలకుడు. అతని భార్య చంద్రవతి. అతడు వివిధ ధర్మాలు పాటిస్తూ ఉన్నాడు.ఆయన కుమారుడు నాచికేతుడు. బాల్యం నుంచి తండ్రికి కావలసినవన్నీ తెస్తూ పితృసేవా పరాయణుడై కాలం గడుపుతున్నాడు. ఉద్దాలకుడు ఒకరోజు నాచికేతుని పిలిచి వనానికి వెళ్లి అగ్ని కార్యానికి కావలసిన సమిత్కుశఫల పుష్పమాలాదులను గొని తెమ్మని పంపించాడు. నాచికేతుడు ఒక వనంలోకి వెళ్లి మానస సరోవరం వంటి సరోవరం ఒకదానిని అక్కడ చూసి సంతోషించి అందులో స్నానం చేసి దేవ రుషి తర్పణలు గావించి దేవతార్చన చేసి బ్రహ్మ జ్ఞాన నిష్ఠుడై ఉన్నాడు. అక్కడ ధ్యాన నిష్ఠలో ఉండగా సంవత్సరం గడిచింది. ఆ స్థితి నుంచి బయటకు రాగానే తండ్రి చెప్పిన విషయం గుర్తుకు రాగా హోమ ద్రవ్యాలను తీసుకుని తండ్రి ఆశ్రమానికి వచ్చాడు. నాచికేతుని చూసి ఉద్దాలకుడు 'నీవు సంవత్సరకాలంగా కనిపించలేదు. నీవు రాని కారణంగా నా అగ్ని కార్యం వంటివి కుంటుపడ్డాయి. అగ్ని కార్యం వల్ల బ్రహ్మాది దేవతలు తృప్తిపడతారు. ఈ విషయం నీకు తెలియదా. ఎందుకిలా చేశావు?' అని కోపంతో కుమారుని ప్రశ్నించాడు. అందుకు నాచికేతుడు, 'అగ్నిహోత్రాది కార్యాలు కర్మ బంధకాలు. యోగమార్గమే శ్రేష్ఠం. దాని నె

ఆచరియాలి. కర్మ పునరావృత్తి లక్షణం కలది. అందుచేత దానిని విడువు'మన్నాడు. దానికి ఉద్దాలకుడు 'కర్మ యోగమే శ్రేష్ఠం. దాని తర్వాతే జ్ఞాన యోగం. కర్మ వల్లనే జ్ఞానం కలుగుతుంది. దాని చేతనే బ్రహ్మ ప్రాప్తి లభిస్తుంది. ఈ శరీరం బావితో సమానం. అందులో పరమాత్మ, నిర్మల జలం మాదిరి శోభిస్తుంటాడు. బావి ఒడ్డున కూర్చుని నీరు లభించాలంటే రాదు. అందుకు ఉప కరణాలు సమకూర్చుకోవాలి. అలాగే కర్మరహితుడై శుద్ధయోగాన్ని చెప్పినంతనే బ్రహ్మ ప్రాప్తి కలుగదు. నరుడు మొదట కర్మాచరణాసక్తుడు కావాలి. కర్మపరుడు భూత దయా దృష్ట సంపన్నుడై పంచ యజ్ఞాలను చేసిన వాడై ఉండాలి. నిష్కాముడైన కర్మపరునకు లోకాన పొందరానిది లేదు. జ్ఞానవంతుడైనా, కర్మ రహితుడైతే నిందితుడవుతాడు. అందు వలన కర్మలను ఆచరించాలి' అన్నాడు. కొంత తడవు తండ్రి కొడుకుల మధ్య వాదోప వాదాలు కొనసాగిన మీదట 'ఎరుక మాలి నాకు ఎదురాడితివి. దురాచారి యోరి! నీవు ఘోరమైన యముని నగరు చూడు' అని నాచికేతునికి శాపమిచ్చాడు. తక్షణమే నాచికేతుడు చాప చుట్టగా భూమిపై పడి మూర్ఛిల్లాడు. దానితో ఉద్దాలకుడు కోపంలో తాను చేసిన కర్మకు దుఃఖితుడయ్యాడు. శాపానికి గురైన నాచికేతుడు కొంత తడవుకు తేరుకుని, 'తండ్రి ఎందుకిలా పలికాడు. తన మరణంతో ఆయనకు బ్రహ్మహత్యా పాతకం వస్తుందని తెలియదా. నేను లేనిదే క్షణం ఉండలేడు నా తండ్రి. అటువంటివాడు నన్నెట్లు వదులుకోగలడు. వదలకుంటే అనృత దోషం సంభవిస్తుంది కదా!' అని విచారించాడు. విచార గ్రస్తమైన తండ్రితో పూర్వులైన శిబి, కర్ణ, దధీచి, జీమూతవాహనాది సత్యవ్రతుల విషయాలు వినిపించి తండ్రికి నచ్చజెప్పి యమలోకానికి వెళ్ళాడు.

నాచికేతుడు యమలోకానికి వెళ్లే సమయానికి యముడు తన లోకంలో లేడు. అతని పరివారం వచ్చి, ఆయువు క్షీణించనిదే యముడె వరిని అనుమతించడని, వెళ్ళిపొమ్మని చెప్పారు. అయితే నాచికేతుడు యముని రాకకై అక్కడే నిరాహారిగా వేచి ఉన్నాడు.

నాచికేతుని పరీక్షింపదలచి కనబడని యముడు తనకై వచ్చిన బాలుడు మూడు రోజుల ఉపవాసంతో తన రాకకై నిరీక్షించడం చూసి అతిథి మర్యాదలు చేశాడు. అనంతరం నాచికేతుడు యముని స్తుతించి తనను తండ్రి శపించిన విధం వివరించాడు. సత్యం చెప్పినందుకు, పితృవాక్య పరిపాలన చేసినందుకు యము డు నాచికేతుని మెచ్చుకుని మూడు వరాలు కోరుకోమన్నాడు.

దానికి నాచికేతుడు తన తండ్రి తన గురించి చింతించకుండా ఉండాలని, ఇక్కడి నుంచి వెళితే తన తండ్రి తాను యమలోకం నుంచి తప్పించుకు వచ్చానని ఆగ్రహింప కుండ గ్రహించేలా మొదటి వరం కోరుకున్నాడు.

అగ్ని చయనం చేసిన వారు జరామరణరహితులై దైవత్వం పొందుతారు కదా అటువంటి అగ్ని చయన విధానం తెలుపమని రెండవ వరంగా కోరాడు. యముడు అగ్ని చయన విధానం బాలునికి వివరించాడు. నచికేతుడు అది విని తాను విన్నదంతా యమునికప్పజెప్పాడు. అతని ఏకసంధా గ్రహణానికి యముడు సంతసించి ఈ అగ్ని చయనం నీ పేరు మీదే వెలయగలదని ఒక రత్నమాలను ఇచ్చి అనేక ఫల హేతుభూతమైన విజ్ఞానాన్ని గ్రహించమని పలికాడు. ఈ నాచికేతాగ్ని మూడు పర్యా యాలు చేసిన వారు లేదా ఆ చయన విజ్ఞానమెరిగి తన్మంత్రాధ్యయను చేసిన వారు రాగద్వేషాది బంధనాలు తెంచుకుని స్వర్గంలో ఆనందం పొందుతారని నాచికేతాగ్ని చయన ఫలితం కూడ తెలిపి మూడో వరం కోరుకోమన్నాడు.



మానవుడు మరణించిన అనంతరం ఆత్మ అనేది దేహేంద్రియాలకు భిన్నంగా ఉంటుందని కొందరు, లేదని కొందరు చెబుతున్నారు. ఈ ఆత్మకు సంబంధించిన జ్ఞానాన్ని ఉపదేశిం చమని కోరుతున్నానని నచికేతుడు కోరాడు. అయితే దానికి సమాధానంగా యముడు 'ఈ ఆత్మజ్ఞానం గురించి దేవతలు కూడా సంశయాత్మకులై ఉంటారు. అందువలన దాని గురించి జిజ్ఞాస విడువుము. పుత్ర పౌత్రాదులు, ధన ధాన్య సంపదలను, వాటిని అనుభవించుటకు తగిన ఆయుష్షును కోరుకోమన్నాడు. దానికి నాచికేతుడు నీవు చెప్పినవన్నీ అనిత్యాలు. వాటి అవసరం నాకు లేదు. నిత్యము, సత్యము, శాశ్వతం అయిన ఆత్మజ్ఞానాన్ని ప్రసాదింపుమని పట్టుపట్టాడు. నాచికేతుని పట్టుదలను చూసి యముడు సంతోషిం చాడు. అతడు ఆత్మజ్ఞానాన్ని పొందేందుకు తగినవాడు, మోక్షార్హుడని భావించి అతనికి ఆత్మ తత్త్వాన్ని ఉపదేశించాడు.

వేదము కర్మకాండ, ఉపాసనా కాండ, జ్ఞానకాండ అని మూడు భాగాలు. కర్మకాండ అనగా మానవుడు విధిగా ఆచరింపదగిన కర్మలను వివరించు భాగం. రెండవది ఉపాసనా కాండ. భగవానుడు, ఆయా దేవతలను ఉపాసించు విధమును తెలిపేది. చివరిదైన జ్ఞాన కాండ పరమాత్మను, అతని తత్త్వాన్ని గుర్తించేది. ఇందులో కర్మ భాగానికి ప్రతీకగా ఉద్దాలకుడు, జ్ఞానాన్ని బోధించే భాగానికి ప్రతీకగా నాచికేతుడు కనిపిస్తారు.

నాచికేతునిది విశిష్టమైన వ్యక్తిత్వం, దూర దృష్టి, పితృభక్తి, తనను తాను విమర్శించుకునే జ్ఞానం, పిత్రాజ్ఞ పరిపాలనానురక్తి ఏక సంధా గ్రహణము, ధన ధాన్యాలకు ప్రలోభ పడకపోవడం. పట్టుదల మొదలైన లక్షణాలు అతనిలో మనకు కనిపిస్తాయి.

నాచికేతుడు యమలోకం నుంచి తిరిగి రాగానే ఉద్దాలకుడు ఎంతో ప్రేమతో కుమారుని కౌగలించుకున్నాడు. అచట చేరిన వారందరినీ ఉద్దేశించి వారడిగిన ప్రశ్నలకు సమాధానంగా నాచికేతుడిలా చెప్పాడు. అన్ని జన్మలలోకెల్లా మానవ జన్మ ఉత్తమమైనది, అక్కడ చేసే పుణ్య పాపాలను అనుసరించి వారికి గతి ఏర్పడుతుంది. పాపం చేస్తూ భూలోకంలోనే అనేక యోనుల్లో క్రిమి కీటకాది జన్మలెత్తుతూ బాధనుభవించును. పుణ్యం చేసుకుంటే పునరావృత్తిరహితమైన స్థితిని పొందుతారు. జీవుడు సంసార సాగరంలో దేనికీ చిక్కు పడక తన ధర్మాన్ని తాను నిర్వర్తిస్తూ తామరాకుపై నీటిబొట్టులా జీవిస్తూ గమ్యస్థానం, అనగా పరమాత్మ సన్నిధికి చేరుకోవాలి. అంతేకాదు హృదయంలో యోగ సమాధినిష్ఠుడై ఉన్న శాంతుడు నాచికేతుడు. ఆత్మారాముని దర్శించాలనుకునేవారు వారు యోగ సమాధి పొందాలి. హృదయ పుండరీకంలో పరమాత్మను దర్శించాలనే కోరిక కలవారు అంతర్ముఖులై బాహ్య జగత్తును గుర్తింపలేనట్టివారై ఉండాలి. అప్పుడే ప్రశాంతత ఏర్పడుతుంది. ఆత్మవిద్య సుధారసముతో సమానమైనది, పునరావృత్తి రహితమైనది, శాశ్వతమైన పుణ్యలోకాలను ప్రాప్తింపచేయునది. అట్టి దానిని దూషించుట పాపహేతువని నాచికేతుని నోట దుగ్గన పలికిస్తాడు. ఆత్మ సేవ చేయవలెననుట, తండ్రి శపించినా చింతిల్లకుండా తన శరీరంపై మమకారం విడిచిపుచ్చడం, శపించిన తండ్రిని కూడా ప్రేమించి తనను ఆదరించునట్టు యమధర్మరాజుని వరం కోరడం వంటి విషయాలు నాచికేతుని యందు ప్రస్ఫుటింపజేయడం వల్ల నాచికేతుడు స్వచ్ఛమైన జ్ఞానం కలవాడని, జ్ఞాన కాండ ప్రాధాన్యత ఎంత గొప్పదో తెలుస్తుంది. అందువల్ల నాచికేతుడు స్వచ్ఛమైన జ్ఞానానికి ప్రతీకగా కనబడతాడు.

- డాక్టర్ గాది శ్రీనివాస్
9989079742

ఆత్మకు సంబంధించిన జ్ఞానాన్ని ఉపదేశించమని కోరుతున్నానని నాచికేతుడు కోరాడు. అయితే దానికి సమాధానంగా యముడు 'ఈ ఆత్మ జ్ఞానం గురించి దేవతలు కూడా సంశయాత్మకులై ఉంటారు. అందువలన దాని గురించి జిజ్ఞాస విడువుము. పుత్ర పౌత్రాదులు, ధన ధాన్య సంపదలను, వాటిని అనుభవించుటకు తగిన ఆయుష్షును కోరుకోమన్నాడు. దానికి నాచికేతుడు నీవు చెప్పినవన్నీ అనిత్యాలు. వాటి అవసరం నాకు లేదు. నిత్యము, సత్యము, శాశ్వతం అయిన ఆత్మజ్ఞానాన్ని ప్రసాదింపుమని పట్టు పట్టాడు. నాచికేతుని పట్టుదలను చూసి యముడు సంతోషించాడు. అతడు ఆత్మ జ్ఞానాన్ని పొందేందుకు తగిన వాడు, మోక్షార్హుడని భావించి అతనికి ఆత్మతత్త్వాన్ని ఉపదేశించాడు.

జీవుడు సంసార సాగరంలో దేనికీ చిక్కుపడక తన ధర్మాన్ని తాను నిర్వర్తిస్తూ తామ రాకుపై నీటిబొట్టులా జీవిస్తూ గమ్యస్థానం, అనగా పరమాత్మ సన్నిధికి చేరుకోవాలి. అంతేకాదు హృదయంలో యోగ సమాధినిష్ఠుడై ఉన్న శాంతుడు నాచికేతుడు. ఆత్మా రాముని దర్శించాలనుకునేవారు వారు యోగ సమాధి పొందాలి. హృదయ పుండరీకంలో పరమాత్మను దర్శిం చాలనే కోరిక కలవారు అంతర్ముఖులై బాహ్య జగత్తును గుర్తింపులేనట్టివారై ఉండాలి.అప్పుడే ప్రశాంతత ఏర్పడుతుంది.

దినఫలాలు

మేష రాశి: ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో ప్రతికూల మార్పులు చేకూరుతాయి. ఆర్థిక చిక్కులు లేకపోలేదు. శత్రువృద్ధి ఉంటుంది.

వృషభ రాశి: సంబంధ బాంధవ్యాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. మానసిక రుగ్మతలు ప్రబలమవుతాయి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. ఉద్యోగ వ్యవహారాల్లో దూకుడు నిర్ణయాలు పనికిరావు. కోర్టు వ్యవహారాల్లో మాత్రం నెగ్గుకురాగలుగుతారు. ఆదాయం పర్వాలేదు.

మిథున రాశి: దూరప్రయాణాలు రాణిస్తాయి. వ్యాపార నిర్ణయాలు అనుకూలం. ఆర్థిక ప్రయత్నాలు లాభిస్తాయి. అవమానకర సంఘటనలు బాధిస్తాయి. ఆరోగ్యం అనుకూలం. దురుసు మాటలు సమస్యలను తెస్తాయి. విద్యాపరమైన విషయాల్లో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి: ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. గృహసంబంధిత కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. విమర్శలు ఉన్నా పనులను పూర్తిచేయగలుగుతారు. ఆరోగ్యం ఖర్చులు తగ్గుతాయి. శత్రుభీతి తగ్గుతుంది. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. వాహన నిర్ణయాలు లాభిస్తాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. విదేశీ ఒప్పందాలు లాభిస్తాయి. ఖర్చులు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆర్థిక నష్టాలను భర్తీ చేసుకొనే ప్రయత్నాలు కొనసాగుతాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యా రాశి: విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. స్థిరాస్తి కొనుగోళ్లు కలసి వస్తాయి. రాజకీయ ప్రతిబంధకాలు పెరుగుతాయి. ఆరోగ్యంలో చిరుసమస్యలు ఉంటాయి. రాజకీయ ప్రతికూలత ఉంటుంది. ఆదాయంలో ఆశించిన విజయాలు సాధించగలుగుతారు.


తులా రాశి: నూతన వస్తు కొనుగోళ్ళు లాభిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు కలిసి వస్తాయి. శారీరిక శ్రమ ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. అపా ర్థాలకి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి: దూర ప్రయాణాలు ఆశించిన ప్రయోజనాలని కలిగిస్తాయి. విద్యాప్రయత్నాలు లాభిస్తాయి. శారీరిక రుగ్మతలు పెరుగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో అలసత్వం ఉంటుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: గృహ కార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. ఆరోగ్య పరీక్షలు రక్షణను కలిపిస్తాయి. సహనం తగ్గుతుంది. గతంలోని ఒత్తిడులు ఇంకా కొనసాగుతాయి. వ్యాపార ప్రయత్నాలలో ప్రోత్సాహం ఉంటుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు మాత్రం దగ్గరవుతాయి.

మకర రాశి: ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. గృహకార్యాలు, కార్యక్రమాలు లాభిస్తాయి. నూతన ఒప్పందాలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. మంచి కార్యాలలో విజయాలు ఏర్పడతాయి. వరస ప్రయత్నాలతో ఆదాయం పెరుగుతుంది.

కుంభ రాశి: కోర్టు వ్యవహారాలు, ప్రక్రియలు ఉపకరిస్తాయి. చిరు ఆరోగ్య సమస్యలు వెలుగు చూస్తాయి. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. ఒత్తిడులను తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.



మీన రాశి: వ్యాపార ప్రయత్నాలు అనుకూలిస్తాయి. చిరుసమస్యలు గృహరీత్యా కొనసాగుతాయి. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. పనులలో గతంలోని వేగం తగ్గుతుంది. ఆదాయం పర్వాలేదు.

శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

మృత్యువు నుంచీ జీవులకు రక్షణ



మహనీయులు జంతువులను సాధుస్వభావంతో ఉండేలా చేయడమే కాదు, మరణించిన, మృత్యు ముఖంలో ఉన్న జీవులను కాపాడిన సందర్భాలు ఉన్నాయి.

కామరాజు వాసుదేవ ముకుందరావుగారు బాపట్ల అనుభవానంద స్వామిగా ప్రఖ్యాతి చెందారు. అనుభవానం దులు కొంత కాలం గూడూరులో ఉన్నారు. ఆ కాలంలో అక్కడ ఒక పొగరుబోతు కుక్క ఉండేది. అది ఆయన ప్రభావానికి లోనయింది. సాధుత్వం సంతరించుకుంది. అది ఆయనతో స్నానానికి పోయేది. ఆయన ధ్యానం చేస్తున్నప్పుడు ఎదురుగా కూచుని ఆయననే తదేకంగా చూసేది. దానికి అనుభవానందులు యోగి అని పేరు పెట్టారు. యోగీ అని పిలవగానే అది ఎక్కడ ఉన్నా పరుగు పరుగున వచ్చేది. వారు భోజనాలకు కూర్చుంటే వారి మధ్య కూర్చునేది. అన్నం, పప్పు, నెయ్యి పెడితే తినేది ఆ కుక్క, కాదు యోగి.

జీవమునీయవయా!

మహాత్ములు మనుషులకు ఆయుష్షునిస్తారు. మరణించిన, మరణించబోయే వారిని బతికించటం వారికి ఒక లెక్క కాదు. జంతుజాలాన్ని కూడా వారు అలానే కరుణిస్తారు.

అది షిరిడీ గ్రామం. మండు వేసవి. పైగా మిట్ట మధ్యాహ్నం. వడగాలి వీస్తోంది. ఎవరూ బయటకు రావడం లేదు. అందరూ గృహాలలోనే ఉండిపోయారు. సాయిబాబా ద్వారకామాయిలో ఉన్నారు. ఒక మేక పిల్ల ద్వారాకామాయి పక్క నుంచి వెళుతోంది. వడదెబ్బకు తాళలేక మరణించింది. కొందరు ఆ మేకపిల్ల చుట్టూ చేరారు. సాయి ఆ మేకపిల్ల దగ్గరకు వచ్చారు. దాని చుట్టూ తిరిగి దానిపై కొద్ది నీటిని చల్లారు. అది చెంగున లేచింది. గెంతుతూ పరుగెత్తుకుపోయింది.


షేగాంలో గజానన్‌మహరాజ్ ఉండేవారు. ఆయన కీర్తి విని ఒక బ్రాహ్మణుడు షేగాం వచ్చాడు. మఠానికి వెళ్లి గజానన్‌ను చూచాడు. ఆ బ్రాహ్మణుని మనసు కలత చెందింది. గజానన్ దిగంబరి, పిచ్చివాడు, అనాచారిగా కనబడ్డాడు. శుచి శుభ్రత లేనివారిగా గోచరించారు ఆయనకు గజాననులు. 'ఎల్లప్పుడూ గంజాయి తాగుతుంటాడు. ఆయనను అందరూ మహరాజ్, మహరాజ్ అంటున్నారు. ఇటువంటి వానినా నేను దర్శించేందుకు వచ్చినది' అని మనసులో ఆలోచిస్తున్నాడా బ్రాహ్మణుడు.

అక్కడి ఒక వీధిలో శునకపు మృతదేహాన్ని చూశాడు బ్రాహ్మణుడు. 'ఈ శునకము దారి మధ్యన పడి ఉంది. దీనిని ఎవరూ తీయటం లేదు' అని అనుకున్నాడు.

ఈలోగా అక్కడ గజానన్ మహరాజ్ తన ఆసనం నుంచి లేచారు. ఎందుకు లేచారో ఎవరికీ అర్థం కాలేదు. ఆయన మరణించిన శునకం వద్దకు వచ్చాడు. గజాననుని పాదస్పర్శతో దానికి పోయిన ప్రాణం తిరిగి వచ్చి లేచింది. అది చూసిన బ్రాహ్మణుడు తెల్లబోయాడు. మరణించిన జీవిని బతికించిన గజాననుల మహత్తును అంచనా వేయజాలక ఆయన పాదాలపై పడ్డాడు. ఈ ఒక్క సంఘటనతో బ్రాహ్మణునికి జ్ఞానోదయం, శునకానికి జీవం వచ్చాయి.

జాలారాం బాపా నిత్యాన్నదానం చేస్తుండేవాడు. సన్మార్గులు, దుర్మార్గులు కూడా ఆయన ఆశ్రమంలో భోజనం చేసేవారు. వారందరినీ ఒకే విధంగా చూడటం జాలారాం విశేషం. ఒకసారి ఆయన ఆశ్రమం వద్దకు ముగ్గురు అరబ్బులు వచ్చారు. దారిలో పక్షులను చంపి, సంచిలో వేసుకుని భుజాన పెట్టుకుని వచ్చారు. ఎవరో బాపారాం ఆశ్రమంలో భోజనం చేసి పొండని సలహా ఇచ్చారు. వారు ఆ ఆశ్రమంలోనికి వచ్చారు. పక్షుల సంచీని దూరంగా పెట్టి భోజనం చేసి పోదామనుకున్నారు.

మహనీయుల జీవకారుణ్యం


జాలారం బాపా

ఈలోగా బాపా వచ్చారు. 'బాగా అలసిపోయారు. రాత్రికి ఇక్కడే విశ్రాంతి తీసు కోండి' అన్నారు బాపా ఆ ముగ్గురు అరబ్బులతో. వారు ఆ చచ్చిన పక్షుల సంగతి ఎక్కడ బయటపడుతుందో అని ఆందోళన పడుతున్నారు. బాపా తన చేతి కర్రను పక్షుల సంచీకి తాకించారు.

'సంచిలో పక్షులు జీవించే ఉన్నాయి. సంచి మూట విప్పండి' అన్నారు బాపా. అరబ్బులు ఆ మూత విప్పగానే పక్షులకు జీవం వచ్చింది. అవి తుర్రున ఎగిరి పోయాయి. అరబ్‌లు బాపా శక్తికి అచ్చెరువొంది ఆయన కాళ్ళ మీద పడ్డారు. ఆ పక్షులకు మరో జీవితం ప్రాప్తించింది.

- ముళ్లపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్

భగవద్గీత



బ్రహ్మ కాల వివరణ

అధ్యాయం 8
శ్లోకం 17

సహస్రయుగపర్యంతమ్
అహర్యద్బ్రహ్మణో విదుః।
రాత్రిం యుగసహస్రాంతాం
తేహోరాత్రవిదో జనాః॥

తాత్పర్యం

మానవపరిగణనమునుసరించి వేయి యుగముల కాలము బ్రహ్మదేవునికి ఒక పగలు. అతని రాత్రి సైతము అంతే పరిమాణము కలిగి ఉంటుంది.

భాష్యం:

ఎంత కాదన్నా భౌతిక ప్రపంచ కాలము పరిమితమైనది. బ్రహ్మకు ఒక పగలు వెయ్యి చతుర్యుగాలను కలిగి ఉంటుంది. అనగా సత్య యుగము (17,28,000 సంవత్సరాలు), ద్వాపర యుగము (12,96,000), త్రేతా యుగము (8,64,000), కలియుగము (4,32,000). అంటే బ్రహ్మకు 12గంటలు గడిచేసరికి మానవులకు 43,20,000 సంవత్సరాలు గడుస్తాయి. అలా ఆయన వంద సంవత్సరములు గడిచే సరికి మన ప్రకారము 311 ట్రిలియన్ల 40 బిలియన్ల సంవత్సరాలన్న మాట. మనకు ఇది ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించవచ్చునేమోగాని, కారణోదకశాయి విష్ణువుతో పోల్చుకుంటే ఇటువంటి బ్రహ్మలు సముద్రములో నీటి బడుగలవలె అనేకమంది వస్తూ పోతూ ఉంటారు. ఎన్నో జన్మలు సన్యాసాన్ని నిక్కచ్చిగా పాటిస్తే గానీ బ్రహ్మ లోకవాసులు కాలేరు. అయితే ఆ బ్రహ్మ, ఆయన లోకవాసులకే జన్మ మృత్యు జరా వ్యాధి తప్పదు. ఇది భౌతిక ప్రకృతి నియమము.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.



'సిప్' తో సిరులు

సంపద పెంచుకోవడానికి సులభమైన మార్గం

పెరుగుతున్న జీవన కాలాన్ని ఏ ఇబ్బందీ లేకుండా ఆస్వాదించాలంటే.. మనం సంపద సృష్టించుకోవాలి. మరి అది ఎలా? దీనికి ఉన్న ఏకైక మార్గం.. మన పెట్టుబడుల విధానం మార్చుకోవడమే. మనదేశంలో ఇప్పటికీ చాలామంది సంప్రదాయ, రాబడికి హమి ఉండే పథకాలపైనే ఆధారపడుతున్నారు. వడ్డీ రేట్లు తగ్గుతున్న తరుణంలో ఈ పెట్టుబడులతో.. దీర్ఘకాలంలో మనకు అవసరమైన సంపదను సృష్టించుకోవడం ఏ మాత్రం సాధ్యం కాదు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే .. చాలామంది ఒక లక్ష్యానికి అనుగుణంగా మదుపు చేయాలనే ధోరణిలోకాకుండా ఎప్పుడు అవసరమైతే అప్పుడు తీసుకొని వాడుకోవాలనే ఉద్దేశ్యంతో ఉంటారు. దీంతో పదవీవిరమణ తర్వాత కోసం అనేది తక్కువ ప్రాధాన్యం జాబితాలోకి వెళ్లిపోతోంది. ఒకవేళ ఇందుకోసం కొంత పెట్టుబడిని కేటాయిస్తున్నా.. అబ్బో.. చాలా సమయం ఉంది కదా అనుకుంటూ.. మధ్యలోనే ఏదో ఒక చిన్న అవసరానికి ఈ డబ్బును వెనక్కి తీసేసుకుంటారు. ఫలితంగా దీర్ఘకాలంలో సంపద సృష్టి అనేది వెనకబడి పోతుంది.

మానవ ఆయుర్దాయం అంతకంతకూ అధికమవుతోంది. పెరుగుతున్న వైద్య పరిజ్ఞానమే ఇందుకు కారణం. జీవన వ్యవధి పెరుగుతున్న కొద్దీ..దాని చుట్టూ కొన్ని కొత్త సమస్యలు కూడా వచ్చి చేరుతుంటాయి. ముఖ్యంగా ఆర్థిక సంబంధమైనవి.. మరి వాటికి మనం సిద్ధంగా ఉన్నామా? అన్నది సందేహమే!

ప్రపంచ బ్యాంకు నివేదికల ప్రకారం .. 1960లో సగటు ఆయుర్దాయం 52 ఏళ్లు. 2015 నాటికి ఇది 72 ఏళ్లు. అంటే ముమ్ముందు ఇది మరింత పెరిగే ఆస్కారం లేకపోలేదు. ఒకవేళ మనిషి సగటు శతమానం భవతి అనే దీవెనలాగా 100 ఏళ్లకు చేరుకోవాలంటే అప్పుడు ఏమిటి పరిస్థితి?

భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని, మనం మదుపు చేస్తున్నాం కదా సరిపోతుందిలే అనే ధోరణిలో కాకుండా.. ఒక లక్ష్యానికి కట్టుబడి పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఉంది. అందులోనూ వైవిధ్యంగా ఉండేలా మదుపు చేయాలి. దీనికోసం మార్కెట్ ఆధారిత పథకాలను ఎంచుకున్నప్పుడు మ్యూచువల్ ఫండ్లు తప్పనిసరిగా పోర్ట్‌పోలియోలో ఒక భాగం కావాలి. కేవలం నెలకు రూ 500లతోనూ ఇందులో మదుపు చేసే అవకాశం ఉంది. ఇది కూడా ఒక రికరింగ్ డిపాజిట్‌లాంటిదే. కాకపోతే దీన్ని క్రమానుగత పెట్టుబడి విధానం (సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్- సిప్) అంటాం. మరో విధంగా చెప్పాలంటే ..సిప్ చేయడం అంటే పెట్టుబడి కోసం ఒక మంచి నెలవారీ వాయిదా'ను చెల్లిస్తున్నట్లు.

భారతీయులు మ్యూచువల్ ఫండ్ పథకాల వల్ల వచ్చే ప్రయోజనాలను ఎలా వదులుకుంటున్నారో.. ఒక ఉదాహరణతో పరిశీలిద్దాం... రూ 500లతోనూ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసే అవకాశం ఉంది. అయితే మనం ఈ ఉదాహరణ కోసం నెలకు రూ 10వేలు మదుపు చేస్తున్నట్టుగా భావిద్దాం. నెలకు రూ 10వేలను, సగటు వార్షిక రాబడి 12శాతం వచ్చేలా.. 20 ఏళ్ల పాటు మదుపు చేస్తే మీ దగ్గర అయ్యే మొత్తం ఎంతో తెలుసా? అక్షరాలా రూ కోటి. అదే 30 ఏళ్లకైతే..దాదాపు రూ 3.53 కోట్లు జమ అవుతాయి. ఇందులో మీరు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించక్కర్లేదు. (ప్రస్తుత పన్ను చట్టాలను అనుసరించి)

పెంచుకుంటూ వెళ్తే..

నెలనెలా నిర్ణీత మొత్తాన్ని మదుపు చేయడం సాధారణసిప్. ఇందులోనూ ఇప్పుడు రకరకాల అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. స్టెప్ అప్/ టాప్ అప్ సిప్‌ల పేర్లతో అందుబాటులో ఉండే ఈ పెట్టుబడి విధానంలో ఏడాదికోసారి నిర్ణీత శాతంలో మీ మదుపు మొత్తాలను పెంచుకోవచ్చు. ఆదాయం పెరుగుతున్నప్పుడు ఆ నిష్పత్తిలో పెట్టుబడులు కూడా పెరగాలి అనే సూత్రానికి అనుగుణంగా దీన్ని వర్తించేసుకోవచ్చు. ఉదాహరణకు మీరు నెలకు రూ.



10వేలతో సిప్ ప్రారంభించారు. ఏడాది తర్వాత 10శాతం చొప్పున పెరగాలి అనుకున్నారనుకుందాం. అప్పుడు 12శాతం రాబడితో 20 ఏళ్ల తర్వాత రూ 1.58 కోట్లు మీ చేతిలో ఉంటాయి. ఇక 30 ఏళ్ల తర్వాత రూ 6 కోట్లు అంటే ఏడాదికేడాది కొంచెం పెంచుకుంటూ వెళ్లడం వల్ల 30 ఏళ్ల తర్వాత దాదాపు రెట్టింపు సంపద మన దగ్గర ఉంటుందని తెలుస్తోంది. మరోసారి గుర్తుపెట్టుకోండి. ఇదంతా ఎలాంటి పన్ను పరిధిలోకి రాని ఆదాయం.

ఏటా 10శాతం పెట్టుబడిని పెంచడం వల్ల దాదాపు రెట్టింపు డబ్బు ఎలా జమ అవుతుంది? అనేది చాలామందికి వచ్చే సందేహం. ఇక్కడే అల్బర్ట్ ఐన్‌స్టీన్ చెప్పినట్లు.. చక్రవడ్డీ అనేది 'ఎనిమిదో వింత'. ఇదే ఇక్కడ పనిచేస్తోంది. చక్రవడ్డీ మెరుగైన ఫలితాలు ఇవ్వాలంటే.. రెండు అంశాలు కీలకం. రాబడి అధికంగా రావాలి లేదా పెట్టుబడిని దీర్ఘాకాలం కొనసాగించాలి. రాబడి ఎంత అనేది మన చేతుల్లో లేదు. కానీ పెట్టుబడిని దీర్ఘకాలం కొనసాగించేది మనమే కదా. అందుకే 20, 30 లేదా అంతకన్నా ఎక్కువ వ్యవధికి మదుపు కొనసాగించాలి.

సమయం మించలేదు

మొక్కనాటడానికి సరైన సమయం 20 ఏళ్ల క్రితమే. అప్పుడు కుదరకపోతే .. కనీసం ఇప్పుడైనా నాటాలి. ఈ సూత్రం పెట్టుబడులకూ వర్తిస్తుంది. ఎంత చిన్న వయసు నుంచి మదుపు ప్రారంభిస్తే..దాని ఫలితాలు అంత అధికంగా ఉంటాయి. తొందరగా ప్రారంభించి దీర్ఘకాలం కొనసాగించినప్పుడు సంపద పెద్ద మొత్తంలో పోగుబడుతుంది. మనం పైన అనుకున్న ఉదాహరణ పరిశీలిస్తే.. నెలకు రూ 10వేల చొప్పున 12శాతం వార్షిక రాబడి వచ్చేలా మదుపు చేస్తే. . 30 ఏళ్లలో రూ 3.53 కోట్లు అవుతాయి. ఇదే రాబడి శాతంతో ఈ మొత్తాన్ని పదేళ్లలో సాధించాలంటే ...నెలకు రూ 1.50 లక్షల వరకు మదుపు చేయాల్సి ఉంటుంది. కాబట్టి ముందు నుంచే మదుపు ప్రారంభించి దాన్ని క్రమశిక్షణతో కొనసాగిస్తే తక్కువ మొత్తంతోనూ ఆకర్షణీయమైన ఫలితాలను అందుకోగలం.

ఆపేయొద్దు

అనుకోని పరిస్థితుల్లో కొన్నాళ్లపాటు ఆదాయం ఆగిపోవచ్చు. లేదా ఏదైనా అవసరం కోసం మళ్లించడం కోసం పెట్టుబడులను ఆపేయాల్సి రావచ్చు. పెట్టుబడి తేదీలను మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు.

ఇలాంటివాటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఫండ్ సంస్థలు అనేక వెసులుబాట్లను కల్పిస్తున్నాయి. పెట్టుబడులను దీర్ఘకాలం కొనసాగించాలనే లక్ష్యం ఉన్న మదుపరులకు తాత్కాలిక ఇబ్బందులు తలెత్తినప్పుడు .. పెట్టుబడుల విధానంలో చిక్కులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటిస్తున్నాయి. ఒకటి రెండు నెలల పాటు మీరు సిప్ చేయకపోతే.. తాత్కాలికంగా నిలుపుదల చేసుకునే అవకాశం ఉంది. ఒకసారి మీ పరిస్థితి సాధారణంగా మారిన తర్వాత సిప్‌ను కొనసాగించవచ్చు. మీరు నెలనెలా రూ 10వేలను సిప్ చేస్తున్నారనుకుందాం. కొన్ని నెలలపాటు రూ 5వేలు చేద్దామని భావించేవారు. దీనికి అవకాశం ఉంది. ఇప్పటివరకూ ప్రతినెలా 1న మదుపు చేస్తున్నారనుకుందాం. ఇక నుంచీ 25న పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారు. దీనికి ఫండ్ సంస్థలు వెసులుబాటునిస్తాయి. మీరు చేయాల్సిందిల్లా.. మదుపు చేసేముందు ఇలాంటి వెసులుబాట్లను ఆయా ఫండ్ సంస్థలు ఎంతమేరకు కల్పిస్తున్నాయని తెలుసుకోవడం. ఇలాంటి వెసులుబాట్లు ఉంటే. దీర్ఘకాలిక మదుపరులు మధ్యలో సిప్‌ను ఆపేయడం.. మళ్లీ కొత్తగా మొదలు పెట్టడం లాంటి చికాకుల నుంచి దూరంగా ఉంటారు. సిప్ నిరంతరం కొనసాగుతూ... చక్రవడ్డీ ప్రయోజనాన్ని పొందుతారు. మదుపు చేసేప్పుడు మీ సలహాదారుడిని, ఫండ్ సంస్థలను ఈ అవకాశాలన్నీ కల్పిస్తున్నారా లేదా అడిగి చూడండి.

బిల్లు వాయిదాలు - జాగ్రత్తలు

ఎక్కడ చూసినా భారీ రాయితీలు స్వాగతిస్తున్నప్పుడు స్థాయికి మించి కొనడం సహజమే. ఇలాంటప్పుడు ఉపయోగపడేది క్రెడిట్ కార్డే. అయితే ఇప్పుడు ఆ బిల్లులు చెల్లించలేక నెలసరి వాయిదాల్లోకి మార్చుకోవాలని చూసేవారు కొన్ని విషయాలను గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉంది.

క్రెడిట్ కార్డు మీద భారీ మొత్తంలో కొనుగోలు చేసినప్పుడు నెలసరి వాయిదాల్లో చెల్లింపులు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. గృహరుణం, వ్యక్తిగత రుణం చెల్లించినట్లుగానే ఇదీ ఉంటుంది. తాత్కాలికంగా చేతిలో నగదు లేనప్పుడు ఈ సౌకర్యం మంచి ఉపశమనమే. ఇప్పుడు ఏది కొన్నా.. వాయిదాల్లోకి మార్చుకునే సదుపాయం ఉంటోంది. పైగా కొన్నింటికి ఎలాంటి వడ్డీ కూడా లేకుండా అనే సదుపాయాన్నీ ఇస్తున్నాయి. ఈఎంఐలో తీసుకుంటే.. నగదు వెనక్కి అంటూ.. 5-10 శాతం వరకూ ప్రత్యేక సదుపాయాలూ ఉంటున్నాయి. అయితే, ఈ సౌకర్యాన్ని వినియోగించుకునేటప్పుడు మనం కొన్ని జాగ్రత్తలనూ మర్చిపోకూడదు.

చెల్లించకపోతే.. ఒకసారి ఈఎంఐగా మార్చుకున్న తర్వాత కచ్చితంగా నెలనెలా బాకీని చెల్లించండి. ఒక్కసారి చెల్లించకపోయినా.. అధిక మొత్తంలో రుసుములు విధిస్తారు. పైగా మిగతా మొత్తాన్ని సాధారణ కార్డు బాకీగా మార్చి మరుసటి నెల బిల్లులో కలిపి పంపిస్తారు.


అదనపు రుసుములు

పేరుకు సున్నా శాతం వడ్డీ అయినప్పటికీ కొన్నిసార్లు అదనంగా రుసుములు వసూలు చేస్తుంటాయి బ్యాంకులు. వీటిని చూసుకోండి. వ్యవధి తీరకముందే చెల్లించాలనుకున్నా.. బాకీ ఉన్న మొత్తంపై 3 శాతం వరకూ రుసుము విధిస్తాయి.

పరిమితి

ఈఎంఐ చెల్లించినన్ని రోజులూ మీ కార్డు పరిమితిని గరిష్టంగా ఉపయోగించుకోలేరు. ఉదాహరణకు మీ కార్డు గరిష్ట పరిమితి రూ 50వేలు అనుకుందాం. రూ 25వేలను ఈఎంఐ కింద చెల్లించాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు మీ కార్డు మీద ఇంకా రూ 25వేల వరకే కొనుగోలు చేయడానికి వీలుంటుంది. మీరు ఈఎంఐ చెల్లిస్తున్న కొద్దీ మీ పరిమితి కూడా పెరుగుతుంది.

కొంటున్నప్పుడేఒక వస్తువు కొన్న తర్వాత బిల్లు వచ్చాక పూర్తిస్థాయిలో చెల్లిస్తారా.. ఈఎంఐలో చెల్లించాలని నిర్ణయించుకున్నారా అనేది ముందుగానే చూసుకోండి. ఎందుకంటే.. మీరు కొనేటప్పుడు ఈఎంఐగా మార్చుకుంటే సున్నా శాతం వడ్డీ ఉండొచ్చు. అదే మీరు కొనుగోలు పూర్తి చేసిన తర్వాత బిల్లు వచ్చే సమయానికి ఈఎంఐగా మార్చుకుంటే సున్నా శాతం వడ్డీ ఉండొచ్చు. అదే మీరు కొనుగోలు పూర్తి చేసిన తర్వాత బిల్లు వచ్చే సమయానికి ఈఎంఐగా మార్చుకుంటే భారీ వడ్డీతో పాటు ప్రాసెసింగ్ ఫీజుల్లాంటివి ఉంటాయి. వీటికి అదనంగా జీఎస్‌టీ కూడా చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి మీరు వాయిదాల్లో కొనాలనుకుంటే .. ఆ వస్తువుకు బిల్లు చెల్లించేటప్పుడే నిర్ణయం తీసుకోండి. క్రెడిట్ కార్డు మీద భారీ మొత్తంలో కొనుగోలు చేసినప్పుడు నెలసరి వాయిదాల్లో చెల్లించడం ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. గృహరుణం, వ్యక్తిగత రుణం. వ్యక్తిగత రుణం చెల్లించినట్లుగానే ఇదీ ఉంటుంది. తాత్కాలికంగా చేతిలో నగదు లేనప్పుడు ఈ సౌకర్యం మంచి ఉపశమనమే. ఇప్పుడు ఏది కొన్నా.. వాయిదాల్లోకి మార్చుకునే సదుపాయం ఉంటోంది. పైగా కొన్నింటికి ఎలాంటి వడ్డీ కూడా లేకుండా అనే సదుపాయాన్ని ఇస్తున్నాయి. ఈఎంఐలో తీసుకుంటే నగదు వెనక్కి అంటూ.. 5 నుంచి 10శాతం వరకూ ప్రత్యేక సదుపాయాలు ఉంటున్నాయి. అయితే ఈ సౌకర్యాన్ని వినియోగించుకునేప్పుడు మనం కొన్ని జాగ్రత్తలనూ మర్చిపోకూడదు.



Business సరిగమలు

పొదుపులో మేటి.. లేరు సరిసాటి

ఒక్క రోజు భారతదేశంలో ఉన్న మహిళలందరూ పనిచేయడం నిలిపివేస్తే ఎలా ఉంటుంది. అమ్మగా, అక్కగా, భార్యగా ఉదయం లేచిన దగ్గరనుంచి రాత్రి నిద్రపోయేవరకూ నిరంతరం శ్రమించే మహిళాలోకం ఒక్క రోజు హాలిడే ప్రకటిస్తే ఊహించగలమా.. దేశాభివృద్ధిలో, దేశ పురోగతిలో మహిళలదే కీలకపాత్ర. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఆశాజనకమైన ఆర్థిక వృద్ధితో దూసుకుపోతున్న భారత్‌లో మహిళల ఆర్థిక వృద్ధి మాత్రం ఆశాజనకంగాలేదు. ఆరోగ్యం, విద్య రంగాల్లో ఉన్న అసమానతే మహిళా సాధికారత సాధనలోనూ చోటు చేసుకుంటున్నాయి. ఇంటర్నేషనల్ మానిటరీఫండ్, ఐఎంఎఫ్ అంచనా ప్రకారం భారత్‌లో పురుషులతో పాటు మహిళలకు సమాన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే స్థూలజాతీయ వృద్ధి, జీడీపీ 27శాతం పెరిగే అవకాశం ఉంది.

ఉపాధి కల్పనలో సమాన అవకాశాలు

భారతదేశంలో అసంఘటిత రంగంలో 75శాతం పురుషులుంటే 27.4శాతం



స్త్రీలు ఉన్నారు. పురుషులతో పోలిస్తే వేతనంలో తారతమ్యం ఎక్కువగా ఉంది. వేతనంలో ప్రాంతాన్ని బట్టీ, పనిని బట్టీ వ్యత్యాసం నెలకొని ఉంది. సహజంగా మహిళకు కష్టపడే నైజం ఎక్కువ. ఒక పక్క కుటుంబ బాధ్యతలను మోస్తూనే మరో పక్క ఉద్యోగంలో రాణించే సత్తా మహిళకు ఉంది. చాలా సార్లు వీరి కష్టానికి ఫలితం ఉండదు. తక్కువ జీతానికే పనిచేయడం ఆమె నైజం. ఇంటిపనులతో సతమతమౌతూ ఉంటారు. వంట, చిన్నారుల సంరక్షణ, ఇంట్లో పెద్దవాళ్లనూ, రోగులను చూసుకోవడంలోనే సరిపోతుంది. పైగా పొదుపులోనూ వీరు ముందంజలో ఉంటారు. ఈ పొదుపు ఆర్థిక అభివృద్ధికి దోహదం చేస్తుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. మన జీడీపీలో సేవింగ్‌రేట్ వృద్ధి 33శాతంగా వుండగా అందులో కుటుంబాలు చేసే పొదుపు 70శాతం, ఆ తర్వాత 20శాతం సేవింగ్స్ ప్రయివేట్ కార్పోరేట్ రంగం, 10శాతం ప్రభుత్వ రంగాల ద్వారా జరుగుతోంది. అంటే తమకు తెలియకుండానే ఆర్థిక వృద్ధిలో మహిళల భాగస్వామ్యులు అవుతున్నారన్నమాట.

ఆర్థిక సాధికారత బలపరిచే చట్టాలు

మహిళల్లో ఆర్థిక సాధికారత ప్రోత్సహించే చట్టాలకు కొదువలేదు. మహిళ ఆర్థిక సాధికారత అభివృద్ధికి కీలకం అని గ్రహించిన కేంద్రం ఎన్నో చట్టాలను తెచ్చింది. పలు పథకాలను ప్రవేశపెట్టింది. భారతరాజ్యాంగం 73-74 ప్రకరణల ప్రకారం మహిళల ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. 1976లో ప్రవేశపెట్టిన సమాన వేతన చట్టం 2001లో వచ్చిన జాతీయ మహిళా సాధికార చట్టం ఈ కోవకు చెందినవే. నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్, జన ధన్ యోజన, రాష్ట్రీయ మహిళా కోష్ లాంటి పథకాలు మహిళల్లో ఆర్థిక సాధికారత తెచ్చేందుకు కృషి చేస్తున్నాయి. అయితే సమాన అవకాశాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. పురుషులతో పాటు స్త్రీలకు సమానమైన హక్కులు కల్పిస్తేనే దేశం పురోగతి సారిస్తుంది. కేంద్ర క్యాబినెట్‌లో 27 మంది మంత్రులు పురుషులైతే కేవలం 6 గురే స్త్రీలు ఉన్నారు. లోకసభలో మహిళల ప్రాతినిధ్యం కేవలం 5.9శాతం మాత్రమే. అంతెందుకు తెలంగాణ ప్రభుత్వంలో ఒక్క మహిళా మంత్రి లేకపోవడం గమనార్హం. ప్రభుత్వాల్లో మహిళా నాయకులు పెరిగితే పాలనా విధానాలు తేవడంలో చిక్కులు తొలగుతాయి. 2013లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టంగా మారేందుకు ఎంతకాలం పడుతుందో చెప్పలేని దుస్థితి.

మహిళలు బిజినెస్ లీడర్స్‌గా


ఇటీవలి కాలంలో పలురంగాల్లో రాణించడం చూస్తూనే ఉన్నాం. అయితే బిజినెస్ లీడర్స్‌గా రాణిస్తున్న సంఖ్య చాలా తక్కువేనని చెప్పాలి. కేవలం సంపన్న కుటుంబాల్లో ఉన్న మహిళలే వ్యాపారాల్లో రాణిస్తున్నారు. ఓ మహిళ కంపెనీలో ఉన్నతాధికారిగా వుంటే ఉద్యోగినులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుంది. మహిళా పారిశ్రామికవేత్తలకు తగినంత ప్రోత్సాహం లభించడం లేదు. టెక్నాలజీ, మార్కెటింగ్, తయారీలో వినూత్న పద్దతులు వీరికి అందుబాటులోకి రావడంలేదు. తగినంత ఆర్థిక వనరులు, వర్కింగ్ క్యాపిటల్ లభించడంలేదు. బ్యాంక్‌ల నుంచి ఆర్థిక సంస్థల నుంచి స్టార్టప్ కంపెనీలకు లభించడంలేదు. టెక్నాలజీ అందుబాటులో లేకపోవడం గ్రామీణస్త్రీలకు శాపంగా మారుతోంది. స్మార్ట్ టెక్నాలజీస్ మరింతమందికి అందుబాటులోకి రావాలి. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ దీనిపై మరింత కృషి చేయాల్సి ఉంది.

ఫలితాలిచ్చే పథకాలపై దృష్టిసారించాలి

మనదేశంలో సగంమందికి పైగా మహిళలు ఆర్థిక లావాదేవీలకు దూరంగా ఉంటున్నారు. 60శాతం మహిళలకు విలువైన ఆస్తులు లేవు. బ్యాంక్ ఖాతాలు లేని మహిళలు ఎక్కువే. పాశ్చాత్య దేశాల్లో చూస్తే కుటుంబాల్లో పలు అంశాలపై తుది నిర్ణయాధికారం మహిళలదే. పలు రాష్ట్రా ల్లో మహిళలకోంస అవలంబిస్తున్న ఉత్తమ పథకాలను అన్ని రాష్ట్రా లకు వర్తించేలా చూడాలి.

బీహార్‌లో 2007లో ప్రవేశపెట్టిన జీవిక పథకం ప్రపంచబ్యాంక్‌ను సైతం ఆకట్టుకుంది. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా తక్కువ ఆదాయం ఉన్న రాష్ట్రా లకు విస్తరించింది. గ్రామీణ బ్యాంకుల నుంచి రుణాలు తెచ్చుకునే ఎన్ఆర్ఎల్‌పి ప్రాజెక్టు 2011 నుంచి కృషి చేస్తుంది. మహిళ ఆర్థిక సాధికారతకు ఇది దోహదం చేసింది. రాజస్థాన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భమేషా యోజన మరో ముందడుగు వేసింది. ప్రభుత్వ పథకాల లబ్దిదారులుగా మహిళలను పేర్కొంటూ నేరుగా వారి ఖాతాల్లోనే డబ్బులు జమ చేయడం జరిగింది. 2008లో ప్రారంభించిన ఈ పథకంలో 10 లక్షలకు పైగా మహిళల ఖాతాల్లో 161.49 కోట్ల రూపాయలు జమ చేయడ జరిగింది. ముద్రపథకంలో రుణాలు అందుకున్న వారిలో 78శాతం మహిళా పారిశ్రామికవేత్తలే కావడం విశేషం.

ఆర్థికంగా స్థిరపడిన మహిళ 90శాతం ఆదాయం తన కుటుంబం కోసం ఖర్చు చేస్తుంది. తమ పిల్లలను ఆరోగ్యవంతులుగా, విద్యావంతులుగా తీర్చిదిద్దుతుంది. మానవఅభివృద్ధి స్థాయిని పెంచుతుంది. అన్నింటికిమించి దేశ ఆర్థిక అభివృద్ధికి



- స్వేచ్ఛ రాజన్ బందెల
ఆర్థిక విశ్లేషకులు

హలో గురు ప్రేమకోసమే ప్రారంభం



రామ్, అనుపమ పరమేశ్వరన్ నాయకానాయికలుగా తెరకెక్కనున్న చిత్రం హలో గురు ప్రేమకోసమే. త్రినాథరావు నక్కిన దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి వంశీ పైడిపల్లి క్లాప్ కొట్టగా, అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేశారు. హరీష్‌శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. యెర్నేని నవీన్, స్రవంతి రవికిషోర్ స్క్రిప్ట్‌ను దర్శకుడికి అందించారు. సినిమా చూపిస్త మావ, నేను లోకల్ వంటి వరుస విజయాల తర్వాత త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో వస్తున్న సినిమా కావడంతో పాటు, దిల్‌రాజు, రామ్‌ల కలయికలో రూపొందుతున్న చిత్రం కావడంతో నిర్మాణానికి ముందే సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ నెల 12 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది.

దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని సమకూరుస్తుండగా, విజయ్ కె.చక్రవర్తి సినిమాటోగ్రఫీని, సాహిసురేష్ కళను, కార్తీక శ్రీనివాస్ ఎడిటింగ్‌ను, రచనా సహకారాన్ని సాయికృష్ణ అందిస్తున్నారు. త్వరలోనే సినిమా మిగతా వివరాలను తెలియజేస్తామని చిత్రబృందం ప్రకటించింది.

కలెక్టర్ కర్తవ్యం



నయనతార

రాజకీయ నేపథ్యంలో నిర్మించిన చిత్రం కర్తవ్యం. నయనతార ప్రధాన పాత్రధారిణి. ఆమె ఇందులో జిల్లా కలెక్టర్‌గా పవర్‌ఫుల్ పాత్రని పోషించింది. నార్త్ స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ, శరత్ మరార్ సంయుక్తంగా తెలుగులో విడుదల చేస్తున్నారు. తమిళంలో నిర్మించిన ఈ చిత్రం అక్కడ విజయం సాధించింది. అందుకే తెలుగులో అనువదిస్తున్నారు. కార్యక్రమాలు అన్నీ పూర్తికావడంతో ఇదే నెల 16న కర్తవ్యం చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు.

నిర్మాతలు మాట్లాడుతూ తమిళంలో ఆరమ్ అనే పేరుతో విడుదలై సూపర్‌హిట్ అయింది. నయనతార కెరీర్‌లోనే పెద్ద హిట్‌గా నిలిచింది. తెలుగులో కూడా ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. చిత్ర కథ ఆసక్తికరంగా సాగుతుంది. బోరుబావిలో సమీపంలో ఆడుకుంటున్న పిల్లలు అందులో పడిపోతే? వారిని కాపాడేందుకు జరిగే ఆపరేషన్ కథా వస్తువుగా తీసుకుని సహజత్వంగా, ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునే విధంగా దర్శకుడు గోపి నైనర్ తెరకెక్కించారు. ఆ ఆపరేషన్ స్పెషల్ ఆఫీసర్‌గా, కలెక్టర్ పాత్రలో నయనతార కనిపిస్తుంది. మార్చి 16న సినిమాను విడుదల చేస్తున్నాం అని తెలిపారు. ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం అందిస్తున్నారు. ఛాయాగ్రహణం ఓం ప్రకాష్, కథ, దర్శకత్వం గోపి నైనర్, నిర్మాత శరత్‌మరార్, ఆర్. రవీంద్రన్.



నాగచైతన్య, సమంత జంటగా

నాగచైతన్య, సమంత జంటగా ఏ మాయ చేశావె, మనం వంటి విజయవంతమైన చిత్రాలొచ్చాయి. ముఖ్యంగా పెళ్లైన తర్వాత ఈ జంట కలిసి నటిస్తే చూడాలని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. నిన్నుకోరి ఫేమ్ శివ నిర్వాణ దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్ సంస్థ ప్రొడక్షన్ నెం.2 రూపొందించబోయే చిత్రంలో ఈ జంట కలిసి నటించబోతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సాహు గారపాటి, హరీష్ పెద్ది మాట్లాడుతూ, త్వరలో ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకుని రానున్నాం. మరోవైపు మా సంస్థ నిర్మాణ సారధ్యంలో రూపొందుతున్న కృష్ణార్జునయుద్ధం ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఇక ఈ చిత్రం ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం అని చెప్పారు.





రవితేజ, అను ఇమ్మాన్యుయేల్

దుబాయి శీను తరువాత

అమర్ అక్బర్ ఆంటోని

హీరో రవితేజ, దర్శకుడు శ్రీను వైట్లది హిట్ కాంబినేషన్. గతంలో వారి కలయికలో నీకోసం, వెంకీ, దుబాయ్ శీను వంటి చిత్రాలొచ్చాయి. తాజాగా వారిద్దరూ కలిసి చేస్తున్న చిత్రం అమర్ అక్బర్ ఆంటోని. రవితేజ సరసన అను ఇమ్మాన్యుయేల్ కథానాయికగా నటిస్తుండగా, మైత్రీ మూవీమేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. దేవుడి పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి శ్రీను వైట్ల పెద్ద కుమార్తె ఆనంది వైట్ల క్లాప్ నివ్వగా, రెండవ కుమార్తె ఆద్య వైట్ల కెమెరా స్విచ్చాన్ చేశారు. శ్రీను వైట్ల గౌరవ దర్శకత్వం వహించారు. రవితేజ చేతులమీదుగా స్క్రిప్ట్‌ను శ్రీను వైట్ల అందుకున్నారు.

ఈ సందర్భంగా శ్రీను వైట్ల మాట్లాడుతూ, రవితేజతో మళ్లీ ఇన్నాళ్ల తర్వాత కలిసి చేయబోతున్న చిత్రమిది. కథకు ఏడాది క్రితం బీజం పడింది. పది నెలల పాటు కష్టపడి స్క్రిప్ట్ పని పూర్తిచేశాం. రవితేజతో పాటు మా నిర్మాతలకు కూడా కథ బాగా నచ్చింది. షూటింగ్ మొత్తాన్ని యు.ఎస్.ఎ.లోనే చేస్తాం. న్యూయార్క్, డెట్రాయిట్, సాల్ట్ లేక్, ఇతర లొకేషన్లల్లో చిత్రీకరణ జరుపుతాం. కష్టతరమైన భారీ షెడ్యూల్స్‌ను చాలా జాగ్రత్తగా ప్లాన్ చేసిన మా నిర్మాతలకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. సునీల్ పూర్తి హాస్యపాత్రను పోషించనున్నారు. నిన్నటితరం కథానాయకి లయ, ఆమె కుమార్తె శ్లోక కూడా ఈ చిత్రంలో కీలక పాత్రలలో కనిపిస్తారు. రవితేజ తనయుడు మహాధన్ మరో ముఖ్యపాత్రలో నటించబోవడం ప్రత్యేక ఆకర్షవుతుంది అని అన్నారు.

నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, మోహన్ చెరుకూరి మాట్లాడుతూ, మా బేనర్‌లో ఇదో ప్రత్యేక చిత్రం. క్రేజీ కాంబినేషన్‌లో ఈ చిత్రం చేస్తుండటం ఆనందంగా ఉంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభిస్తాం అని చెప్పారు.

ఇంకా ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో అభిమన్యుసింగ్, తరుణ్ అరోరా, విక్రమ్‌జిత్‌సింగ్, రాజ్‌వీర్‌సింగ్, షాయాజీషిండే, ఆదిత్యమీనన్, వెన్నెల కిషోర్, సత్య, జయప్రకాష్‌రెడ్డి, షకలక శంకర్, శుభలేఖ సుధాకర్, దివ్య ఉన్ని, భరత్‌రెడ్డి తదితరులు తారాగణం. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: విజయ్ సి.దిలీప్, సంగీతం: తమన్.

నీతోనే హాయ్... హాయ్



అరుణ్‌తేజ్, ఛరిష్మా శ్రీకర్ హీరోహీరోయిన్లుగా తెరకెక్కనున్న చిత్రం నీతోనే హాయ్ హాయ్. బి.ఎన్.రెడ్డి అభినయ దర్శకత్వంలో కెఎస్‌పి ప్రొడక్షన్స్ పతాకంపై యలమంచిలి ప్రవీణ్ సమర్పణలో డా.ఎస్.కీర్తి, డా.జి.పార్థసారథిరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాద్ ఫిలింనగర్‌లోని దైవసన్నిధానంలో జరిగింది. అతిథులుగా విచ్చేసిన హీరో శ్రీకాంత్ సన్నివేశానికి క్లాప్ నివ్వగా, మా అధ్యక్షుడు శివాజీరాజా కెమెరా స్విచ్చాన్ చేశారు. రేలంగి నరసింహవు గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం చిత్రదర్శకుడు బి.ఎన్.రెడ్డి అభినయ మాట్లాడుతూ, నా కథను నమ్మి ఈ చిత్రాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చిన మా నిర్మాతలకు కృతజ్ఞతలు. బాగా డబ్బున్న వ్యక్తి వ్యక్తిత్వం ఎలా ఉంటుంది? మధ్యతరగ తి కుటుంబానికి చెందినవాడి మానవత్వం ఎలా ఉంటుంది? అనేది మా చిత్రం ద్వారా చూపిస్తున్నాం. క్యూట్ ప్రేమకథకు కమర్షియల్ అంశాలు జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఈ రోజు నుంచి షెడ్యూల్ ప్రారంభమైంది. మూడు షెడ్యూల్స్‌లో సినిమాను పూర్తిచేస్తాం. విదేశాల్లో పాటలను చిత్రీకరించాలన్న ఆలోచనలో ఉన్నాం అని అన్నారు.

చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ, దర్శకుడి పట్టుదల, ఐదు అద్భుతమైన పాటలను రవికల్యాణ్ కంపోజ్ చేశారు అని అన్నారు. చిత్ర సమర్పకుడు యలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ, సీనియర్ నటీనటులతో పాటు ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులతో ఈ చిత్రం రూపొందుతోంది అని అన్నారు. హీరో అరుణ్‌తేజ్ మాట్లాడుతూ, చంద్రుళ్లో ఉండే కుందేలు చిత్రం తర్వాత తెలుగులో తాను చేస్తున్న రెండో చిత్రమిదని పేర్కొనగా, హీరోయిన్ ఛరిష్మాశ్రీకర్ మాట్లాడుతూ, ఇందులో తాను క్యూట్ పాత్రను చేస్తున్నానని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఈదరప్రసాద్, సంగీతం: రవికల్యాణ్.



ఆలోచనాత్మక చిత్రం

ఏ మంత్రం వేశావె

- దర్శకుడు శ్రీధర్ మర్రి

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం ఏ మంత్రం వేశావే. శివానీ సింగ్ నాయికగా నటించింది. గోలీసోడా ఫిలింస్ పతాకంపై శ్రీధర్ ఈ చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో రూపొందించారు. మల్కాపురం శివకుమార్ ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఏ మంత్రం వేశావే చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శక నిర్మాత శ్రీధర్ మాట్లాడుతూ....మన చుట్టూ ఉన్న పరిస్థితులను ఆధారంగా చేసుకుని రాసుకున్న కథ ఇది. సాంకేతికత మాయలో పడి మనుషుల మధ్య దూరం పెరుగుతోంది. మనతో ఉన్న వారి కంటే ఆన్‌లైన్‌తో స్నేహితులు ఎక్కువయ్యారు. ప్రతి చిన్న విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పెడుతూ స్పందనల కోసం ఆరాటపడుతున్నారు. సోషల్ మీడియా వ్యక్తిగతంగా ఓ టీవీలా తయారైంది. మంచి సందేశాత్మక చిత్రం. ఈ కథను ఇతర నిర్మాతలు ఎవరూ నమ్మరు. అందుకే నేనే నిర్మాతగా మారి చిత్రాన్ని రూపొందించాను. ఉద్యోగం చేస్తూ, వీలైనప్పుడల్లా చిత్రాన్ని రూపొందిస్తూ వచ్చాను. అలా సినిమా పూర్తి కావడానికి కొంత సమయం పట్టింది. విజయ్ దేవరకొండ గత చిత్రాలైన పెళ్లి చూపులు, అర్జున్ రెడ్డిలతో చూస్తే ఏ మంత్రం వేశావే విభిన్నమైన చిత్రం. హీరో విజయ్ దేవరకొండతో నాకెలాంటి విభేధాలు లేవు. హీరోగా ఆయనకు తీరిక లేనందువల్ల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనలేకపోతున్నారు.

అందుకు నాకేమీ బాధ లేదు. నేను డబ్బులు సంపాదించడానికి పరిశ్రమకు రాలేదు. భవిష్యత్‌లో కూడా మంచి ఆలోచనాత్మక చిత్రాలే చేయాలని ప్రయత్నిస్తాను. మూస చిత్రాలకు భిన్నమైన నేపథ్యంతో ఈ చిత్రాన్ని రూపొందించాం. పిల్లలు పెద్దలకు నచ్చుతుందని ఆశిస్తున్నాం. అన్నారు.

విడుదలకు సిద్ధమైన తొలి కిరణం

కంప్యూటర్ గ్రాఫిక్స్ రూపకల్పనలో జరుగుతున్న ఆలస్యమే చిత్ర విడుదలలో జాప్యం జరిగేందుకు కారణమని చెబుతున్నారు తొలి కిరణం చిత్రయూనిట్ సభ్యులు. సువర్ణ క్రియేషన్స్ పతాకంపై జాన్‌బాబు దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది. భానుచందర్ కీలక పాత్రలో నటించగా...పీడీ రాజు ఏసుక్రీస్తు పాత్రను పోషించారు. ప్రస్తుతం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న తొలి కిరణం సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భగా నటుడు భానుచందర్ మాట్లాడుతూ...ఇప్పటిదాకా ప్రపంచవ్యాప్తంగా ఏసుక్రీస్తు జీవితం ఆధారంగా చాలా చిత్రాలు వచ్చాయి. ఆ చిత్రాలన్నీ ఏసుక్రీస్తు జన్మించినప్పటి నుంచి శిలువ వేసే వరకు సాగుతాయి. ఆయన మరణించిన మూడు రోజుల తర్వాత సమాధి లోనుంచి లేచి వచ్చి శాంతి సందేశాన్నిస్తూ భూమిపై తిరిగారు. ఆ కథను తొలి కిరణం సినిమాలో దర్శకులు జాన్‌బాబు చూపిస్తున్నారు. సినిమా రషెస్ చూశాను చాలా చక్కగా సినిమాను రూపొందించారు. మా అబ్బాయి హీరోగా నా కొడుకు బంగారం అనే చిత్రాన్ని జాన్‌బాబు గారి దర్శకత్వంలోనే చేయబోతున్నాం. అన్నారు. దర్శకుడు జాన్‌బాబు మాట్లాడుతూ...లండన్‌లో గ్రాఫిక్స్ పనులు జరగడంలో ఆలస్యమైంది. అందుకే చిత్రాన్ని కొద్ది జాప్యంతో విడుదల చేస్తున్నాం. అన్నారు.



భానుచందర్, పీడీ రాజు

